LANGUAGES

CLASS - 9 SEMESTER - 1

S. No.	SUBJECT	Page No.
1.	తెలుగు – తెలుగు పరిమళం	01 - 120
2.	हिंदी – सुगंध - 1	121 - 160
3.	ENGLISH – BEEHIVE & S.R	161 - 256

© Government of Andhra Pradesh, Amaravati

Telugu, English First Published 2023
New Impression - 2024, 2025, 2026
Hindi First Published 2013
New Impression - 2025, 2026

DISCLAIMER

Any form of copying of the content, information and illustrations from this textbook is a punishable offence.

All rights reserved

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser. The copyright holder of this book is the Commissioner of School Education, Amaravati, Andhra Pradesh.

This book has been printed on 70 GSM, SS Maplitho. Title Page 220 GSM, White Art Card.

Published by Samagra Shiksha & SCERT - Government of Andhra Pradesh, Amaravati.

AP SCERT

Vande Mataram



Vande Mataram!

Sujalam, suphalam, malayaja shitalam,

Shasyashyamalam, Mataram!

Vande Mataram!

Shubhrajyotsna pulakitayaminim,

Phullakusumita drumadala shobhinim,

Suhasinim sumadhura bhashinim,

Sukhadam varadam, Mataram!

Vande Mataram, Vande Mataram!

- Bankimchandra Chatterji

వందే మాతరం

వందే మాతరం వందే మాతరం

సుజలాం సుఫలాం మలయజ శీతలాం

సస్యశ్యామలాం మాతరం వందే మాతరం

శుభ్రజ్యోత్స్నాపులకిత యామినీం

ఫుల్లకుసుమిత ద్రుమదళ శోభినీం

సుహాసినీం సుమధుర భాషిణీం

సుఖదాం వరదాం మాతరం వందే మాతరం.

- బంకించంద్ర ఛటర్జీ

AP SCERT

Printed in India
at the A.P. Govt., Textbook Press,
Amaravati, Andhra Pradesh.

Our National Anthem | జాతీయ గీతం

Jana-gana-mana-adhinayaka jaya he
Bharata-bhagya-vidhata
Panjaba-Sindhu-Gujarata-Maratha
Dravida-Utkala-Banga
Vindhya-Himachala-Yamuna-Ganga
uchchala-jaladhi-taranga
Tava Subha name jage,
tava subha asisa mage,
gahe tava jaya-gatha.
Jana-gana-mangala-dayaka jaya he
Bharata-bhagya-vidhata.
Jaya he, Jaya he, Jaya he,
jaya jaya jaya jaya he.

- Rabindranath Tagore

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబు, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగా!
వింధ్య, హిమాచల, యమునా, గంగా!
ఉచ్చల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాఁగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

– రవీంద్రనాథ్ ఠాగూర్

AP SCERT


Pledge | ప్రతిజ్ఞ

India is my country. All Indians are my brothers and sisters.
I love my country and I am proud of its rich and varied heritage.
I shall always strive to be worthy of it.
I shall give my parents, teachers and all elders respect,
and treat everyone with courtesy. I shall be kind to animals.
To my country and my people, I pledge my devotion.
In their well-being and prosperity alone lies my happiness.

- Pydimarri Venkata Subba Rao

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు.
నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం.
దీనికి అర్హత పొందడానికై సర్వదా నేను కృషి చేస్తాను.
నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను.
జంతువులపట్ల దయతో ఉంటాను.
నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.
వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

– పైడిమర్రి వెంకట సుబ్బారావు



AP SCERT

తెలుగు పరిమళం - 9

తెలుగు వాచకం

తొమ్మిదో తరగతి (ప్రథమ భాష)

సెమిస్టర్ - 1

క్ర.సం	పాఠం	ప్రక్రియ	ఇతివృత్తం	కవి / రచయిత	మాసం	పుట
	అభ్యసన ఫలితాలు					02
1.	ధర్మబోధ	ప్రాచీన పద్యం	కుటుంబ సంబంధాలు	నన్నయభట్టు	జూన్	04
2.	ఇల్లలకగానే ✶	కథానిక	స్త్రీ చైతన్యం	పి.సత్యవతి	జూలై	19
3.	చైతన్యం	గేయ కవిత	సామాజిక బాధ్యత	తాపీ ధర్మారావు	జూలై	29
4.	ప్రియమైన నాన్నకు	లేఖ	మానవసంబంధాలు	పింగళి బాలాదేవి	ఆగస్టు	41
5.	ఆత్మకథ	వచన కవిత	స్వయంకృషి	ఎండ్లూరి సుధాకర్	సెప్టెంబర్	54
6.	ఆశావాది	ముఖాముఖి	సాహితీ జీవనం	ఆశావాది ప్రకాశరావు	అక్టోబర్	67

ఉపవాచకం

కాశీనాథుని నాగేశ్వరరావు	కాంపోజిషన్	జూలై	81
ఉన్నవ దంపతులు ✶	ఉరులు	ఆగస్టు	86
దువ్వూరి సుబ్బమ్మ ✶	మనస్వి	సెప్టెంబర్	93
అయ్యదేవర కాళేశ్వరరావు	అహింస	సెప్టెంబర్	101
కడప కోటిరెడ్డి దంపతులు	చంద్రవంక	అక్టోబర్	109

R9S1E7

Teacher corner

సంస్కృతం కాంపోజిట్ కోర్సుగా చదివేవారు ✶ గుర్తుగల పాఠములు మినహా మిగిలిన అన్ని పాఠములు చదవాలి.

U8X8K6

Student corner

చుక్క గుర్తుగల పద్యాలు, పద్య మధురిమ శీర్షికలో ఇచ్చిన పద్యాలను కంఠస్థం చేయాలి.

AP SCERT

అభ్యసన ఫలితాలు

ధర్మబోధ

- ధర్మాన్ని పాటించవలసిన అవసరాన్ని తెలుసుకుంటారు.
- సత్యం గొప్పదనాన్ని వివరించగలరు.
- పద్యాలను రాగయుక్తంగా పాడగలరు.
- పద్యాలకు ప్రతిపదార్థాలు రాయగలరు.
- ఉత్వ, సవర్ణదీర్ఘ సంధులు, ద్వంద్వ సమాసం, ఉపమాలంకారం, మత్తేభ పద్యలక్షణాలను వివరించగలరు.

ఇల్లలకగానే

- స్త్రీలు తమ అస్తిత్వాన్ని చాటుకోవలసిన అవసరాన్ని వివరించగలరు.
- నేటి సమాజంలో స్త్రీలు ఆత్మాభిమానంతో జీవించవలసిన విధానాన్ని తెలుపగలరు.
- స్త్రీ ఔన్నత్యం, కుటుంబ సభ్యుల బాధ్యతలను విశ్లేషించగలరు.
- రచయిత్రి ఉద్దేశాన్ని కథా రచన శైలిని వివరించగలరు.
- సామాన్య సంశ్లిష్ట వాక్యాలను అవగాహన చేసుకుని ప్రయోగించగలరు.

చైతన్యం

- కవిత్వం గొప్పదనాన్ని కవి కర్తవ్యాన్ని తెలుసుకుంటారు.
- కవి రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించడాన్ని వివరించగలరు.
- సమాజాభివృద్ధికి తన కర్తవ్యాన్ని అర్థం చేసుకోగలరు.
- మేధావులు ఎవరి పక్షాన ఉండాలో విశ్లేషించగలరు.
- గుణ సంధి, కర్మధారయ సమాసం, అంత్యానుప్రాస, చంపకమాల పద్య లక్షణాలను వివరించగలరు.

ప్రియమైన నాన్నకు

- కథాంశాన్ని చదివి అర్థం చేసుకుంటారు. కథలోని పాత్రలు వాటి స్వభావాలను విశ్లేషించగలరు.
- తండ్రి తమ పిల్లల అభివృద్ధి కోసం ఎలా కష్టపడతారో అర్థం చేసుకుంటారు.
- తమ తల్లిదండ్రులతో గల అనుభూతులను అభిప్రాయాలను వ్యక్తీకరించగలరు.
- లేఖా ప్రక్రియలో వివిధ రకాలైన లేఖలు రాయగలరు.
- సరళాదేశ సంధి, ఛేకానుప్రాస, లాటాను ప్రాస అలంకారాలను వివరించగలరు.

AP SCERT

ఆత్మకథ

- స్ఫూర్తి ప్రదాతలైన వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని వారి బాటలో నడవాలని అర్థం చేసుకుంటారు.
- గతాన్ని వర్తమానాన్ని అనుసంధానం చేసుకుని మార్పులను వివరించగలరు.
- పాఠ్య విషయాన్ని భావయుక్తంగా చదవగలరు.
- కవి ఆవేదనకు గల కారణాలను వివరించగలరు.
- ఆమ్రేడిత సంధి, తత్పురుష సమాసం, రూపకాలంకారము, శార్దూలం పద్య లక్షణాలను వివరించగలరు.

ఆశావాది

- ముఖాముఖి ప్రక్రియ స్వరూపం వివరించగలరు.
- అవధాన ప్రక్రియ గురించి వివరించగలరు.
- ఆశావాది జీవిత విశేషాలు, రచనలు గురించి వివరించగలరు.
- ఆశావాది అవధానాలలో పూరించిన సమస్యాపూరణలను తెలుపగలరు.
- వృద్ధి సంధి, ప్రత్యక్ష, పరోక్ష కథనం గురించి వివరించగలరు.

AP SCERT



1 ధర్మబోధ

మూల గ్రంథం : 'ఆంధ్ర మహాభారతం'

కవి : నన్నయ భట్టు

చదవండి - చర్చించండి

దీవెన

చిన్నప్పుడు అమ్మ ఊరికెళ్తే
నాకూ చెల్లికీ అన్నం ముద్దలు కలిపి పెట్టావు గుర్తుందా?
పెద్ద ముద్దకి మారాం చేసినప్పుడు
నీ మొహంలో తుంటరి చిరునవ్వు
మేము నీకు తీర్చలేని బాకీ.

సంక్రాంతికి బయట నాలుగు రోడ్ల కూడలిలో
మాచేత వేయించిన భోగిమంట గుర్తుందా?
మా ఇద్దర్నీ తలోవైపూ పట్టుకున్న
నీ చేతుల్లో నేనున్నానంటూ ఇచ్చే ధైర్యం
మేము నీకు తీర్చలేని బాకీ.

పండగల్లో, పుట్టినరోజుల్లో
నీకూ అమ్మకీ లేకపోయినా
మాకిద్దరికీ కొత్తబట్టలు కొన్న రోజు గుర్తుందా?
ఆ రోజున పాతబట్టలే కట్టుకుని
మా తలల మీద కొత్తగా కలిపిన అక్షింతలు
వేసినప్పుడు మీ ఇద్దరి మొహాల్లో ఆనందం
మేము నీకు తీర్చలేని బాకీ.

ఖాళీ గూట్లో ఒంటరివై కూర్చున్నప్పుడు
రెక్కలొచ్చిన పిల్ల పక్షులు ఎగరడం
ఎంత సహజమో చెప్పావు గుర్తుందా?
అప్పుడు నీ మొహంలో కనిపించిన ధైర్యం
మా మీద చూపించిన నమ్మకం
మేము నీకు తీర్చలేని బాకీ
అది "ఆత్మావై పుత్రనామాసి".



– దంతుర్తి శర్మ

AP SCERT

ప్రశ్నలు:

1. మీకోసం మీ తల్లిదండ్రులు పడుతున్న కష్టాలను గురించి చెప్పండి?
2. మీ తల్లిదండ్రుల కోసం మీరు ఏం చేస్తారో చెప్పండి?

ఉద్దేశం

మానవులు చేసే ప్రతి పనికి, ప్రతి సంకల్పానికి వారి అంతరాత్మ అసలైన సాక్షి. అంతరాత్మను చంపుకుంటే మనిషి తనను తాను వంచించుకున్నట్లే అవుతుంది. గృహస్థధర్మాన్ని, సంతాన ప్రాధాన్యాన్ని, సత్యం గొప్పతనాన్ని గురించి చెప్పడమే ఈ పాఠం ఉద్దేశం.


నేపథ్యం

విశ్వామిత్రుడు బ్రహ్మర్షి కావాలని తపస్సు చేస్తున్నాడు. అతడి తపస్సు భంగం చేయడానికి దేవతలు మేనకను పంపారు. వారిద్దరికి ఒక బాలిక జన్మించింది. ఆ శిశువును 'శకుంత' అనే జాతి పక్షులు కాపాడాయి. అందువల్ల ఆమెకు శకుంతల అని నామకరణం చేసి కణ్వమహాముని పెంచుకున్నాడు. ఒక రోజు దుష్యంతుడు వేట కోసం వెళుతూ కణ్వమహాముని ఆశ్రమం దగ్గర ఆగాడు. శకుంతలను చూశాడు. ఆమెను గాంధర్వ వివాహం చేసుకొని తన రాజ్యానికి వెళ్లిపోయాడు. శకుంతలకు భరతుడు జన్మించాడు. తల్లీబిడ్డలను కణ్వుడు అత్తవారింటికి పంపించాడు. నిండుకొలువులో దుష్యంతుడు ఆమెను తిరస్కరించాడు. దుష్యంతుడి మాటలు విని కలత చెందిన శకుంతల రాజుకు ధర్మబోధ చేయడమే ఈ పాఠం నేపథ్యం.

ప్రక్రియ – ప్రాచీన పద్యం

ఇతిహాసం అనే పదానికి ఈ విధంగా జరిగింది అని అర్థం. ఇతిహాసంలో కథకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. రామాయణం, మహాభారతం ఇతిహాసాలు. ఇతిహాసాలలోని మూలకథను తీసుకొని వర్ణనలతో ఛందోబద్ధంగా పద్యాల రూపంలో కావ్యంగా మలచి రాయడమే ఇతిహాస కావ్యం. ఈ కావ్యాలు కవి ప్రతిభావిశేషాలను వెల్లడిస్తాయి. అద్భుత కథాగమనంతో పాఠకుల మనసుల్లో చెరగని ముద్రను వేస్తాయి.


కవి పరిచయం :



నన్నయభట్టు 11వ శతాబ్దపు కవి. రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసికొని ఆంధ్రదేశాన్ని పరిపాలించిన తూర్పుచాళుక్యరాజు రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి. వేదవ్యాసుడు సంస్కృతంలో రచించిన మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవిత్రయంలో మొదటి వారు. ఆది, సభా పర్వాలను, అరణ్య పర్వంలో సగభాగాన్ని ఆంధ్రీకరించారు. (అరణ్యపర్వం – 4 ఆశ్వాసంలో 142వ పద్యం వరకు). చాముండికా విలాసం, ఇంద్ర విజయం అనే కావ్యాలను ఆంధ్ర శబ్ద చింతామణి అనే వ్యాకరణ గ్రంథాన్ని నన్నయ్య రాశాడని ప్రతీతి. ఆదికవి, వాగనుశాసనుడు అని బిరుదులు. అక్షరరమ్యత, ప్రసన్న కథా కలితార్థ యుక్తి, నానారుచిరార్థ సూక్తి నిధిత్వం నన్నయ కవిత్వంలోని ప్రధాన లక్షణాలు. అనువాద పద్ధతిలో, శైలిలో తరువాతి కవులకు మార్గదర్శి. నారాయణభట్టు, పావులూరి మల్లన, వేములవాడ భీమకవి, మల్లియ రేచన, అధర్వణుడు మొదలైన వారు నన్నయ సమకాలికులు. ప్రస్తుత పాఠ్యభాగం నన్నయభట్టు రచించిన '*శ్రీమదాంధ్రమహాభారతంలోని ఆదిపర్వం – చతుర్థాశ్వాసం*'లోనిది.

AP SCERT

ధర్మబోధ




ఆ.వె. 1. ఏల యెఱుక లేని యితరుల యట్ల నీ
వెఱుఁగనన్రుఁబలికె దెఱిఁగి యెఱిఁగి,
యేన కాని దీని నెఱుఁగరిం దొరులని
తప్పఁబలుక నగునె ధార్మికులకు!

✶ చం. 2. విమలయశోనిధీ! పురుషవృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే
దములును బంచభూతములు ధర్మవు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థము లివి యుండ గా నరుఁడు దక్కొననేర్చునె తన్ను మ్రుచ్చిలన్

కం. 3. సతియును గుణవతియుఁబ్రజా
వతియు ననువ్రతయు నైన వనిత నవజ్ఞా
న్వితదృష్టిఁజూచు నతి దు
ర్మతికి హముంబరముఁగలదె మతిఁబరికింపన్

APSCERT



కం. 4. సంతత గృహమేధి ఫలం
బంతయుఁబడయంగ నోపు ననుగుణభార్యా
వంతుండగు వాఁడు క్రియా
వంతుఁడు దాంతుండుఁబుత్రవంతుండు నగున్

సీ. 5. ధర్మార్థ కామ సాధనకుపకరణంబు
గృహనీతివిద్యకు గృహము, విమల
చారిత్ర శిక్షకాచార్యకం, బన్వయ
స్థితికి మూలంబు, సద్గతికి నూఁత,
గౌరవంబున కేకకారణం, బున్నత
స్థిరగుణమణుల కాకరము, హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ
చూవె భర్తకు, నొండ్లు గావు ప్రియము,

ఆ.వె. లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను,
నెట్టి తీరములను ముట్టఁబడిన
వంతలెల్లఁబాయు నింతులఁబ్రజలను
నొనరఁజూడఁగనిన జనులకెందు.

AP SCERT

కం. 6. తాన తన నీడ నీళ్ళుల
లో నేర్పడఁజూచునట్లు లోకస్తుత! త
త్సూను జనకుండు సూచి మ
హానందముఁ బొందు నతిశయప్రీతి మెయిన్

కం. 7. నీ పుణ్యతనువు వలనన
యీ పుత్రకుఁడు ద్భవిల్లి యెంతయు నొప్పున్
దీపంబువలన నొండొక
దీపము ప్రభవించినట్లు తేజం బెసగన్.

★ మ. 8. విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ! యీ పుత్ర గా
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్రపరాగ ప్రసరంబుఁ జందనముఁజంద్ర జ్యోత్స్నయుంబుత్ర గా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే.


కం. 9. భూరిగుణు నిట్టి కులవి
స్తారకు దారకు నుదార ధర్మప్రియ! ని
ష్కారణమ తప్పఁజూడఁగ
సారమతీ! చనునె నాఁటి సత్యము గలుగన్.

★ చం. 10. నుతజలపూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలు; మరి బావులు నూఱిటి కంటె నొక్క స
త్క్రతు వదిమేలు; తత్క్రతు శతంబున కంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబు కంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్.

కం. 11. వెలయంగ నశ్వమేధం
బులు వేయును నొక్క సత్యమును నిరుగడలం
దుల నిడి, తూఁపఁగ సత్యము
వలనన ములు సూపు గౌరవంబున పేర్మిన్.

తే.గీ. 12. సర్వతీర్థాభిగమనంబు, సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుఁగావు
ఎఱుఁగుమెల్ల ధర్మంబుల కెందుఁబెద్ద
యంద్రు సత్యంబు ధర్మజ్ఞులైన ముసులు.

AP SCERT



కం. 13. కావున సత్యము మిక్కిలి
గా విమలప్రతిభ దలఁచి కణ్వాశ్రమ సం
భావిత సమయస్థితి దయఁ
గావింపుము, గొడుకుఁ జూడు కరుణాదృష్టిన్.

వ. 14. అనిన శకుంతల పలుకులు సేకొన నొల్లక దుష్యంతుండిట్లనియె.

కం. 15. ఏ నెట? నీ వెట? సుతుఁ డెట?
యే నెన్నఁడు తొల్లి చూచి యెఱుఁగను నిన్నున్;
మానిను లసత్య వచనలు
నా నిట్టు లసత్యభాషణం బుచితంబే?

వ. 16. "ఇంక దైవంబకాని యొండు శరణంబు" లే దని యప్పరమ
పతివ్రత తనయుం దోడ్కొని క్రమ్మఱిపోవనున్న యవసరంబున

చం. 17. "గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు, సే
కొని భరియింపు మీతని, శకుంతల సత్యము వల్కె, సాధ్వి స
ద్వినుత మహాపతివ్రత వివేకముతో" నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ మందగఁ దత్సభాసదుల్.

AP SCERT

పద్యాల భావాలు

1. మహారాజా! అన్నీ బాగా తెలిసినవాడివి. అయినా కూడా నాకు తెలియదు అంటున్నావు. తెలివి లేని వారి వలె, ఎవరో ఇతరులవలె మాట్లాడుతున్నావెందుకు? మన గాంధర్వ వివాహ విషయం ఇతరులకు ఎవ్వరికీ తెలియదు అని (సాక్షులు ఎవరూ లేరని) నేను ఎవరో తెలియదు అని అంటున్నావు. ధర్మాన్ని ఆచరించేవారు అబద్ధం చెప్పవచ్చునా? చెప్పకూడదు అని భావం.

2. నిర్మలమైన కీర్తికి నిధివంటివాడా! దుష్యంత మహారాజా! వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉదయం – సాయం అనే సంధ్యా సమయాలు, హృదయం, యముడు, చంద్రుడు, సూర్యుడు, పగలు, రాత్రి అనే మహాపదార్థాలు మానవుల ప్రవర్తనను ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయి సుమా! ఆ మహాపదార్థాలు ఉండగా మానవుడు తనను తానే వంచించుకోగలడా? తాను చేసిన దానిని దాచుకోగలడా? దాచుకోలేడు అని భావం.

3. రాజా! మంచిబుద్ధితో బాగా పరిశీలిస్తే పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కారభావంతో చూసే దుష్టబుద్ధి కలవాడికి ఈ లోకంలోను, పరలోకంలోను సుఖాలు ఉంటాయా? ఉండవు అని భావం.

4. భార్య అనుకూలవతి అయితే ఆ పురుషుడు గృహస్థ విధులయినట్టి యజ్ఞం, అగ్నిహోత్రం, అతిథిపూజ మొదలైన సమస్త కర్మలు ఆచరింపగలుగుతాడు. అతనికి ఇంద్రియనిగ్రహం ఉంటుంది. సంతానం పొందగలుగుతాడు. ఎల్లప్పుడూ గృహస్థధర్మాన్ని ఆచరించే గృహస్థు అందుకోవలసిన ఫలితాన్నంతటినీ అందుకోగలుగుతాడు.

5. ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించడానికి భార్య అనువైన సాధనం. గృహనీతి అనే విద్యకు నిలయమైనది. మంచిశీలాన్ని గురించి ప్రబోధించే గురుస్థానం. వంశం వృద్ధి చెందడానికి ఆధారమైనది. ఉత్తమ గతులు పొందడానికి ఊతకర్ర. గౌరవానికి ముఖ్యకారకురాలు. ఆదర్శప్రాయమైన, శాశ్వతమైన మణులవంటి గుణాలకు భార్య నిలయమైనది. భర్త హృదయానికి భార్య మాత్రమే ఆనందాన్ని కలిగిస్తుంది. ఇంటి యజమానికి ఇల్లాలి కంటె ఇంపైనది వేరొకటి లేదు. భార్యాపిల్లలను ఆప్యాయంగా చూసుకునేవారికి ఎక్కడైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి ఆపదలోనైనా, ఏ తీరాలలోనైనా చుట్టుముట్టిన దుఃఖాలన్నీ తొలగిపోతాయి.

6. రాజా! పురుషుడు నీళ్లల్లో తన నీడను తాను స్పష్టంగా చూసిన విధంగా తండ్రి కొడుకును చూచి మిక్కిలి సంతృప్తితో చెప్పలేనంత ఆనందాన్ని పొందుతాడు.

7. ఒక దీపం నుండి మరొక దీపం పుట్టి వెలుగుతుంది. అలాగే నీ పుణ్యశరీరం నుండి ఈ పుత్రుడు పుట్టి ప్రకాశిస్తున్నాడు.

8. ఓ దుష్యంత మహారాజా! విరుద్ధమైన మాటలు, మారు మాటలు ఎందుకు? ఈ మీ పుత్రుడిని కౌగిలించుకోండి. ఇతని ఆలింగనం వలన కలిగే సుఖాన్ని అనుభవించండి. ముత్యాలహారాలు, పచ్చకర్పూరపుపొడి మొదలైనవి ఏవీకూడా ఇంతటి సుఖాన్నీ, గొప్ప చల్లదనాన్ని కలిగించలేవు.

9. ధర్మమునందు, అందునా ఉత్తమమైన ధర్మమునందు ప్రీతికలవాడా! పటిష్ఠమైన, చలనములేని బుద్ధి కలవాడా! మన వివాహమైన నాడు నాకు ఇచ్చిన వరం ఉంది. అది నిజం. అది నిలిచి ఉండగా, అనేక మంచి గుణాలు

AP SCERT

కలవాడిని, వంశ విస్తారకుడు అయిన పుత్రుడిని ఏ కారణం లేకుండానే కాదనడం తగునా? ఇది నీకు న్యాయం కాదు.

10. సత్యవాక్యాన్ని పరిపాలించే నియమంగల ఓ రాజా! మంచినీటితో నిండిన వంద చేదుడుబావుల కంటె ఒక దిగుడుబావి మేలు. అలాంటి దిగుడుబావులు నూరిటి కంటె ఒక యజ్ఞం మంచిది. అటువంటి వంద యాగాల కంటె ఒక పుత్రుడు మేలు. అటువంటి వందమంది పుత్రుల కంటె ఒక సత్యవాక్యం చాలా గొప్పది.

11. ఒక త్రాసులో వేయి అశ్వమేధయాగాలు చేసిన ఫలితాన్ని ఒకవైపు, ఒక్క సత్యాన్ని మాత్రమే మరొకవైపు ఉంచి తూచితే సత్యం వైపుకు ముల్లు మొగ్గు చూపుతుంది. అంటే సత్యమే గొప్పదని నిరూపించినట్లు.

12. సమస్త తీర్థాలను సేవించడం కంటె, వేదాల నన్నింటిని అధ్యయనం చేయడం కంటె, సత్యం గొప్పది. ధర్మం బాగా తెలిసిన ఋషులు ఎల్లప్పుడు అన్ని ధర్మాల కంటె సత్యమే గొప్పదని అంటారు. దీన్ని గమనించండి. ఇవేవీ సత్యానికి సాటిరావు. సమస్త జగత్తుకూ సత్యమే మూలం.

13. కాబట్టి, నిర్మలమైన బుద్ధితో సత్యాన్ని గొప్పదిగా భావించి, కణ్వమహర్షి ఆశ్రమంలో చేసిన ప్రతిజ్ఞను దయతో నెరవేర్చండి. మీ కొడుకును దయాదృష్టితో చూడండి.

14. పై విధంగా పలికిన శకుంతల మాటలను దుష్యంతుడు ఒప్పుకోలేదు. పైగా ఈ విధంగా అన్నాడు.

15. "ఓ శకుంతలా! మహారాజునైన నేనెక్కడ? ఆశ్రమంలో ఉన్న నువ్వు ఎక్కడ? కుమారుడెక్కడ? ఇంతకు ముందు నిన్ను ఏనాడూ నేను చూడలేదు. 'స్త్రీలు అసత్యాలు చెప్తారన్నట్లుగా ఇలా మాట్లాడడం నీకు తగునా? ఇది నీకు సముచితం కాదు" అన్నాడు. తన తప్పును కప్పి పుచ్చుకోవడానికి దుష్యంతుడు శకుంతలపైననే నేరారోపణ చేస్తున్నాడు.

16. ఇకపై తనకు దైవమే దిక్కు అని భావించి, ఆ ఉత్తమ పతివ్రత కొడుకుని వెంటబెట్టుకొని తిరిగి వెళ్లిపోతున్న సమయంలో

17. "ఈ భరతుడు నీకూ, శకుంతలకు పుట్టిన ముద్దుబిడ్డడు. ఈ పుత్రుని స్వీకరించి పోషించండి. ఉత్తమ ఇల్లాలూ, ఉత్తమకీర్తి కలిగినదీ, మహాపతివ్రత అయిన శకుంతల వివేకంతో నిజమే చెప్పింది". అని దివ్యవాణి ఆ సభలోని వారంతా విని ఆశ్చర్యపడేటట్లుగా పలికింది.



ఇవి చేయండి

అవగాహన - ప్రతిస్పందన

అ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి, రాయండి.

1. **పద్యాలను రాగయుక్తంగా పాడండి, వాటి భావాలు చెప్పండి.**
2. **అనుకూలవతి అయిన భార్యను గూర్చి కవి ఏమని చెప్పారు?**
3. **శకుంతల రాజుతో 'కొడుకును కరుణా దృష్టితో చూడుము' అని అన్నది. కరుణా దృష్టితో అంటే ఏమిటి?**

AP SCERT

4. 'ధర్మాలన్నింటి కంటే సత్యమే గొప్పది' – ఎందుకు?

5. శకుంతల మాటలు విని దుష్యంతుడు ఏమని సమాధానమిచ్చాడు?

6. కింది ప్రతి పదార్థాన్ని చదవండి పువ్వు గుర్తు ఉన్న పద్యాలకు ప్రతిపదార్థం రాయండి (2, 8, 10)

విమల	=	నిర్మలమైన
యశోనిధీ!	=	కీర్తికి నిలయమైన వాడా!
వేదములును	=	నాలుగు వేదాలు (ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం)
పంచభూతములు	=	భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే అయిదూను
ధర్మువు	=	ధర్మమున్నూ (ఆచరింపబడేది ధర్మం)
సంధ్యలు	=	ఉదయ సంధ్య, సాయం సంధ్య (రెండు ప్రొద్దులకు మధ్యకాలం)
అంత: +ఆత్మయున్	=	హృదయమూ (మనస్సూ)
యముడును	=	యమధర్మరాజూ (మృత్యువుకు అధిదేవత)
చంద్ర సూర్యులు	=	చంద్రుడూ, సూర్యుడూ
అహంబును	=	పగలునూ
రాత్రియున్	=	రాత్రీ
అన్	=	అనెడి
మహత్	=	చాలా గొప్పవైన
పదార్థములు	=	పదార్థాలూ
పురుషవృత్తము	=	మానవులు చేసే పనులను
ఎఱుంగుచున్	=	తెలిసికొంటూ
ఉండున్ + చూవె	=	ఉంటాయి సుమా
ఇవి ఉండగాన్	=	ఈ మహాపదార్థాలు ఉండగా
నరుడు	=	మానవుడు
తన్ను	=	తనను తాను
మ్రుచ్చిలన్	=	వంచింపగా (మోసగించుకొనుటకు)
తక్కు + ఒనన్	=	అబద్ధమాడడానికి
నేర్చునె	=	పూనుకొనునా (వేరే విధంగా చేయడానికి ప్రయత్నించడు).

AP SCERT

ఆ) కింది పద్యం చదవండి. మహాభారతంలో ధర్మం గురించి, సత్యం గురించి తిక్కన సోమయాజి ఏంచెప్పారో గమనించండి.

ఉ॥ సారపు ధర్మమున్ విమల సత్యముఁ బాపము చేత బొంకుచేఁ
బారముఁ బొందలేక చెడ బాఱినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసి రది వారల చేటగుఁగాని ధర్మని
స్తారక మయ్యు సత్యశుభదాయక మయ్యును దైవముండెడున్.

(–ఉద్యోగపర్వం, ఆశ్వాసం – 3, పద్యం– 273)

భావం: ధర్మం కాలానుగుణమైనది. ఉత్తమమైనది. సత్యం సర్వకాలాలలోనూ మార్పు చెందక స్థిరంగా, ప్రకాశవంతమైనదిగా ఉంటుంది. ధర్మం, సత్యం అనే రెండూ పాపం చేతను, అబద్ధం చేతనూ కప్పిపుచ్చడానికి ప్రయత్నం చేస్తే అపుడు అవి చెడిపోవడానికి సంసిద్ధంగా ఉంటాయి. ఆ స్థితిలో ధర్మాన్ని, సత్యాన్ని రక్షించడానికి సమర్థులై ఉండి కూడా నిర్లక్ష్యంగా ఉంటే అది వారికే హానికరమవుతుంది. అప్పుడు భగవంతుడు ధర్మాన్ని ఉద్ధరించడానికీ, సత్యానికి శుభం కలిగించడానికి ముందుకు వస్తాడు. ధర్మాన్ని, సత్యాన్ని కప్పిపుచ్చడం ఎవరికీ సాధ్యం కాదు అని భావం.

ప్రశ్నలు

1. ధర్మం కాలానుగుణమైనది అంటే ఏమిటి?
2. సమర్థులైనవారు ధర్మం విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ఏమవుతుంది?
3. పద్యంలో అబద్ధం అని అర్థాన్నిచ్చే పదం ఏది?
4. "సమర్థులు" అనే పదానికి వ్యతిరేకపదాన్ని గుర్తించండి. ( )


   అ) అవివేకులు ఆ) అధర్ములు ఇ) అసమర్థులు ఈ) అపరాధులు
5. పై పద్యానికి శీర్షికను నిర్ణయించి రాయండి.

ఇ) కింది అపరిచిత గద్యం చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

20వ శతాబ్దంలో తమ రచనల ద్వారా, ఆచరణ ద్వారా సంఘసేవ ద్వారా ఆంధ్రజాతిని ప్రభావితం చేసిన మహనీయులలో – కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, కళాప్రపూర్ణ చర్ల గణపతిశాస్త్రిగారు ఒకరు. వీరు ప్రాచీన గ్రంథాల అనువాదకుడు, సంపాదకుడు, గాంధేయవాది, శతాధిక గ్రంథకర్త. తమ రచనలను దేశసేవకు వినియోగించాలని 1950లో ఆర్షవిజ్ఞానపరిషత్తును స్థాపించారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, క్విట్ ఇండియా ఉద్యమం, సహాయనిరాకరణ ఉద్యమం మొదలైన వాటిలో చురుకుగా పాల్గొన్నారు. సర్వోదయమండలి ఉద్యమ నాయకులు, వినోబా భావే అనుచరులుగా పాదయాత్ర చేసి తమ ఐదు ఎకరాల భూమిని దానం చేసిన త్యాగశీలి. స్వాతంత్ర్య సమరయోధుల పింఛను, ఉద్యోగ పింఛను వద్దంటూ. "నా తల్లికి సేవ చేసి డబ్బు తీసుకుంటానా?" అని ప్రశ్నించారు. హోమియో వైద్యం, ప్రకృతి వైద్యం ఉచితంగా చేసేవారు. రాట్నం వడికేవారు. స్త్రీలు మాతృ భూమితో సమానమని తలచి వారికి చేయూతనిచ్చి, ఉపాధి కల్పించి మహిళా సాధికారతకు కృషి చేసారు. రాత్రిపూట

AP SCERT

ఒక లాంతరుతో గ్రామాలకు వెళ్లి వయోజనవిద్య, పారిశుద్ధ్యం గురించి నేర్పి చైతన్యపరిచేవారు. తమ ఇంటిని ఆశ్రమంగా మలిచి వృద్ధులకు, అనాథలకు ఆశ్రయమిచ్చారు. ఇది కులమతాలకు అతీతంగా ఈనాటికీ నడుస్తోంది. వీరి తుదిశ్వాస వరకు సేవాతత్పరతతో జీవించారు. *(–చర్ల గణపతి శాస్త్రి జీవిత చరిత్ర నుండి)*



ప్రశ్నలు

1. పాదయాత్రలో చర్ల గణపతిశాస్త్రి ఎవరిని అనుసరించారు?
2. శతాధిక గ్రంథకర్త అంటే అర్థం ఏమిటి?
3. ఆర్ష విజ్ఞాన పరిషత్తునెప్పుడు స్థాపించారు?
4. భూమిని దానం చేసిన త్యాగశీలి ఎవరు?
5. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారుచేయండి.

వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగు వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. 'ధర్మ బోధ' పాఠ్యభాగ కవి పరిచయం రాయండి?
2. సత్యవాక్యం గొప్పతనం గురించి రాయండి.
3. పుత్రగాత్ర పరిష్వంగం అంటే ఏమిటి?

ఆ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. సత్యం మరియు ధర్మం గురించి దుష్యంతుని సభలో శకుంతల చేసిన ప్రసంగం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.
2. పాఠం ఆధారంగా శకుంతల దుష్యంతుల మధ్య జరిగిన సంఘటనను సంభాషణగా రాయండి.
3. ప్రస్తుత సమాజంలో మనుషులు అబద్ధాలు చెప్పడానికి గల కారణాలేమిటి? సత్య మార్గంలో నడవడానికి విద్యార్థులకు ఉండవలసిన లక్షణాలు ఏమిటో వివరించండి.

భాషాంశాలు - పదజాలం

అ) కింది వాక్యాలు చదివి, ఎరుపు రంగులో ఉన్న పదానికి అర్థం రాసి, వాటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

ఉదా॥ కౌరవపాండవులకు ద్రోణుడు విలువిద్య నేర్పిన ఆచార్యుడు.

ఆచార్యుడు = గురువు

గురువును గౌరవించాలి.

1. కరోనా సమయంలో ప్రజలు విపత్తులకు గురి అయ్యారు.
2. శకుంతల రాజుతో సూనృత వాక్యం మేలు అన్నది (గీత గీసిన పదానికి సరైన అర్థాన్ని గుర్తించండి.)

   ఎ) సత్యము బి) సందేహము సి) సమ్మతము డి) సుకృతము ( )
3. తెలుగు పద్యం హృద్యంగా ఉంటుంది.

AP SCERT

4. గాంధీమహాత్ముని యశస్సు దిగంతాలకు వ్యాపించింది.
5. వృద్ధులకు చేతికర్ర ఊతగా ఉంటుంది.

ఆ) కింది వాక్యాలు చదవండి, అదే అర్థం వచ్చే మరికొన్ని పదాలను గుర్తించి రాయండి. (పర్యాయపదాలు)

1. రైతులు భూమిని సాగు చేస్తారు. పాడి పంటలకు నిలయమైన వసుధ మీద ఎన్నో జీవరాసులు నివసిస్తున్నాయి. ఈ పుడమిని కాపాడుకోవడం మన బాధ్యత.
2. తల్లిదండ్రులకు పిల్లలు ఆసరాగా ఉండాలి. పెద్దతనంలో పిల్లలే ఆధారం.
3. భార్య ఇంటిని అందంగా అలంకరిస్తుంది. సతిని కళత్రం అంటారు. దారాపుత్రులతో ఇల్లు కళకళలాడుతూ ఉంటుంది.
4. తనయుని ఆటపాటలను చూసి తల్లిదండ్రులు మురిసిపోతారు. పుత్రుడు పున్నామనరకం నుండి తప్పిస్తాడని నమ్ముతారు. సుతుడు జన్మించాలని పూజలు చేస్తారు. కొడుకైనా కూతురైనా ఒకటే అని తెలుసుకోవాలి.
5. ఏనుగు భూమి మీద ఉన్న చిన్న సూదిని కూడా తన తొండంతో తీస్తుంది. వెలగపండును కరి తింటుంది. మాతంగము మావటి వానిమాట వింటుంది.

ఇ) కింది వేరు వేరు అర్థాలనిచ్చే పదాలను గుర్తించి జతపరచండి. (నానార్థాలు)

1.	క్రమము, నీటి చాలు, భూమి, వెల	( )	అ) ఆశ
2.	పుణ్యం, స్వభావం, న్యాయం, ఆచారం, నీతి	( )	ఆ) ధర
3.	మానవుడు, అర్జునుడు	( )	ఇ) ధర్మం
4.	దిక్కు, కోరిక	( )	ఈ) వంశం
5.	కులం, వెదురు, పిల్లనగ్రోవి	( )	ఉ) నరుడు

ఈ) కింది ప్రకృతులకు – వికృతులను, వికృతులకు – ప్రకృతులను రాయండి.

1. పుస్తకం	2. నీరము	3. జన్నము	4. విద్దె	5. గృహము
6. దివ్వె	7. సత్యము	8. దమ్ముము	9. సంతోషం	10. కావ్యం

ఉ) కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.

1. పుత్రుడు
2. ధర్మం
3. పతివ్రత
4. జ్యోత్స్న

ఊ) కింది పదాలకు వ్యతిరేక క్రియారూపాలు రాయండి.

1. చేసి
2. వచ్చి
3. తిను
4. విను
5. చెప్పి

AP SCERT

వ్యాకరణాంశాలు

సంధులు

అ) కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.

1. వంతలెల్ల : _____ + _____ = _____
2. క్రతువది : _____ + _____ = _____
3. లేదని : _____ + _____ = _____
4. భాషలేమిటి : _____ + _____ = _____
5. పూరితంబులగు : _____ + _____ = _____

ఆ) కింది పదాలను కలిపి రాసి, సంధి పేరు రాయండి.

1. కణ్వ + ఆశ్రమం : _____ _____
2. తీర్థ + అభిగమనం : _____ _____
3. ధర + అధినాథుడు : _____ _____
4. మహా + ఆనందము : _____ _____

సమాసాలు

అ) కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి, ఏ సమాసమో రాయండి.

1. సూర్య చంద్రులు : _____ _____
2. ఇహపరాలు : _____ _____
3. రాత్రింబవళ్లు : _____ _____
4. శకుంతలాదుష్యంతులు : _____ _____

అలంకారాలు

అ) ఉపమాలంకారం:- ఒక వస్తువును ప్రసిద్ధమైన మరొక వస్తువుతో పోల్చి రమ్యంగా చెబితే అది ఉపమాలంకారం. దీనిలో ఉపమానం, ఉపమేయం, ఉపమావాచకం, సమానధర్మం అనే నాలుగు అంశాలు ఉంటాయి.

ఉపమేయం	ఉపమానం	ఉపమావాచకం	సమానధర్మం
ఆమె ముఖం	చంద్రబింబం	వలె	అందంగా ఉంది.
నీ కీర్తి	పాల	వలె	తెల్లగా ఉంది

AP SCERT

కింది వాక్యాలలోని అలంకారాన్ని గుర్తించండి.

1. ఒక దీపం నుండి మరొక దీపం పుట్టి వెలుగొందినట్లు తండ్రి రూపం పుత్రునిలో ఉంటుంది.
2. ఆకాశంలో మేఘం వెండికొండలా తెల్లగా ఉంది.

ఛందస్సు

కింది తరగతిలో చంపకమాల పద్య లక్షణాలను తెలుసుకున్నారు కదా! ఇప్పుడు మత్తేభపద్య లక్షణాలను గురించి తెలుసుకుందాం...!

* పాఠంలోని కింది పద్య పాదాలకు గురు – లఘువులను పరిశీలించండి. పద్యలక్షణాలను అన్వయం చేయండి.

స	భ	ర	న	మ	య	వ
I I U	U I I	U I U	I I I	U U U	I U U	I U
వి ప రీ	త ప్ర తి	భా ష లే	మి టి కి	ను ర్వీ నా	థ! యీ పు	త్ర గా

స	భ	ర	న	మ	య	వ
I I U	U I I	U I U	I I I	U U U	I U U	I U
త్ర ప రి	ష్వం గ సు	ఖం బు సే	కొ ను ము	ము క్తా హా	ర క ర్పూ	ర సాం

స	భ	ర	న	మ	య	వ
I I U	U I I	U I U	I I I	U U U	I U U	I U
ద్ర ప రా	గ ప్ర స	రం బు ఁ జం	ద న ము ఁ	జం ద్ర జ్యో	త్స్ను యుం బు	త్త గా

స	భ	ర	న	మ	య	వ
I I U	U I I	U I U	I I I	U U U	I U U	I U
త్ర ప రి	ష్వం గ ము	న ట్లు జీ	వు ల కు	హృ ద్యం బే	క డున్ శీ	త మే

పై పద్యపాదాలు గమనించండి. ప్రతి పాదంలో వరుసగా స, భ, ర, న, మ, య, వ అనే గణాలు ఉన్నాయి కదా! ప్రతి పాదంలోనూ 14వ అక్షరం (వి – ర్వీ, త్ర – క్తా, ద్ర – ద్ర, త్ర – ద్యం) లకు యతి చెల్లింది. ప్రతి పాదంలో ప్రాస 2వ అక్షరం 'ప' ఉంది. ఈ లక్షణాలు ఉంటే అది మత్తేభ పద్యం అవుతుంది.

మత్తేభ పద్య లక్షణాలు

1. మత్తేభం వృత్త జాతి పద్యం.
2. నాలుగు పాదాలు ఉంటాయి.
3. ప్రతి పాదంలో 20 అక్షరాలు ఉంటాయి.
4. ప్రాస నియమం ఉంది.
5. ప్రతి పాదంలో స – భ – ర – న – మ – య – వ అనే గణాలు వరుసగా వస్తాయి.
6. ప్రతి పాదంలో 14వ అక్షరం యతి స్థానం.

AP SCERT

కింది పద్య పాదాలకు గురు – లఘువులను గుర్తించండి. మత్తేభ పద్య లక్షణాలను సమన్వయం చేయండి.

1. అవనీ చక్రము సంచరింపగ దివంబల్లాడ నాశాచయం
2. తమ కార్యంబుఁ బరిత్య జించియుఁ బరార్థ ప్రాపకుల్ సజ్జనుల్
3. అదిగో ద్వారక! యాలమంద లవిగో! నందందుఁ గోరాడు న(య్య)



ప్రాజెక్టు పని

- శకుంతలను అత్తవారింటికి పంపిస్తూ కణ్వమహాముని శకుంతలకు చెప్పిన మాటలను క్యూఆర్ కోడ్‌లో ఇచ్చిన శకుంతల చిత్రం స్కాన్ చేసి చూసి సమీక్ష రాసి తరగతి గదిలో ప్రదర్శించండి.
- ఈనాటి పెళ్ళి వేడుకలలో పెళ్ళికూతురును అత్తవారింటికి పంపే సందర్భాన్ని వర్ణిస్తూ వ్యాసం రాయండి.



పద్య మధురిమ

ఉ॥ **ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందుఁ దాల్మియున్**
భూపసభాంతరాళమునఁ, బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశము నందనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్

–భర్తృహరి సుభాషితాలు–ఏనుగు లక్ష్మణకవి

భావం: ఆపదలు వచ్చినపుడు ధైర్యగుణం, ఐశ్వర్యం కలిగినపుడు ఓర్పు, సభలో వాక్పాటవం, యుద్ధంలో శౌర్యం, కీర్తియందాసక్తి, విద్యార్జనయందు మిక్కిలి కోరిక – ఇవన్నీ సజ్జనులకు సహజసిద్ధమైన గుణాలు.

AP SCERT

2 ఇల్లలకగానే

M3E7J3

మూల గ్రంథం : 'సత్యవతి కథలు'


రచయిత్రి : పి. సత్యవతి

చదవండి - చర్చించండి

అమ్మ జేజి



పెరట్లో –
అమ్మ పిండి రుబ్బుతోన్న సవ్వడే
మాకు కోడి కూతయ్యేది
మేల్కొని ఒళ్ళు విరుచుకొని
బుడ్డిదీపం ముందు కూచుంటే
అమ్మే పుస్తకమై మా ముందు తెరుచుకునేది
తెల్లవార్లూ యంత్రమై గరగరలాడుతూ
అలసిపోయిన అమ్మ
మాకు మస్తిష్కంలో అక్షరమై విచ్చుకునేది
వేసవి ఒంటిపూట బడులప్పుడు
విరామ సమయంలో
మామిడి చెట్లక్రింద విప్పిన టిఫిన్ బాక్సులోంచి
గుప్పున ఉప్మావాసనై అమ్మ మా కడుపు తడిమేది
పాఠం గడగడా చదివేస్తున్నపుడు
ప్రశ్నలకు జవాబులు ఠక్కున చెబుతున్నపుడు
అమ్మ మెచ్చుకోలు చూపులే
మాకు ప్రశంసా పత్రాలయ్యేవి
అమ్మ రాత్రి ఎప్పుడు నిద్రపోయేదో !
తెల్లవారుఝామున
కొత్త పుస్తకపు వాసనలాంటి అమ్మ పిలుపుతో
విద్యార్థులుగా మేల్కొనేవాళ్లం !
హృదయంతో ఎవ్వరూ మాట్లాడలేరు
ఒక్క అమ్మ తప్ప !
హృదయంతో ఎవ్వరూ స్పర్శించలేరు
ఒక్క 'అమ్మ' కు అర్థం తెలిసిన వాళ్ళు తప్ప !
ఇప్పుడు మాకు ఏవో ఆశలు
ఏవేవో ఆశయాలు ఉన్నాయి గానీ
అప్పట్నుంచీ యిప్పటివరకూ



AP SCERT

అమ్మకు మేమే ఆశా దీపాలం
అమ్మ – మేం నిర్మించుకున్న జీవితాలకు పునాది!
గాలికి ఆరిపోకుండా
దీపం చుట్టూ కట్టిన చేతుల దడి !
దీపమై తానెన్ని దీపాల్ని వెలిగించిందో !
అమ్మ మా పసితనంలో
దీపాన్ని చూపించి
'జేజి – దండం పెట్టమ' ని చెప్పేది !
ఆ దీపంలో అమ్మే మాకెప్పుడూ కనిపించేది !!



– ఆప్త చైతన్య

ఆలోచనాత్మక ప్రశ్నలు:

1. పై కవితలో 'హృదయంతో ఎవరూ మాట్లాడలేరు ఒక అమ్మ తప్ప' అని ఎందుకు పేర్కొన్నారు?
2. మీ అమ్మను తలచుకున్నప్పుడు మీకు ఏమనిపిస్తుంది?

ఉద్దేశం

ప్రతి మనిషికి కొన్ని అభిరుచులు ఉంటాయి. ఆడవాళ్ళు పెళ్ళయిపోగానే ఇల్లు చక్కదిద్దడంలో లీనమైపోతారు. బరువు బాధ్యతలతో వంటింటి కుందేళ్ళయి పోతారు. ఇంటి పనులలో పడి కోరికలకు కళ్ళెం వేసుకుంటారు. అభిరుచులను అటకెక్కిస్తారు. భర్త, పిల్లలను చూచుకోవడమే భాగ్యం అనుకుంటారు. చివరికి తమ అస్తిత్వాన్ని కోల్పోతారు. వివాహితకు కుటుంబం అండగా నిలిస్తే వారు విజయబావుటా ఎగరేస్తారు. స్త్రీలు ఆత్మాభిమానాన్ని పెంపొందించుకోవాలి అని తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

ప్రవేశిక

వివాహమైన స్త్రీ తన చదువును, సృజనాత్మక నైపుణ్యాలను పక్కన పెట్టవలసి వస్తుంది. యంత్రంలా విసుగూ విరామం లేకుండా పనిచేస్తున్న క్రమంలో తనకో పేరు ఉందన్న సంగతి కూడా మర్చిపోతుంది. ఇంటి పనిలో మునిగి స్వీయ చైతన్యాన్ని, ఆత్మ గౌరవాన్ని కోల్పోవడంలోని అనౌచిత్యాన్ని ఈ కథ ద్వారా తెలుసుకుందాం.

ప్రక్రియ – కథ

తెలుగు సాహిత్యంలో కథ ఒక ప్రధాన ప్రక్రియ. వ్యక్తి జీవితంలో ఎదురయ్యే సంఘటనలను వివిధ పాత్రల ద్వారా గొప్ప శిల్ప నైపుణ్యంతో, గుండెకు హత్తుకొనేలా చెప్పే వచన రచనే కథ. ప్రస్తుతం కథ, కథానిక అనే రెండు పదాలను ఒకే అర్థంలో వాడుతున్నాం. ఎందరో రచయితలు తమ కథల ద్వారా తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తున్నారు.

రచయిత్రి పరిచయం :



జ: 12.07.1940

పి.సత్యవతి గుంటూరు జిల్లా కొలకలూరులో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఆంగ్ల సాహిత్యంలో ఎమ్.ఎ పట్టభద్రులయ్యారు. ఆంగ్ల అధ్యాపకురాలిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈమె కథలు, నవలలు, సాహిత్య సమీక్ష వ్యాసాలు రాశారు. అనువాదాలు కూడా చేశారు. ఏ ప్రక్రియలో రాసినా స్త్రీ జీవితమే ప్రధానంగా సుమారు 70 కథలు, రచనలు చేశారు. సత్యవతి కథలు, ఇల్లలకగానే, మత్తునగరి, మెలకువ, రాగభూపాలం మొదలైన కథా సంపుటాలు; పడుచుదనం, రైలుబండి, గొడుగు, ఆ తప్పు నీది కాదు, మొదలైన నవలలు రాశారు. ఉర్దూ రచయిత్రి 'ఇస్మత్ చుగ్తాయ్' కథలను తెలుగు అనువాదం చేసారు. చాసో స్ఫూర్తి పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 'కళారత్న' ఉగాది పురస్కారం వంటివెన్నో పొందారు. ప్రస్తుత పాఠ్యాంశం *'సత్యవతి కథలు'* అనే కథా సంపుటి లోనిది.

APSCERT

ఇల్లలకగానే...!

ఇల్లాలు కాకపూర్వం ఓ యువతి. చదువూ సంధ్య, తెలివి, చాకచక్యం, సమయస్ఫూర్తి, హాస్యం, లాస్యం అన్నీ కలిగిన అమ్మాయి. అమ్మాయి అందం, తెలివీ, వాళ్ళ నాన్న ఇచ్చిన కట్నం బాగా నచ్చిన ఓ చిన్నవాడు ఆ అమ్మాయి మెడలో మూడుముళ్ళూ వేసి, ఓ ఇంటికి ఇల్లాల్ని చేసి, 'ఇదిగో అమ్మడూ ఈ ఇల్లు నీది' అని చెప్పేడు. ఆ ఇల్లాలు వెంటనే పైట నడుముకి బిగించి, ఇంటిని అందంగా అలికి ముగ్గులు పెట్టింది. ఆ చిన్నవాడు వెంటనే ఆ ఇల్లాల్ని మెచ్చుకుని, "నువ్వు ఇల్లు అలకడంలో నేర్పరివి – ముగ్గులు వెయ్యడంలో అంతకన్నా నేర్పరివి – సెభాష్! కీప్ ఇట్ అప్" అని ఇంగ్లీషులో మెచ్చుకుని భుజం తట్టాడు.



దాంతో ఆ ఇల్లాలు తెగ మురిసిపోయి, ఇల్లలకడమే ధ్యేయంగా తన జీవితాన్ని కొనసాగించింది. ఎల్లప్పుడూ ఇంటిని పరిశుభ్రంగా అలికి రంగురంగుల రంగవల్లికలు తీర్చిదిద్దేది. ఆ విధంగా ఆమె జీవితం మూడు అలుకుగుడ్డలూ – ఆరు ముగ్గుబుట్టలుగా సాగిపోతూ వచ్చింది. కానీ ఒకనాడా ఇల్లాలు ఇల్లలుకుతూ అలుకుతూ "నాపేరేమిటి చెప్మా!" అనుకుంది. అలా అనుకుని ఉలిక్కిపడింది. చేతిలో అలుకు గుడ్డా, ముగ్గు బుట్టా అక్కడ పడేసి కిటికీ దగ్గర నిలబడి తల గోక్కుంటూ, "నా పేరేమిటి... నా పేరేమిటి!"అని తెగ ఆలోచించింది. ఎదురుగా ఇంటికి నేమ్ బోర్డ్ వ్రేలాడుతోంది. శ్రీమతి ఎం. సుహాసిని ఎం.ఏ. పిహెచ్.డి – ప్రిన్సిపాల్ అని. అవును అలాగే తనకీ ఓ పేరుండాలి కదా – ఇలా మర్చిపోయానేమిటి? ఇల్లలికే సంబరంలో పేరు మరిచిపోయాను. ఇప్పుడెలాగ అనుకుని ఆ ఇల్లాలు కంగారు పడిపోయింది. మనసంతా చికాగ్గా అయిపోయింది. ఎలాగో ఆ పూటకి ఇల్లలకడం కానిచ్చింది. అంతలో పనిమనిషి వచ్చింది. పోనీ ఆమెకైనా గుర్తుందేమోనని, "అమ్మాయ్! నాపేరు నీకు తెలుసా!" అని అడిగింది.

"అదేమిటమ్మా! అమ్మగార్ల పేర్లతో మాకేమిటి పని! మీరంటే మాకు అమ్మగారే! ఫలానా తెల్లమేడ క్రింద భాగంలో అమ్మగారంటే మీరు" అన్నది ఆ అమ్మాయి.

"అవున్లే పాపం నీకేం తెలుసు" అనుకుంది ఇల్లాలు.

> ∨ జీవితం మూడు అలుకు గుడ్డలూ – ఆరు ముగ్గు బుట్టలుగా సాగిపోవడమంటే మీకేమి అర్థమైంది?
>
> ∨ భర్త ఇల్లాలి భుజం ఎందుకు తట్టాడు?

స్కూల్‌నించి మధ్యాహ్న భోజనానికి వచ్చారు. పిల్లలకైనా గుర్తుందేమో నా పేరు అనుకుంది ఇల్లాలు. "ఓరే పిల్లలూ, నా పేరు మీకు తెలుసా?" అని అడిగింది. వాళ్ళు తెగ ఆశ్చర్యపడిపోయి "నువ్వు అమ్మవి... నీ పేరు అమ్మే... మేం పుట్టినప్పటినించీ మాకు తెలిసింది అదే. నాన్నగారి పేరుతో ఉత్తరాలొస్తాయి. ఆయన్నంతా పేరుతో పిలుస్తారు గనుక మాకు తెలుసు. నీ పేరు నువ్వు మాకెప్పుడు చెప్పలేదుగదా! పోనీ నీ పేరుతో ఉత్తరాలు కూడా రావు" అనేశారు వాళ్ళు. అవును తనకెవరు ఉత్తరాలు రాస్తారు? అమ్మా నాన్న ఉన్నారు గానీ నెలకో రెండు నెలలకో ఓసారి ఫోన్ చేస్తారు. చెల్లెళ్ళు అక్కలూ కూడా వాళ్ళ వాళ్ళ ఇళ్ళు అలుక్కోడంలో నిమగ్నమై వున్నారు. వాళ్ళు ఏ పెళ్ళిలోనో పేరంటంలోనో కలిస్తే కొత్తముగ్గుల్ని గురించో... వంటల్ని గురించో మాట్లాడుకోడమేగాని ఉత్తరాలు లేవు. ఇల్లాలు నిరాశపడింది ఆమెకి అశాంతి ఎక్కువైంది. తన పేరెలాగైనా గుర్తు తెచ్చుకోవాలనే తపన ఎక్కువైంది. అంతలో

APSCERT

పక్కింటావిడ పేరంటం పిలవడానికొచ్చింది. పోనీ ఆవిడకేమైనా గుర్తుందేమోనని అడిగితే ఆవిడ కిసుక్కున నవ్వేసి,

"మరే! మీ పేరు నేనడగాలేదు... మీరు చెప్పాలేదు. కుడిచేతివైపు తెల్లమేడావిడ అల్లదుగో ఆ మందుల కంపెనీ మేనేజరుగారి భార్య అనో లేకపోతే తెల్లగా పొడుగ్గా ఉంటుందే ఆవిడ అనో చెప్పుకుంటాం... అంతే" అనేసింది ఆ ఇల్లాలు.

ఇంక లాభంలేదు... పిల్లలు స్నేహితులు మాత్రం ఏం చెప్తారు... వాళ్ళకి కమలావాళ్ళ అమ్మ అనో, ఆంటీ అనో తెలుసు. ఇక భర్తగారొక్కరే శరణ్యం.. ఆయనకే గుర్తుంటే వుండాలి.

రాత్రి భోజనాల దగ్గర అడిగింది "ఏవండీ నా పేరు మర్చిపోయానండి... మీకు గుర్తుంటే చెప్పరా!"

భర్తగారు పెద్దగా నవ్వేసి "అదేమిటోయ్ ఎన్నడూ లేనిదివ్వాళ పేరు సంగతి ప్రస్తావిస్తున్నావు. నిన్ను పెళ్ళయిన్నాటి నుంచీ "ఏమోయ్" అని పిలవడం అలవాటైపోయింది. నువ్వు కూడా అలా పిలవకండి, నాపేరు నాకుంది కదా అని చెప్పలేదు...అందుకని నేనూ మర్చిపోయాను... ఇప్పుడేం? నిన్నందరూ మిసెస్ మూర్తి అంటారుగదా?" అన్నాడు.

"మిసెస్ మూర్తి కాదండీ నా అసలు పేరు నాక్కావాలి – ఎలాగిప్పుడు?" అన్నది ఆవేదనగా.

"దానికేం పోనీ ఏదో ఒక పేరు పెట్టేసుకో కొత్తది" అని సలహా ఇచ్చాడు ఆయన.

"బావుందండీ.. మీ పేరు సత్యనారాయణ మూర్తి అయితే మిమ్మల్ని శివరావు అనో సుందరరావు అనో పెట్టుకోమంటే ఊరుకుంటారా? నా పేరే నాక్కావాలి" అన్నది.

"చదువుకున్నావుగదా... సర్టిఫికెట్లమీద పేరుంటుంది గదా. ఆ మాత్రం కామన్సెన్స్ లేకపోతే ఎలా... చూసుకో వెళ్ళి" అని సలహా ఇచ్చాడాయన మళ్ళీ. ఇల్లాలు సర్టిఫికెట్లకోసం హోరా హోరీ వెతికింది. బీరువాలో పట్టుచీరెలు, షిఫాన్ చీరెలు, నేతచీరెలు, వాయిల్చీరెలు వాటి మాచింగ్ జాకెట్లు, లంగాలు, గాజులు, పూసలు, ముత్యాలు, పిన్నులు, కుంకుమ భరిణెలు, గంధంగిన్నెలు, వెండికంచాలు, బంగారం నగలు అన్నీ పొందికగా అమర్చి వున్నాయేగానీ అందులో ఎక్కడా సర్టిఫికెట్ల జాడలేదు. అవును... తను పెళ్ళయిన తరువాత ఇక్కడికొచ్చేటప్పుడు అవి తెచ్చుకోలేదు.

> V "అదేమిటమ్మా అమ్మగార్ల పేర్లతో మాకేమిటి పని" అన్న పనిమనిషి మాటలను బట్టి మీకేమి అర్థం అయ్యింది?
>
> V పేరంటానికి పిలవడం అంటే ఏమిటి?

"అవునండీ... నేను అవి ఇక్కడికి తెచ్చుకోలేదు... నేను మా ఊరు వెళ్ళి ఆ సర్టిఫికెట్లు వెతుక్కుని నా పేరు అడిగి తెలుసుకుని రెండు రోజుల్లో వచ్చేస్తాను" అని అడిగింది భర్తని.

"బాగానే వుంది. పేరుకోసం ఊరెళ్ళాలా? ఏం? నువ్వు ఊరెడితే ఈ రెండు రోజులూ ఇల్లెవరలుకుతారు?" అన్నాడు నాథుడు. అవును నిజమే మరి, తనందరికన్న బాగా అలుకుతుందని గదా ! ఆ పని ఎవర్నీ చెయ్యనివ్వలేదు ఇన్నాళ్ళూ. ఎవరి పన్లు వాళ్ళకున్నాయి. ఆయనకి ఉద్యోగం, పిల్లలకి చదువులు, వాళ్ళకెందుకులే శ్రమ పాపం అనుకుని తనే ఆ పని చేస్తూవచ్చింది. వాళ్ళకి అసలు చేతకాదు మరి.

అయినా పేరు తెలీకుండా ఎలా బ్రతకడం.

ఇన్నాళ్ళు ఆ విషయం గుర్తురాలేదు గనుక సరిపోయిందిగానీ, గుర్తొచ్చాక కష్టంగానే వుంది.

"రెండు రోజులెలాగైనా కష్టపడండి నే వెళ్ళి నా పేరు కనుక్కుని రాకపోతే బ్రతకలేకుండా వున్నాను" అని బ్రతిమిలాడి బయటపడింది ఇల్లాలు.

"ఏమ్మా! ఇంతర్జంటుగా వచ్చావు? ఆయనా పిల్లలు బావున్నారా? ఒక్కదానివే వచ్చావేం?" అని అమ్మా నాన్నా ఆప్యాయంగానే పలకరించినా అందులో కొంత సందేహాన్ని కూడా జోడించారు. వచ్చిన పని వెంటనే గుర్తుకొచ్చి

"అమ్మా! నా పేరేమిటో చెప్పమ్మా" అనడిగింది ఎంతో దీనంగా ఇల్లాలు.

APSCERT

"అదేమిటమ్మా! నువ్వు మా పెద్దమ్మాయివి. నీకు బి.ఏ. దాకా చదువు చెప్పించి యాభైవేలు కట్నం ఇచ్చి పెళ్ళి చేశాం. రెండు పురుళ్ళు పోశాం. ప్రతి పురిటికీ ఆస్పత్రి ఖర్చులు మేమే భరించాం. నీకిద్దరు పిల్లలు. మీ ఆయనకి మంచి ఉద్యోగం. చాలా మంచివాడు కూడానూ. నీ పిల్లలు బుద్ధిమంతులు."

"నా చరిత్ర కాదమ్మా... నా పేరు కావాలమ్మా నాకు. పోనీ, నా సర్టిఫికెట్లు ఎక్కడున్నాయో చెప్పు."

> V "భర్తగారొక్కరే శరణ్యం" అని ఇల్లాలు ఎందుకు భావించింది?
>
> V పుట్టింటికి ఒక్కర్తే వచ్చిన ఇల్లాలిని చూసిన తల్లిదండ్రులకు వచ్చిన సందేహం ఏమై ఉండవచ్చు?

"ఏమోనమ్మా ఈమధ్యన అలమారల్లో పాత కాగితాలు, ఫైళ్ళు అన్నీ ఖాళీ చేసేసి గాజు సామాన్లు సర్దించాం. కొన్ని కొన్ని ముఖ్యమైన ఫైళ్ళు అటకమీద పడేశాం. రేపు వెతికిద్దాంలే. ఇప్పుడు వాటికేం తొందర. హాయిగా స్నానం చేసి భోజనం కానియ్యమ్మా" అన్నది ఆ ఇల్లాలి తల్లి. ఇల్లాలు హాయిగా స్నానం చేసి భోజనం చేసింది కానీ నిద్ర రాలేదు. ఆడుతూ పాడుతూ ఇల్లలుకుతూ ముగ్గువేస్తూ పేరు మర్చిపోవడం వల్ల ఇలా ఇన్ని కష్టాలొస్తాయని ఎప్పుడూ అనుకోలేదు.

తెల్లవారింది గానీ అటకమీద ఫైళ్ళలో సర్టిఫికెట్లు వెతకడం పూర్తికాలేదు. ఈలోగా ఆ ఇల్లాలు కనపడ్డ మనిషినల్లా అడిగింది. చెట్టునడిగీ... పుట్టనడిగీ... చెరువునడిగీ... తను చదివిన స్కూలునడిగీ... కాలేజీనడిగీ... అరచీ ఆక్రోశించి ఎట్టకేలకు ఓ మిత్రురాలిని కలిసి తన పేరు సంపాదించింది. ఆ స్నేహితురాలు తనలాగే, తనతోనే చదువుకుని తనలాగే పెళ్ళి చేసుకుని, తనలాగా బ్రతుకు ఇల్లలకడంగా కాకుండా, ఇల్లలకడం బ్రతుకులో ఓ భాగంగా బ్రతుకుతూ తన పేరునూ, తన స్నేహితురాళ్ళ పేర్లనూ కూడా గుర్తుంచుకున్న వ్యక్తి.. ఆ స్నేహితురాలు ఈవిణ్ణి చూడగానే గుర్తుపట్టి, "ఓ హాయ్ శారదా! నా ప్రియమైన శారదా!" అని కేకలు పెట్టి కౌగిలించేసుకుంది. అప్పుడా ఇల్లాలిని దాహంతో ఆర్చుకుపోయి, ఎండిపోయి ప్రాణం పోవడానికి సిద్ధపడిన వాడికి కొత్త కూజాలో నీళ్ళు చెంచాతో నోట్లో పోసి బ్రతికించిన చందంగా... బ్రతికించింది ఆ స్నేహితురాలు.



"నువ్వు శారదవి. నువ్వు మన స్కూల్లో టెన్త్ క్లాసులో ఫస్ట్ వచ్చావు కాలేజీలో జరిగిన మ్యూజిక్ పోటీల్లో ఫస్టొచ్చావు. అప్పుడప్పుడు మంచి మంచి బొమ్మలు వేసేదానివి. మనందరం పదిమంది స్నేహితులం. వాళ్ళందర్నీ నేను అప్పుడప్పుడూ కలుసుకుంటూనే ఉన్నాను. మేం ఉత్తరాలు రాసుకుంటూనే వున్నాం. నువ్వొక్కదానివే మాకు అందకుండా పోయావు. చెప్పు, ఎందుకు అజ్ఞాతవాసం చేస్తున్నావు" అని నిలదీసింది ఆవిడ.

"అవును ప్రమీలా... నువ్వు చెప్పింది నిజం. నేను శారదనే... నువ్వు చెప్పేదాకా నాకు జ్ఞాపకం రాలేదు. నా మెదడులోని అరలన్నీ కూడా ఇల్లు ఎంత బాగా అలకాలీ అనే విషయంమీదే

AP SCERT

కేంద్రీకృతం అయిపోయాయి. ఇంకేం గుర్తులేదు. నువ్వు కనపడకపోతే నాకు పిచ్చెక్కిపోయేది" అంది శారద అనే పేరుగల ఆ ఇల్లాలు. శారద సరాసరి ఇంటికి వచ్చి అటక ఎక్కి పాత ఫైళ్ళు తిరగదోడి తన సర్టిఫికెట్లు, తను వేసిన బొమ్మలు, పాత ఆల్బంలు అన్నీ సాధించింది. తను స్కూల్లో కాలేజీలో గెలుచుకున్న ప్రైజులు కూడా వెతికి పట్టుకుంది.

- ప్రతుకు ఇల్లలకడంగా కాకుండా, ఇల్లలకడం ప్రతుకులో ఓ భాగంగా ప్రతకడం అంటే మీకేమి అర్థమైంది?
- అజ్ఞాతవాసం అంటే ఏమిటి? మహాభారతంలో అజ్ఞాత వాసం చేసినది ఎవరు?

కొండంత సంతోషంతో ఇంటికి తిరిగివచ్చింది. "నువ్వు లేవు... ఇల్లు చూడెలా ఉందో... సత్రంలా వుంది. అమ్మయ్య నువ్వొచ్చావు. ఇంక మాకు పండగేనోయ్" అన్నాడు శారద భర్త. "ఇల్లలకగానే పండగకాదండీ... అవును గానీ ఇకనుంచీ నన్ను ఏమోయ్, గీమోయ్ అనకండి. నా పేరు శారద... శారదా అని పిలవండి తెలిసిందా" అని కూనిరాగాలు తీస్తూ హుషారుగా లోపలికి వెళ్ళింది. ఏ మూల దుమ్ము ఉందో, ఎక్కడ సామాన్లు క్రమపద్ధతిలో లేవని చాలా తీక్షణంగా వెతుకుతూ, క్రమశిక్షణ కోసం తపనపడే శారద రెండు రోజులుగా దులపని సోఫాలో హాయిగా చేరబడి, తను తెచ్చిన సర్టిఫికెట్‌లను, తనకొచ్చిన ప్రైజులను, తాను గీసిన బొమ్మల్ని పిల్లలకి చూపిస్తోంది ఉత్సాహంగా.



ఇవి చేయండి

అవగాహన - ప్రతిస్పందన

అ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి, రాయండి.

1. స్నేహితురాలు గుర్తుచేసిన ఇల్లాలి గతం ఎలాంటిది? చెప్పండి.

2. తన పేరేమిటన్న ఇల్లాలి ప్రశ్నకు పక్కింటావిడ చెప్పిన జవాబేమిటి?

3. 'అజ్ఞాత వాసం' అంటే మీకేమి అర్థమైంది?

ఆ) ఇచ్చిన గద్యాన్ని చదివి, అడిగిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

గణగణమంటూ స్కూల్ బెల్ మోగింది.పాఠశాల విడిచిపెట్టగానే పిల్లలందరూ తమతో పాటు తెచ్చుకున్న క్యారేజీలు విప్పి తినడం ప్రారంభించారు. అందులో ఒక అమ్మాయి మాత్రం తెచ్చుకున్న రొట్టెముక్కలు పళ్లు తమతో పాటు చదువుతున్న పేద విద్యార్థినులకు పంచి, వారితో కలిసి తింది. తెచ్చుకున్న తినుబండారాలు అందరికీ సరిపడలేదు. మరుసటి రోజు అమ్మతో "అమ్మా...ఈ మధ్య నాకు ఆకలి చాలా ఎక్కువగా ఉంటోంది. కాబట్టి నా క్యారేజీలో నలుగురైదుగురికి సరిపడినంత పెట్టు" అంది. నిజమేననుకుని ఆ తల్లి నలుగురైదుగురికి సరిపడినన్ని రొట్టెలు, పళ్లు పెట్టి ఇచ్చింది.

సాయంత్రం ఆ అమ్మాయి స్కూల్ నుండి వచ్చినప్పుడు అమ్మ క్యారేజీ తెరిచి చూసింది. అందులో చిన్న రొట్టె ముక్కగానీ, కనీసం ఒక పండుగానీ మిగల్లేదు. కూతురు ఇన్ని ఎలా తిందా అని ఆశ్చర్యపోయింది.

ఆమె స్కూల్ టీచర్ని కలిసి తన కూతురు అన్ని పదార్థాలు ఎలా తింటుందో గమనించమని చెప్పింది. "నువ్వేం భయపడవద్దు. నేను చూస్తాలే" అని టీచర్ ఆమెకు ధైర్యం చెప్పింది. మరునాడు ఆ అమ్మాయి తోటిపిల్లలకు ఆహార పదార్థాలు పంచడం గమనించి జరిగిన విషయం ఆమెతో చెప్పింది టీచర్. ఆ అమ్మాయి తల్లి ఎంతగానో మెచ్చుకుంది.

APSCERT

ముద్దులాడింది. ఆ అమ్మాయి ఎవరో కాదు, ప్రాంతీయ భేదాలు మరచి, భారత స్వాతంత్ర్యం కోసం ఎనలేని సేవలందించిన అనిబిసెంట్. చిన్ననాటి నుంచి సత్ప్రవర్తన, ప్రేమ, సేవ, త్యాగం వంటి మంచి లక్షణాలను అలవరచుకోబట్టే ఆమె 'మహామనిషి'గా ఎదిగింది.



1. పై గద్యంలో 'తినదగిన పదార్థాలు' అనే అర్థం కలిగిన పదాన్ని గుర్తించి రాయండి.

2. అనిబిసెంట్‌ను తల్లి ఎందుకు మెచ్చుకొని, ముద్దులాడింది?

3. 'దుష్ప్రవర్తన' ఈ పదానికి వ్యతిరేక పదాన్ని గద్యంలో వెతికి రాయండి.

4. అనిబిసెంట్ భారత దేశానికి ఏ విషయమై సేవలను అందించింది?

5. పై గద్యానికి తగిన శీర్షికను రాయండి.

ఇ) కింది పేరాను చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.

బండారు అచ్చమాంబ 1874లో కృష్ణాజిల్లా నందిగామలో పుట్టింది. తండ్రి వెంకటప్పయ్య, తల్లి గంగమాంబ. ఆమెకు ఆరేళ్లప్పుడు తండ్రి మరణించాడు. పదేళ్ల వయసులో మాధవరావుతో వివాహం జరిగింది. పుట్టిన ఇద్దరు పిల్లలూ ఏడాది వ్యవధిలో మరణించారు. దుఃఖం నుంచి మెల్లగా కోలుకుంది. కన్నీళ్లను కాగితాలపై అక్షరాలుగా మలచింది. స్త్రీ అనంత శక్తిమంతురాలనీ, ఆమెకు విద్యాప్రకాశాలు అందితే జాతికి మార్గదర్శి కాగలదని నిశ్చయంగా నమ్మింది. తినడం, పడుకోవడమే జీవితం కాదని, వెలుగుతూ వెలిగించడమేనని, సరాల్లో ఆవేశం, గుండెల్లో చైతన్యం ఉబికివచ్చేలా ప్రసంగించేది. మాటలే కాదు చేతల్లో కూడా చేవ ఉన్న అచ్చమాంబ తన జీవితాన ఎదురైన దుఃఖాన్ని ధైర్యంగా దిగమింగుకుంది. అదే చెప్పింది అందరికీ. నీకోసం బతకడం బతుకు కాదని, నిర్భాగ్యులకు నీడనివ్వడమే పరమార్థమని ప్రసంగించేది. ఆచరించేది. ఓసారి ఓ బిచ్చగత్తె ఇద్దరు పిల్లలతో అడుక్కుంటుంటే వారిని వారించి, ఓ ఆవును కొనిచ్చి, వారి కాళ్లపై వారిని నిలబడేలా చేసింది. తన మరిదికి భార్య చనిపోతే అందరినీ ఎదిరించి, దగ్గరుండి మరీ ఓ వితంతువును అతనికిచ్చి పెళ్లి చేసింది 1905లో మహారాష్ట్రలో ప్లేగు వ్యాధి వ్యాపించింది. ఓ గర్భిణి రోగాన పడింది. ఎవరూ తోడు లేరు. దగ్గరుండి తానే పురుడు పోసింది అచ్చమాంబ. ఆ మహమ్మారి ఆమెనూ కబళించింది. 1905 జనవరి 18న మూడు పదుల వయస్సులోనే అచ్చమాంబ కన్నుమూసింది.



1. అచ్చమాంబకు వివాహమైన తరువాత కలిగిన దుఃఖం ఏమిటి?

2. 'మార్గదర్శి కావడం' అంటే ఏమిటి?

AP SCERT

3. ఏ మహమ్మారి అచ్చమాంబను కబళించింది?

అ) కలరా ఆ) మలేరియా ఇ) ప్లేగు ఈ) టైఫాయిడ్

4. 'కన్నుమూయడం' అనే పదాన్ని దేనికి పర్యాయ పదంగా వాడుతారు?

5. 'తన కాళ్ళపై తాను నిలబడటం' అంటే మీకేమి అర్థం అయ్యింది?

వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో జవాబులు రాయండి.

1. "నా పేరేమిటో చెప్పమ్మా" అన్న ఇల్లాలికి తల్లి చెప్పిన చరిత్ర ఏమిటి?
2. "అమ్మయ్య నువ్వొచ్చావు. ఇంక మాకు పండగేనోయ్" అన్న శారద భర్త మాటలను బట్టి మీరు ఏమి గ్రహించారు?
3. ఇల్లాలు తన పేరు తానే మరచిపోవడానికి గల కారణాలు రాయండి.

ఆ) కింది ప్రశ్నలకు పదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.

1. కథలో ఇల్లాలు తన పేరు మరచిపోవడాన్ని మీరు సమర్థిస్తారా? ఎందువల్ల?
2. మరచిపోయిన తన పేరును తెలుసుకోవడానికి ఇల్లాలు చేసిన ప్రయత్నాలు ఏవి?
3. ఇల్లాలు, స్నేహితురాలిని కలిసిన సందర్భాన్ని సంభాషణ రూపంలోకి మార్చి రాయండి.

భాషాంశాలు - పదజాలం

అ) ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాసి, సొంత వాక్యాలలో ప్రయోగించండి.

1. కోనేరు హంపి చదరంగం ఆటలో నేర్పరి
2. అమ్మ తీర్చిదిద్దిన బొమ్మను నేను.
3. ఉపాధ్యాయుడు మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థి భుజం తట్టాడు.
4. విద్యార్థికి విద్యార్జనే తపనగా ఉండాలి.

ఆ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు నిఘంటువును ఉపయోగించి సమానార్థక పదాలను రాయండి.

1. పండుగనాడు ఇంట్లో అందరూ కొత్త బట్టలు ధరించారు.
2. నెల్రూ జైలు నుండి ఇందిరకు ఉత్తరాలు రాశారు.
3. క్రికెట్ చూస్తున్నవారందరకూ మన జట్టే గెలవాలని తపన.
4. చదువుకున్న ఇల్లాలు ఇంటిని చక్కదిద్దుకుంటుంది.
5. అన్నకు చదివిన పద్యం గుర్తు రాలేదు. (గీతగీసిన పదానికి పర్యాయ పదాలు గుర్తించండి.) ( )

అ) జ్ఞప్తి, ఎరుక బి) తలపు, విరుపు

సి) జ్ఞప్తి, స్థిరము డి) తీరు, గౌరవము

AP SCERT

ఇ) కింది పదాలలో ప్రకృతి – వికృతులను జతపరిచి రాయండి.

తీరము – గారవం – ప్రాణము – దరి – బాస – గౌరవం – అచ్చెరువు – భాష – ఆశ్చర్యం – పానము.

	ప్రకృతి	వికృతి
1.		
2.		
3.		
4.		
5.		

వాక్యాలు

అ) కింది సామాన్య వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చి రాయండి.

1. రాధ పాట పాడుతున్నది. రవి పాట పాడుతున్నాడు.
2. సాందీపుడు గురువు. శ్రీకృష్ణుడు శిష్యుడు.
3. రవి బజారుకు వెళ్ళాడు. రఘు బజారుకు వెళ్లాడు.
4. భీముడు వీరుడు. అర్జునుడు వీరుడు.

ఆ) కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చి రాయండి.

1. శైలజ నడుస్తున్నది. శైలజ పాట పాడుతున్నది.
2. నెమలి వేగంగా వచ్చింది. నెమలి పామును చూసింది.
3. నేను ఉదయాన్నే లేచాను. నేను వ్యాయామం చేశాను.
4. ఏనుగు తొండం ఎత్తింది. ఏనుగు ఘీంకరించింది.

వ్యాకరణాంశాలు

అ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలను విడదీసి, సంధిపేరు రాయండి.

1. రామన్న **కూరగాయలు** పండించాడు.
2. **ఊరువల్లెలు** జాతరకు కదలివచ్చాయి.
3. మన అందరికీ ప్రత్యక్ష దైవాలు మన **తల్లిదండ్రులు.**
4. రాజు **కొలువునేసి** ఉన్నాడు.

ఆ) ఈ కింది పదాలకు సంధిచేసి కలిపి రాయండి

1. వాడు + కొట్టె = _____
2. నీవు + టక్కరివి = _____
3. వత్తురు + పోదురు = _____
4. వారు + చనిరి = _____

AP SCERT

ఇ) కింది పట్టికలోని ఖాళీ గళ్ళను పూరించండి.

	సమాస పదం	విగ్రహవాక్యం	సమాసం పేరు
1.	చదువు సంధ్యలు		ద్వంద్వ సమాసం
2.		మూడైన ముళ్ళు	
3.	అశాంతి		నఞ్ తత్పురుష సమాసం
4.		పాతవైన కాగితాలు	విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
5.		నా యొక్క చరిత్ర	



ప్రాజెక్టు పని

ఉదయం నిద్ర లేచినది మొదలు రాత్రి పడుకునే వరకు మీ అమ్మ చేసే పనులను పరిశీలించి జాబితా రాయండి. అలుపు సొలుపు లేకుండా ఆమె చేస్తున్న పనులను విశ్లేషిస్తూ నివేదిక రాసి తరగతి గదిలో ప్రదర్శించండి.



పద్య మధురిమ

శా. **ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాస సంత్రస్తులై**
యారంభించి పరిత్యజింతురురు విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్ఝగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్

– భర్తృహరి సుభాషితాలు – ఏనుగు లక్ష్మణకవి

భావం: నీచులైనవారు ఆటంకాలు వస్తాయనే భయంతో తాము చేయాలనుకున్న పనిని అసలు ప్రారంభించరు. ఆటంకాలు ఎదురైతే, మొదలుపెట్టిన పనిని సగంలోనే వదిలేసేవారు మధ్యములు. ప్రజ్ఞానిధులైన ధీరులు ఎన్ని ఆటంకాలు కలిగినా, ధైర్యంతో కూడిన గొప్ప ఉత్సాహంతో ప్రారంభించిన పనులను పూర్తి చేసే వరకూ వదిలిపెట్టరు.

APSCERT

3 చైతన్యం


మూల గ్రంథం : కొత్తపాళీ

కవి : తాపీ ధర్మారావు

పూలండోయ్ పూలు

చదవండి - చర్చించండి

పూలమ్ముకొని బతికిపోయినా బావుండు
నిత్యం రంగుల సుగంధాల వానలో నృత్యం చేసేవాడిని
పూలు రాశులుగా పోసి కిలోలు క్వింటాళ్ళ లెక్కన అమ్మేచోట
కూలీకి కుదిరినా చక్కగా ఉండేది
తోటల్ని తోలుకు తిరిగే పూలకాపరినయ్యేవాడిని
పూలు లారీలకెక్కించే చోట పని చేసుకున్నా సరిపోయేది
పూల బస్తాలు కుట్టీ కుట్టీ సువాసనల
సూదీదారాలతో మనుషుల్ని కుట్టిపారేసేవాడిని
నెత్తిమీద రంగుపూల బుట్టల్ని పెట్టుకుని
పూల వ్యాపారం చేసుకున్నా ఓ లెక్కనుండేది.
కువకువలాడే చిత్రవర్ణాల చిట్టిపిట్టలు
తల మీద ఆడుకుంటుంటే
నా చుట్టూ నేనే పూల ముగ్గులు వేసుకుంటూ
మనిషి చెట్టునై మసలేవాడిని
పూలండోయ్ పూలు
జ్ఞాపకాల జాజులు మమకారాల మందారాలు
మమతల మల్లెలు కలల కనకాంబరాలు
చలాకీ ఊహల గులాబీలు ముద్దు చూపుల ముద్దబంతులు
పాటల పారిజాతాలు ఆశల సంపెంగలు
పూలండోయ్ పూలు
బతుకుల్ని తూకం వేసి అమ్ముకునే చోట
నాకు బతుకు పరమార్థం దొరికింది.
మనుషులంతా పువ్వులైపోయినట్టు
పువ్వులు, మనుషుల్ని మూటలుగట్టి
మంచికీ మానవత్వానికీ మధ్య ఆదానప్రదానాలు చేస్తున్నట్టు
అక్కడోసారి వాసన చూశాకే
రోజూ సూర్యుడు తూర్పు కొండెక్కి
ఒళ్ళు విరుచుకుంటున్నట్టు
ఒకటే కలలు కలలు
పూలండోయ్ పూలు







డా॥ ప్రసాద మూర్తి

AP SCERT

ఆలోచనాత్మక ప్రశ్నలు:

1. నిండా విరబూసిన పూల చెట్టునో, రంగురంగుల పూలతోటనో చూస్తే నీకేమనిపిస్తుంది? వాటి నుండి మనం నేర్చుకోదగినది ఏమైనా ఉందా?
2. పూలు అమ్ముకుని బతికిపోయినా బాగుండు అని అనడంలో కవి మనకు ఏమి సూచిస్తున్నాడు?

ఉద్దేశం

ప్రతి మానవ సమాజంలోనూ అందరికీ అతీతంగా కొందరుంటారు, వారు భవిష్యత్తును దర్శిస్తారు. ముందుచూపుతో ఆలోచిస్తారు. దారి దీపమై ముందుకు సాగుతారు. వారు తాత్త్వికులు. వారు తమ మాటల ద్వారా చేతల ద్వారా దిశానిర్దేశం చేస్తారు. కవి కూడా ఈ కోవకు చెందినవాడే. అతడి కవిత్వంతో సామాజిక చైతన్యం కలిగిస్తాడు. కవి తన రచనల ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తాడు. ఒక వంక మనిషిలోని మంచితనాన్ని మెచ్చుకుంటూ కుటిలత్వాన్ని ఎండగడతాడు. ఆ నిబద్ధతతోనే కవి తన మనసులోని భావాలను లోకానికి ఈ కవిత రూపంలో వెల్లడించారు. విద్యార్థుల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించి, సమాజాభివృద్ధికి పాటుపడేలా చేయడమే ఈ పాఠం ఉద్దేశం.


నేపథ్యం

కవిత్వానికి ఉండవలసిన ప్రథమ లక్షణం సామాజిక ప్రయోజనం. సమాజంలోని అసమానతల్ని రూపు మాపడానికి కవి తన కలాన్ని కదిలించాలి. ప్రజల గొంతుకగా కవి వినబడాలి. తోటి మానవాళికి అండగా నిలవాలంటే గుండె నిండా ధైర్యం నింపుకోవాలి. సొంత లాభం కోసం కాకుండా పరుల మేలు కోరి పనిచేయాలి అని ప్రేరణనిస్తూ కవి తన ఆకాంక్షను వ్యక్తం చేస్తున్న సందర్భంలో కవి కలం నుంచి జాలువారినదే ఈ గేయకవిత.

ప్రక్రియ – గేయకవిత

గేయ కవిత పాడుకోవడానికి అనువైనది. మాత్రా ఛందస్సును అనుసరించి నడుస్తుంది. లయాత్మకంగా సాగుతుంది. మానవాళి శ్రేయస్సునూ, సమాజ పురోగమనాన్ని, లోక కల్యాణాన్ని కాంక్షించే గేయాన్ని అభ్యుదయ గేయం అంటారు.


కవి పరిచయం :




జ :19-09-1887
మ:08-05-1973

తాపీ ధర్మారావు అభ్యుదయ రచయిత, పత్రికా సంపాదకుడు, చలన చిత్ర సంభాషణ రచయిత. పత్రికా సంపాదకుడిగా దినపత్రికలలో తొలిసారి వ్యావహారిక భాషను ప్రవేశపెట్టాడు. పద్య కవిత్వంతో మొదలు పెట్టి నాటికలు, నాటకాలు, నవలలు, పరిశోధన వ్యాసాలు ఎన్నో రాశాడు. సుబోధకమైన జనరంజక శైలిలో రచనలు చేశాడు. పాతపాళీ, కొత్తపాళి, దేవాలయాల మీద బూతుబొమ్మలెందుకు, పెళ్లి దాని పుట్టు పూర్వోత్తరాలు, రాలూ – రప్పలూ, ఇనుప కచ్చడాలు, సాహితీ మొర్మరాలు మొదలైనవి ఆయన రచనలు. చేమకూర వేంకటకవి విజయవిలాస ప్రబంధానికి ఆయన రాసిన 'హృదయోల్లాస' వ్యాఖ్యానానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. పుట్టపర్తి నారాయణాచార్యులు, గుర్రం జాషువా, గురజాడ అప్పారావు, శ్రీ.శ్రీ వంటి గొప్ప కవులు వీరి సమకాలికులు. ప్రస్తుత పాఠ్యభాగం తాపీ ధర్మారావు రచించిన 'కొత్తపాళీ' గ్రంథం లోనిది.

AP SCERT



చైతన్యం



అందమగు మేఘాల
సందులో, నొక చిన్ని
గొందిలో దూరి, యానందమునకై పాడు
కుందామనే చింత కూడ దది, కూడ దది
పుట్టు గ్రుడ్డిగ పోకురా
ఓ కవీ!
వట్టి మ్రోడువు కాకురా!


"ఏకతార" పాటలను
ఇంక చాలించరా
కాకతో జగమొక్క కమ్మచ్చునే తీసి,
లోకతంత్రుల గొంతులోన పల్కించరా
పాతరోజులు పోయెరా
ఓ కవీ!
రోత పాటలు మానరా!

దిక్కులను చూచినా,
చుక్కలను కాంచినా,
ఒక్క రీతిని రక్త మోడికలు కడుతుంది.
బక్కవారిని పోరు చక్కాడిపోకుండ
నిలిచి శాసించవేమిరా!
ఓ కవీ!
పలికి పురికొల్పు వేమిరా!

గొంతులో ఒక యగ్ని
కొత్తగా రగిలింది
తంత్రులన్నీ ఒక్క పుంతలోబడ్డాయి
ఇంతింత అనరాని వింత బలమొచ్చింది
స్వార్థగానము మానరా
ఓ కవీ!
సార్థకానికి పూనరా!

© SCERT

క్రూరులై కల్పించు
ఘోర యుద్ధాలలో
కోట్లకొద్దీ జనులు కూడు గుడ్డకు లేక
పాట్లుపడి చచ్చారు పరికించలేదేమొ
తిండియొక్కటి కాదురా!
ఓ కవీ!
గుండె ధైర్యము నూదరా !



నీటిలో గాలిలో
నేలమీదను "చావు"
కోటికోరలు చాచి వేటాడుచున్నదా
ధాటికోరవలేక దద్దరిల్లుచున్నారు
మెత్తదనమును వీడరా!
ఓ కవీ!
కత్తిసాముసు పాడరా!

అధిక బాధలతోడ
అలమటించే జనుల
కష్టాల కొలిమిలో కాగి మండినగుండె
కత్తివాదరనైన మెత్తననిపించగా
మాటాడ నుంకించరా!
ఓ కవీ!
మానసము నురికించరా !

తూర్పు పడమరలనక
దొర్లుకొని వచ్చేటి
దుఃఖవాహిని నాపి, దొడ్డశక్తిగ మార్చి
దుష్టరాక్షసి నొక్క త్రుటిలోన పరిమార్చ
కంకణమ్ముసు కట్టరా!
ఓ కవీ!
జంకెల్ల పోగొట్టరా !

పూలవర్షము కురియు
పాలమబ్బుల నుంచి
రాలుచుండే అగ్నిగోళాల మంటలో
కాలకుండా ప్రజల కాపాడి రక్షించ
జాతి కాయుధ మీవెరా!
ఓ కవీ!
నీ తేజమును చూపరా!

మండు టాకలిలోను
ఎండు నాల్కలలోను
మొండిబారిన పేద బండ గుండెలలోను
గాండ్రించు భావాల నిండించి నీ గొంతు
సింహనాదము చేయరా!
ఓ కవీ!
స్థిరమైన పేర్మోయరా!

చిదిగి శిథిలాలైన
హృదయాలు పెనవేసి
అదురుబెదురుల గుండెలన్నీ యొక్కటి చేసి,
పదును నాలుకతోడ పలికి సాధించాలి
వెనుకాడగా కాదురా!
ఓ కవీ!
వెనుక తరుణము రాదురా!

ప్రజల కవివై గొంతు
రగిలించి పాడితే
బక్కడొక్కలు రేగి ప్రళయమారుతమట్లు
తక్కువెక్కువలెల్ల ఒక్క దెబ్బను కూల్చి
లోకాల నూగింపరా!
ఓ కవీ!
శోకాల తొలగింపరా!



AP SCERT

గేయాల భావాలు

1. ఓ కవీ..! అందమైన మేఘాల గురించి వాటి సోయగాల గురించి అనవసర ఆలోచనల్లో పడిపోవద్దు. ఆనందం అనేది మనసులోనే ఉందని గ్రహించు. పుట్టు గ్రుడ్డి వాడిలా ప్రవర్తించి, చుట్టూ ఉన్న సమాజాన్ని పట్టించుకోకుండా ఉండకు. చిగురించని మోడులా మిగిలి పోవద్దు.

2. ఓ కవీ..! ఏకతార్‌ను మీటుతూ, పూర్వకాలంలో లాగ పాత పాటల్నే పాడుకుంటూ తిరగవద్దు. లోకం తీరుని బాగా తెలుసుకొని, ప్రజల హృదయాలనే తీగలతో సరిక్రొత్త పాటల్ని సృష్టించాలి. కాలం మారుతున్న కొలది మనం మారాలి. రోత పుట్టించే పాత పాటలతో నేడు పని లేదు. సమాజ చైతన్యానికై నీ గొంతు సవరించాలి.

3. ఓ కవీ..! దిక్కులను చూసినా, చుక్కలను చూసినా, రక్తం ఉప్పొంగి కవిత్వం ఉరకలు వేస్తుంది. బడుగుల జీవన పోరాటాన్ని చూసి అలా వెళ్ళి పోవద్దు. ఒక్కసారి ఆ పేదవారిని పలుకరించి, వారిలో నూతనోత్తేజాన్ని నింపు. వారి పోరుకు నువ్వు సారథిగా నిలబడాలి.

4. ఓ కవీ..! విషయాన్ని ఆవేశంగా చెప్పగలిగే సామర్థ్యం నీలో ఉంది. అటువంటి రచనా శక్తిని నీ సొంతం చేసుకున్నావు. కాబట్టి స్వప్రయోజనం కోసం కాకుండా సమాజ హితం కోసం నువ్వు రచనలు చెయ్యాలి. స్వార్థంతో చేసే ఏ పని వలన ప్రయోజనం ఉండదు. ప్రజల కలల సాకారానికి నువ్వు పూనుకోవాలి.

5. ఓ కవీ..! దుర్మార్గుల కుతంత్రాలతో చరిత్రలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఎంతో మంది ప్రజలు కూడు, గూడు లేక మరణించారు. అయితే వాళ్ళ మరణానికి తిండి లేక పోవడమే కారణంగా చూపి వారిని అలా వదిలెయ్యకు. వాళ్ళు చూపిన ధైర్య సాహసాల గురించి, వారు చేసిన త్యాగాల గురించి కూడా నువ్వు రాయాలి.

6. ఓ కవీ..! నేడు నీరు, గాలి, నేల ఈ మూడు మార్గాల్లో జరిగే మారణహోమానికి ఎంతో మంది బలి అవుతున్నారు. అలాంటి వారికి అండగా నిలబడు. ప్రమాదం ఏ దిక్కు నుంచి ఏ రూపంలో వస్తుందో స్పష్టంగా చెప్పలేం. అలా భీతిల్లుతున్న వారి గుండెల్లో ధైర్యాన్ని నింపు. నీ రచనలతో కత్తిపదును వంటి కరుకు దనాన్ని వాళ్ళకు అందించాలి.

7. ఓ కవీ..! ఎందరో జనులు, అనేక బాధలతో అలమటిస్తున్నారు. కష్టాలనే అగ్నిగుండంలో వాళ్ళ గుండెలు కాలిపోతున్నాయి. అలాంటి దీన జనులకు కత్తి పదును కూడా మెత్తగా ఉందనిపించేటట్లు వారితో మాట్లాడి వాళ్ళ మనసును అందుకు అనుగుణంగా సన్నద్ధం చేయాలి.

8. ఓ కవీ...! ఈ దిక్కూ, ఆ దిక్కూ అనకుండా అన్ని దిక్కుల నుంచీ కష్టాలు కమ్ముకుని వస్తున్నాయి. అటువంటి వారి దుఃఖాన్ని ఆపి వారిని పెద్ద శక్తిగా మార్చాలి. వాళ్ళకు మేలు చేయడానికి నువ్వు నడుం బిగించాలి. వాళ్ళంతా రాటుదేలేలా చేసి, జంకును పోగొట్టే బాధ్యత నువ్వు తీసుకోవాలి.

AP SCERT

9. ఓ కవీ...! ఎంతో మంది మహనీయుల త్యాగఫలాలు కొందరు దుర్మార్గులు చేసే కుట్రలనే అగ్ని గుండాల్లో పడి నశిస్తున్నాయి. వాళ్ళు చేసిన త్యాగాలు వృథా కాకుండా చూడవలసిన బాధ్యతనీదే. నీ కలం బలంతో వారిని చైతన్య పరచాలి. నీవు జాతిని కాపాడే సరికొత్త ఆయుధం కావాలి.

10. ఓ కవీ...! నిత్యమూ ఆకలితో అలమటిస్తూ, ఎముకల గూడులా మారి ఎందరో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. వాళ్ళ నాలుకలపై తడి సైతం ఆరిపోయింది. బండ బారిన వాళ్ళ గుండెల్లో నీ స్ఫూర్తిదాయకమైన భావాలను నింపి వారిని చైతన్య పరచాలి. నీ కవి నామాన్ని సార్థకం చేసుకోవాలి. శాశ్వతమైన పేరు సంపాదించాలి.

11. ఓ కవీ...! అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని జీవనం గడుపుతున్న బడుగుజీవులు ఎందరో ఉన్నారు. వారిని ఏకం చేసి మంచి ఉత్తేజకరమైన మాటలతో వారిని మరింత చైతన్య పరచాలి. వెనుకడుగు వేయాల్సిన పనిలేదు. వారిలో నూతన ఉత్సాహాన్ని నింపే బాధ్యత నీదే. నీ రచనా నైపుణ్యంతో వారిలో ఉన్న బెరుకును పోగొట్టాలి.

12. ఓ కవీ...! నువ్వు ప్రజాకవివై వారి పక్షాన నిలవాలి. నీ కలం నుంచి వచ్చిన మంచి గీతాలతో పేదలంతా ఒక్కటై ముందడుగు వేయాలి. సమాజంలో ఉన్న పేద – ధనిక అనే భేద భావాన్ని పోగొట్టాలి. లోకంలో ఉండే కష్టజీవుల బాధల్ని నువ్వు పోగొట్టి, వారిలో నవచైతన్యం తొణికిసలాడేలా చేయాలి.



ఇవి చేయండి

అవగాహన – ప్రతిస్పందన

అ) పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి, రాయండి.

1. గేయాన్ని లయబద్ధంగా పాడండి. ప్రాస పదాలను గుర్తించి రాయండి.
2. కవి తనకున్న రచనా శక్తితో ఏమి చేయాలని తెలియజేస్తున్నాడు?
3. కవి తన పేరును సార్థకం చేసుకోవాలంటే ఏమి చేయాలి?
4. కింది వాక్యాలు చదివి గేయంలో ఆ వాక్యాల భావాలు వచ్చే పంక్తులను గుర్తించి రాయండి.
   - అ. అన్ని దిక్కుల నుంచి కష్టాలు కమ్ముకుని వస్తున్నాయి.
   - ఆ. దుర్మార్గుల కుతంత్రాల వలన ఘోరమైన యుద్ధాలు జరిగాయి.
   - ఇ. భయం భయంగా బ్రతుకుతున్న వాళ్ళందరినీ ఒక్కటి చేయాలి.


ఆ) కింది అపరిచిత గద్యం చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

'యోగ్యతాపత్రం' ఇది తెలుగు సాహిత్యంలో పేరెన్నికగన్న ముందు మాట. అక్షర దివిటీలు చేపట్టి పదాల ఫెళఫెళార్భాటాలతో తెలుగుకవితను కొత్త పుంతలు తొక్కించిన యుగకవి శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం కావ్యానికి మరో మహాకవి చలం రాసిన ముందుమాట ఇది. తన కవిత్వానికి ముందుమాట రాయమని శ్రీశ్రీ అడిగితే కవిత్వాన్ని తూచే రాళ్ళు తన దగ్గర లేవు అన్నాడు చలం, తూచవద్దు అనుభవించి పలవరించమన్నాడు శ్రీశ్రీ. తనకీ ప్రపంచానికీ

AP SCERT

సామరస్యం కుదిరిందాక కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వం అంటాడు చలం. నెత్తురునూ, కన్నీళ్ళనూ తడిపి ఈ వృద్ధ ప్రపంచానికి కొత్త టానిక్ తయారు చేసాడు శ్రీశ్రీ. హృదయం ఎలా కంపిస్తే ఆ కంపనానికి పాటల రూపాన్నివ్వడం అతనికి తెలుసు. మాటల్ని కత్తులూ, ఈటెలూ, మంటలుగా మార్చడం అతనికి చేతనవును. పద్యాలు చదువుతుంటే అవి మాటలు కావు, అక్షరాలూ కావు, ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు – అతని హృదయంలోంచి మన హృదయంలోకి నేరుగా పంపిన ఉత్సాహాలు, నెత్తురు కాలువలు అనిపిస్తుంది. ఎందుకంటే కృష్ణశాస్త్రి తన బాధను అందరిలోనూ పలికిస్తే శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు. శ్రీశ్రీ కవిత్వమూ, పాల్ రోబ్సన్ సంగీతము ఒకటే రకం అంటుంది సౌరీస్. ఆ రెండింటికీ హద్దులూ, ఆజ్ఞలూ లేవు. అప్పుడప్పుడూ లక్షణాలనూ, రాగాలను మీరి చెవి కిర్రుమనేలా అరుస్తారిద్దరూ. ఆ అరుపుల్లో ఎగిరిపడే సముద్రం, తుఫాను గర్జనం, మర ఫిరంగుల మరణధ్వానం గింగురు మంటాయి. కంఠం తగ్గించి మూలిగారా, ఆ మూలుగులు దిక్కులేని దీనుల మూగవేదన, నీళ్ళు లేక ఎండుతున్న గడ్డిపొలం ఆర్తనాదం వినిపింపజేస్తాయి. తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాంతించి, రక్షించే అపూర్వ వ్యక్తి మీ చేతుల్లో ఉన్న ఈ పుస్తకం. ఈనాటి కవిత్వమంతా ఏమిటి? ఎందుకు ఉంది? ఏం చేస్తోంది అని దిబ్బరించి అడిగే తెలుగు ప్రజలకు శ్రీశ్రీ కవిత్వం ప్రత్యుత్తరం. (–మహాప్రస్థానం ముందుమాట నుండి)

ప్రశ్నలు



1. **మహాప్రస్థానం కావ్యానికి ముందుమాట రాసింది ఎవరు?**
2. **శ్రీశ్రీ కవిత్వాన్ని సౌరీస్ ఎవరితో పోల్చారని చలం చెప్పారు?**
3. **సాయంకోరి బిగ్గరగా అరవడం అని అర్థాన్నిచ్చే పదం ఏది?**
4. **వృద్ధ ప్రపంచానికి కొత్త టానిక్ తయారు చేయడం అంటే ఏమిటి?**
5. **పై గద్యానికి ఒక శీర్షిక (పేరు) పెట్టండి?**

ఇ) కింది గద్యం చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

"ఆపరేషన్ అవకముందు నా మాటలో స్పష్టత తగ్గటం మొదలయింది. నా సన్నిహితులకే నా మాటలు అర్థమయ్యేవి. అప్పుడు కనీసం ఆలోచనలైనా వినిపించగలిగే వాడిని. సెక్రటరీకి డిక్టేషన్ ఇవ్వటం వల్ల సైంటిఫిక్ పేపర్లు రాయగలిగే వాడిని. నా మాటలను మరొకరు స్పష్టంగా మళ్లీ పలుకుతూంటే సెమినార్లలో ఉపన్యాసాలు ఇవ్వగలిగే వాడిని. కానీ ట్రాకియాటమీ ఆపరేషన్ నా మాట్లాడే శక్తిని పూర్తిగా తగ్గించింది. కొద్దికాలం పాటు, ఎవరైనా అక్షరాలను చూపుతుంటే, నాకు కావల్సిన అక్షరం చూపగానే కనుబొమ్మలెత్తి సైగచేయటం ద్వారా నేను చెప్పాలనుకున్నది చెప్పేవాడిని. ఇలా మాట్లాడటమే అతి కష్టమైన విషయం. ఇక సైంటిఫిక్ సెమినార్లలో మాట్లాడటం కుదరని పని. అయితే, కాలిఫోర్నియాకు చెందిన కంప్యూటర్ నిపుణుడు 'వాల్ట్ వోల్టేజ్' ప్రత్యేకంగా నా కోసం 'ఈక్వలైజర్' అనే ప్రోగ్రాం రాసి పంపాడు. ఇందువల్ల తెరపై ఉన్న పదాలను, నా చేతిలోని మీటను నొక్కటం వల్ల ఎంచుకోగలుగుతాను. నేను చెప్పాలనుకున్న పదాలను ఎంచుకుని స్పీచ్ సింథసైజర్‌కు పంపుతాను. నా మాటలను కంప్యూటర్ పలుకుతుంది".

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ బ్లాగు 'హాకింగ్ డాట్ ఆర్గెట్ యు.కె' లో హాకింగ్ అంతరంగ భావ వ్యక్తీకరణ ఇది. మానవ మేధ భౌతిక పరిమితులకు లొంగదని నిరూపించిన శాస్త్రవేత్త హాకింగ్. శరీరం కదలికలు లేక

AP SCERT


చక్రాల కుర్చీకి పరిమితమైనా, అతని మేధ మాత్రం అనంత విశ్వరహస్యాలను అత్యద్భుతమైన రీతిలో పరిశోధించి ఆవిష్కరించింది. స్టీఫెన్ హాకింగ్ రచించిన 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్' ఆధునిక కాస్మాలజీని సామాన్య మానవుడికి చేరువచేసిన మహత్తర పుస్తకం. కాల్పనిక నవలలకన్నా అధికంగా అమ్ముడుపోయిందీ శాస్త్రవేత్త సిద్ధాంత గ్రంథం. దీనిని 'కాలం కథ' పేరుతో తెలుగులోకి అనువదించారు.(–కాలం కథ నుండి)

ప్రశ్నలు

1. హాకింగ్ సైంటిఫిక్ పేపర్లు ఎలా రాయగలిగేవారు?
2. వాల్ట్ వోల్టేజ్ అనే కంప్యూటర్ నిపుణుడు హాకింగ్ కోసం తయారు చేసిన ప్రోగ్రాం ఏమిటి?
3. హాకింగ్ జీవితంలో నిన్ను ఆశ్చర్యపరిచిన అంశం ఏమిటి?
4. స్టీఫెన్ హాకింగ్ రాసిన పుస్తకం పేరేమిటి? గుర్తించండి. ( )

   అ) గీతాంజలి బి) ది సీక్రెట్ గార్డ్

   సి) ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ డి) ది ఆర్ట్‌ఆఫ్ అలోన్
5. పై పేరా నుంచి ఒక ప్రశ్న తయారు చేయండి?



వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. ఒక పౌరుడుగా కవి కర్తవ్యం ఏమిటని నీవు భావిస్తున్నావు.
2. 'స్వార్థ గానము మానరా! ఓ కవీ సార్థకానికి పూనరా!' ఈ గేయ పంక్తుల భావాన్ని మీ సొంత మాటలలో వివరించండి.

ఆ) కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. పుట్టు గ్రుడ్డిగా పోకూరా ఓ కవీ ! వట్టి మ్రోడువు కాకురా ! అని కవిత రాసిన కవి గురించి రాయండి.
2. అసమానతలకు తావులేని సమాజం కోసం మనం ఏమి చేయాలో వివరిస్తూ వ్యాసం రాయండి.
3. నీవే కవివైతే ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఎలాంటి కవితను రాస్తావు.

భాషాంశాలు - పదజాలం

అ) కింది వాక్యాలు చదివి, ఎరుపు రంగు గల పదానికి అర్థం రాసి, దానిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

1. పూల వాసనలు నింపుకున్న మారుతం మనసుకు హాయినిస్తుంది.
2. నిత్యమూ చింతతో రగిలే మనిషికి సుఖం ఉండదు.
3. మనం చేసే మంచి పనుల వలన స్థిరమైన పేరు సంపాదిస్తాం.
4. ఎవరైతే తమ మానసమును అదుపులో పెట్టుకుంటారో వాళ్ళే గొప్పవాళ్ళవుతారు.
5. క్రూరులతో స్నేహం ప్రాణానికే ప్రమాదం

ఆ) కింది వాక్యాల్లో ఒకే అర్థాన్నిచ్చే పదాల్ని గుర్తించి వాటిని వేరు చేసి రాయండి.

1. అభ్రములు వర్షిస్తే పంటలు పండుతాయి. జలధరముల కోసం రైతన్నలు ఎదురు చూస్తారు. ఆకాశంలో మేఘములు కదులుతుంటే చూడముచ్చటగా ఉంటుంది.
2. యుద్ధం వల్ల నష్టం. సమరం చేస్తే మరణాలు సంభవిస్తాయి. పోరు లేనపుడే లాభం పొందుతాం.

AP SCERT

3. ఆకాశంలో చుక్కలు మెరుస్తుంటాయి. ఎందరో కవులు తారలు గురించి వర్ణించారు. పౌర్ణమిరోజు చంద్రుని చుట్టూ నక్షత్రాలు సందడి చేస్తాయి.

4. కోరికలు శోకానికి మూలం. దుఃఖానికి దూరమైతే సంతోషం దగ్గరవుతుంది. ఏడుస్తూ కూర్చుంటే గెలుపు దూరమవుతుంది.

ఇ) కింది పదాలకు వేరు వేరు అర్థాలను గుర్తించి జతపరచండి. (నానార్థాలు)

1.	వర్షం	( )	అ) జగత్తు, చూపు, గుంపు
2.	నామం	( )	ఆ) పేరు, బొట్టు
3.	వాహిని	( )	ఇ) నది, సైన్యం
4.	లోకం	( )	ఈ) వాన, సంవత్సరం

ఈ) సూర్యుడు తూర్పుదిక్కున ఉదయిస్తాడు. (గీతగీసిన పదానికి నానార్థాలు రాయండి.) ( )

అ) పడమర, తూర్పు ఆ) దిశ, ఉపాయం ఇ) ఆశ, మబ్బు ఈ) పొద్దు, ఉన్నతి

ఉ) ఈ కింది వాక్యాల్లో ఉన్న ప్రకృతి – వికృతి పదాలను గుర్తించి రాయండి.

1. అగ్ని ప్రమాదకరం కాబట్టి పిల్లలు అగ్గితో ఆటలు ఆడకూడదు.
2. అడవికి రాజు సింహం. జంతువులకు సింగం అంటే చాలా భయం
3. లంకిణి ఒక రాక్షసి. హనుమంతుడు ఆ రక్కసిని జయించాడు.
4. తలపెట్టిన కార్యమును సాధించాలి. ఆటంకాలు ఎదురైనా కర్జమును విడువరాదు.
5. ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకున్నాయి. అవి పెద్ద వానకురిసే మొయిళ్లులా ఉన్నాయి.

వ్యాకరణాంశాలు

సంధులు

గుణసంధి

'అ' కారానికి ఇ, ఉ, ఋ లు పరమైతే వరుసగా ఏ, ఓ, అర్ లు ఏకాదేశంగా వచ్చి గుణసంధి జరుగుతుందని కింది తరగతుల్లో తెలుసుకున్నారు కదా!

అ) కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి

1.	రాజేశ్వరి	:	_____	+	_____	= _____
2.	పరోపకారం	:	_____	+	_____	= _____
3.	మహర్షి	:	_____	+	_____	= _____
4.	నూతనోత్సాహం	:	_____	+	_____	= _____

APSCERT

సమాసాలు

కర్మధారయ సమాసం

విశేషణానికీ, నామవాచకానికీ (విశేష్యానికి) సమాసం జరిగితే దాన్ని కర్మధారయ సమాసం అంటారు. దీనిని 'సమానాధికరణం' అని కూడా పిలుస్తారు. ఈ పాఠంలో కర్మధారయ సమాసాలను గురించి తెలుసుకుందాం.

విశేషణ పూర్వపద కర్మధారయసమాసం

విశేషణం పూర్వపదంగా (మొదటి పదంగా) ఉంటే ఆ సమాసాన్ని "విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం" అంటారు.

ఉదా॥	తెల్లచొక్కా	–	తెల్లనైన చొక్కా
	తెల్లని	–	విశేషణం (పూర్వపదం – మొదటి పదం)
	చొక్కా	–	నామవాచకం (ఉత్తర పదం – రెండవ పదం)

పై ఉదాహరణను గమనిస్తే తెల్ల – చొక్కా అనే రెండు పదాలున్నాయి. మొదటి పదం 'తెల్ల' విశేషణం, రెండోపదం 'చొక్కా' నామవాచకం. ఇలా విశేషణానికీ, నామవాచకానికీ (విశేష్యానికి) సమాసం జరిగింది కాబట్టి 'కర్మధారయ సమాసం'.

ఆ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాస నామం తెలపండి.

1. పాత రోజులు : _____ _____
2. మంచి దారి : _____ _____
3. కొత్త పుస్తకం : _____ _____
4. నల్ల పూసలు : _____ _____
5. కొత్త కోక : _____ _____
6. ఎర్ర గులాబి : _____ _____
7. లేత మొగ్గ : _____ _____

విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసం

విశేషణం ఉత్తరపదంగా (రెండవ పదంగా) ఉంటే ఆ సమాసాన్ని "విశేషణ ఉత్తరపద కర్మధారయ సమాసం" అంటారు.

ఉదా॥	కపోతవృద్ధము	–	వృద్ధమైన కపోతము
	కపోతము	–	నామవాచకం (పూర్వపదం – మొదటి పదం)
	వృద్ధము	–	విశేషణం (ఉత్తర పదం – రెండవ పదం)

పై ఉదాహరణలో కపోతము, వృద్ధము అనే రెండు పదాలున్నాయి. మొదటి పదం కపోతము నామవాచకం (విశేష్యం), రెండోపదం వృద్ధము మొదటి పదం గుణాన్ని తెలుపుతుంది కాబట్టి విశేషణం. విశేషణ పదం ఉత్తరపదంగా రావడం వలన ఇది విశేషణ ఉత్తర పద కర్మధారయ సమాసం.

AP SCERT

ఆ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాస నామం తెలపండి.

1. తమ్ముకుఱ్ఱ : _____ _____
2. కవిశ్రేష్ఠుడు : _____ _____
3. కార్మిక వృద్ధుడు : _____ _____
4. వృక్ష రాజము : _____ _____

విశేషణ ఉభయపద కర్మధారయ సమాసం

సమాసంలోని రెండు పదాలు విశేషణాలై ఉంటాయి.

ఉదా॥ శీతోష్ణం – శీతం, ఉష్ణం
శీతం – విశేషణం (పూర్వపదం – మొదటి పదం)
ఉష్ణం – విశేషణం (ఉత్తర పదం – రెండవ పదం)

పై ఉదాహరణను గమనిస్తే శీతం, ఉష్ణం అనే రెండు పదాలున్నాయి. మొదటి పదం శీతం (విశేషణం), రెండోపదం ఉష్ణం (విశేషణం). ఇలా రెండు పదాలూ విశేషణాలే కావడం వలన ఈ సమాసం విశేషణ ఉభయపద కర్మధారయ సమాసం అయింది.

ఇ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాస నామం తెలపండి.

1. మృదుమధురం : _____ _____
2. సరసగంభీరం : _____ _____
3. నిమ్నోన్నతం : _____ _____
4. ఎగుడు దిగుడు : _____ _____

అలంకారాలు

అ) అంత్యానుప్రాస అలంకారం

కింది తరగతిలో నేర్చుకున్న అంత్యాను ప్రాస అలంకారం – గుర్తు చేసుకుందాం.

భాగవతమున భక్తి
భారతములో యుక్తి
రామకథయే ముక్తి

పై కవితలో పాదాలన్నింటి చివర ఒకే లయతో కూడిన ప్రాస పదాలు వచ్చాయి కదా! ఇలా అన్ని పాదాలలోనూ చివరన ఒకే విధమైన లయాత్మక పదాలు ఉంటే అంత్యానుప్రాస అలంకారం అవుతుంది. పై ఉదాహరణలో 'క్తి' అనే అక్షరం చివర ప్రాసగా వచ్చింది.

వేదశాఖలు వెలిసెనిచ్చట
ఆదికావ్యం బలరెనిచ్చట

AP SCERT

పై ఉదాహరణలో 'ఇచ్చట' అనే పదం చివరలో ప్రాసగా రావడం జరిగింది. పాదాంతంలో లేదా పంక్తి చివరలో ఒకే ఉచ్చారణతో ముగిసే పదాలు లేదా అక్షరాలు ఉంటే దాన్ని 'అంత్యాను ప్రాస అలంకారం' అంటారు. పాఠాన్ని పరిశీలించండి. అంత్యాను ప్రాస కలిగిన పాదాలను గుర్తించి రాయండి.

ఉదా॥ పుట్టుగ్రుడ్డిగ పోకుర్రా

వట్టి మ్రోడువు కాకుర్రా

1. _____

_____

2. _____

_____

3. _____

_____

ఛందస్సు

ఈ కింది చంపకమాల పద్య పాదాలకు గణవిభజన చేసి పద్య లక్షణాలు రాయండి.

అ) జనిత పరాక్రమ! క్రమ విశారద! శారద కందకుందచం

ఆ) దన ఘన సార సార యశ! దాశరథీ కరుణా పయోనిధీ

ప్రాజెక్టు పని

పిల్లలూ! క్యూ.ఆర్ కోడ్‌ని స్కాన్ చేసి అక్కడ ఇచ్చిన గేయాలను రాగయుక్తంగా ఆలపించి మీ పాఠశాల సారస్వత సంఘ సమావేశంలో ప్రదర్శించండి.

పద్య మధురిమ

సమయమమూల్య మొక్క నిమిషంబు వృథాచన గ్రమ్మతింప నే
రము, మనయాయువా త్రుటి పరంపరయౌట నెఱింగి, నిద్రమాం
ద్యమును దొలంగి మీ పనుల నారయుడో జనులార యంచు డం
బముగ మెడన్నిగిడ్చి కృకవాకము గూసెడి నించి కొప్పునన్

– కృషీవలుడు – దువ్వూరి రామిరెడ్డి

భావం: ఓ జనులారా! సమయం చాలా విలువైనది. ఒక నిమిషం కూడా వృథాగా గడపరాదు. మన ఆయువు శాశ్వతమైనది కాదు. నిద్రమత్తును వదిలి పెట్టండి. మీరు చేయవలసిన పనులేవో తొందరపడి పూర్తిచేయండని కోడిపుంజు ఇంటి కప్పు పైకెక్కి మెడను చాచి బిగ్గరగా కూసింది.

AP SCERT

4 ప్రియమైన నాన్నకు

K3D7J7


మూలగ్రంథం: తెలుగు కథ పారిజాతాలు

రచయిత్రి: పింగళి బాలాదేవి

చదవండి - చర్చించండి

మా నాయన

కోడి మా నాయన్ని నిద్రలేపేదో
మా నాయనే కోడిని నిద్ర లేపేవాడో
తెలియదు గాని
సూర్యుణ్ణి నిద్రలేపేది మాత్రం మా నాయనే
సూర్యకిరణాలతో పులకించే ముందు
మా నాయన పాదస్పర్శతో
పంటపొలం పరవశించిపోయేది.
మా నాయన పొలంలోకి అడుగుపెట్టగానే
గెనాల మీద పచ్చిక
మంచుబిందువులతో ఆయన పాదాలు కడిగేది.
ఆయన పంచ పై కెగగట్టి నడుస్తుంటే
గెనాలు వంతెనలా ఊగేవి.
ఆయన నడిచి పోయిన గెనిమి
నీళ్ళు జల్లించడం మానేసేది.
మా నాయన
కాడిపైకెత్తి లొట్టవేస్తేచాలు
కాడెద్దులు విధేయులైన కొడుకుల్లా
కాడి కింద దూరేవి.
ఆయన వేసిన కొండ్ర
ఇంజనీర్లకు గీత గియ్యడం నేర్పేది.
పారతో అండజెక్కితే



AP SCERT

ఆచారి బాడిసతో దూలం చెక్కినట్టుండేది.

మా నాయన

మొలకెత్తిన వడ్లను

గోయిందా గోయిందా అని నారు విడుస్తుంటే

తిండి గింజలు పండుతాయి భయపడకండని దండోరా వేస్తున్నట్లుండేది.

ఊరందరికన్నా ముందు

నాట్లు వేసి కోత కోసే పందెంలో

మొదటి బహుమతి ఎప్పుడూ మా నాయనదే

అడుసు ఏడు సాళ్ళు దున్నేటప్పుడు

ఆయన ముఖంలో కళ

తొలిచూలు మోసేది.

నాటిన పైరు పొట్టకరుక్కు వచ్చేటప్పుడు

ఆయన ముఖం ఆత్మవిశ్వాసానికి ప్రతీక అయ్యేది.

పనగొట్టిన వడ్లను తూర్పారబడుతూ

మా నాయన

కన్నబిడ్డలను స్నానం చేయించే తండ్రిలా అయ్యేవాడు.

తిరుపతి నుంచి ముసలయ్య గోతాలతో వచ్చి

వడ్లధర చెబుతుంటే

ఆయన ముఖం సంపూర్ణసూర్యగ్రహణం పట్టినట్లయేది.

మొలక మీసం పలితకేశమయ్యేదాకా

పొలంవేదికమీద హలాయుధంతో

స్వైరవిహారం చేసిన కర్షకయోధుడు మా నాయన.



– రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

AP SCERT

ఆలోచనాత్మక ప్రశ్నలు:

1. మనందరికీ అన్నం పండించిపెట్టే రైతు పడుతున్న శ్రమను చూస్తే నీకేమనిపిస్తుంది?

2. నీవు ఎప్పుడయినా మీ నాన్న చేసే పనిలో పాలు పంచుకున్నావా? అక్కడ నీకు చాలా అద్భుతంగా అనిపించిన అంశం ఏమిటి?

ఉద్దేశం

మనిషి ప్రేమతో నిండిన పలుకరింపుకు పులకరిస్తాడు. ఆత్మీయంగా హత్తుకుంటే ఆనందిస్తాడు. ఆధునిక కాలంలో మనిషికి ఉరుకుల పరుగుల జీవనశైలి నిత్యకృత్యమైంది. అమ్మానాన్నలను, అయిన వాళ్ళను, ఆత్మీయులను, పలుకరించుకొని, మనసు విప్పి సుఖదుఃఖాలను పంచుకొనే కాలమే నేడు కరువైపోతోంది. సాంకేతిక పరిజ్ఞానం మనిషిని యాంత్రికుని చేసి తన చుట్టూ తిప్పుకుంటోంది. ఈ నేపథ్యంలో మనసులోని మాటలను, మమతలను ఒకరినొకరు పంచుకునేలా చేయగల ఏకైక సాధనం ఉత్తరం. బాలలలో లేఖారచన పట్ల ఆసక్తి పెంపొందించి, కుటుంబ విలువలను కాపాడడం, మానవ సంబంధ బాంధవ్యాలకు ప్రాణం పోయడమే ఈ పాఠం ఉద్దేశం.

నేపథ్యం

ఉత్తరం ద్వారా వాస్తవిక సంఘటనలు, అనుభవాలు, ఆలోచనలు ఆసక్తికరంగా వ్యక్తీకరించడం జరుగుతుంది. ఉత్తరం రాయడం ఒక కళ. మన అని అనుకున్నవారి బాగోగులను, భావోద్వేగాలను ఉత్తరం రూపంలో అందుకుంటే కలిగే ఆనందానికి అవధులు ఉండవు. ఉత్తరం చదువుతూంటే రాసినవారు ఎదురుగా కూర్చుని మాట్లాడుతున్న అనుభూతి కలుగుతుంది. ఆత్మీయ బంధం పెనవేసుకుంటుంది. అందుకే ఉత్తరాన్ని పదే పదే చదువుతూ గుండెకు హత్తుకుంటాం, పదిలంగా దాచుకుంటాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలైన వాట్సాప్ గాని మెయిల్ గాని ఇలాంటి అనుభూతిని ఇవ్వలేవు. ఆత్మీయతలు, ప్రేమానురాగాలు పెంపొందాలన్నా, మనుషుల మధ్య దూరాలు తగ్గాలన్నా లేఖ అత్యుత్తమ సాధనం. పిల్లల ఎదుగుదల కోసం తాను కొవ్వొత్తిలా కరిగిపోతూ, బిడ్డలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని నిరంతరం తపించిన తన తండ్రిని తలుచుకుంటూ ఒక కూతురు తండ్రికి రాసుకున్న ఉత్తరమే ఈ పాఠ్యాంశం.

ప్రక్రియ-లేఖ

తెలుగు సాహిత్యంలో లేఖా సాహిత్యం ఒక అద్భుత ప్రక్రియ. వ్యక్తులు, సంస్థల మధ్య సమాచారాన్ని పరస్పరం పంచుకోవడానికి ఉపయోగించే సాధనమే లేఖ. లేఖల ద్వారా తమ భావాలు, అనుభవాలు, అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. కేవలం విషయ సమాచారమే కాకుండా ప్రముఖులు రాసిన లేఖల్లో సాహితీ విలువలు ఉంటాయి. అందువల్ల వచన రచనలో ఒక సాహిత్య ప్రక్రియగా లేఖను పేర్కొంటారు. ఎందరో రచయితలు లేఖల రూపంలో తను హృదయాన్ని ఆవిష్కరించారు. సంజీవ దేవ్ లేఖలు, చలం లేఖలు, నెహ్రూ లేఖలు, ఔరంగజేబు లేఖలు, అబ్రహం లింకన్ లేఖలు ఈ కోవకు చెందినవే. కొందరి లేఖలు ఆలోచింపచేస్తే, మరికొందరి లేఖలు ఆనందింపజేస్తాయి. అందుకే లేఖలను చైతన్యానికి ప్రతీకలు అంటారు.

రచయిత్రి పరిచయం :



జ :18-06-1946
మ:10-12-1992

శ్రీమతి పింగళి బాలాదేవి తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం తాలూకా కాట్రావులపల్లెలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు భట్టిప్రోలు కృష్ణమూర్తి, వేల్పూరి సుభద్రాదేవి. ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న ఈమె అధ్యాపక వృత్తిని స్వీకరించారు. తండ్రి నుంచి వారసత్వంగా రచనా నైపుణ్యాన్ని పొందారు. తెలుగు, హిందీ, ఒడియా, బెంగాలీ భాషల్లో రచనలు చేసారు. ఒక చీకటి – ఒక వెన్నెల, పొగ మంచులో సూర్యోదయం మొదలైన నవలలు, 'నాన్నకు రాయని ఉత్తరం' కథా సంపుటిని రాశారు. కుసుమ కోమలి, ప్రశ్న, గాజు బొమ్మలు, గృహప్రవేశం, మొదలైన కవితా సంపుటాలు వెలువరించారు. మహిళా సాధికారత, స్వాతంత్ర్యం, చదువు, ఉద్యోగం, కుటుంబ విలువలు ఇతివృత్తాలుగా ఈమె అనేక నవలలు, కథలు, కవితలు రాశారు. ప్రస్తుత పాఠం '*తెలుగు కథా పారిజాతాలు*' లోనిది.

AP SCERT

ప్రియమైన నాన్నకు

"మహారాజశ్రీ నాన్నగారికి బాల నమస్కారములతో ..,

నాన్నా మీకీ ఉత్తరం రాద్దామని ఎప్పటినుంచో ప్రయత్నం చేసాను. ఇన్నాళ్లు నువ్వు రాయలేదా అని మీరు అనవచ్చు. మామూలుగా రాసే ఉత్తరాలు ఎలా ఉంటాయో మీకు తెలిసినవే కదా. మూసపోసినట్లు మీరు క్షేమమా.. మీ ఒంట్లో ఎలా ఉంది? మీరెప్పుడొస్తున్నారు. తమ్ముడు, మరదలు ఎలా ఉన్నారు. వగైరా .... వగైరా.... మీరు ఇన్నాళ్ళు ఎదురు చూసింది ఇటువంటి ఉత్తరం కోసం కాదని నాకు తెలుసు. ఈ ఉత్తరం ఎన్నాళ్ళ నుంచో నా మనస్సులో మెదులుతున్న భావనల మథనానికి ఒక రూపం. మీకు ఉత్తరం రాద్దామని రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోయాయి. నేను రాయలేదని మీకు కష్టంగానూ కూడా అనిపించి ఉండవచ్చు కదూ!

ఇంకా ఉత్తరం మొదలు పెట్టానో లేదో టెలిఫోన్ ట్రింగ్ ట్రింగ్....మని అదేపనిగా మ్రోగుతోంది. నా ఏకాగ్రతను భగ్నం చేస్తూ. ఈ టెలిఫోన్లు వచ్చాక సముద్రాలు, కొండలు, కోనలు, వాగులు, నదులూ, అడవులు, ఎడారులూ దాటి మరీ దూరాలను దగ్గరగా ఉంచుతున్నట్లుగా మాట్లాడుకో గలుగుతున్నాం.

టెలిఫోన్ అంటే గుర్తు కొచ్చింది నాకు కిందటి సంవత్సరం మీరు రాసిన ఉత్తరంలో ఫోనుల్లో సంభాషణ సంతృప్తిగా ఉండదు. టైము గడిచేకొద్దీ డబ్బులు ఎక్కువైపోతాయని గాబరా పడి ఒకటి రెండు మాటల్లో సరిపెట్టుకుంటాము అని.

అలాగే నాకైతే అసలు సమయానికి ఏంమాట్లాడాలో తోచదు. ఫోన్ పెట్టేశాక అరెరె మర్చిపోయానే ఈ మాట మాట్లాడి ఉండాల్సింది అనుకుంటు ఉంటాను. ఏది ఏమైనా ఈ టెలిఫోన్ల వల్ల నేను రాయాలనుకున్న ఉత్తరం రాయలేక పోయానేమో అనిపిస్తోంది నాన్నా...! మీ ఉత్తరం చదివినప్పటి నుంచి మీకు ఉత్తరం రాయాలనే కోరిక మరీ ఎక్కువైంది. ఇదిగో ఇవాళ ఈ కృష్ణాష్టమికి ఈ అర్ధరాత్రి కుదిరింది.



APSCERT

మనసులో ఏదో తెలియని వెలితి, చెప్పలేని ఒంటరి తనం, భారంగా, నిస్పృహగా వుంది. ఏవేవో జ్ఞాపకాలు, స్మృతులు, చిన్నప్పటి నుంచి నాజీవితం ఒక సినిమా రీలులా నాకళ్ళముందు జరిగి పోయింది. మీ ఉత్తరంలో కొన్ని భాగాలు నామనసుని మరీ కలవర పరిచేటట్లున్నాయి.

మీరు రాసారు – "మొన్న స్టేషన్లో చాలా బాధని పించింది. మళ్ళీ భువనేశ్వరం రావడం పడదేమో అనిపిస్తోంది. నేను ఏలాగో నిగ్రహించుకుంటున్నాను కానీ నా జీవితం ముగింపు కొస్తోందని అనిపిస్తోందమ్మా...." ఈ చివరి వాక్యం నా గుండెల్ని పిండింది. ఎందుకలా రాసారు నాన్నా? ఆ ఉత్తరం చదువుతుంటే కన్నీళ్లు ఆగలేదు. చిన్నమ్మాయి భాస్వర వచ్చి ఎందుకమ్మా ఏడుస్తున్నావు? అని అంది. "తాత గారు రాసిన ఉత్తరం చదువు" అని ఇచ్చాను.



మీ ఉత్తరంలో మరికొన్ని భాగాలు నా మనసుని కదిలించేశాయి. మాకెవరికీ మీరు ఏ ఇబ్బందీ కల్గించలేదు నాన్నా! మమ్మల్ని మనుషులుగా చేసిన మీరు మాకు భారమా? బరువా? మీమీద మాకున్న ప్రేమను అభిమానాన్ని ఎలా తెలియజేయాలో మాకు తెలియలేదు. మీరు మాకు విలువైన వారనే విశ్వాసాన్ని మీకు మేము ఎలా కల్గించగలం చెప్పండి?

మీకు, మాకు మధ్య ఇంత పెద్ద అంతరం ఎందుకు వచ్చిందో అర్థం కావడంలేదు. ఈ ఫోన్లు మమ్మల్ని పాడు చేశాయి నాన్నా – జీవితంలోని అశాంతి, పరుగులు, ఉరుకులు, కుటుంబ బాధ్యతలు ఇవేమి మమ్మల్ని మనుషులుగా తీర్చిదిద్దలేదా? లేదా మాలో మానవత్వం చచ్చిపోయిందా? ఎలా వున్నారు నాన్నా అని పలకరించి వదిలేస్తే బాధ్యత తీరి పోతుందనుకున్నాము. మాకు ఏమయింది? మీ తరం నుంచి మాతరానికి వచ్చే లోపల ఎక్కడ ఏ తప్పు జరిగింది?

ఎందుకు మేము ఉత్తరాలు రాయడం లేదు? ఒకరికొకరు రాసుకోవడం లేదు. నాకెప్పటికీ అర్థంకాని, జవాబు లేని ప్రశ్న? నాజీవిత కాలం నన్ను నా మనసుని, నా అస్తిత్వాన్ని వేధించే ప్రశ్న.

నాన్నా – మమ్మల్ని పెంచి అ, ఆలు దిద్దించిన మిమ్మల్ని మేము బరువుగా అనుకోలేదు. మాలో మిమ్మల్ని, మీలో మమ్మల్ని చూసుకున్నాము. ఈ మా జీవితాలు మీరు పెట్టిన భిక్ష నాన్నా! మా అస్తిత్వం మీ చలవే నాన్నా! నాకింకా జ్ఞాపకముంది నాన్న!

నేను, తమ్ముడు, అరుణ చిన్న పిల్లలప్పుడు మీతో ఉన్న ఒక ఫోటో నాకిచ్చారు మీరు. నేను మీకు ఎంత దగ్గరగా వున్నాను ఆ ఫోటోలో. అప్పుడు నాలుగేళ్ళు కాబోలు నాకు – గుండ్రని బుగ్గలతో, మెడలో మఫ్లర్‌తో నాచేయి ఒకటి మీకాలు మీద – మీరేమో గంభీరంగా ఉన్నతంగా ఎంతో గొప్పగా ఉన్నారు. నాకందులో అమాయకంగా అమ్మ, బెదురుగా, భయంగా కుంకుడు పిక్కల్లాంటి నల్లటి కనుగుడ్లతో, ఉంగరాల జుట్టుతో అమ్మ ఒడిలో ఉన్న అరుణ, పాలపొడి డబ్బామీద బొమ్మలా తమ్ముడు ఎంత ముద్దుగా వున్నాడో, ఆ ఫోటో కథ చెప్పి ఎంత నవ్వించారో మమ్మల్ని

APSCERT

మీరు. మీకు కుక్క కరవడమూ, అందరు రేబిస్ వచ్చి మీరు చచ్చిపోతారని భయపెట్టడమూ, మీరేమో చచ్చిపోయేలోపు భార్యాబిడ్డలతో ఒక ఫోటో తీయించుకోవాలని స్టూడియోకెళ్ళి ఆ ఫోటో తీయించు కోవడమూ మీకు డెబ్భై ఏళ్ళు దాటిన తర్వాత కదూ మీరు ఆ కథ మాకు చెప్పారు.

చాలా రోజులు మీ మనస్సులో మేము చాక్లెట్లు, బిస్కెట్లు అడిగిన చిన్న పిల్లల్లానే వుండిపోతే బావుండేదని వుండేది కదూ! నిజంగా మాట్లాడితే అలా కాలం స్థగితం అయి పోతే ఎలా వుంటుంది? కానీ మేము పెద్ద వాళ్ళయి పుస్తకాలకి, ఫీజులకి డబ్బు అడగకుండానే ఎమ్.ఓ. లు పంపే వారు అంత బాధ్యతల్లో వుంటూ కూడా మర్చి పోకుండా మా అవసరాలని మీరే గుర్తించి మేము అడగకుండానే తీర్చేవారు. మరి మేము మిమ్మల్ని ఎలా మర్చిపోగలం నాన్నా?

నా చిన్నప్పుడు మీరు ఒక టిన్ను పెట్టెలో 'అ,ఆ' ల పుస్తకం, పలక, బలపం తెచ్చి పెట్టడం నా మనసులో చెరగని ముద్ర, నాచేత 'అఆ' లు దిద్దించడం, చక్కని ముద్దబంతి పువ్వులాంటి, ముత్యాల కోవలాంటి గుండ్రని అక్షరాల్తో బొండు పుస్తకంలో దక్షయజ్ఞం, బంగారు రాజుకథ లాంటి కథలు గుర్తుకొస్తున్నాయి. మీరు రాసిన తెలుగు కథలు – మనిషి తనకు కావలసిన దానికంటే ఎక్కువ కోరుకోవడం తప్పనీ, దురాశ దుఃఖానికి చేటనీ, పిలవని పేరంటానికి వెళ్ళకూడదనీ, ఇప్పటికీ మనసులో హత్తుకుని వుండి పోయిన కథలు నాన్నా అవి.

V మనం పుస్తకాలు ఎందుకు చదవాలి?
V మీరు చదివిన పుస్తకాల పేర్లు చెప్పండి.

మీరు టూరు వెళ్ళి వెనక్కి వస్తే మాకెంతో సంతోషం. నిద్రలోంచి లేచి కూర్చొని మీరు తెచ్చిన కోవాబిళ్ళలు, బిస్కట్లు తినేవాళ్లం. మీరు తెచ్చిన జంతువుల – పక్షుల కథల పుస్తకాలు, చందమామ, బాలమిత్ర పుస్తకాలు చూసి సంతోషించేవాళ్లం. మీరు రాసిన ఆలిండియో రేడియో నాటకాల పోటీలో ఫస్ట్ ప్రైజ్ వచ్చిన రిక్షా తాత నాటకంలో తాత కూడా వాళ్ళ మనుమరాలుకి కోవాబిళ్ళలు తేవడం గురించే రాసారని చెప్పారు మీరు నాకు.

అ, ఆ ల రోజుల దగ్గర నుండి మీ దగ్గరే లెక్కలు, ఇంగ్లీషు నేర్చుకున్నాను. నాకు పదిహేనేళ్ళు వచ్చే లోపలే



నేను చదివిన టాగూరు, శరత్, బంకింబాబుల అనువాదాలు. చలం. కొడవటిగంటి గారి కథలు, రామాయణం, భారతం, భాగవతం వచన రచనలు, ఇరవై ఏళ్ళలోపే చదివేసిన పెర్ల్‌బక్, స్టీన్‌జెక్, టాల్ స్టాయ్, ఓహెన్రి కథలూ, షేక్స్‌పియర్ నాటకాలు ఎన్నెన్నని చెప్పను? వాటి ద్వారా ఎన్ని జీవితాలను చదివించారు, నాచేత. అంత త్వరగా చదవడానికి కావలసిన ఉత్సాహాన్ని, ఆ వేగాన్ని మీరేకదా నాన్న నేర్పారు? మీరు రాసిన ప్రతి కథ, నవల అచ్చువేయక ముందే మొదటగా నేనే చదివేదాన్ని. మీరిచ్చిన ఆ పెద్ద పెద్ద పుస్తకాలను అలమార్లో జాగ్రత్తగా పెట్టుకొని చూచుకుంటున్నాను. నా పిల్లలకు ఇది మీ తాతగారి ఆస్తి మీరూ చదివి తీరాలిరా అని చెప్తుంటాను.

అరవైల్లో నన్ను ఎస్సెల్సీ నుంచి పి.యు.సీ, బి.ఎస్.సి నుంచి ఎమ్మెస్సీ వరకు చదివిస్తుంటే అడుగడుగునా ఆడపిల్లకెందుకు అంత చదువు, మళ్ళీ పెళ్ళికొడుకు దొరకడం కష్టమౌతుందని ఎందరు మిమ్మల్ని వేధించలేదు? అమ్మమ్మ అయితే బాలకి

AP SCERT

పెళ్ళి చేసేయ్ కృష్ణమూర్తి అనేవారు. మీరేమనే వాళ్ళు నాన్నా ! ఆడపిల్ల అయినా, మగపిల్లలయినా బాగా చదివి వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడాలి అప్పుడే పెళ్ళి అనేవారు. అలాగే మమ్మల్ని పూర్తిగా మనుషుల్ని చేసి, ఉద్యోగాల్లో చేరేవరకూ పెళ్ళి గురించే ప్రస్తావించలేదు. అంత స్వేచ్ఛ ఆరోజుల్లోనే మాకిచ్చారు మీరు !

అంత స్వాతంత్ర్యాన్ని ఇచ్చినా ఎంతో అప్రమత్తతతో వుండే వారు మీరు. నేను ఉద్యోగం చేసిన కొత్తలో కాలేజ్ మీటింగు వుందని ఐదు దాటాకా సాయంత్రం ఇంటికి రాక పోతే కారు వేసుకొచ్చిమరీ కాలేజీ అంతా రెండుసార్లు తిరిగి వెళ్ళారని ప్యూను చెప్పాడు. ఆర్ట్స్ బ్లాక్ వెనుక పక్క హాల్లో మీటింగ్ జరిగిందని మీకు జవాబు చెప్పి, అమ్మతో చిరాగ్గా "నేను చిన్న పిల్లనా! ఎందుకలా గాబరా పడ్తారు మీరు, నాన్న అన్నిసార్లు కాలేజీ చుట్టుతిరిగారు" అని అమ్మతో అన్నాను విసుగ్గా.

కానీ– ఈరోజు నాకూతుళ్లు ఇద్దరూ సాయంత్రం ఆరు లోపల ఇంటికి రాకపోతే, ఫోను చేయకపోతే మీ ఆత్రుత, గాభరా మనసులో తలచుకుంటూ వుంటాను. ఆ సమయంలో భయపడ్తున్న మనసులకి ఫోను చాలా సాంత్వన కదూ.... నాన్నా !

మీరు ఉత్తరంలో తెల్పినట్లు మా బాధ్యతలను పూర్తిగా తీర్చుకున్నారు. దేని గురించి భయం లేదు. చిన్న ఉద్యోగంలో చేరి స్వయంగా కష్టపడి చదువుకొని అలా అలా పెద్ద వారయి అడిషినల్ కలెక్టరుగా రిటైరయిన మీరు స్వయం కృతులైన మనీషి "సెల్ఫ్ మేడ్‌మేన్" అంటారు కదా ఇంగ్లీషులో. మీరే కాక మమ్మల్నీ అలాగే తయారు చేశారు. ఇంటికి వచ్చిన అల్లుళ్లు కూడా పెద్ద పెద్ద హోదాల్లో ఉన్న వాళ్ళే. ఇపుడు మనవళ్ళు, మనమరాండ్రు కూడా కాలేజీలోకి వచ్చారు.

తండ్రీ, కూతుళ్లకి పుస్తకాలంటే ప్రాణం. ఇంటి గురించి ఒంటి గురించి పట్టదు అని అమ్మ అంటే ఇదిగో వీళ్ళంతా మన నవరత్నాలూ, మణులూ వజ్రాలూనూ ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క మేడ కడ్తారులే అనే వారు మీరు.

నేను ఇవన్నీ గొప్పకి రాసినవి కాదు నాన్నా! మమ్మల్నిందర్నీ మీ ఒక్కరి జీతంతో పైకి తెచ్చిన మీ ఔన్నత్యాన్ని చెప్పాలనీ మీ ఆదర్శాలూ, ఆకాంక్షలూ ఉన్నత విలువలతో ఎలా సాధించారో చెప్పాలనే నా ఆరాటం.

మీ స్నేహితులు చలంగారు, భమిడిపాటివారు లాంటి పేద్ద పెద్దవారు రాసినట్లు నేను రాయలేక పోయినా మీమనసుకు నచ్చినట్లు నేను రాయగలననే ఆశతో నమ్మకంతోనే రాశానీ ఉత్తరం.

టెలిఫోన్లు, టీవీలు, సినిమాలు మొదలైన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో నవలోకం ఉర్రూతలూగుతూ ఉత్తరాల విలువ పడిపోతున్న ఈ సమయంలో మరోసారి ఉత్తరాలకి ఎంత విలువుందో చెప్పాలని రాస్తున్నాను. మనుషులు, మనస్సులు ఎంత దగ్గరౌతాయో, మాసిపోతున్న మమతలు, అనురాగాలు, ఆప్యాయతలు మళ్లీ మానవత్వం పుంజుకుని బ్రతకుతాయని ఈ ఉత్తరం రాసాను.

ఈరోజు మీ డెబ్భై ఏడవ పుట్టినరోజు.

ఇన్నాళ్ళు నేను రాయలేదు, కాదు ... కాదు ... రాయలేక పోయాను నాన్నా! రాసి వుంటే మీ ఉత్తరాల్లో మీరు ఆ వాక్యాలు రాసి వుండేవారు కాదు నాన్నా!

మళ్ళీ మీకు జ్ఞాపకం చేస్తున్నాను నాన్న! ఒకసారి ఎందుకో రెండు రోజులు మీతో మాట్లాడక పోతే బాల నన్ను నాన్నా అని అనడంలేదని తనకి ఫిర్యాదు చేశారని అమ్మ చెప్పింది.

కానీ మొన్న జూలై నెల్లో నేను ఎన్నిసార్లు ఆ హాస్పిటల్లో ఐసియూలో దుఃఖంతో బాధాతప్త హృదయంతో నాన్నా – నేను మీ బాలని కళ్ళు తెరవండి – మాట్లాడండి. నాన్నా – మిమ్మల్ని చూడాలని, మీతోమాట్లాడాలని వచ్చానునాన్నా..అని ఎంత పిలిచినా మీరు పలకలేదు నాన్నా.....!

నాకేం తెలుసు మీరు నా పిలుపులకి అందని దూరాలకు వెళ్ళిపోతున్నారని? మీరు నావైపు చూస్తున్నట్లు,

AP SCERT

నాతో మాట్లాడడానికి ప్రయత్నిస్తున్నట్లు, మీ గొంతులో గొట్టాలేవో వుండడం వల్ల నాతో మాట్లాడలేకపోతున్నారనుకున్నా. నాన్నా అని పిలిచినప్పుడు నా చెయ్యి వదలకుండా గట్టిగా పట్టుకున్నారు. అదే మీరు విన్న నా ఆఖరి పిలుపా?

ఎంత పిలిచినా అరచినా, మా పిలుపులు, అరుపులూ మరి మీకు వినిపించవేమో కదూ?

మీరున్న ఆ లోకానికి ఏ ఫోనూ లేదు, మీకు హ్యాపీ బర్త్‌డే టూయూ అని చెప్పడానికి – ఎందుకు నాన్నా వెళ్ళిపోయారు? మాకెవరికీ చెప్పకుండా ఆఖరికి ఏభై ఎనిమిదేళ్ళుగా మీ నీడలా వున్న అమ్మకయినా చెప్పకుండా..! మేము ఫోన్‌లలో మాట్లాడడం మీకు ఇష్టంలేకనా నాన్నా!


నా ఈ ఉత్తరం మీకింక అందదు. నాకు తెలుసు నాన్నా! మేము ఉత్తరాలు రాయలేదు, అజ్ఞానంతోనో, చిన్నతనంతోనో, స్వార్థపు జీవితపు బాధ్యతల బంగారు సంకెళ్ళ బరువుతోనో ! అయినా మేము మీకు పిల్లలమే కదా నాన్నా. మేము ఉత్తరాలు రాయలేక పోయినా మీ మీద ప్రేమ, భక్తి, అనురాగం ఏమీ తగ్గని మీ పిల్లలం. మమ్మల్ని ఆఖరి సారిగా క్షమించండి నాన్నా!

ఆగని కన్నీళ్ళతో, అత్యంత శ్రద్ధా భక్తులతో, స్మృత్యర్థం సుమనస్కారాలతో మీకు బ్రతికి ఉండగా రాయని ఈ ఉత్తరాన్ని ముగిస్తున్నాను నాన్నా.!

ఇట్లు

మీ పెద్ద కూతురు

బాల.





ఇవి చేయండి

అవగాహన - ప్రతిస్పందన

అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి, రాయండి.

1. 'ప్రియమైన నాన్నకు' కథా రచయిత్రి గురించి రాయండి.

2. కృష్ణమూర్తి గారికి ఫోన్లో మాట్లాడడం కన్నా ఉత్తరాలు రాయడం అంటేనే ఎందుకు ఇష్టం?

3. చిన్నతనంలో రచయిత్రి తండ్రిగారైన కృష్ణమూర్తి గారు ఆమెతో ఏ ఏ పుస్తకాలు చదివించారు?

4. రచయిత్రి తండ్రికి ఎప్పుడు, ఎందుకు ఉత్తరం రాయవలసి వచ్చింది?

5. "కమ్యూనికేషన్ గ్యాప్" అంటే మీరు ఏమి అర్థం చేసుకున్నారు.?

ఆ) కింది అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

నా కళ్ళు అందమైనవి అంటుంది అమ్మ. నిజమే నా కళ్ళు పెద్దవే కానీ ఏమి లాభం, పక్కింటి వాళ్ల రాముడివి చింతాకంత చీకిరికళ్ళు. నాకూ వాడికీ పదేళ్లే. కానీ మా ఊళ్లో వాడు చూసిన వింతల్లో వందో వంతు కూడా నేను చూడలేదు.

నాకు ఏడుపు అంటే ఇష్టం లేదు. ఏడిస్తే నా కళ్ళు ఏమి బాగుండవు. మొహమంతా నల్లగా కాటుకవుతుంది. నేనెప్పుడూ ఏడవను బాబూ. మన కళ్ళకు ఏం కనబడ్డా సరే మనం ఏం అనకూడదంట – ఏమీ చెయ్యకూడదంట! అలా దిక్కులు చూస్తావేం తలొంచుకునడువు. నేలమీద చూడు అంటూ అమ్మ మొట్టికాయలేస్తుంది. నాకు నాన్న చేతిలో మామిడిపళ్ళ బుట్ట కనపడిందనుకో – ఓ మామిడి పళ్ళో అని ఎగర బుద్ధేస్తుంది. ఎగర కూడదంట. అవి మన కంచం లోకి వచ్చే వరకూ అరవకూడదంట. కంచంలోకి వచ్చాక బుద్ధిగా తినాలంట. మామిడిపళ్ళు చూడగానే ఎగరక పోతే చూసిన ఫలితం ఏముంటుంది? అలాగే కోపం వచ్చేది, చూసినా కూడా అరవ కూడదంట. అప్పుడొక రోజు ఏమయింది. కల్యాణి అక్క కాలేజ్ నుంచి ఒస్తుంటే ఒకబ్బాయి సైకిల్ మీద నుంచి పడి పోయాడు – కాలు బెణికి లేవలేక పోయాడు. రోడ్డుమీద ఎవరూ లేరు. కళ్యాణి అక్క అతన్ని లేపి సైకిల్ తీసి స్తంభానికి ఆనించి పెట్టింది.

APSCERT

ఆ అబ్బాయిని లేపి కాలు విదిలించుకుంటుంటే అతను పడిపోకుండా అతని చేయి పట్టుకుందట. ఇదంతా మా పక్కింటి మామయ్య చూసి కల్యాణి వాళ్ళ నాన్నతో చెప్పాడట. పరాయి పిల్లవాడి చేయి పట్టుకుంటావా అని అక్కను వాళ్ల నాన్నగారు కొట్టారు. పడిపోతే చూసి లేవదీసానంటే – చూస్తే చూసావు, నీ దారిన నీవు రావాలిగానీ దేశసేవ చేస్తావా అంటూ తిట్టాడు.

చూసిన తర్వాత ఏదయినా చెయ్యాలి గదా – లేకపోతే చూడడమెందుకు? చూసినా చూడనట్లు ఉండటం ఎలా? అంటే అమ్మకి అర్థంకాదు. నోరుమూసుకో అంటుంది. కళ్ళు మూసుకోవాలి. నోరు మూసుకోవాలి. అమ్మ కళ్ళకు ఏమీ కనిపించవు. కనిపించినా వాటి గురించి అమ్మ పట్టించుకోదు. ఆడ వాళ్ళ కళ్ళే ఇట్లా ఎందుకుంటాయో..!

(–సురక్ష ఆంధ్రప్రదేశ్ పోలీసు మాస పత్రిక, రాజకీయ కథలు – శ్రీమతి ఓల్గా)



1. రచయిత్రికి ఏడువు అంటే ఇష్టం లేదు ఎందుకు?
2. 'నోరు మూసుకో లేకుంటే కళ్ళు మూసుకో' అని అమ్మ ఎందుకన్నది ?
3. ఆపదలో ఉన్నవాళ్ళకు సాయం చేయడంలో ఆడ మగ తేడాలుంటాయా?
4. చూసి చూడనట్లు ఉండడం అంటే ఏమిటి?
5. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న రాయండి.

ii) కింది అపరిచిత గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

యుద్ధంలోకి మొదటిసారిగా మహిళల్ని తెచ్చింది నేతాజీ. స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళా సైనిక దళాన్ని ఏర్పాటు చేసి, వాళ్ల చేతికి తుపాకులిచ్చారు నేతాజీ. సరిగ్గా శత్రువుల గుండెల్లోకి పేల్చేలా వారికి శిక్షణ ఇచ్చారు. కదన రంగంలో ముందుకు కదలడానికి ఆ మహిళలకు కట్టుకున్న చీరలు అడ్డుపడలేదు, కానీ ఆరంభంలోనే యుద్ధంలోకి స్త్రీలెందుకు, స్త్రీల చేతులకు తుపాకులెందుకు అని మగాళ్లు ముఖం చిట్లిస్తూ అడ్డొచ్చారు. అయినా నేతాజీ వినలేదు. ఆజాద్ హింద్ ఫౌజ్ (నేతాజీ సారథ్యం వహించిన సైన్యం)కి ప్రత్యేకమైన పోరాట వ్యూహాలు ఉన్నప్పటికీ భారీ బలగాల్లేవు. మహిళాశక్తిపై నమ్మకంతో, విశ్వాసంతో వారిని సంగ్రామంలోకి ఆహ్వానించారు నేతాజీ. అందుకోసం 1943 జూలై 9న సింగపూర్లో సమావేశం జరిగింది.

"ఏం చేస్తారు బోస్.. ఆడవాళ్లు సైన్యంలోకి వచ్చి?" మగవాళ్లెవరో లేచి అడిగారు నేతాజీని,

"ఝాన్సీ లక్ష్మీబాయి ఏం చేసిందో అదే చేస్తారు" అన్నారు నేతాజీ! "తిరుగుబాటుకు, స్వాతంత్ర్య సంగ్రామానికి అప్పుడున్నది ఒక్క లక్ష్మీబాయే. ఇప్పుడు ప్రతి మహిళా ఒక లక్ష్మీ బాయి. నేను నమ్ముతున్నాను. పురుషులతో పాటు మహిళలూ కదిలొస్తే మనకు త్వరగా స్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. మహిళా సైనికులు యుద్ధరంగంలోకి దుమికితే భారతదేశం అణువణువునా స్వాతంత్ర్య కాంక్ష రగులుతోందన్న సంకేతం బ్రిటన్‌కు అందుతుంది" అన్నారు నేతాజీ. ఆ వెంటనే చెయ్యి ముందుకు చాస్తూ ప్రమాణం చేస్తున్నట్లుగా "మన మహిళా దళం పేరు 'రాణీ ఝాన్సీ రెజిమెంట్'. మరణ ధిక్కార మహిళా దళం మనది" అని దిక్కులు పిక్కటిల్లేలా సింహనాదం చేసారు మహిళా సైనికులు.



1. యుద్ధ రంగంలో మహిళల్ని మొదటిసారిగా పరిచయం చేసిన వారు ఎవరు? ( )

అ) గాంధీ ఆ) నేతాజీ ఇ) ఆజాద్ ఈ) నెహ్రూ

2 స్త్రీలు యుద్ధరంగంలో ప్రవేశించడంపై మీ అభిప్రాయం రాయండి.
3. పై పేరాలో యుద్ధం అని అర్థం వచ్చే పదాలను గుర్తించి రాయండి
4. 'ఝాన్సీ లక్ష్మీబాయి ఏం చేసిందో అదే చేస్తారు' అంటే అర్థం ఏమిటి?
5. పేరా ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

AP SCERT

వ్యక్తీకరణ సృజనాత్మకత

అ) ఈ కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానాలు రాయండి

1. కృష్ణమూర్తి గారు తన కుటుంబంతో కలిసి ఫోటో తీయించుకోవడం వెనక గల సందర్భాన్ని మీ సొంతమాటల్లో రాయండి.
2. ఈ పాఠ్యాంశం ద్వారా రచయిత్రి తన తండ్రి గురించి ఏమి చెప్పదలచుకున్నారు?
3. రచయిత్రి తండ్రి తమ కుమార్తెలకు స్వేచ్ఛనిచ్చినా, అప్రమత్తంగా ఉండేవారు అనడానికి కారణం ఏమిటి?

ఆ) కింది ప్రశ్నలకు జవాబులను రాయండి.

1. ఉత్తరం ద్వారా వాస్తవిక సంఘటనలు, అనుభవాలు, ఆలోచనలు ఆసక్తికరంగా వ్యక్తీకరించుట జరుగుతుంది. మీరు ఎవరితోనైనా మీ అనుభవాలను ఉత్తరంలో వ్యక్తపరిచారా? మీ అనుభవాన్ని రాయండి.
2. మీకు మీ నాన్న మీద ఉన్న ప్రేమను తెలుపుతూ మీ సొంతమాటల్లో లేఖను రాయండి.
3. 'ఉత్తరాలు రాయడం, టెలిఫోన్‌లో మాట్లాడడం' వీటిలో ఏది ఉపయోగకరమైనదని నీవు భావిస్తున్నావు? మీ సమాధానాన్ని సమర్థిస్తూ వ్యాసం రాయండి.
4. తండ్రి కూతుళ్ళ మధ్య జరిగిన కింది టెలిఫోన్ సంభాషణను పూరించి రాయండి.

కూతురు : నాన్నా... నేను

తండ్రి : ఎలా ఉన్నావు తల్లీ?

కూతురు : బాగున్నాను నాన్న.. నువ్వు వేళకు మందులు వేసుకుంటున్నావా? అమ్మ ఎలా ఉంది?

తండ్రి :

కూతురు :

భాషాంశాలు - పదజాలం

అ) ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థం రాసి వాటిని సొంతవాక్యాల్లో రాయండి.

1. ఏరు చిన్నపిల్లలా **ఉరకలు** వేస్తోంది.
2. వర్షాభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో **కరువు** నీడలు అలముకున్నాయి.
3. దేశనాయకుల చిత్రాలు ఎన్నో **స్మృతులను** గుర్తు చేస్తున్నాయి.
4. మా ఇంటిపేరు నాన్న **అస్తిత్వాన్ని** గుర్తు చేస్తోంది.

ఆ) కింది వాక్యాలను చదివి పర్యాయపదాలను గుర్తించి రాయండి.

ఉదా : అమ్మ ఎద ప్రేమమయం, నాన్న హృదయం అనురాగమయం

(1) నేను రాసిన లేఖకు మాస్నేహితురాలు ఉత్తరమిచ్చింది.

(2) తాతయ్య జ్ఞాపకాలను కుటుంబం మననం చేసుకున్నది.

(3) ఆహారపదార్థాల లేమి వల్ల భోజనంలో కూరల వెలితి కన్పించింది.

(4) ఆమె పరుగు పోటీల్లో ఆత్రుత వల్ల గమ్యాన్ని తొందరగా చేరలేకపోయింది.

(5) పశువుల గుంపులో బెదురుకున్న గొడ్డు భయంతో పరుగుపెట్టింది.

AP SCERT

ఇ) కింది పద్యం చదివి నానార్థాలను గుర్తించి రాయండి.

భోగమన పాము పడగయు _____

భోగంబన శుభము కీర్తి భోజన మొప్పున్ _____

భోగమన దపము, భువనము _____

భోగంబన మేనమామ పుత్రిక యయ్యెన్ _____

ఈ) కింద సూచించిన ప్రకృతి పదాలకు సరైన వికృతి పదాలను గుర్తించి రాయండి. వాటిని వాక్యాల్లో ప్రయోగించండి.

సిరి	కుమారుడు	సేమము	శ్రీ	పంక్తి
క్షేమము	ఆశ	కొమరుడు	బంతి	ఆస

	ప్రకృతి	వికృతి
1.	స్త్రీ	ఇంతి
2.		
3.		
4.		
5.		

ఉదా: ప్రతి కుటుంబానికి స్త్రీ – సిరితో సమానం. ఆ ఇంతియే ఇంటికి వెలుగు.

1. _____

2. _____

3. _____

4. _____

5. _____

వ్యాకరణాంశాలు

సంధులు

అ) కింది పదాలను విడదీసి సంధిపేరు రాయండి.

ఉదా : మీరెప్పుడు = మీరు + ఎప్పుడు = ఉకారసంది

1. ఉత్తరాలు = _____ + _____ = _____

2. జ్ఞాపకాలు = _____ + _____ = _____

3. పదిహేనేళ్ళు = _____ + _____ = _____

4. మాకెవరికీ = _____ + _____ = _____

5. అటఁజని = _____ + _____ = _____

6. వానింగూర్చి = _____ + _____ = _____

AP SCERT

ఆ) సరళాదేశ సంధి మరొకసారి గుర్తుచేసుకుందాం. కింది ఉదాహరణను గమనించండి.

1. రామలక్ష్మణులు రాక్షసులఁజూసిరి
2. సత్యభామ నరకాసురుని ప్రాణముఁదీసెను

రాక్షసులఁజూసిరి = రాక్షసులన్ + చూసిరి

ప్రాణముఁ దీసెను = ప్రాణమున్ + తీసెను

పై ఉదాహరణల్లో పూర్వపదం చివర 'న్' అనే ద్రుతం ఉంది. పరపదంలో చ, త అనే పరుషాలకు సంధి జరిగి జ, ద అనే సరళాలుగా మారాయి. క-చ-ట-త-ప లు సంధి జరిగిన తరువాత గ - జ-డ- ద-బ లు గా మారుతున్నాయి. ఇలా పరుషాల స్థానంలో సరళాలు ఆదేశంగా రావడాన్ని సరళాదేశ సంధి అంటారు.

కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.

1. రాఁగలదు = _____ + _____ = _____
2. వచ్చెఁదల్లీ = _____ + _____ = _____
3. పట్టుఁబట్టెను = _____ + _____ = _____
4. రావణుఁజంపె = _____ + _____ = _____
5. చాయఁబోలె = _____ + _____ = _____

సమాసాలు

అ) కింది పదాలకు విగ్రహవాక్యం రాసి సమాసం పేరు రాయండి.

1. తండ్రీ కూతుళ్ళు = _____, _____
2. అజ్ఞానము = _____, _____
3. గౌరవాభిమానములు = _____, _____
4. పఠనలేఖనములు మానవుని వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి. (గీతగీసిన పదం ఏ సమాసమో గుర్తించండి.) ( )

అ) ద్విగు ఆ) షష్ఠీ తత్పురుష ఇ) ద్వంద్వ ఈ) రూపక

వాక్యాలు - రకాలు

అ) కింది వాక్యాలను పరిశీలించండి.

1. నీవు పాఠం చదువు.
2. చిత్రం గురించి వివరించండి.

పై వాక్యాలు చేయాల్సిన పనిని తప్పనిసరిగా చేయమని తెలియజేస్తున్నాయి. ఇలా విధిగా చేయమని చెప్పే వాక్యాలు **విధ్యర్థక వాక్యాలు** అంటారు. ఇలాంటి వాక్యాలు మీరూ కొన్ని రాయండి.

1. _____
2. _____
3. _____
4. _____

ఆ) కింది వాక్యాలను పరిశీలించండి

1. ప్రతి ఆదివారం సెలవు.
2. ప్రతి రోజూ సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు.

AP SCERT

పై వాక్యాలలో సమాచారం స్పష్టంగా కచ్చితంగా తెలుస్తోంది. ఇలా కచ్చితంగా సమాచారాన్నిచ్చే వాక్యాలను **నిశ్చయార్థక వాక్యాలు** అంటారు. ఇలాంటి వాక్యాలు మీరూ కొన్ని రాయండి.

1. _____

2. _____

ఇ) కింది వాక్యాలను పరిశీలించండి

1. అతిగా సెల్‌ఫోనులో ఆటలు ఆడవద్దు
2. బస్సులో చేతులు బయట పెట్టరాదు

పై వాక్యాలను గమనిస్తే అవి చేసే పనిని నిషేధిస్తున్నాయని తెలుస్తోంది. ఇలాంటి వాక్యాలను **నిషేధార్థక వాక్యాలు** అంటారు. ఇలాంటి వాక్యాలను మీరు కొన్ని రాయండి.

1. _____

2. _____

అలంకారాలు

కింది ఉదాహరణలు పరిశీలించండి. అలంకారాల్ని గుర్తించండి.

1. శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
2. మధుర ఫలంబులిచ్చు వృక్షంబు వృక్షంబు
3. దేవా! నీకు వంద వందనాలు
4. నీటిలో పడిన తేలు తేలుతుందా
5. వర్ష వర్షంలో తడుస్తూ ఉంది
6. రామ బాణం తగిలి వాలి వాలిపోయెను.

ప్రాజెక్టు పని

క్యు.ఆర్.కోడ్‌ను స్కాన్ చేయండి. ప్రకాశ్ నాయుడు రచించిన, తనికెళ్ళ భరణి ఆలపించిన 'నాన్న ఎందుకో వెనుకబడ్డాడు' కవితను వినండి. దానిని చార్టుపై రాసి తరగతిగదిలో ప్రదర్శించండి.

పద్య మధురిమ

మ॥ కొడుకుల్ పుట్టరటంచు నేడ్తు రవివేకుల్జీవన భ్రాంతులై
కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రునకనేకుల్ వారిచే నేగతుల్
పడిసెం? బుత్రులు లేని యాశుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా!

–శ్రీకాళహస్తీశ్వర శతకం – ధూర్జటి

భావం : కొంతమంది సంతానం కోసం ఆశతో ఎదురు చూస్తుంటారు. కొడుకులు లేరని బాధపడుతూ ఉంటారు. అలాంటి వాళ్ళు పుత్రులు పున్నామ నరకం నుంచి రక్షిస్తారనీ వంశాంకురాలనీ అనవసరమైన భ్రమలో ఉంటారు. వందమంది కౌరవుల వల్ల ధృతరాష్ట్రునికి సద్గతులు ఏమైనా కలిగాయా? కొడుకులు లేని శుక మహర్షికి మోక్షం లభించింది కదా!

AP SCERT

5 ఆత్మకథ

V3Q2L6

మూల గ్రంథం : నల్లద్రాక్ష పందిరి

కవి : డా॥ ఎండ్లూరి సుధాకర్

చదవండి - చర్చించండి

గీటురాయి



మేం మనుష్యులం
మేం మహస్సులం
గుండె లోపలి గుండె కదిలించి
తీగ లోపలి తీగ సవరించి
పాట పాటకి లేచు కెరటంలాగ
మాట మాటకి మోగు కిన్నెరలాగ
మేం ఆడుతాం
మేం పాడుతాం

మేం ఉపాసకులం
మేం పిపాసువులం
భూమి అంచులకు వెలుగు తెరకట్టి
తారకల గతికొక్క శ్రుతివెట్టి
పాట పాటకి వెండిదారంలాగ
మాట మాటకి మండు దూరంలాగ
మేం సాగుతాం
మేం రేగుతాం

మేం నవీనులం
మేం భావుకులం

AP SCERT

పాత లోకపు గుండెలో శతఘ్ని పగిలించి
భావి కాలపు చంద్రకాంత శిలల కరిగించి
పాట పాటకి సోకు స్వర్గంలాగ
మాట మాటకి దూకు సింహంలాగ
మేం నిలుస్తాం
మేం పిలుస్తాం.

మేం మనుష్యులం
మేం మహస్సులం
మాకు దాస్యంలేదు
మాకు శాస్త్రంలేదు
మాకు లోకం ఒక గీటురాయి
మాకు కరుణ చిగురు తురాయి
మేం పరపీడన సహించం
మేం దివ్యత్వం నటించం

గాలి గుర్రపు జూలు విదిలించి
పూలవర్షం భువిని కురిపించి
పాట పాటకు పొంగు మున్నీరులా
మాట మాటకి జారు కన్నీరులా
మేం ఆడుతాం
మేం పాడుతాం.





– దేవరకొండ బాలగంగాధర తిలక్

APSCERT

ఆలోచనాత్మక ప్రశ్నలు:

1. మనం మనుష్యులం అని చెప్పుకోవాలనుకుంటే మనకు ఉండవలసిన లక్షణాలేమిటి?
2. మేం నవీనులమని అంటున్న వారు దేనిని సహించమంటున్నారు? ఎందుకోచెప్పండి.

ఉద్దేశం

సామాజిక జీవితం సమస్యల వలయం, అందులో ఆటు పోట్లుంటాయి. జీవితం అందరికీ వడ్డించిన విస్తరి కాదు. తాము నమ్మిన జీవన సూత్రాలను అనుసరించి ఎదిగిన ఎందరో గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని వారి బాటలో నడిచి విజయ శిఖరాలు అధిరోహించిన వారిలో ఈ కవి ఒకడు. సమాజం అతడి కృషిని గౌరవించి సమున్నతంగా సన్మానిస్తుంది. కానీ కవి ఆ సన్మానానికి పొంగిపోడు. గతంలో తనజాతి జనులకు జరిగిన అనేకానేక అవమాన పరంపరలు అతడి కళ్ళముందు కదలుతూ ఉంటాయి. వాటి తాలూకా దుఃఖం అతణ్ణి పట్టి బాధిస్తుంది. విద్య ద్వారానే వ్యక్తికి గౌరవం లభిస్తుంది. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా తాను ఎక్కడనుండి వచ్చాడో గుర్తెరగాలి. తనమూలాలు మరువ కూడదనే సత్యాన్ని తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.


నేపథ్యం

స్వేచ్ఛ మానవ సహజాతం. వ్యక్తి తన స్వతంత్రానికి భంగం కలిగితే సహించడు. తన హక్కులను అణచివేయాలని ప్రయత్నిస్తే తిరగబడతాడు. పిల్లలు సైతం తమకు ఇష్టం లేకపోతే తల్లిపాలను తాగనంటారు, తలతిప్పుకుంటారు. ప్రతి మనిషికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది. తనకు సాటిమనుష్యుల మధ్య గుర్తింపును కోరుకుంటాడు. సమాజంలో ఉన్న కొన్ని నిరంకుశ భావాలు, కట్టుబాట్లు మనిషి స్వేచ్ఛకు సంకెళ్ళు వేస్తాయి. అతడు వాటిని తెంచుకొని తనలో ఉన్న సృజనాత్మక శక్తిని ప్రపంచానికి చాటుకుంటాడు. మనిషిలోని మంచితనాన్ని, మానవీయతను ప్రపంచం గుర్తించి గౌరవిస్తుంది. అనేకానేక సమస్యలకు కుంగిపోక ఎదురునిల్చి ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా జ్ఞాన శిఖరాలు అధిరోహించిన ఒకానొక కవి జీవితమే నేటి మన పాఠం.

ప్రక్రియ – వచన కవిత

ఈ పాఠ్యభాగం 'వచన కవిత' అనే సాహిత్య ప్రక్రియకు చెందినది. పద్య, గేయాల్లో ఉండే ఛందో నియమాలతో సంబంధం లేకుండా, వ్యావహారిక భాషలో లయాత్మకంగా సాగే కవితను వచన కవిత అంటారు. సరళమైన పదాలు, వాక్యాలతో ధ్వని గర్భితంగా ఉండే కవిత వచన కవిత. రచయిత తాను చెప్పదలుచుకున్న భావాన్ని సూటిగా స్పష్టంగా చెప్పడం వచన కవిత ప్రత్యేకత. ఆధునిక కవిత్వానికి కొత్త నెత్తురు ఎక్కించిన శ్రీశ్రీ వచన కవితకు పట్టంకట్టారు. వారి బాటలో నడుస్తున్న ఆధునిక కవులందరు వచన కవితలోనే రచనలు చేస్తున్నారు.

కవి పరిచయం :




జ : 21.01.1959
మ : 28.01.2022

'నా అనుభవం నేర్పిన పాఠమే నా కవిత్వం' అని తన కవితా గుణాల్ని ప్రకటించిన ఆధునిక కవి డా॥ ఎండ్లూరి సుధాకర్. ఆయన ప్రకాశం జిల్లా కనిగిరి తాలుకా రావికుంటపల్లెలో జన్మించారు. ఎండ్లూరి దేవయ్య, శాంతాబాయి వీరి తల్లిదండ్రులు. ఉన్నత చదువులు చదివిన వీరు జాషువా రచనలపై పరిశోధన చేసి పిహెచ్.డి పట్టా పొందారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో, కేంద్రీయ విశ్వవిద్యాలయం (హైదరాబాద్)లో లెక్చరర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్‌గా, శాఖాధిపతిగా సుమారు 30 సంవత్సరాలు పనిచేసారు. 'జాషువ పరిశోధన కేంద్రం' తరపున సుమారు 20 గ్రంథాలకు సంపాదకత్వం వహించారు. కవిరత్న, నవయుగ వచన కవితా చక్రవర్తి వీరి బిరుదులు. వర్తమానం, మల్లెమొగ్గల గొడుగు, కొత్త గబ్బిలం, వర్ణీకరణీయం, గోసంగి, నల్లద్రాక్షపందిరి, ఆటాజనిగాంచె యాత్రా కవిత్వం, జాషువా సాహిత్యం పై విశ్లేషణ వీరి ఇతర రచనలు. ప్రస్తుత పాఠం 'నల్లద్రాక్షపందిరి' కవితాసంపుటి లోనిది.

AP SCERT

ఆత్మకథ




మయసభలో నా ఆత్మకథ ఆవిష్కరించబడింది.
బహిరంగ వేదిక మీద నా సన్మానం మొదలయ్యింది.
ఇప్పుడు నా మెడలో దండలు పడుతుంటే
నిన్నటి నా గాయాలు ఉలిక్కిపడుతుంటాయి.
నా తల మీద పూలు చల్లుతున్నప్పుడు
నా లోలోపల ముళ్ల కొరడాలు చరుస్తుంటాయి.
నా మీద అభినందన పత్రాలు చదువుతున్నప్పుడు
నా కడుపులో అవమానాల చురకత్తులు గుచ్చుకుంటాయి.
నా వెనక వేదమంత్రాలు నినదిస్తుంటే
నా చెవుల్లో సీసం పొగల గావు కేకలు తాండవిస్తుంటాయి
సభావేదిక మీద నన్ను కూర్చోబెట్టినప్పుడు
ఊరి పొలిమేర దగ్గరే నిలబడ్డ నా తాత మొహం గుర్తుకొస్తుంది.
నా ముందు నీళ్లు నిండిన గాజు గ్లాసులు పెట్టినప్పుడు
మోకాళ్లపై వంగి నీళ్లు తాగిన ఎడారి దృశ్యాలు వేడిగా తగులుతాయి.
నా భుజాల చుట్టూ శాలువా కప్పుతున్నప్పుడు
వంటి నిండా బట్ట లేని నా జేజెమ్మ మసకరూపం గుండెల్ని కోస్తూ వుంటుంది.
పట్టు వస్త్రాలు నాకు అర్పణంగా పెడుతున్నప్పుడు
చివికి పేలికలైన నా తాత ముతకపంచెలు
కళ్ల తీగలపై వేలాడుతుంటాయి.



© SCERT

నన్ను విందు భోజనాలకు ఆహ్వానిస్తున్నప్పుడు
చిన్నప్పుడు గొడ్ల చావిట్లో బువ్వ పెట్టిన పొద్దులు గుర్తొస్తాయి.
కాలం నా పాదాలకు నమస్కరిస్తుంటే
చెప్పుల్లేని నా తాతల మట్టికాళ్లు
మనసులో మెదులుతుంటాయి.
ఏ రోడ్డు మీదో నా చిన్నప్పటి గురువులు కనిపిస్తే
గద్దను చూసిన కోడిపిల్లలా
నా బొటన వేలు గుప్పిట్లో దాక్కుంటుంది.
ఆహా ఓహోల మధ్య నా కవిత్వాన్ని
రామచిలుకలు చప్పరిస్తున్నప్పుడు
మన్నులో ఇంకిపోయిన నా జాతి కవిత్వం
గుర్తొచ్చి క్రూరంగా వేధిస్తుంది.
నా కోసం చౌరస్తాలు రంగు రంగుల
తోరణాలై ఆహ్వానిస్తున్నప్పుడు
నాతో ఐదడుగులూ కలిపేందుకు
స్వర్ణహంసలు సిద్ధపడుతున్నాయి.
నా పూర్వీకుల దేహధూళి
నేలమాళిగల్లోంచి కొత్తగాలి పీల్చుకుంటుంది.



అసూర్యంపశ్యలు స్వయం వరాల్లో
నా కోసం పోటీ పడుతున్నప్పుడు
తెగిన తలలూ కోసిన అంగాలూ
నా కళ్లల్లో ఎగిరిపడుతూనే ఉంటాయి.

దేవాలయాలూ కొత్త దేవుళ్లూ
నా దర్శనం కోసం పడిగాపులు పడుతున్నప్పుడు
గుడ్డి చీకట్లో గుడిగంటలు
వక్ర ధ్వనులతో నవ్వుకుంటాయి.
నాలుగు మబ్బుల నీలిగోడల్ని చీల్చుకుంటూ
నేను ఐదవ సూర్యుడినై ఉదయించాను.

ఇవాళ నా రక్త కిరణాలు
చంద్రతలం మీద ప్రతిబింబిస్తున్నాయి.
ఇప్పటి కొత్త సూర్యుడి వెలుగులో
కాలం నా 'ఆత్మకథ'ను
పాఠ్యగ్రంథంగా చదువుకుంటుంది.

AP SCERT

సారాంశం

చదువుతోనే సంస్కారం, సామాజిక గౌరవం అబ్బుతాయని దీనికి పుట్టుపూర్వోత్తరాలతో సంబంధం లేదని నిరూపించిన కవి అతడు. అనేక కష్టాలను చవిచూచిన బాల్యం ఆయనది. అమానుషమైన కట్టుబాట్లకు అక్షరాలను ఆయుధంగా మార్చి కలం పట్టి ఎదురుతిరిగిన ధీశాలి అతడు. ఆయన రచించిన 'ఆత్మకథ' గ్రంథావిష్కరణ జరిగింది. సభావేదికపై కవికి సన్మానం మొదలైంది. కవి మెడలో అభిమానులు పూల దండలు వేస్తున్నారు. తలమీద పూలను అక్షింతల్లా చల్లుతున్నారు. తనను గురించి తన కవిత్వం గురించి ఎంతో గొప్పగా పొగుడుతూ అభినందన పత్రం చదువుతున్నారు.

కవి హృదయంలో అలజడి మొదలయింది. వేద మంత్రోచ్చారణతో తనను ఈవేళ వేదికపైకి ఆహ్వానిస్తున్నప్పుడు గతం తాలూకా అవమానాల గాయాలు గుర్తొచ్చి గుండెలోతుల్లో ఆవేదన పెల్లుబికింది. మనసును ఎవరో ముళ్ళ కొరడాలతో చరిచినట్లయింది. కడుపులో అవమానాల చురకత్తులు దిగబడి తిప్పినట్లుగా అనిపించింది. సభా వేదికపై కవిని కూర్చోబెట్టినపుడు– అతడికి ఊరి పొలిమేరల్లో నిస్సహాయంగా నిలబడిపోయిన తన తాత మదిలో మెదిలాడు. నిషిద్ధమానవుడిగా ఊరిబయటే ఉండిపోయిన తాత రూపం కనులముందు కదలాడింది.

కవి ఎదుట గాజుగ్లాసుల్లో నీళ్ళు పెట్టినప్పుడు, కలత చెందిన తన జాతి నీటి దాహం గుర్తుకొచ్చింది. దాహమయినప్పుడు మోకాళ్ళపై వంగి దప్పిక తీర్చుకున్న సన్నివేశాలు మనసు లోతుల్లో వెచ్చగా తగిలాయి. నీటి కోసం అలమటించిన తన జాతి జనుల పాత రోజులు కదిలాడాయి.

కవి భుజాలపై శాలువా కప్పి సన్మానిస్తున్నప్పుడు, అతడి అంతరంగంలో ఒంటి నిండా బట్టకు నోచుకోని తన జేజి రూపం, చొక్కా అంటే ఏమిటో ఎరుగని తన తాతరూపం మదిలో మసగ్గా కనబడ్డాయి. నిషేధాజ్ఞలకు బందీలై వాళ్ళు బతుకును వెళ్ళ తీసారు. ఒంటి నిండా గుడ్డకట్టుకోలేని వారి దీనస్థితికి కవి కుంగి పోయాడు.

కవికి పట్టు వస్త్రాలిచ్చి గౌరవించినపుడు, అతడి మనసులో తన తల్లిదండ్రులు మెదిలారు. చిరిగి పేలికలైన ముతక పంచెలు కట్టుకొని వారు తిరుగాడిన దృశ్యాలు తన కళ్ళముందు కదులుతున్నాయని కవి బాధపడుతున్నాడు. తన జాతి హీనతకు, దీనతకు, దైన్యానికి కవి తీవ్ర వేదనకు గురయ్యాడు. పంచభక్ష్య పరమాన్నాలు సిద్ధపరచి భోజనానికి కవిని పిలిచినప్పుడు – తన చిన్నప్పుడు గొడ్లపాకలో కూర్చుని బువ్వ తిన్న పొద్దులు గుర్తు చేసుకొని కుమిలి పోతున్నాడు.

స్వయం కృషితో కవి వీధిబడి నుండి విశ్వవిద్యాలయం దాకా చేరుకున్నాడు. తన ప్రతిభ, పాండిత్యాలు, వాక్చతురతతో సమాజంలో గుర్తింపు తెచ్చుకున్నాడు. వ్యక్తిగా మానవతా శక్తిగా తనను తాను నిరూపించుకున్నాడు. ఇప్పుడు కాలం తన పాదాలకు నమస్కరించి నిలుచోవడం అతడు గమనించాడు. అందరి పాదాలు కందకుండా చెప్పులు కుట్టించిన, తమ తాతలు మట్టి పాదాలతోనే బతుకంతా నడుచుకుంటూ తిరుగాడిన రోజులు గుర్తుకొచ్చాయి. ఎవరైనా గురుదక్షిణగా బొటనవేలు అడుగుతారనే భయం ఆవరిస్తోంది. అందుకే గురువులను చూచినప్పుడు గ్రద్దను చూసిన కోడి పిల్లలా తనబొటనవ్రేలు గుప్పిటిలో దాక్కుంటుందని అంటున్నాడు.

AP SCERT

తన కవిత్వంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ ఆహా..! ఓహో..! అంటూ చిలకపలుకులు పలుకుతూ మెచ్చుకుంటున్నారు. ఎంతో వేదనామయ జీవితాన్ని కవిత్వీకరించిన తన జాతి జనులు ఎవరూ వెలుగులోకి రాలేక పోయారు. మట్టిలో కలిసిపోయిన నిఖార్సయిన తన జాతి కవులు గుర్తొచ్చి కవి మనసు కలత చెందింది. తనను ఆహ్వానించడానికి నాలుగు రోడ్ల కూడళ్ళు రంగుల తోరణాలతో అలంకరించుకుంటున్నాయి. తనతో కలిసి నడవడానికి బంగారు హంసలు బారులు తీరి ఉన్నాయి. తన పూర్వీకులు మట్టిలో కలిసిన ఈ నేలమీద ఇప్పుడు కొత్తగాలి వీస్తోంది.

ఎండకన్నెరగని కోమలాంగులు స్వయంవరంలో తనకోసం పోటీపడుతున్నారు. ఇప్పుడు దేవాలయాలు, కొత్త దేవుళ్ళు తన దర్శనం కోసం పోటీపడుతున్నారని చెపుతున్నాడు కవి. ఈ విషయం తెలిసిన గుడిగంటలు చీకటిలో వంకరగా నవ్వుకుంటున్నాయని అంటాడు.

వర్ణవ్యవస్థ గోడలను కూలగొట్టి తాను ఐదవ సూర్యుడిగా ఉదయించానని కవి చెపుతున్నాడు. తాను సాధించిన విజయాలు, సంపాదించిన విజ్ఞానం, సామాజిక సమానత్వానికి, మానవీయ విలువలకు చోటు దక్కడం ద్వారానే సాధ్యమయింది. ఈ రోజు తన రక్తకిరణాల వెలుగులు చంద్రతలం మీద ప్రకాశిస్తున్నాయి. ఒకనాటి సామాజిక పరిస్థితులకు ఎదురు నిలిచి తన కవిత్వం ద్వారా తనను తాను నిరూపించుకున్నాను అని కవి అంటున్నాడు. స్వయంకృషితో తాను సాధించిన విజయాలు సమున్నతంగా సమాజంలో నిలవబట్టి సంఘం తనను గుర్తించి గౌరవించిందని అంటున్నాడు. తాను లోకానికి వెలుగును పంచే జ్ఞాన సూర్యుడనయ్యానని అంటున్నాడు. కొత్త ప్రపంచం తన ఆత్మకథను పాఠ్యగ్రంథంగా చదువుకుంటుందనే విశ్వాసాన్ని కవి వ్యక్తం చేస్తున్నాడు.



అవగాహన - ప్రతిస్పందన

అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి, రాయండి.

1. **శాలువా కప్పినప్పుడు కవికి ఎవరెవరు గుర్తుకు వచ్చారు? చెప్పండి.**
2. **సన్మానం పొందుతున్నప్పుడు కవికి తన తాత రూపం ఎలా కనిపించింది?**
3. **ఆత్మకథ పాఠ్యభాగ రచయితను గురించి రాయండి.**


ఆ) కింది అపరిచిత గద్యం చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

అమెరికాలోని శ్వేత జాతీయులు నల్లవారిపై చూపే జాతివివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు మార్టిన్ లూథర్ కింగ్. నల్లవారికి ఓటు హక్కులేదు. కావాలన్న చోట ఇల్లు కట్టుకోకూడదు. భోజనం చేసే చోట, ప్రయాణించే చోట తెల్లవారి పక్కన కూర్చోరాదు. సాటి మనిషిని హీనంగా చూసే దురహంకారాన్ని ధైర్యంగా ఎదిరించాడు మార్టిన్.

AP SCERT

"నాకో స్వప్నం ఉంది. బానిసల పిల్లలు, యజమానుల పిల్లలు పక్క పక్కనే కూచునే రోజు వస్తుంది. అన్యాయం అణచివేతలతో ఎడారి అయిన మిసిసిపి రాష్ట్రం స్వేచ్ఛ, న్యాయాల ఒయాసిస్సులను పొందే రోజొస్తుందన్న స్వప్నం నాకుంది. నా పిల్లలు చర్మం రంగును బట్టి కాకుండా వ్యక్తిత్వాన్ని బట్టి మనుషులుగా విలువ పొందే రోజు వస్తుందన్న స్వప్నం నాకుంది." అంటూ తన జాతి ప్రజల విమోచనకొరకు జీవితాంతం పోరాటం చేసిన వీరుడు ఆయన. 1929 జనవరి 15న అట్లాంటాలో జన్మించిన మార్టిన్ లూథర్ కింగ్ తండ్రి పేరు కూడా అదే. తల్లిపేరు అల్బర్టా విలియమ్స్. ముగ్గురు సంతానంలో మధ్యవాడు మార్టిన్. స్థానిక స్కూల్లో చదువుతున్నప్పుడు హొవార్డు తూమ్రాన్ అనే గురువు ప్రభావం మార్టిన్ పై పడింది. సాటిమనిషిని మనిషిగా చూడని జంతు ప్రవృత్తిని ఈ సడించుకునే మనస్తత్వం మార్టిన్‌కు నచ్చింది. ఆయన ప్రోత్సాహంతో సోషియాలజీ డిగ్రీ చేసాడు. బోస్టన్ యూనివర్సిటీ నుండి సిస్టిమేటిక్ థియాలజిలో డాక్టరేటు పొందాడు. కార్ల్‌మార్క్సు సిద్ధాంతాన్ని చదివాడు. మహాత్మాగాంధీ రచనలను, జీవితాన్ని, పోరాట మార్గాన్ని ఆకళింపు చేసుకున్నాడు. అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. విజయం సాధించాడు. పౌరహక్కులకోసం పోరాటం చేసిన యోధుడిగా ఇతణ్ణి ప్రపంచం గుర్తించింది. నల్లజాతి ప్రజలను నడిపించిన శక్తిగా ఇతడు కీర్తిపొందాడు. 35 ఏళ్ళకే నోబెల్ శాంతి బహుమానం పొందాడు.

ప్రశ్నలు



1. **మార్టిన్ లూథర్‌కింగ్ భవిష్యత్తును గురించి ఏం కలకన్నాడు?**
2. **ఉద్యమాల ద్వారా అతడు సాధించిన విజయాలేమిటి?**
3. **పై పేరాలో 'కల' అని అర్థాన్నిచ్చే పదం ఏది?**
4. **ఆకళింపు చేసుకోవడం అంటే ( )**

అ) ఆవలించడం ఆ) అర్థంచేసుకోవడం ఇ) పోరాడడం

5. **పైపేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.**

ఇ) కింది అపరిచిత గద్యం చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

20వ శతాబ్దం స్వేచ్ఛా స్వాతంత్ర్య ఉద్యమాలకు ఆలవాలం. బానిస సంకెళ్ళు తెంచుకోవడం కోసం ప్రజలు పిడికిలి బిగించి ముందుకురికిన కాలం. కవుల పాతయుగపు ఛాందసత్వం పై కలాలు ఝళిపించిన కాలం. వ్యథార్త జీవుల గాథలకు పట్టం కట్టడం మొదలైన కాలం. తెలుగు సాహిత్యంలో దళిత జీవిత గాథలను వాస్తవిక దృష్టితో రచించడం మొదలైంది. ప్రతి మనిషి పుట్టుకకు విలువ ఉందంటూ దీనజనుల గొంతై నినదించిన ప్రాతఃస్మరణీయుడు గుర్రం జాషువ. తెలుగు కథా సాహిత్యంలో తొలిసారి 1925లో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రాసిన *'పల్లంరాజు కథ'*లో దళితుల ప్రస్తావన మనకు కనిపిస్తుంది. దళిత జీవితాన్ని అనుభవించిన వ్యక్తిగా లోతులు చూచిన వాడిగా మంచి కథలు రాసినవారు ఆచార్య కొలకలూరి ఇనాక్. వీరు కోస్తాంధ్ర జీవితాన్ని, దళిత జీవితాన్ని, మూలాన్ని పట్టుకొని *కొలిమి, కట్టడి, ఊరబావి, బస్సు ప్రయాణం* వంటి గొప్పకథలు రాసారు. డాక్టర్ భార్గవీరావు సంకలనం చేసిన *'ఇంకానా ఇకపై సాగవు'* కథలు విభిన్న కోణాలను ఆవిష్కరిస్తాయి. గోగు శ్యామల, జూపాక సుభద్ర సంపాదకత్వంలో వచ్చిన *రేగటి సాళ్లు'* లో దళితుల బతుకు చిత్రాలను చూడగలం. తెలంగాణ దళిత జీవితాన్ని బోయ జంగయ్య రాసిన *ఎచ్చరిక, గొర్రెలు* కథాసంపుటాల్లో చూడగలం. రాయలసీమ దళిత జీవితాన్ని శాంతి నారాయణ, చిలుకూరి దేవపుత్ర అద్భుతమైన కథాశిల్పంతో మలిచారు. డాక్టర్ ఎండ్లూరి సుధాకర్ *'మల్లెమొగ్గల గొడుగు'* లో ప్రకాశం జిల్లా మాదిగల

APSCERT

జీవితసారాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. ఇంకా నాగప్పగారి సుందర్రాజు, కొలకలూరి స్వరూపరాణి, చల్లపల్లి స్వరూపరాణి, జాజుల గౌరి, వినోదిని మొదలైన వారు దళిత కథా సాహిత్యాన్ని పరిపుష్టం చేసారు.

ప్రశ్నలు

1. ప్రజల హక్కుల కోసం కవులు ఏమి చేస్తారు?
2. రాయలసీమ ప్రాంతంలో దళిత జీవితాన్ని చిత్రించిన కథకులు ఎవరు?
3. ప్రాతఃస్మరణీయుడు అంటే అర్థం ఏమిటి?
4. పై పేరా చదివి రచయిత్రుల పేర్లు రాయండి.
5. పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి?

వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానం రాయండి.

1. కాలం నా పాదాలకు నమస్కరిస్తుంది అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?
2. కవి నేడు సమాజంతో సత్కారం పొందడానికి తోడ్పడిన అంశాలేమిటి?
3. కవి తన పూర్వీకులు ఎదుర్కొన్న సవాళ్ళ గురించి ఏమి ఆలోచిస్తాడో రాయండి.

ఆ) కింది ప్రశ్నలకు సమాధానాలివ్వండి.

1. ఆత్మకథ పాఠ్యభాగంలో కవి వెలువరించిన బాధామయ జీవితాన్ని మీ మాటల్లో రాయండి.
2. కాలం నా ఆత్మకథను పాఠ్యగ్రంథంగా చదువుతుందని అనడంలో కవి ఆలోచనల గురించి రాయండి.
3. తమ గురించి తాము చెప్పుకోవడమే ఆత్మకథ. ఏదైనా ఒక వస్తువు / పక్షి / జంతువును ఎంపిక చేసుకుని అవి తమ గురించి తాము ఏమేమి చెప్పుకుంటాయో ఊహించి ఆత్మకథలా రాయండి.
4. 'మనుషులందరూ సమానమే' అనే అంశంపై ఐదు నినాదాలు రాయండి.

భాషాంశాలు - పదజాలం

అ) కింద ఎరుపు రంగులో ఉన్న పదానికి అర్థం తెలుసుకొని సొంత మాటల్లో రాయండి.

1. నాలుగు రోడ్ల చౌరాస్తా లో జాతీయ జెండా ఎగురవేశారు.
2. పూరి గుడిసె అగ్నికి అర్పణం అయ్యింది.
3. ఆ పిల్లలు తెలివి తేటల్లో చురకత్తుల్లా ఉన్నారు.

ఆ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

1. స్వర్ణం : _____
2. సూర్యుడు : _____
3. కళ్ళు : _____
4. దేహం : _____

APSCERT

ఇ) కింది పదాలకు నానార్థాలు రాయండి

1. తల : _____
2. కాలం : _____
3. క్రియ : _____
4. రామ : _____

ఈ) కింది ప్రకృతి పదాలకు వికృతులను జతపచండి.

1.	భోజనం	( )	ఎ) కత
2.	కథ	( )	బి) పువ్వు
3.	పుష్పం	( )	సి) బోనము

గీతగీసిన పదానికి ప్రకృతి పదం గుర్తించండి.

రైతులు ప్రొద్దుపొడవక ముందే పొలానికి వెళతారు. ( )

అ) సూర్యోదయం ఆ) వేకువ ఇ) బ్రధ్న ఈ) భధ్న

వ్యాకరణాంశాలు

సంధులు

ఆమ్రేడిత సంధి

ఈ కింది ఉదాహరణలను పరిశీలించండి.

ఓహొహొహొ = ఓహొహొ + ఓహొహొ

ఏమేమి = ఏమి + ఏమి

ఈ పదాలను విడదీసినపుడు పూర్వపదం, పరపదం రెండింటిలోనూ ఒకే పదం వస్తుంది. ఇలా రెండూ ఒకవిధమైన పదాలు వస్తే అందులో రెండవ పదాన్ని ఆమ్రేడితం అంటారు.

ఉదా॥ అప్పటికిన్ + అప్పటికిన్ : అప్పటప్పటికిన్

అక్కడన్ + అక్కడన్ : అక్కడక్కడన్

సూత్రం-1 : అచ్చునకు ఆమ్రేడితము పరమైనపుడు సంధి తఱుచుగానగు.

సూత్రం-2 : ఆమ్రేడితం పరమైనపుడు విభక్తిలోపం బహుళంగా వస్తుంది.

అ) కింది పదాలు విడదీసి, సంధి పేరు తెలపండి.

1. పావనమైనది : _____ + _____ = _____
2. ధర్మమొకటి : _____ + _____ = _____
3. చిన్నప్పుడు : _____ + _____ = _____
4. ఐదడుగులు : _____ + _____ = _____

సమాసాలు

తత్పురుష సమాసం:- ఉత్తర పద అర్థం ప్రధానంగా కలది తత్పురుష సమాసం.

ప్రథమా తత్పురుష సమాసం:- ప్రథమా విభక్తి చివర కలిగిన పూర్వపదం, ఉత్తర పద అర్థ ప్రాధాన్యత కలిగినది

AP SCERT

ప్రథమా తత్పురుష సమాసం. ప్రథమావిభక్తితో కూడిన పూర్వపదాలు కలవి (డు, ము, వు, లు)

ఉదా॥ మధ్యాహ్నము : అహ్నము మధ్యభాగము

నడిరేయి : రేయి నడిమి భాగము

ద్వితీయాతత్పురుష సమాసం:- ద్వితీయా విభక్తితో కూడిన పూర్వపదాలు కలవి (నిన్, నున్, లన్, కూర్చి, గురించి)

ఉదా॥ కృష్ణాశ్రితుడు : కృష్ణుని ఆశ్రయించినవాడు

నెలతాల్పు : నెలను తాల్చిన వాడు

తృతీయాతత్పురుష సమాసం:- తృతీయా విభక్తితో కూడిన పూర్వపదాలు కలవి (చేతన్, చేన్, తోడన్, తోన్)

ఉదా॥ వాక్కులహము : వాక్కు చేత కలహము

విద్యాహీనుడు : విద్యచేత హీనుడు

చతుర్థీ తత్పురుష సమాసం:- చతుర్థీవిభక్తితో కూడిన పూర్వపదాలు కలవి (కొరకున్, కై)

ఉదా॥ బతుకు తెరువు : బతుకు కొరకు తెరువు

పొట్టకూడు : పొట్ట కొరకు కూడు

పంచమీ తత్పురుష సమాసం:- పంచమీ విభక్తితో కూడిన పూర్వపదాలు కలవి (వలనన్, కంటె, పట్టి)

ఉదా॥ దొంగభయం : దొంగ వలన భయం

పాప విముక్తుడు : పాపము వలన విముక్తుడు

షష్ఠీ తత్పురుష సమాసం:- షష్ఠీ విభక్తితో కూడిన పూర్వపదాలు కలవి (కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్)

ఉదా॥ రాజపుత్రుడు : రాజు యొక్క పుత్రుడు

యజ్ఞ ఫలం : యజ్ఞము యొక్క ఫలం

సప్తమీ తత్పురుష సమాసం:- సప్తమీ విభక్తితో కూడిన పూర్వపదాలు కలవి. (అందున్, నన్)

ఉదా॥ నీతి పారగుడు : నీతి యందు పారగుడు

మాటనేర్పరి : మాట యందు నేర్పరి

అ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసాలను గుర్తించండి.

1. మేలు వస్త్రాలు : మేలైన వస్త్రాలు : విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
   వస్త్రాలు (నామవాచకం) మేలు (విశేషణం)
2. ముతక పంచెలు : _____ _____

AP SCERT

3. కొత్త దేవుళ్ళు : _____ _____

4. వక్రధ్వనులు : _____ _____

5. నాలుగు పంక్తులు : _____ _____

అలంకారాలు

అ) రూపకాలంకారం

"మా అమ్మచేతి వంట అమృతం".

పై వాక్యంలో అమ్మచేతి వంట ఉపమేయం, అమృతం – ఉపమానం, అమ్మచేతి వంటకు – అమృతానికి భేదం లేదని (అభేదం) చెప్పడం కనిపిస్తుంది.

నిర్వచనం: ఉపమేయ ఉపమానములకు భేదం లేదని చెప్పడాన్ని రూపకాలంకారం అని అంటారు.

ఉదా: ఈ మహారాజు సాక్షాత్తూ ఈశ్వరుడే!

సమన్వయం: ఇక్కడ మహారాజు ఉపమేయం. ఈశ్వరుడు ఉపమానం 'సాక్షాత్తు' అనే పదం రాజుకు, ఈశ్వరునికి భేదం లేదు అని వర్ణించబడింది. కాబట్టి ఇది రూపకాలంకారం.

"నా కడుపులో అవమానాల చురకత్తులు గుచ్చుకుంటాయి".

అవమానాల చురకత్తులు – అవమానాలనెడి చురకత్తులు

అవమానం – ఉపమేయం, చురకత్తులు – ఉపమానం

అవమానాలు – చురకత్తులకు – భేదం లేదని వర్ణించబడింది. కాబట్టి ఇది రూపకాలంకారం.

ఛందస్సు

* కింది పద్య పాదానికి గురు – లఘువులను పరిశీలించండి.

మ స జ స త త గ

U U U I I U I U I I U U U I U U I U

ఉదా : తారాస స్యముపం డినన్‌గ గనకే దారంబు నంజంద్ర కా

శార్దూల పద్య లక్షణాలు

1. ఇది వృత్త జాతికి చెందినపద్యం
2. ఇందులో నాలుగు పాదాలుంటాయి
3. ప్రతి పాదంలో 19 అక్షరాలు ఉంటాయి
4. ప్రతి పాదంలో మ,స,జ,స,త,త,గ అనే గణాలు వరుసగా వస్తాయి.
5. ప్రతి పాదంలో 13వ అక్షరం యతి స్థానం
6. ప్రాస నియమం ఉంది.

కింది పద్య పాదాలకు గురు – లఘువులను గుర్తించండి. శార్దూల పద్య లక్షణాలను సమన్వయం చేయండి.

1. మాయామేయ జగంబె నిత్యమని సంభావించి మోహంబునన్
2. బావా యెప్పుడు వచ్చితీవు? సుఖులే భ్రాతల్సుతుల్ చుట్టముల్
3. ప్రాకారంబు గదా ప్రహారముల సుత్పాటించి యంత్రంబులున్
4. కంటిన్ జానకి బూర్ణచంద్ర వదనన్ గల్యాణి నాలంకలో

AP SCERT

ప్రాజెక్టు పని

క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి. కొలకలూరి ఇనాక్ గారు రచించిన 'కట్టడి' కథ చదవండి. దానిపై సమీక్షరాసి మీ తరగతిలో ప్రదర్శించండి.

ఈయన నవభారత నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్. మీ పాఠశాల గ్రంథాలయంలో పరిశీలించి ఆయన జీవిత విశేషాలను, మనదేశానికి చేసిన సేవల గురించి రాయండి.



AP SCERT

పద్య మధురిమ

ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుఁగాని దుఃఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని ముప్పదిమూఁడుకోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తులాఱునే

భావము: ఏటేటా బొమ్మల పెళ్ళిళ్ళు చేయడానికి వందలు వేలరూపాయిలు ఖర్చు చేస్తున్నారు. కానీ పేదవాళ్ళ ఖాళీపాత్రల్లో ఒక్క మెతుకు కూడా విదల్చడానికి మనసొప్పదు. కోట్లాది దేవతలకు నిలయమైన ఈ దేశంలో అన్నార్తుల ఆకలి తీరుతుందా?

గబ్బిలం – గుఱ్ఱం జాషువ

6 ఆశావాది


B1K6V7

మూల గ్రంథం : ప్రకాశ ప్రదీపనం

రచయిత : ఆశావాది ప్రకాశరావు

చదవండి - చర్చించండి

నాక్కొంచెం నమ్మకమివ్వు!



నాక్కొంచెం నమ్మకమివ్వు
కొండలు పిండి కొట్టేస్తాను
చితికిన టొమేటోలాంటి సూర్యుణ్ణి
ఆరిన అప్పడంలాంటి చంద్రుణ్ణి
ఆకాశపు ఎంగిలి పళ్ళెంలోంచి నెట్టేస్తాను!
నాదగు బాహుబంధనంలో
ఈ విశాల బ్రహ్మాండాన్ని చాపలా చుట్టేస్తాను!
నిస్సహాయ మానవేయుని నొసటివ్రాలు
ఒక్క కలంపోటుతోటి కొట్టేస్తాను.
జీవిత సభా భవన ద్వారంనుంచి
అన్యాయాన్ని, అక్రమాన్ని మెడబట్టి గెంటేస్తాను.
ఇంకా ఎన్నో ఎన్నెన్నో చేసేస్తాను.
కాని ఒక్కటి,
నాక్కొంచెం నమ్మకమివ్వు.
కాలునిమీద కలబడతాను
పరమశివుని శూలాగ్రాన తలక్రిందుగ నిలబడతాను
ఇంటింటా గగనకుసుమాలు మూడుపూవులుగా
నందన నికుంజాల అమృతఫలాలు ఆరుకాయలుగా
పూయిస్తాను, కాయిస్తాను,
కొయ్యతుపాకి దొరనౌతాను,
బావులు పూడ్పిస్తాను, చెరువులు త్రవ్విస్తాను
ఆకాశపు పందిరిక్రింద
నయాగరా నిర్జరాల చలివేంద్రాలు స్థాపిస్తాను.
ప్రపంచమనే మహాసత్రం నిండిపోతే
మరో సత్రం కట్టిస్తాను.
ఆకాశపు ఉదారంగు తానును చించి

AP SCERT

చొక్కాల్లేని వారందరికి కుట్టిస్తాను.
ఒకటేమిటి, ఏదైనా చేసేస్తాను
కాని ఒకటి
నాక్కొంచెం నమ్మకమివ్వు.
నమ్మకమివ్వు..!
నమ్మకమివ్వు..!!



– ఆలూరి బైరాగి

ఆలోచనాత్మక ప్రశ్నలు:

1. నీవేదైనా సాధించగలవన్న నమ్మకం నీకు కల్పిస్తే నువ్వేం సాధిస్తావు?

2. మీ తల్లిదండ్రులకు నీ పట్ల నమ్మకం కల్పించిన సందర్భమేది?

ఉద్దేశం

విద్యార్జనకు పుట్టుపూర్వోత్తరాలు, ఆర్థిక అసమానతలు అవరోధాలు కావని నిరూపించిన ధీశాలి ప్రకాశరావు. పట్టుదల, కృషి ఉంటే అక్షర సింహాసనమెక్కి సాహితీ సామ్రాజ్యాన్ని ఏలవచ్చునని నిరూపించి చూపిన కార్యదక్షుడు. పద్య రచనలో పట్టుసాధించి కొందరికే పరిమితమైన అష్టావధాన ప్రక్రియలో రాణించడం ద్వారా అత్యున్నత 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకుని నేటి తరానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన ఆ మహనీయుని సాహితీ జీవన ప్రస్థానాన్ని తెల్పడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

ప్రక్రియ – ముఖాముఖి

ఉన్నత శిఖరాలు అధిరోహించిన మహనీయుల జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలుంటాయి. మరెన్నో వెలుగునీడలుంటాయి. వాటి గురించి తెలుసుకోవడం ద్వారా మన జీవితాన్ని సుగమం చేసుకోవడానికి వీలవుతుంది. ప్రశ్నలు అడగడం ద్వారా సమాచారాన్ని సేకరించటమే 'ముఖాముఖి'. సేకరించిన సమాచారాన్ని ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా పాఠకులకు అందించడం జరుగుతుంది. ముఖాముఖి ద్వారా వ్యక్తుల వ్యక్తిత్వాన్ని, వారి అనుభవాలను, జీవిత విశేషాలను స్వయంగా వారి ద్వారానే తెలుసుకునే వీలుంటుంది.

ప్రవేశిక

సాహితీ వ్యవసాయంలో పద్య సేద్యం చేసిన ఓ 'భాషా పరిమళం', సుందర శబ్దాలతో అందమైన పద్యాలు అల్లిన ఓ 'అష్టావధాన రూపం' ఆశావాది ప్రకాశరావు. "నీదే కులం?" అని అడిగినవారికి నాది 'కవితా కులం' అని చాటిన కవితావాది 'ఆశావాది'. "అవధానం కొందరి సొత్తు ..అది నీవెలా చేస్తావు" అన్న అవహేళనలకు తన సాహిత్య పటిమతో సమాధానమిచ్చిన సౌజన్యమూర్తి ఆయన. తెలుగు భాషకే సొంతమైన అవధాన ప్రక్రియలో వారు అగ్రశ్రేణిలో నిలిచారు. తిరుపతి వేంకట కవులను ప్రేరణగా తీసుకుని, సి.వి సుబ్బన్న శతావధానిని గురువుగా నిలుపుకుని సాగించిన వారి 'సాహితీ ప్రస్థానం' విశిష్ట పురస్కారాలకు వేదికైంది. అలనాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్‌చే 'బాలకవి'గా పిలిపించుకొని, మొన్నటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న భాషాజీవి. 'అష్టావధాని'గా అత్యున్నత శిఖరం అధిరోహించిన ఆశావాది ప్రకాశరావు జీవిత విశేషాలను తెలుసుకుందాం. ప్రస్తుత పాఠ్యభాగం ఆశావాది ప్రకాశరావు రచించిన *'ప్రకాశప్రదీపనం'* లోనిది.

AP SCERT

రచయిత పరిచయం :



జ :02-08-1944
మ :17-02-2022

"పద్యం కమ్మగా పాడువాడు, పద్యవిద్యను కాపాడువాడు, పద్యద్వేషణలతో రాపాడువాడు" అంటూ డా.సినారెచే కీర్తించబడిన ఆశావాది ప్రకాశరావు అనంతపురం జిల్లా, శింగనమల మండలం, కొరవిపల్లె గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు. కుళ్లాయమ్మ, పక్కీరప్పలు వీరి తల్లిదండ్రులు. తండ్రి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కావడంతో ప్రాథమిక విద్యకు తండ్రే గురువు. శతావధాని సి.వి. సుబ్బన్నను వీరు గురువుగా భావిస్తారు. వీరు పంతొమ్మిదవ ఏట ఆరంభించిన అవధానం 26 వసంతాలు నిరాఘాటంగా కొనసాగించారు. సుమారు 171 అవధానాలు చేశారు.

సాహిత్యమే ప్రపంచంగా సాగిన 'ఆశావాది' కవి, అవధాని, విమర్శకుడు, పరిశోధకుడు, అనువాదకుడుగా గుర్తింపు పొందారు. భారత ప్రభుత్వం 2021 'పద్మశ్రీ' పురస్కారంతో వీరిని సత్కరించింది. పుష్పాంజలి, అంతరంగ తరంగాలు, లోకలీలాసూక్తము, అవధాన చాటువులు, అవధాన దీపిక, అవధాన కౌముది, అవధాన వసంతము, అవధాన కళాతోరణము, ప్రత్యూష పవనాలు మొదలైనవి వీరి ఇతర రచనలు.

ఆశావాది

అవధానాచార్యులకు అక్షర ప్రణామాలు.

అవధానమే 'ఆశ'గా.. పద్యమే శ్వాసగా సాహితీ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న 'అవధాన పద్మం' గురించి తెలుగు పాఠకులకు తెలియజెప్పేందుకే మీతో ఈ 'ముఖాముఖి'.

ముందుగా ఈ సరస్వతీ పుత్రునికి జన్మనిచ్చిన పుణ్యమూర్తుల గురించి చెప్పండి?

మాది అనంతపురం జిల్లా, శింగనమల మండలం, పెరవళి గ్రామం. మా అమ్మ కుళ్లాయమ్మ, నాన్న పక్కీరప్ప. వారు ఎలిమెంటరీ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. మేము మొత్తం పదిమంది సంతానం. ఏడుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు.

మీ పూర్వీకుల వృత్తి విశేషాలతో మీరు చెప్పిన 'ఆశు పద్యం' మా కోసం వినిపిస్తారా?

మాది 'ఆసాది' వృత్తి. మా పూర్వులు గ్రామదేవతా పూజారులు. ఆయా దేవతలపై జాతర్లలో ఆశువుగా పాటలు కట్టేవారు. ఆ పాట సంప్రదాయమే నా దగ్గర ఆశుపద్యమైంది. ఆ ఆశువు అవధానానికి దారి తీసింది. ఈ విషయాన్నే ఒక అవధాన సభలో ఇలా చెప్పాను.

గ్రామాలన్ గల దేవతా కథనముల్ గానంబునన్ దీర్చుచున్
రోమాంచంబును గూర్చు కాన్కలు గొనే ప్రోద్యత్కళాచారమే
ధీమంతుల్ కొనియాడ పద్యమయి సందీపించె నా వాక్కునన్
శ్రీమద్దివ్య వధాన ముఖ్యగురువౌ శ్రీ సీ.వి. సుబ్బన్న చేన్ (అవధాన కళాతోరణం)

మీ 'విద్యా వ్యాసంగం' మీ సాహితీ ఎదుగుదలకు ఎలాంటి బీజం వేసింది?

నా ప్రాథమిక విద్య మా నాన్న దగ్గరే. ఆయన ఉపాధ్యాయుడుగా నాతో కృష్ణ, భాస్కర, సుమతి, వేమన శతకాల పద్యాలు ఓ వందదాకా ఐదవ తరగతి ముగిసేలోపే కంఠస్థం చేయించాడు. పెద్దబాలశిక్ష క్షుణ్ణంగా చదివించాడు. నాటి ఉన్నత పాఠశాలల్లో అక్షరజీవులుగా మమ్మల్ని మలచటానికి ఎన్నెన్నో పోటీలు నిర్వహించేవారు. పద్యధారణలో, పద్యపఠనంలో పూర్వకవుల గ్రంథాల్లో ఏ పుట తెరిచి చూపిస్తే అక్కడి పద్య గద్యాలను చదువవలసి వచ్చేది.

13వ ఏట నాలో రచయిత మేల్కొన్నాడు. నేను చదివే పాఠశాల వసతి గృహంలో, వ్యాసరచనల పోటీల్లో బహుమతులు నావే. 10వ తరగతిలో 'అస్పృశ్యతా నివారణ'ను గూర్చి ఒక వ్యాసం వ్రాసి మా పాఠశాల వార్షిక

AP SCERT

సంచికకు ఇచ్చాను. దాని సంపాదకులు "స్వాతంత్ర్యం వచ్చి పదేళ్లయ్యింది. ఇంకా ఎక్కడుంది అస్పృశ్యత? బుద్ధి లేకుంటే సరి" అంటూ కాగితాలను విసిరికొట్టారు. అది నాలో పట్టుదలను పెంచింది. సహనంతో కార్యం సాధించుకోవలసిన దీక్షను గుర్తుచేసింది. నా 15వ యేట అప్పటికి నాకు తెలిసినప్పటి ఛందోవిజ్ఞానంతో పద్యాలు వ్రాయాలన్న ఆలోచన కలిగింది. ఒకసారి మా నాన్న వ్రాసి ఎవరికీ చెప్పకుండా తన జేబులోనే భద్రపరచుకొన్న కొన్ని కంద పద్యాలను ఆకస్మికంగా చూచాను. ఆ తండ్రి కొడుకుగా పద్యరచనలో పేరు నిలుపుకోవాలన్న ఆశ మొలకెత్తింది.



కళాశాలలో సారస్వత సంఘ ఆధ్వర్యంలో తరచు ప్రసిద్ధ కవి పండితుల ప్రసంగాలు ఉండేవి. ఊళ్ళలో రాష్ట్రస్థాయి సంచార నాటక సమాజాలవాళ్లు మూడు నెలలకు ఒకమారైనా తప్పక పద్యనాటకాలు ప్రదర్శించే వాళ్లు. ఆసక్తిగా వీటికి హాజరయ్యేవాడిని. అంతే కాకుండా పాఠశాలలో అప్పటి బోధనా పద్ధతులు, పరీక్షా విధానాలు సృజనాత్మకతను పెంచేవిగా ఉండేవి. ఇవన్నీ పద్యంపై ప్రీతి పెంచుకోవడానికి, అవగాహనలో ఒదిగివచ్చిన వాటికి చక్కని వ్యాసరూపం ఇవ్వటానికి, ధైర్యంగా వేదికలపై ప్రసంగించటానికి తగిన బీజాలు వేశాయి.

మీ రచనా నైపుణ్యం పెంచుకునేందుకు మీరెలాంటి కృషి చేశారు?

పౌర గ్రంథాలయానికి వెళ్లి ఆసక్తిగల గ్రంథాన్ని తీసుకొనే వాడిని. దానిని ఆద్యంతం చదవకుండా పీఠికను మాత్రం తప్పనిసరిగా చదివేవాడిని. నాకంటే ముందే దాన్ని చూచిన పాఠకులు ఆ పుటల్లో ఎక్కడైనా క్రీగీటులు పెట్టారా?, మరేవైనా గుర్తులు ఉంచారా? స్పందనలు వ్రాశారా? అని చూచి, వాటిపై దృష్టి నిలిపి దానికి కారణాలు అన్వేషించేవాడిని.

దీనివల్ల తక్కువకాలంలో ఎక్కువ విషయసేకరణ జరిగేది. విజ్ఞానం పెరిగేది. వ్రాతకు బలం చేకూర్చే అనేకాంశాలు తెలిసివచ్చేవి. ఈ విధంగా కూర్చుకొన్న రచనా సామర్థ్యం తరచూ చుట్టూ జరిగే అసంబద్ధతలపై కరపత్రాలు తయారుచేసి పంచేదాకా వెళ్లింది. నా ప్రయత్నాన్ని ప్రత్యర్థులు వమ్ముచేస్తూ బెదిరించటంతో ఆ విధానం మానుకున్నాను.

మా కళాశాలలో మత సామరస్యంపై, పోతన భాగవతంపై విద్యార్థులకు ఏటేటా నిర్వహిస్తూ ఉండిన ధర్మనిధి పురస్కారాల వ్యాసరచన పోటీలలో గెలుపొందాను. కళాశాల వార్షికసంచికకు 'అష్టావధానం' పై వ్యాసం ఇచ్చాను. విద్యార్థుల మధ్య, ఉపాధ్యాయుల మధ్య, మంచి గుర్తింపు వచ్చింది. నా దృష్టిలో గ్రంథాలయం ఒక పవిత్ర దేవాలయం. ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వెళ్ళి జ్ఞానార్జన చేసే అలవాటు పొందడం ఆవశ్యం అని నాకు అనిపిస్తుంది.

మీ పరిశోధనా ప్రస్థానం ఎలా సాగింది? అందులో ఏమైనా పురస్కారాలు లభించాయా?

తాళ్లపాక అన్నమాచార్యుల వారి పౌత్రుడు తాళ్ళపాక అన్నయ్య రచించిన 'చెల్లపిళ్లరాయ చరిత్రము' (బీబీ నాంచారు కళ్యాణ గాథ) అముద్రిత యక్షగాన తాళపత్రప్రతి సేకరించి పరిశీలించి, క్రిమిదష్ట భాగాలను పూరించి, కవి కాలాదులు నిర్ణయిస్తూ విపులమైన పీఠికతో ప్రచురించాను. శ్రీ రాప్తాటి వారి నిరోష్ఠ్య కృష్ణ శతకానికి లఘుటీక

APSCERT

వ్రాసే అవకాశం లభించింది. పిహెచ్.డి. పట్టాకై శ్రీ కృష్ణదేవరాయ విశ్వ విద్యాలయంలో పేరు నమోదు చేసుకొన్నాను, కాని కొన్ని అవాచ్య సంఘటనల మధ్య విరమించాను. కొన్నేళ్ల విరామంతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం లోనూ చేరి సరిపడని సంగతులు తలెత్తటంతో దాని ఆశ వదులుకొన్నాను. 'అంతకంటె మించిన డిగ్రీ రాకుండా పోతుందా' అని యథాలాపంగా పలికిన నా మాటను దైవం నెగ్గించాడు. నా 56వ యేట పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ (డి.లిట్) లభించింది.



ఈ పరిశోధనా ప్రస్థానంలో సోదరతుల్యుడు శ్రీ గంగవరప్పగారి చెన్నయ్యతో కలిసి ఒంగోలు ఎఱ్ఱన పీఠం ప్రకటనకు స్పందించి, 'ప్రహ్లాద చరిత్ర –ఎఱ్ఱన, పోతన తులనాత్మక పరిశీలన' రాసాను. దానికి ఉత్తమ సిద్ధాంత గ్రంథ రచనా పురస్కారం వచ్చింది. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులకు నేను సమర్పించిన కొన్ని పరిశోధనా పత్రాలు 'సువర్ణ గోపురం'గా పుస్తకాకృతి పొందాయి. 2021లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో నాలోని అవధాన సరస్వతిని సత్కరించింది.

సాహితీ మేరువులతో మీరు నెరపిన సాంగత్యపు సంగతులు చెప్పండి.

ఒకవైపు సినిమా బాణిలో పాటలు వ్రాస్తూ, మరోవైపు చిటిపొటి పద్యాలు అల్లేవాడిని. మరికొన్ని తెలిసిన వాళ్ళ పెళ్లిళ్లకు, పండుగలకు శుభాకాంక్ష రూపంగా అందించేవాడిని. ఇంకా కొన్ని పెద్దలను గౌరవించే సందర్భాలకు స్తుతి రూపంగా సమర్పించేవాడిని.

తెలుగు పండితునిగా విద్యార్థుల కోర్కె తీర్చడానికై తరచు చెప్పుతూ వచ్చిన ఆటవెలది పద్యాలే వరదరాజ శతకం. ఇందులో చివర దశావతార స్తుతి ఉంది. ఈ శతకాన్ని తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు ఇలా దీవించారు.

చదివినాడ వరద శతకమ్ము సకలమ్ము
కరగినాడ నీదు కైత పసకు
కలదు నీకు ఆంధ్ర కవికోటిలో పీట
వలదు జంకు వినయవత్ ప్రకాశ

దివాకర్ల వేంకటావధాని, చర్ల గణపతిశాస్త్రి వగైరాల అభినందనలు కూడా అందుకొన్నాను. తర్వాతి కాలంలో ఆ శతకమే మకుట విరహితంగా 'లోకలీలా సూక్తం'గా రూపుదిద్దుకొనింది. నా అవధాన గురుదేవులు డా. సి.వి. సుబ్బన్న శతావధాని గారి వెంట అవధాన సభలకు వెళ్ళుతూ వారిపై స్తుత్యాత్మకంగా చెప్పిన ఆశుపద్యాలే 'పుష్పాంజలి' పేర వెలుగు చూచింది. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, దాశరథి కృష్ణమాచార్యులు, సి. నారాయణరెడ్డి గారలు నాకు శుభాశంస అందించిన సాహితీ మేరువులు.

AP SCERT

అనువాదం దిశగా మీ ఆలోచనలు వెళ్ళడానికి గల మూలాలను వివరిస్తారా?

తిరుమల తిరుపతి దేవస్థానంవారి పోతన భాగవతం ప్రాజెక్టునుండి లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసికోదలచి తృతీయస్కంధానికి సరళ గద్యానువాదం చేశాను. దీని ప్రధాన సంపాదకులు 'కరుణశ్రీ' డాక్టర్ జంధ్యాల పాపయ్య శాస్త్రి ఈ గ్రంథానికి రాసిన మున్నుడిలో "ఆశావాది ప్రకాశరావు అష్టావధాన కళలో ఆరితేరినవాడు. వినయభూషణుడు, మధుర భాషణుడు. వీరి అనువాదం సరళంగా సాగింది" అన్నారు. ఆంగ్లంలో ఆలివర్ గోల్డ్‌స్మిత్ రచించిన 'సిటీ నైట్ పీస్'ను 'చీకటి కోణం' శీర్షికతో వచన కవితగా అనువదించాను. పుట్టపర్తి సాయిబాబాగారి సూక్తులకు 'విభూతి గీత' పేర పద్యరూపం ఇచ్చాను. ఇలా అనువాద పరంపర కొనసాగింది.

మీ జీవితంలో 'అష్టావధానానికి' అంకురార్పణ ఎక్కడ జరిగింది?

నేను మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతూ ఉండగానే శ్రీ సి.వి. సుబ్బన్న శతావధాని గారి అష్టావధానం చూచాను. పేదరికం కారణంగా ఆ మార్గంలో పరిశ్రమిస్తే కీర్తితో పాటు నాలుగు డబ్బులూ వస్తాయనే ప్రలోభం, పెద్ద కుటుంబాన్ని బరువుగా ఈడ్చుకొస్తున్న మా నాన్నకు సహాయపడినట్లు అవుతుందన్న ఆశ, తలెత్తింది. అప్పటికే పద్యరచనలో కొంతమేర పరిశ్రమించిన నేను, కొన్ని సందర్భాలలో నాకు నేనుగా, మరికొన్ని వేళల్లో స్నేహితుల ద్వారా, రకరకాల నిబంధనల్ని విధించి ప్రశ్నలడగండని వాటికి లొంగి పద్యం అల్లటమేకాక ధారణపట్టి అప్పజెప్పడం అలవాటు చేసుకొన్నాను.

రిటైర్డు కలెక్టర్ శ్రీ బి.జూగప్పగారి చొరవతో అప్పటి భారత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారికి స్వాగత పద్యాలు సమర్పించి 'బాలకవి'గా శ్రీశైలంలో అమృతాశీర్వాదాలు అందుకొన్నాను. తెలుగుశాఖ పక్షాన ఏర్పాటైన శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వరరావుగారి అష్టావధానంలో పృచ్ఛకస్థానం పొందాను. కళాశాల ఉపన్యాసకులు నిర్వహించిన భువన విజయంలో నేపథ్య పద్యగాయకుడినీ అయ్యాను.

మీ ఇంటి పేరు 'ఆసాది' కదా! 'ఆశావాది' గా ఎలా మారింది?

అదొక అద్భుత ఘట్టం. చెబుతాను. ఎండాకాలం సెలవుల్లో ఏలూరులోని ఫ్లడ్స్ కంట్రోల్ సర్కిల్‌లో ప్రభుత్వ ఉద్యోగం వస్తే అందులో గుమాస్తాగా చేరాను. అక్కడ శ్రీ బస్వా సింహాద్రి అప్పారావుగారి సాహచర్యంలో మూడు నెలలపాటు చేమకూర వేంకటకవి విజయ విలాసం అధ్యయనం చేశాను. అది నా పద్యాలకు మరింత వెలుగునిచ్చే అచ్చ తెనుగు ముచ్చట్లను పదబంధాలను సమకూర్చింది.

ఇవన్నీ ఒక రకమైన బలాన్ని తృప్తిని కలిగించడంతో ఆ యేడే గాంధీజయంతి సందర్భంగా మొట్టమొదటి అష్టావధానం జయప్రదంగా ముగించాను. ఈ వార్త మా తెలుగుశాఖ 'హెడ్'డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులవారి చెవిలో పడింది. వారు నన్ను 'డిపార్ట్‌మెంట్'కు పిలిపించి మా 'మాస్టర్ల' సన్నిధిలో సమస్యాపూరణ పరీక్ష నిర్వహించారు. వారిచ్చిన ' ప్రశ్నకు ప్రశ్నయె జవాబు భామిని పలికెన్' అనే సమస్యకు, నా పూరణంగా

"ప్రశ్నలపై వడి ప్రశ్నలు
ప్రశ్నించెడి తనదు భర్త భావంబేమో
ప్రశ్నించుచు తన యెదలో
ప్రశ్నకు ప్రశ్నయె జవాబు భామిని పలికెన్" అని పూరించాను.


వారు సంతోషించి "నీకు ధైర్యం ఉంది. ఎక్కడైనా నెట్టుకొస్తావు. నేటి నుంచి నీవు ఆసాదివి కావు. 'ఆశావాది'వి" అని ఆశీర్వదించారు. అప్పటినుండి నా ఇంటిపేరు ఆశావాది అయింది.

నిషిద్ధాక్షరిలోని మెలకువలను నాకు నేర్పవలసిందిగా శ్రీ గాడేపల్లి వారిని కుదిర్చారు నండూరివారు. వారి అంతేవాసిత్వం ఒక్క సంవత్సరం కూడా గడవకుండానే ఆ ఇరువురు బదిలీ అయ్యారు. నేను నా వికాసానికి కొండంత అండను కోల్పోయాను.

APSCERT

మరి మీ అవధాన సాధనను ఎలా కొనసాగించారు?

మూడవయేడు చదువు రకరకాల కష్టాలమధ్య ముగించుకొని శిక్షణలేని తెలుగుపండిత వృత్తిలో చేరి శ్రీ.సి.వి. సుబ్బన్న శతావధానిగారి గురుత్వం సంపాదించాను. వారి అవధానసభలకు వీలు కలుగజేసికొని హాజరయ్యేవాడిని. వారి వెంట ప్రయాణిస్తూ కొన్ని, ఉత్తరాల ద్వారా మరెన్నో సందేహాలు తీర్చుకొనేవాడిని. వారి ద్వారా నా అవధాన సువిధానానికి బలమైన పునాదులు పడ్డాయి. మా గురుదేవులే కాక నాకు అవధాన రంగంలో బాగా ఇష్టమైనవారు, పూజనీయులైనవారు తిరుపతి వేంకటకవులు, గాడేపల్లి కుక్కుటేశ్వరరావు.



నా 19వ యేట ప్రారంభించిన అవధానం 26 వసంతాల పాటు నిరాఘాటంగా విస్తరిల్లింది. రాష్ట్రమంతటా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలోనూ, న్యూఢిల్లీలోనూ దాదాపు 171 అవధానాలు చేశాను. అవధాన పద్యాలను జారిపోనీకుండా భద్రపరిచి అయిదు సంపుటాలుగా ఆంధ్రసరస్వతికి కానుక చేశాను. అవి అవధాన చాటువులు, అవధాన దీపిక, అవధాన కౌముది, అవధాన వసంతం, అవధాన కళాతోరణం. అప్రస్తుత ప్రసంగంలోని కొన్ని ముఖ్య ప్రశ్నలకు సమాధానాలు 'అవధాన వినోదం–సరస ప్రసంగం' అనే పేర వెలువడింది.

పెరుగుతున్న వయస్సుతో పాటు, తరుగుతున్న ధారణ, నిరంతర ప్రయాణాలు అవధానాలకు మంగళం పాడేటట్లు చేశాయి. 1999 ఉగాది రోజున నారాయణఖేడ్‌లో చేసిందే నా చివరి అవధానం.

అవధానిగా ఎదిగే క్రమంలో మీరు ఎదుర్కొన్న ఒడిదుడుకులు ఏమైనా ఉన్నాయా?

అవధానికి అనుకూలమైన ఆతిథ్యాదుల్ని ఏర్పాటు చేయడంలో సన్మానాదుల్లో వివక్ష చూపడం నాకు బాగా

ఎరుక. 'అయినవారికి ఆకులు కానివారికి కంచాలు' అన్నది నేను చవిచూచిన చేదు అనుభవం. కొందరేమో ఈ వర్గం వాళ్ళను ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వాధికారుల దగ్గరో, ప్రజాప్రతినిధుల దగ్గరో యోగ్యతా పత్రం పొందడానికి వీలుగా అవధానం ఏర్పాటు చేస్తారే తప్ప అవధాని గౌరవాన్ని కాపాడే పద్ధతిలో శ్రద్ధ చూపరు. నా దగ్గరకు వచ్చేటప్పటికి శుష్కప్రియాలు, శూన్యహస్తాలు అన్న పద్ధతి పాటించారు. అవధానంలో గంట కొట్టే పృచ్ఛకునితో సమానంగా మాత్రమే అవధానినై కూడా సన్మానమందుకున్న సన్నివేశాలున్నాయి. పూలహారం, ఫలహారంతో ముగిసిన సభలూ ఉన్నాయి. సాటి అవధానులు ఈ ప్రక్రియ కారణంగా తమ ఆర్థిక సుస్థితి పెంచుకోగలిగితే, కేవలం సాహితీ లోకంలో పేరు సాధించడంతోనే నా స్థితి ఆగిపోయింది.

అవధానంలో అన్యాపదేశంగా దెప్పి పొడిచే పద్ధతిలో కొందరు ప్రశ్నలిచ్చిన దాఖలాలున్నాయి. వాటిని చాలా సున్నితంగా త్రిప్పి కొట్టవలసి వచ్చేది. మరికొన్ని చోట్ల నేను శ్లేషనాశ్రయించవలసి వచ్చేది. వాటిని ప్రక్కదారి మళ్ళించే ధోరణిలో సమాధాన ప్రసంగం కొనసాగించేవాడిని. ఏమైనా నా జాతిలో ఒక అవధాని ఉన్నాడన్న కీర్తిని దక్కించడం కోసం ఎన్నో చేదుల్ని దిగమ్రింగుకొని గంభీరంగా సభ ముగించేవాణ్ణి.

అంతరంగాన్ని తళుక్కుమనిపించే వీటి మధ్య మనసు విప్పి మాటగలిపి హృదయస్ఫూర్తిగా ఆనందిస్తూ, నాలో చెరగని ముద్ర వేసిన సంస్కారులు లేకపోలేదు. అట్టివారు నాతో సత్సంబంధాలు నెలకొల్పుతూ, నా కృతులు వెలికిదేవడానికి శతథా ప్రయత్నిస్తున్నారు. ఏది ఏమైనప్పటికి అవధానం కొందరి సొత్తు అనే అహంభావాన్ని తుత్తునియలు చేయగలిగాను.

'వచన కవిత'ల పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

నేను ప్రధానంగా పద్యజీవినే. అయినా వచనకవితను ఏనాడు నిరసించలేదు. నినాదప్రాయంగా కాకుండ హృదయావర్జకంగా వెల్వడే ఏ చిన్నమాటనైనా ఆదరించేవాడిని. అడపాదడపా నేనూ రసాత్మక వాక్యాలను వ్రాయడానికి ఆసక్తి చూపేవాడిని. పి.జి. కళాశాల వార్షిక సంచికలో 'నీవు–నేను' అనే నా మొదటి వచన కవిత అచ్చయింది. ఒక దశాబ్ది పిమ్మట అదే కవిత డా. కమల్‌నాథ్‌పంకజ్‌గారిచే హిందీభాషలోనికి అనూదితమై మంచి గుర్తింపు సంపాదించుకుంది. వేదికపై ఆశువుగా చెప్పిన వచనకవిత 'రొయ్య మీసాలు'. శ్రోతల సమక్షంలో నిర్వహించే కవి సమ్మేళనాలకు ఒకమారు పద్యం, మరొకమారు వచనం కాన్క చేసేవాడిని. ఇలా తయారైన వచనకవితల సంపుటియే 'అంతరంగ తరంగాలు'. నేను సాహిత్యానికి చేసిన దానికంటే సాహితీలోకం నాకు చేసిందే ఎక్కువ. ఆయా సందర్భాలు ఎటు ఈడిస్తే అటుగా వెళుతూ అక్కడ నన్ను నేను ప్రతిష్ఠించుకునే ప్రయత్నం చేసాను. భాషా సాహిత్యాలకు దూరంగా బ్రతకలేని బలహీనత నా నరనరాల్లో జీర్ణించుకుపోయింది.


నేటి రచయితలకు మీరిచ్చే సందేశం ఏమిటి?

నేడు సమాజంలో రచయితలు ఎందరో ఉన్నారు. సామాజిక స్పృహ పేరిట తామరతంపరగా రచనలు చేస్తున్నారు. తాము ఏ సందేశాన్ని ఎదుటివారికి ఇస్తున్నారో అందులో చాలామంది జీవించడం లేదు. కవి మాటకు, చేతకు పొంతన లేకపోతే ఎలా? మహిళావాదం, లంచగొండితనం, కులమత సామరస్యం, తల్లిదండ్రుల సేవ, సాటి రచయితల పట్ల సదవగాహన వగైరాలు, వారి నిజ జీవితాల్లో అపహాస్యానికి గురి అవుతున్నాయి. వాగ్రూపంలో అందంగా ఆవిష్కరించుకోవటం దగ్గర ఆగిపోవటం కాకుండా ఆచరణలో నిలుపవలసినదిగా నేను రచయితలను అభ్యర్థిస్తున్నాను.

AP SCERT

ఇవి చేయండి

అవగాహన - ప్రతిస్పందన



అ) కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. రాయండి.

1. ఆశావాది ప్రకాశరావు తల్లిదండ్రుల గురించి చెప్పండి?
2. ఆశావాది ప్రకాశరావు రచనలు పేర్కొనండి.
3. ఆశావాది పూరించిన ఒక సమస్య చెప్పండి?

ఆ) కింది పేరా చదివి ప్రశ్నలకు తగిన సమాధానాలు రాయండి.

తెలుగు సాహిత్యంలో అవధాన విద్య ఒక ప్రాచీన ప్రక్రియ. విశేషమైన ధారణ శక్తి దీనికి ఆలంబన. 'అష్టావధానం' అంటే ఒకే సమయంలో ఎనిమిది విషయములపైన మనస్సును ఏకాగ్రతతో నిలపడం. అవధానంలో ప్రశ్నలు అడిగేవారిని పృచ్ఛకులు అంటారు. సమాధానమిచ్చే వారిని అవధాని అంటారు. అవధాని కవేకాక, పండితుడై కూడా ఉండాలి. ఎందుకంటే సమయానుకూలంగా చమత్కార సంభాషణలు జరుపవలసి ఉంటుంది. పృచ్ఛకులు కూడా పండితులై ఉంటారు. అనేక సందర్భాల్లో అవధానిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుంటారు. అవధానికి అది ఒక పరీక్ష అయితే ఇతరులకు అది వినోదప్రాయంగా ఉంటుంది.

కవిత్వం, కావ్య పఠనం, శాస్త్రార్థం, ఆకాశపురాణం, లోకాభిరామాయణం, చదరంగం, వ్యస్తాక్షరి, పుష్పగణనం అష్టావధానంలోని ప్రసిద్ధ అంశాలు. కొందరు అవధానులు పైన తెలిపిన ఎనిమిదింటిలో కొన్నింటిని తొలగించి వాటి స్థానంలో దత్తపది, నిషిద్ధాక్షరి, గణిత చాతుర్యం ప్రదర్శిస్తారు. అవధానాలలో నేత్రావధానం, నాట్యావధానం అనే ప్రక్రియలు కూడా ఉన్నాయి. అవధానం కేవలం వినోదం మాత్రమే కాదు. అది కవితా, పాండిత్యాలకు పట్టుగొమ్మ. ఆంధ్రదేశాన అష్టావధానులు, శతావధానులు, సహస్రావధానులు ఎందరో ఉన్నారు. మాడుగుల నాగఫణిశర్మ , గరికపాటి నరసింహారావు, మేడసాని మోహన్, కడిమెళ్ళ వరప్రసాద్ మొదలైన వారు అవధానంలో విశేషకృషి చేస్తున్నారు. సాయి కృష్ణ యాచేంద్ర గారు 'సంగీత గేయధార' తో అవధానంలో కొత్త ఒరవడి సృష్టించారు.

ప్రశ్నలు :

1. **తెలుగు సాహిత్యంలో ఒక ప్రాచీన ప్రక్రియ పేరు రాయండి?**
2. **అష్టావధానం అంటే ఏమిటి?**
3. **అష్టావధానంలో ప్రశ్నలు అడిగేవారిని _____ అంటారు.**
4. **అష్టావధానంలోని అంశాల సంఖ్య?** ( )


   అ) 6 **ఆ) 7** **ఇ) 8** **ఈ) 9**
5. **పై పేరాలను చదివి ఒక ప్రశ్న తయారు చేయండి.**

ఇ) కింది పేరా చదివి ప్రశ్నలకు సరైన సమాధానాలు రాయండి.

ఒకసారి ఒక అబ్బాయి పక్కింటివారి ధాన్యం కొట్టంలో కూర్చొని చిన్న దీపం పెట్టుకుని చదువుకుంటున్నాడు. ఉన్నట్టుండి గాలి వీచడంతో దీపం ఆరిపోయింది. తిరిగి దీపం వెలిగించి చదువుతుండగా అది మళ్లీ ఆరిపోయింది. అలా నాలుగైదు సార్లు జరగడంతో అతనికి కోపమొచ్చింది. " ఈ దీపం చిన్నదవడం వలన ఇలా జరుగుతోంది. గాలి తగిలినా కూడా ఆరిపోవడానికి వీల్లేకుండా ఏదైనా చెయ్యాలి. ఏం చేద్దామా?" అనుకుంటుండగా ఏదో ఆలోచన

AP SCERT

వచ్చింది. వెంటనే తన ఆలోచనను అమలు పరుస్తూ చిన్ని ప్రయోగం చేశారు. ప్రమాదవశాత్తు మంటలు రేగి ఆ కొట్టం తగులబడిపోయింది. కొడుకు చేసిన పనికి తండ్రికి కోపం వచ్చింది. చుట్టుపక్కలవాళ్లు మంటలు ఆర్పుతున్నారు. తండ్రి కొడుకుని నడిరోడ్డు మీదకు ఈడ్చుకొచ్చి బెత్తంతో వీపు తట్లుతేలేలా కొట్టాడు. "ఇంకెప్పుడైన ఇటువంటి పనిచేస్తే చంపేస్తా"నన్నాడు. పాపం ఆ అబ్బాయి తల్లి దగ్గరకు చేరి తప్పు క్షమించమని, ఇంకెప్పుడూ అలాంటి ప్రమాదాలు రానివ్వనని వేడుకొన్నాడు. తండ్రికి చెప్పి తను ప్రయోగాలు చేసుకోవడానికి అనుమతి ఇప్పించమన్నాడు. తన కొడుక్కి సృజనాత్మకశక్తి ఎంతో ఉందని గ్రహించిన ఆమె అతడికి అన్నివిధాలా సహకరించింది. పట్టువదలని విక్రమార్కునిలా ఆ అబ్బాయి తన ప్రయోగాన్ని ఆపలేదు. ఆ అబ్బాయి ఇంకెవరోకాదు, ఎలక్ట్రిక్ బల్బు కనిపెట్టి ప్రపంచానికి చీకట్లో వెలుగులు అందించిన థామస్ అల్వా ఎడిసన్.



ప్రశ్నలు :

1. 'సృజనాత్మకత' అంటే ఏమిటి?
2. 'పట్టువదలని విక్రమార్కుడు' – సొంతవాక్యంలో ప్రయోగించండి.
3. 'తండ్రి' – పర్యాయపదాలు రాయండి.
4. మీ అమ్మ దగ్గర నువ్వు చేసిన తప్పు ఒప్పుకున్న ఒక్క సందర్భం రాయండి.
5. పై పేరాకు శీర్షిక పెట్టండి.

వ్యక్తీకరణ - సృజనాత్మకత

అ) కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.

1. ఆశావాది 'బాలకవి'గా ఆశీర్వాదం పొందిన సన్నివేశం గురించి రాయండి.
2. ఆసాదిగా ఉన్న ప్రకాశరావు ఇంటిపేరు ఆశావాదిగా ఎలా మారింది?
3. ముఖాముఖి ప్రక్రియను గురించి రాయండి.
4. ప్రకాశరావు అష్టావధానంలోకి ప్రవేశం, అవధాన ప్రక్రియలో వారి కృషిని వివరించండి.

ఆ) కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. ఆశావాది వారి సాహితీ జీవన ప్రస్థానం తెలుసుకున్నారు కదా! మీరు తెలుసుకున్న విషయాలను మీ మిత్రునికి 'లేఖ' రూపంలో రాయండి.
2. మీకు దగ్గర్లోని రైతు/ఆరోగ్య కార్యకర్త/ శ్రామికుడు/ పోలీసు/ ప్రజాప్రతినిధి వీరిలో ఎవరితోనైనా 'ముఖాముఖి' (ఇంటర్వ్యూ) నిర్వహించేందుకు 10 ప్రశ్నలు తయారు చేయండి.
3. ఆశావాది ప్రకాశరావుగారి జీవిత విశేషాలను రాయండి.
4. ఆశావాది ప్రకాశరావుగారు ఏదైనా ఒక విషయాన్ని నేర్చుకోవటంలో మనకు ఏవిధంగా స్ఫూర్తినిస్తారు?

AP SCERT

భాషాంశాలు - పదజాలం

అ) ఎరుపు రంగులో ఉన్న పదాలకు అర్థాలు రాయండి. ఆ అర్థాలు ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

1. సజ్జనులతో 'గోష్ఠి' శ్రేయోదాయకం.

జ : _____

2. కొంతమంది కవులు పద్యాలను 'ఆశువు' గా చెపుతారు.

జ : _____

3. అవధాన ప్రక్రియలో 'పృచ్ఛకులు' ప్రశ్నలు అడుగుతారు.

జ : _____

ఆ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు పర్యాయపదాలు రాయండి.

1. అవధాన ప్రక్రియలో నేత్రావధానం కూడా ఉంటుంది. = _____, _____, _____
2. నాన్న కుటుంబం కోసం ఎంతో శ్రమిస్తాడు. = _____, _____, _____
3. ఆకాశాన కౌముది ప్రకాశం ఎంతో మనోహరంగా ఉంది. = _____, _____, _____

ఇ) కింది వాక్యాలలో ఎరుపు రంగులో ఉన్న పదాలకు నానార్థాలు రాయండి.

1. కవికి సామాజిక స్పృహ అవసరం. = _____, _____, _____
2. విద్యార్థుల్లో జ్ఞానజ్యోతులను వెలిగించేవాడు గురువు. = _____, _____, _____
3. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు. = _____, _____, _____

ఈ) కింది పదాలకు వ్యుత్పత్త్యర్థాలు రాయండి.

1. అక్షరము = _____
2. పౌత్రుడు = _____
3. ఆచార్యుడు = _____

ఉ) కింది పట్టికలోని ప్రకృతులకు– వికృతులు, వికృతులకు–ప్రకృతులు రాయండి.

అక్కరం, కార్యం, పద్యము, కీర్తి, సందియం, వమ్ము, కవిత, విజ్ఞానం

ఊ) కింది జాతీయాలను వివరించండి.

1. ఎత్తిపొడుపు = _____
2. కత్తిమీద సాము = _____
3. తామరతంపర = _____

AP SCERT

వ్యాకరణాంశాలు

సంధులు

అ) పాఠ్యాంశంలోని కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.

1. అష్టావధానం = _____ + _____ = _____
2. పుస్తకాకృతి = _____ + _____ = _____
3. నేత్రావధానులు = _____ + _____ = _____
4. ఆద్యంతం = _____ + _____ = _____
5. ఉన్నతోద్యోగులు = _____ + _____ = _____

ఆ) కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి.

1. రసౌచిత్యం = _____ + _____ = _____
2. దివ్యౌషధం = _____ + _____ = _____
3. పాపౌఘం = _____ + _____ = _____
4. దేశోన్నత్యం = _____ + _____ = _____

ఇ) కింది విడదీసిన పదాలను కలపండి, సంధి పేరు రాయండి.

1. రస + ఏక = _____ = _____
2. వన + ఓషధి = _____ = _____
3. వసుధా +ఏక = _____ = _____
4. అష్ట + ఐశ్వర్యం = _____ = _____

వృద్ధి సంధి : అకారానికి ఏ,ఐలు పరమైతే ఐకారము, ఓ,ఔలు పరమైనప్పుడు ఔకారము ఏకాదేశమవుతాయి.

ఈ) కింది సమాస పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసం పేరు రాయండి.

1. మధుర భాషణము = _____ _____
2. మూడు సంవత్సరాలు = _____ _____
3. కళా గోష్ఠి = _____ _____

ప్రత్యక్ష – పరోక్ష కథనాలు :

ప్రత్యక్ష కథనం : ఒక వ్యక్తి చెప్పిన మాటలను యథాతథంగా చెప్పడాన్ని 'ప్రత్యక్ష కథనం' అంటారు.
కింది ఉదాహరణను చూడండి.

" నేను తలచుకుంటే ఏదైనా సాధించగలను " అని వర్షిత్ అన్నాడు.

పరోక్ష కథనం : వేరే వాళ్ళు చెప్పిన మాటల్ని మన మాటల్లో చెప్పడాన్ని పరోక్ష కథనం అంటారు.
కింది ఉదాహరణను చూడండి.

తాను బాగా చదువుకొను, ఒక గొప్ప స్థితికి చేరుకుంటానని మోక్ష అన్నది.

ఈ రెండూ అనుకరణాలే. అనుకరణంలో అంతా చెప్పి కథనం చివర 'అని' వాడతాం. దీనిని అనుకారకం అంటారు.

AP SCERT

ప్రత్యక్ష కథనాన్ని పరోక్ష కథనంలోకి మార్చడానికి పాటించవలసిన నియమాలు

á ప్రత్యక్ష కథనంలో వ్యక్తి యథాతథంగా చెప్పిన మాటలను ఉద్ధరణ చిహ్నాలలో "....." చూపించాలి పరోక్ష కథనంలో ఉద్ధరణ చిహ్నాలు ఉండవు.

á ప్రత్యక్ష కథనంలో 'నేను' పరోక్ష కథనంలో 'తను' అవుతుంది.

నేను – తాను, తను
నా – తన
నాతో – తనతో
నన్ను – తనను
నాకు – తనకు
మా – తమ
మాకు – తమకు
మేము – తాము
మీరు – వారు

అ) కింది ప్రత్యక్ష కథనంలోని వాక్యాలను పరోక్ష కథనంలోకి మార్చండి.

1. " నాకు పరీక్షల్లో మంచి మార్కులు వచ్చాయి" అని రఫీ చెప్పాడు.
2. "పుష్కర బొమ్మలు బాగా వేస్తుంది" అని వాళ్ళ నాన్నగారు అన్నారు.
3. "మీరంతా ఎక్కడి నుండి వస్తున్నారు?" అని శైలజ పిల్లల్ని అడిగింది.
4. "నాకు ఈత అంటే ఎంతో సరదా. ఈత కొట్టడం ఆరోగ్యం కూడా" అని అక్షయ అన్నది.

ఆ) కింది పరోక్ష కథనంలోని వాక్యాలను ప్రత్యక్ష కథనంలోకి మార్చండి.

1. చదువుకన్నా విద్యార్థికి క్రమశిక్షణ చాలా ముఖ్యమని ఉపాధ్యాయులు చెప్పారు.
2. తను జీవితంలో ఎన్నో కష్టాలనెదుర్కొని ఈ స్థితికి చేరానని కలామ్ అన్నారు.
3. తామంతా నిత్యం పుస్తకాలు చదువుతూ ఉంటామని పిల్లలు చెప్పారు.
4. తానొక ప్రకృతి ఆరాధకుడినని విజయ్ అన్నాడు.

ప్రాజెక్టు పని

క్యూ.ఆర్.కోడ్‌ను స్కాన్ చేయండి. 'పద్మశ్రీ' అవార్డు ప్రకటన అనంతరం ఆశావాదిగారి ఉపన్యాసం విని సమీక్ష రాయండి. మీ తరగతి గదిలో ప్రదర్శించండి.

క్యూ.ఆర్.కోడ్‌ను స్కాన్ చేయండి. ఆహ్వానపత్రికను పరిశీలించి మీ పాఠశాల అవధాన కార్యక్రమానికి ఆహ్వానపత్రికను తయారుచేయండి.

పద్య మధురిమ

ఉ॥ పూరితసద్గుణంబుగని పుణ్యునకించుక రూపసంపదల్
దూరములైన వానియెడ దొడ్డగ జూతురు బుద్ధిమంతు లె
ట్లారయగొగ్గులైన మఱియందుల మాధురి జూచి కాదె ఖ
ర్జూరఫలంబులం బ్రియము చొప్పడ లోకులు గొంట భాస్కరా!

–భాస్కర శతకం –మారద వెంకయ్య

భావం: భాస్కరా! గుణవంతునికి అందము, ఐశ్వర్యమూ లేకున్నా బుద్ధిమంతులు అతని పట్ల గౌరవంగా ప్రవర్తిస్తారు. ఎలాగంటే ఖర్జూర ఫలాలు ఆకారంలో అందంగా లేకపోయినప్పటికీ లోకులు వాటి మాధుర్యాన్ని స్వీకరిస్తారు కదా!

AP SCERT


ఉపవాచకం

AP SCERT



X8V3W3

1 దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు



ఆంధ్రపత్రిక పేరు చెప్పగానే మొదట గుర్తొచ్చే పేరు కాశీనాథుని నాగేశ్వరరావు.తెలుగు భాషా వికాసాలకు ఉద్యమించిన ఆంధ్రపత్రికను స్థాపించి, తెలుగుభాషను, తెలుగునేలను ఎన్నో విధాలుగా సంపన్నవంతం చేసిన మహనీయుడు. కాశీనాథుని వారు స్థాపించిన తెలుగు సాహిత్య మాసపత్రిక భారతి చేసిన తెలుగు భాషాసేవ అనితర సాధ్యం. దీనికితోడు కాశీనాథుని వారు స్థాపించిన ''అమృతాంజనం'' దేశ ప్రజలకు అందిన అమూల్యమైన ఔషధం. అమృతాంజన లాభాలన్నీ ఆయన తిరిగి దేశానికే వినియోగించారు.

ప్రాతఃస్మరణీయుడైన కాశీనాథుని నాగేశ్వరరావు 1867వ సంవత్సరము మే 1వ తేదీన కృష్ణాజిల్లా ఎలకుర్రులో జన్మించారు. తల్లిదండ్రులు శ్యామలాంబ, బుచ్చయ్య. బారసాలనాడు పెద్దలు ఆయనకు పెట్టినపేరు నాగలింగం. కాలక్రమంలో నాగలింగమే, నాగేశ్వరరావుగా మారింది. మొదటినుండీ ఆయనకు చదువు అంటే ఆసక్తి ఉండేది. అయితే వ్యాపారం అంటే కూడా చాలా ఇష్టం ఉండేది. చిన్ననాట ఆయనకు ఎటువంటి చదువు చెప్పించాలనే విషయంలో తల్లిదండ్రుల మధ్య భిన్నాభిప్రాయం ఉండేది. తండ్రికి సంస్కృతం చదివించాలని ఉండేది. తల్లి దృష్టిలో సంస్కృతం కన్నా, ఇంగ్లీషు చదువుకొంటేనే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. చివరికి ఆమె మాటే నెగ్గింది. నాగేశ్వరరావు బందరులోని, హిందూ హైస్కూల్లో చదివి పదకొండో తరగతి పాసయ్యాడు. సరిగ్గా ఆ రోజుల్లోనే ఆయన తండ్రి మరణించారు.

ఆ దుఃఖాన్ని తనలోనే అణచుకొని, ఆయన ఇంటర్ పూర్తిచేసి, మద్రాసులో డిగ్రీ చదివేరు. ఆ రోజుల్లో ఆయనకు రెంటాల వెంకటసుబ్బారావు పరిచయం అయ్యారు. ఆయన మేనకోడలు రామాయమ్మని వివాహం చేసుకొన్నాడు నాగేశ్వరరావు. కాశీనాథుని వారిది తొలినుండీ స్వతంత్ర వ్యక్తిత్వం. అందుకే ఎవరి దగ్గరా ఉద్యోగం చేయాలని లేదు ఆయనకు. వ్యాపారం మీద ఆయన దృష్టి పడింది. బొంబాయిలో విలియం అండ్ కో సంస్థలో చేరాడు, ఆ సంస్థ యజమానులు ఆ సంస్థను వదిలి, తమ దేశానికి వెళ్లిపోదామని అనుకొని, ఆ వ్యాపారాన్ని నాగేశ్వరరావుగారికి అప్పగించారు. 1899లో ఆయన అమృతాంజనం తయారు చేయడం మొదలు పెట్టారు. 1903 నాటికి ఆ వ్యాపారం ఎంతో వృద్ధి చెందింది. అమృతాంజనం విదేశాలకు కూడా ఎగుమతి అయ్యింది. దాంతో, వ్యాపారం లాభాల బాట పట్టింది. ఇక్కడే, కాశీనాథుని వారికి, మిగిలిన వ్యాపారులకు ప్రధానమైన భేదం ఉంది. అలా ప్రజల నుండి ఆయన

AP SCERT

సంపాదించిన సొమ్ముని, తిరిగి దేశంకోసం, దేశాభివృద్ధి కోసం వినియోగించాలనుకొన్నారు. 1907 సూరత్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభలకు ఆయన హాజరయ్యారు. ఆ మహాసభల ప్రభావం వారిపై బాగా పడింది. దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని ఉత్తేజితం చేయాలన్న బలమైన సంకల్పంతో 1908లో ఆంధ్ర పత్రికను ఆరంభించారు. బొంబాయికన్నా, మద్రాసులో పత్రిక ప్రచురణ చేస్తే బావుంటుంది అన్న ఆలోచన రాగానే ఆయన ఆంధ్రపత్రిక ప్రచురణని మద్రాసుకి మార్చారు. మద్రాస్ నుండి 1914న ఆంధ్రపత్రిక దినపత్రికగా మొదలయ్యింది. ఆ రోజుల్లోనే ఆంధ్రపత్రిక వారపత్రిక కూడా వెలువడింది. అప్పుడే, తొలి ప్రపంచ యుద్ధం ఆరంభమైంది. ఆనాటి భారత స్వాతంత్ర్య పోరాటాన్ని, మొదటి ప్రపంచ యుద్ధాన్ని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని తెలుగు అక్షరాలలో, తెలుగువారికి అందించిన ఘనత కాశీనాధుని నాగేశ్వరరావుకే దక్కుతుంది.

సహాయ నిరాకరణోద్యమం దేశంలో ఆరంభం కాగానే, కాశీనాధునివారు గాంధీ మహాత్ముని మార్గాన్ని త్రికరణశుద్ధిగా అనుసరించారు. పత్రిక ద్వారానే కాక, స్వయంగా తెలుగు ప్రాంతమంతా తిరిగి ప్రజల్ని చైతన్యవంతం చేశారు. స్వాతంత్ర్యోద్యమానికి పత్రిక ద్వారా సేవ చేయడమే కాదు, స్వాతంత్ర్య వీరులకు ఎన్నో విధాలుగా ఆర్థిక సహాయం అందించిన మహానుభావుడాయన. స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న వారిలో ఎవరికి ఏ రకమైన ఆర్థిక ఇబ్బంది వచ్చినా, ఆయన ఆదుకొనేవారు. ఒకసారి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం స్వరాజ్య పత్రికకు పేపర్ లేక ప్రచురణ ఆగిపోతే, వెంటనే పేపర్ అందించారట. దీనికి తోడు దేశంలో ఎక్కడ ఏ కష్టం వాటిల్లినా సహాయానికి ఆయన సిద్ధంగా ఉండేవారు. రాత్రిలేదు, పగలు లేదు, ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రజాశ్రేయస్సును కాంక్షిస్తూ పనిచేయడమే ఆయనకు తెలిసిన ఏకైక సూత్రం.

1930లో దేశంలో గాంధీజీ శాసనోల్లంఘన ఉద్యమం ప్రారంభించారు. దండి ఉప్పు సత్యాగ్రహం శాసనోల్లంఘనంలోని భాగమే. ఈ ఉద్యమంలో పాల్గొని, జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటుగా, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఉద్యమంలోనూ, కాశీనాధుని నాగేశ్వరరావు చూపిన చొరవ చాలా గొప్పది. ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు సంబంధించిన అత్యంత ప్రాముఖ్యమైన ఒప్పందం వారి గృహం శ్రీబాగ్ లోనే జరిగింది. అందుకే దానిని శ్రీబాగ్ ఒప్పందం అని పిలిచారు.

దళితులంటే ఆయనకు చాలా అభిమానం. వేముల కూర్మయ్యను బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో చదివించారు. ఇన్ని బాధ్యతలతో పాటుగా, ఆంధ్ర గ్రంథమాలను స్థాపించి నిర్వహించారు. తెలుగునాట గ్రంథాలయోద్యమాన్ని ప్రోత్సహించారు. 1924-1934వ సంవత్సరాల మధ్య, ఆంధ్రప్రాంత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు. ఆంధ్రప్రాంతంలో ఖద్దరు వ్యాప్తికి ఆయన అందించిన సేవలు చాలా గొప్పవి. జైల్లో ఉన్నప్పుడు భగవద్గీతకు ఆయన వ్యాఖ్యానం వ్రాశారు. కొమర్రాజు లక్ష్మణరావుగారు వదిలివెళ్లిన విజ్ఞాన సర్వస్వ ప్రచురణ బాధ్యతను ఆయన తీసుకొని, విజ్ఞాన సర్వస్వాలను ప్రచురించి తెలుగువారికి అమూల్యమైన కానుకలుగా అందించారు. ఆంధ్రనాటక కళాపరిషత్ వ్యవస్థాపకులలో ఆయనా ఒకరు. ఇలా, జీవితాంతం దేశానికి, దేశ స్వాతంత్ర్య సముపార్జనకు, ఆంధ్రరాష్ట్ర సాధనకు, దీనజనోద్ధరణకు, దళిత జనవికాసానికి, తెలుగు భాషా సాహిత్యాభివృద్ధికి అంకితమై కృషి చేసిన కాశీనాధుని నాగేశ్వరరావు 1938 మార్చి 26న అస్తమించారు.

AP SCERT

చదవండి – ఆనందించండి

కాంపోజిషన్



పి. సరళాదేవి

సుశీలా టీచరును చూస్తూనే గజగజలాడాడు మారయ్య. ఆవిడ లోపలికి వచ్చి హాజరు తీసుకుంది. పెన్ను మూతపెడుతూ క్లాసంతా కలయజూసింది.

"నిన్న కాంపోజిషన్ వ్రాయనివాళ్ళు చేతులెత్తండి" అంది. మారయ్య కూడా ఎత్తాడు.

"ఇవాళేనా వ్రాసి తెచ్చారా?" మిగతా కుర్రాళ్ళ 'ఓం'కారంతో మారయ్య గొంతు వినిపించలేదు.

"మీ పుస్తకాలన్నీ ఇలా ఇవ్వండి"

అందరూ ఇచ్చేశారు. మారయ్య పుస్తకం పట్టుకుని ముందుకూ వెనక్కూ వూగులాడుతున్నాడు.

"ఏరా! ఇవ్వాళా రాయలేదా?"

మారయ్య బెదురు చూపులు చూస్తూ, గుక్కిళ్ళు మింగుతూ పుస్తకం అందించాడు. పుస్తకం తెరవబోయిన టీచర్ క్లాసులో గోలతో తలెత్తి చూసింది. మారయ్య కళ్ళుతిరిగి పడిపోయాడు. వాడి పరిచర్యతో క్లాసు పూర్తయిపోయింది.

రాత్రి భోజనం చేసి దిద్దడానికి కాంపోజిషన్ పుస్తకాలు ముందు వేసుకుని కూర్చుంది సుశీల.



AP SCERT

అలా దిద్దుతూండగానే మారయ్య జ్ఞాపకం వచ్చాడు. వాడెందుకు అలాపడిపోయాడు? తను ఆ స్కూల్లో చేరి నెలరోజులే అయింది అప్పటినుండీ చూస్తోంది. వాడెప్పుడూ వుత్సాహంగా వుండడు. ఏదో బరువు మోస్తోన్నట్టు దిగులుగా వుంటాడు. అపరజ్ఞానిలా చూపులు దూరంగా నిలుపుతాడు. ముందురోజు క్లాసులో కాంపోజిషన్ వ్రాయవలసిన విషయం చెప్పింది.

"మీ పుట్టిన రోజు పండుగను గురించి మీ స్నేహితునికి లేఖ వ్రాయండి" ఇది ఎలా ప్రారంభించాలో ఏమేమి వ్రాయాలో అన్నీ చెప్పింది. అందరూ ఏదో వ్రాయడానికి ప్రయత్నిస్తూంటే వీడు పుస్తకమయినా తెరవకుండా బిక్కచచ్చినట్టు కూర్చున్నాడు. తను చూసీచూడనట్టుగా చూస్తోంది. వాడి నిర్లక్ష్యం చూస్తోన్న కొద్దీ వొళ్ళు మండింది. గంట కొట్టేసరికి రాసినవాళ్ళు తెచ్చి ఇచ్చేశారు. అంతవరకూ వాడి వాలకాన్ని గమనిస్తున్న తను చరచర వాడి ముందుకు వెళ్ళి

"ఏరా? నే చెప్పింది వినిపించలేదా. చెవుడా? పోయే కాలమా? ముద్దపప్పులా కూర్చున్నావు. ఇంటి దగ్గర వ్రాసి రేపు తీసుకురాకపోయేవో వొళ్ళు చీరేస్తాను. జాగ్రత్త!" అంటూ వెళ్ళిపోయింది. ఆ సాయంత్రం స్కూలు వదిలాక తనకెదురుపడిన వాడు లేడిలా బెదురుతూ పారిపోయాడు. ఇవాళ పుస్తకం ఇస్తూనే కళ్ళు తిరిగి పడిపోయాడు.

"ఛ్, కుర్రవాడు బొత్తిగ అర్భకుడు. వాడ్ని కొంచెం గట్టివాడ్ని చేయాలి" అనుకుంటూంటే మారయ్య పుస్తకం టీచర్ చేతికొచ్చింది. తెరిచిన సుశీలకు బుర్ర తిరిగిపోయింది. అది కాంపోజిషనా?...

'సుశీలా టీచర్‌గారికి!

మీరు నిన్న కాంపోజిషన్ వ్రాయమని ఇచ్చిన విషయం. "నీ పుట్టిన రోజు పండుగను గురించి నీ స్నేహితునికి లేఖ వ్రాయండి" ఇది మీకు చాలా సులభమైనదిగా తోచి వుంటుందనుకుంటాను. గాని నాకు... నాకు... వ్రాయడానికి స్నేహితులు లేరు. వున్న స్నేహితులకు చదవటం రాదు. ఒకవేళ కూడబలుక్కుని చదివినా 'పుట్టినరోజు పండుగ' ఏమిటో, దానికంత ప్రాముఖ్యమేమిటో చచ్చినా అర్థంకాదు. అంచేత టీచర్! అర్థంకాని స్నేహితులకు బదులు, అర్థం చేసుకోగలిగిన టీచర్‌కే వ్రాస్తున్నాను. కానీ... ఏమని వ్రాయాలి. టీచర్? నా పుట్టినరోజు పండుగ ఎలా జరిగిందని వ్రాయాలి టీచర్?

మా అమ్మపేరు సూరమ్మ... నాలుగిళ్ళల్లో పాచిపని చేసుకుని, వాళ్ళిచ్చిన... గెంజి నీళ్ళతో కడుపునింపుకుని అడుగున పడేసిన చద్దన్నం, చారూ మాకు తెచ్చి పెడుతుంది. మా అమ్మ ఇళ్ళల్లో పనిచేస్తూనే ఆయా కాలాల్లో నాట్లుకెళ్తుంది, కోతలకెళ్తుంది. అవి లేనప్పుడు కూరగాయలు మారుబేరానికి తెచ్చి వీధుల్లో తిరిగి అమ్ముతుంది. హోటళ్ళలో పిండిరుబ్బుతుంది. పగలంతా రిక్షాబండి తొక్కి రాత్రికి వస్తాడు మా నాన్న.

నాకింకా ముగ్గురు చెల్లెళ్ళు వున్నారు టీచర్. నేను మగపిల్లవాడినని అమ్మకు ప్రేమ, అర్భకుడనని మా నాన్నకు చులకన. అమ్మ ప్రేమే నన్నీ బడిలో చేర్చింది. తను పనిచేసే మాస్టారుగారి కాళ్ళమీద నన్ను పడేసింది – 'బాబూ తవరి దయ' అంది. చదువులో నా చురుకుదనం చూసి ఆ మాస్టారు ఈ బళ్ళో చేర్చారు. ఆ మాస్టారే గోపాలరావు మాస్టారు. ఆయనే నాకు పాత పుస్తకాలూ పెన్సిళ్ళూ రబ్బరూ అవీ ఇస్తుంటారు. వాళ్ళనీ, వీళ్ళనీ అడిగి మా అమ్మ చొక్కాలూ చెడ్డీలూ తెస్తుంది. పుట్టిబుద్ధెరిగి కొత్త గుడ్డ అనేది ఎరుగను. మన బడిలో ఇచ్చే బట్టలు, పుస్తకాలు, భోజనం, మంచి చదువు దొరుకుతున్నాయని అమ్మ సంబరపడుతుంది.

ఇంక పుట్టిన రోజుకంటూ కొత్తబట్టలెక్కడివి టీచర్! అసలు నా పుట్టిన రోజు ఏదో నాకు తెలీదు. మా అమ్మకు తెలీదు. నిన్న ఇంటికెళ్ళి – "అమ్మా! నేనెప్పుడు పుట్టానే" అని అడిగాను. "కొత్తామాసెల్లిన నాలుగు రోజులకి పుట్టావ"ని ఒక మారంది. కాదు..కాదు సంకురాతిరి ముందు పుట్టావ"ంది కాసేపటికి.. "అది కాదు పోలేరమ్మ జాతర మర్నాడు పుట్టావ"ంది ఇంకాసేపటికి – నాకేటి గురుతురా నాయనా. ఎనమండుగుర్ని కన్నాను. ఐదుగురు మిగిలారు. ముగ్గురు పోనారు. మీ నాన్న నాలుగుసార్లు లారీకింద పడి చచ్చిబతికాడు. ఏదెప్పుడు జరిగిందో నాకు గుర్తుకొస్తలేదురా. అంటూ ఏడ్చింది అమ్మ. ఇంక నా పుట్టిన తేదీ ఏదని రాసేది టీచర్!

మూడవ తరగతి సైన్సు పుస్తకంలో "పరిసరముల శుభ్రత–వ్యక్తిగత పరిశుభ్రత' పాఠాలు చదువుతున్నప్పుడు

AP SCERT

నా మనసు వెర్రిగా ఏడ్చేది. గాంధీ జయంతినాడు మా వాడలకు ఎవరెవరో వచ్చేవారు. మేము ఇళ్ళు శుభ్రంగా వుంచుకోవాలని, రోజూ స్నానం చేసి బట్టలుతుక్కుని వేసుకోవాలని, ఇంటి చుట్టూ చెత్తపోసుకోకూడదని వుపన్యాసాలిచ్చి వెళ్ళేవారు. మేము చాలా అజ్ఞానులమని, మూర్ఖులమని, శుచీ శుభ్రతా తెలియదని వారి అభిప్రాయం. కాని నిజమేమిటో చెప్పనా టీచర్. మాకున్నది ఒకే ఒక్కటి – అదే! దరిద్రం.

మా వాడలో తెల్లవారుతూనే ఎవరి పనుల్లోకి వాళ్లు వెళ్ళిపోవాలి. ఏమాత్రం ఆలస్యమైనా ఏదో కొరత పడుతుంది ఉదాహరణకు మా అమ్మనే చూడండి టీచర్! లేస్తూనే పాచిపనికి పోతుంది. అది పూర్తిచేసి బజారెళ్ళి కూరలు తెచ్చి తట్టలో వేసుకుంటుంది. అవి అమ్ముకుని వచ్చేసరికి పొద్దునెత్తి మీదుంటుంది. రాత్రి మిగిలిన కూడూ, తను తెచ్చిన పచ్చడీ మెతుకులూ అందరికీ తలోముద్దా సర్ది చిన్న కునుకు తీస్తుంది. లేస్తూనే అంట్లు పనికిపోయి, అక్కడ నుండి హోటళ్ళలో పని చూసుకుని పొయ్యిలోకి సరుకులు తెచ్చి పొయ్యిరాజేసేసరికి చీకటి పడుతుంది. ఇందులో ఏది మానేసినా ఒక ముద్ద తగ్గిపోతుంది. కుండల్లో నీళ్ళు నింపి, చెత్తలూడ్చి, కుండలు కడగడం నా చెల్లెళ్ళు చేస్తుంటారు.

ఇన్ని పనుల్లో మీకులాగా ఇళ్ళు అలుక్కోవడం, బట్టలుతుక్కోవడం, స్నానాలు చేయడం మాకు సాధ్యమా టీచర్? బట్టలుతుక్కోడానికి సబ్బు కావాలి. అది కొనుక్కోడానికి డబ్బు కావాలి. ఆ డబ్బు కోసం మళ్లీ కూలికి పోవాలి. తిండికి పోగా సబ్బుకి డబ్బు మిగిలితే సొంత పనికి టైము దొరకాలి. అది కూడా దొరికిన నాడు వోపిక మిగలాలి. రోగం రొష్టూ లేకుండా చాకిరీ చేసినా కడుపు నిండా తిండి సంపాదించడానికి రోజు చాలడం లేదే! మిగిలినవి ఎప్పుడాలోచించాలి టీచర్? నేను మధ్యాహ్నం బడి వదిలాక గోచి కట్టుకుని చెరువులో బట్టలుతుక్కుంటాను, అవి ఆరేక వేసుకుని బడికి వస్తాను.

నేను చదవడం మా నాన్నకి ఇష్టం లేదు. "బస్టాండులో పెట్టెలు మోస్తే రోజుకి మూడు రూపాయలు దొరుకుతా"యంటాడు.

నా పుట్టిన రోజు నాకు తెలియదు. కొత్త బట్టలు లేవు, పిండి వంటలు కలలోకి కూడా రావు. ఇటువంటి పరిస్థితులలో నా పుట్టిన రోజు పండుగెలా జరిగిందని వ్రాయాలి టీచర్? మీవి కడుపు నిండిన బతుకులు. అందుకనే మీరు పుట్టిన రోజులూ, పెళ్ళిరోజులూ, చావు రోజులూ అన్ని చేసుకుంటారు. ఇంతమంది కడుపునిండిన బతుకుల మధ్య నేనొక్కడిని! నాకెందుకు ఈ చదువు? అనిపిస్తుంది. ఈ చదువు మా అక్క జీవితాన్ని బాగుచేయగలదా? మా అమ్మ కష్టాన్ని మరిపించగలదా? మా నాన్నకు తాగుడు మానిపించగలదా? నా చెల్లెళ్ళకు కడుపునిండా తిండి పెట్టగలదా? అని ఆలోచిస్తుంటాను టీచర్! ఇవన్నీ సాధించాలంటే నేను బాగా చదువుకోవాలి టీచర్. అందుకు మీ సాయం కావాలి. నేను బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించాలి టీచర్."

సుశీలా టీచర్ దిగ్భ్రాంతికి లోనయ్యింది. మారయ్య ప్రశ్నలు ఆవిడ బుర్రలో గిరగిరా తిరగసాగాయి.


ఇంత పసివాడికి జీవితంపట్ల ఎంత అవగాహన.

సుశీల టీచర్ మనసు విలవిలలాడింది, తను ఇచ్చిన విషయం ఎంత జటిలమైనదో తెలిసివచ్చింది. "అవును నీ సమస్యలన్నింటికీ చదువే సమాధానం చెపుతుందయ్యా, నీకు నేనున్నానుగా..నిన్ను మేలిముత్యంలా తీర్చిదిద్దుతాను" అని మనసులోనే భరోసా ఇచ్చింది.

(మాకుగాదులు లేవు కథా సంపుటి)

AP SCERT

2 ఉన్నవ దంపతులు లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ



భారత స్వాతంత్ర్య పోరాటంలో పురుషులతో సమంగా, ఆమాటకొస్తే కొన్ని సందర్భాలలో పురుషులకన్నా మిన్నగా సాహసాన్ని ప్రదర్శించిన స్త్రీమూర్తులు ఎందరో ఉన్నారు. అటువంటి ధీరోదాత్తురాలైన మహిళామూర్తి, ఉన్నవ లక్ష్మీబాయమ్మ.

గాంధీమహాత్ముడి మాటను తనమాటగా, గాంధీజీ బాటను తన బాటగా మలచుకొన్న ఉన్నవ లక్ష్మీనారాయణ గారి ధర్మపత్ని ఆమె. తన భర్త అడుగుజాడల్లో సాగి, తన జీవితాన్ని సంఘసంస్కరణ కోసం, దేశసేవకోసం అంకితం చేసిన ఉత్తమురాలు ఉన్నవ లక్ష్మీబాయమ్మ.

గుంటూరు జిల్లాలోని నత్తెనపల్లి తాలూకాలోని అమీనాబాద్ గ్రామకరణమైన నడింపల్లి సీతారామయ్య, లక్ష్మీదేవమ్మల చివరి సంతానంగా 1882లో జన్మించింది లక్ష్మీబాయమ్మ. అమీనాబాద్‌లో ఆమె బాల్యం, అక్కడి ప్రాథమిక పాఠశాలలోనే ఆమె విద్యాభ్యాసం గడిచింది. ఆరోజుల్లో ఆడపిల్లలకు పదో ఏటికే పెళ్ళిచేసేవారు. లక్ష్మీబాయమ్మకి బావ లక్ష్మీనారాయణతో వివాహం జరిగింది.

ఉన్నవ లక్ష్మీనారాయణ సహృదయులు, సౌజన్యమూర్తి. మహాత్ముడి మార్గాన్ని మనసారా విశ్వసించిన వ్యక్తి. త్యాగమూ, సేవా అనే రెండు మాటల్నే తన జీవితంగా మలచుకొన్న మహానుభావుడు లక్ష్మీనారాయణ 1877 డిసెంబర్ 4వ తేదీన ఉన్నవ శ్రీరాములు, శేషమ్మల పెద్ద కుమారుడిగా జన్మించాడు. లండన్లో బారిస్టర్ చదివి న్యాయవాదిగా వృత్తి చేస్తూనే సంఘ సంస్కరణకు అంకితమయ్యారు. పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో వారు వహించిన పాత్ర చాలా గొప్పది. తన రచనలతో దీన జనోద్ధరణకు ఎంతగానో కృషి చేశారు. స్వరాజ్య పోరాటంలో కఠిన కారాగార శిక్షలు అనుభవించారు. కుల వ్యవస్థను నిరసిస్తూ, 'సంగవిజయం' వంటి గొప్ప నవలను రచించారు. దీన్ని ఆ రోజుల్లో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. ఆయనకు అన్ని విధాలుగా తగిన ఇల్లాలు లక్ష్మీబాయమ్మ.

కందుకూరి వీరేశలింగం, ఈ దంపతులను రాజమహేంద్రవరం రమ్మని ఆహ్వానించారు. అక్కడ వారు చేస్తున్న స్త్రీ జనోద్ధరణ కృషిని ఉన్నవ దంపతులు కళ్లారా చూసి, గుంటూరు వచ్చేక వారూ అటువంటి కృషినే ఆరంభించారు. భర్తమాటే తన మాటగా, ఆయన నడిచేబాటే తన బాటగా మలచుకొన్న స్త్రీమూర్తి లక్ష్మీబాయమ్మ. మహిళా సేవకు తన జీవితాన్ని అంకితం చేసుకొన్నారామె. చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన స్త్రీలెందరినో ఆదరించి

ARSCERT

వారికి తిరిగి వివాహాలు చేయించారు. ఆరోజుల్లో ఉన్నవ దంపతుల సంఘ సంస్కరణని వ్యతిరేకించి, వారిని ఛాందసులు సహపంక్తి భోజనాల నుండి వెలివేస్తే, దానిని ఆమె ధైర్యంగా ఎదుర్కొన్నారు.

1918వ సంవత్సరంలో దేశభక్త కొండ వేంకటప్పయ్య చేతివృత్తుల్లో స్త్రీలకు శిక్షణ ఇవ్వడం కోసం గుంటూరులో తన గృహంలో ఒక పాఠశాలను ప్రారంభించారు. అక్కడే, వయోజనులకు చదువు చెప్పించారు. వారికి చదవడం, రాయడం నేర్పించారు. ఆ బాధ్యతని ఉన్నవ దంపతులు చూశారు. మరీముఖ్యంగా లక్ష్మీబాయమ్మ ఆ పనిలో ముఖ్య పాత్ర వహించారు. అదే కాలక్రమంలో శారదానికేతన్ గా మారింది. కులమత వర్గ విభేదాలు లేకుండా, అందరికీ శారదానికేతన్‌లోప్రవేశం కల్పించారు.

శారదానికేతన్ స్థాపనతో లక్ష్మీబాయమ్మ, నిరాధారులైన ఆడపిల్లలెందరినో దగ్గరకు చేసుకొని సాయంకాలం వేళ బాలికలు అందర్నీ దగ్గరకు చేర్చుకొని, అనేక కథలు చెప్పి వారిని ఆనందింపజేసి, పాటలు పాడించి, తగాదాలు తీర్చి, ఆటలు ఆడించేవారు. శారదానికేతనం నాలుగు భాషల సూత్రాన్ని అనుసరించింది. అప్పుడక్కడ తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషలు నడుస్తూ ఉండేవి. పిల్లలకి ఈ నాలుగు భాషల్లో ప్రావీణ్యత కలిగించే ప్రయత్నం చేసేవారు. చదువుతోపాటు చేతివృత్తులకి ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇతరులు కన్నపిల్లల్ని తన స్వంత పిల్లలుగా భావించి, ఆదరించి, అక్కున చేర్చుకొని వారి శ్రేయోభివృద్ధులు కోసం దేశమంతా తిరిగి విరాళాలు సంపాదించి తెచ్చిన ఉత్తమురాలు ఉన్నవ లక్ష్మీబాయమ్మ.

1921 పలనాటిలో సహాయనిరాకరణోద్యమం జరిగింది. కారెంపూడిలో పలనాడు సదస్సు జరిగింది. దాని ప్రభావం వల్ల ప్రజలు సహాయనిరాకరణ ఉద్యమాన్ని పెద్దఎత్తున చేపట్టి, ప్రభుత్వాధికారులని కూడా సాంఘిక బహిష్కరణ చేశారు. ఆ మేరకు, ఉన్నవ లక్ష్మీనారాయణ, మాడభూషి, వేదాంతం నరసింహాచార్యులు మాచర్లలో ఉన్న గుంటూరు జిల్లా కలెక్టర్ షీల్డిని కలిసి, విషయాన్ని వివరించడానికి వెడితే, వారిని అరెస్ట్ చేసి, ఒక సంవత్సరం జైలుశిక్ష విధించారు. అది తెలియగానే లక్ష్మీబాయమ్మ గుంటూరు రైల్వేస్టేషన్ చేరి, భర్తకు ధైర్యంగా వీడ్కోలు చెప్పి ఆయన తరపున తానే ఉద్యమాన్ని నడిపించింది.


1930వ సంవత్సరంలో గాంధీ మహాత్ముడు శాసనోల్లంఘనానికి సమకట్టారు. ఆ సందర్భంలో సబర్మతీ నది నుండి దండిదాకా పాదయాత్ర చేసి, దండిలో ఉప్పు తయారు చేశాడు. ఉన్నవ దంపతులు ఆంధ్ర ప్రాంతమంతా తిరిగి, స్వరాజ్య సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఎవరైతే స్వాతంత్ర్య శపథం చేశారో, వారందరికీ ఆమె వీరకంకణాలు కట్టారు. శారదానికేతనంలోని బాలికలు స్వరాజ్య వీరులకి వీరగంధం పూసారు. నేవరంపాడులో ఉప్పు తయారుచేస్తుంటే, లక్ష్మీబాయమ్మను అరెస్ట్ చేసి ఆరు నెలలకాలం పాటు, కఠిన జైలుశిక్షని విధించారు. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా, ఢిల్లీలో మరోమారు అరెస్ట్ అయి జైలుశిక్షను అనుభవించారు. మహాత్మాగాంధీజీ ప్రతిపాదించిన వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు అరెస్ట్ చేయబడ్డారు. అప్పుడు మూడు నెలల జైలుశిక్షను రాయవేలూరు జైలులో గడిపి తిరిగివచ్చి సాంఘిక సంస్కరణ సేవా కార్యక్రమాల్లో మరింత శక్తిమంతంగా పాల్గొన్నారు. 1943 ఫిబ్రవరి 3వ తేదీన మరోసారి వారిని అరెస్ట్ చేసింది ఆంగ్ల ప్రభుత్వం. మద్యపాన నిషేధాన్ని కోరుతూ, కల్లుపాకల దగ్గర ఎన్నోమార్లు పికెటింగ్ కార్యక్రమాల్ని నిర్వహించారు.

ఆమె పట్టుదల, దీక్ష ఎంత గొప్పవంటే, ఆమె సంఘానికి, దేశానికి చేసిన సేవల్ని దృష్టిలో పెట్టుకొని

AP SCERT

గృహలక్ష్మీ పత్రికవారు ఆమెకు స్వర్ణ కంకణం బహూకరించాలని నిర్ణయించారు. అయితే ఆమె, దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకూ బంగారు నగలు ధరించనని ప్రతిజ్ఞ చేశారు. అందువల్ల కంకణం స్వీకరిస్తానే కానీ, ధరించనని స్పష్టం చేశారు.

దేశం కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం, సంఘ సంస్కరణ కోసం జీవితమంతా పోరాడి సాంఘిక సంస్కరణోద్యమాలను ఎంతో చైతన్యంతో ముందుకు నడిపించి, స్త్రీ విద్యావ్యాప్తికి చిరస్మరణీయమైన కృషి చేసి, తన భర్తకంటే ముందుగా 1956లో జీవితాన్ని చాలించిన తెలుగు నారీమణి ఉన్నవ లక్ష్మీబాయమ్మ. తన భార్యను గొప్ప దేశభక్తురాలిగా తీర్చిదిద్ది, ఆమెతో పాటుగా సాంఘిక సేవా రంగంలోనూ, స్వరాజ్య పోరాటంలోనూ కలిసి నడిచిన ఉత్తమ పురుషుడు ఉన్నవ లక్ష్మీనారాయణ 25-9-1958న అస్తమించారు.



సంజీవ దత్తుడు

ఒకసారి సంజీవ దేవ్ గారి ఇంటిలో దొంగలు పడ్డారు. దాదాపు పదివేల దాకా విలువ చేసే నగలు దోచుకెళ్ళారు. పరామర్శిద్దామని వెళ్లిన వారితో సంజీవ దేవ్ ఇలా అన్నాడు "పర్వాలేదు నిజానికి మనకి ఏమీ నష్టం లేదు దీనివల్ల" అని చెప్పి చిరునవ్వు నవ్వారు. అదేమిటి అలా అంటారు అని ఆశ్చర్యపడిన వారికి "వారు తీసుకెళ్లింది అన్ని నగలే కదా వాటిని తిరిగి మనం చేయిస్తేనే కదా మనకు నష్టం వచ్చేది దానివల్ల నష్టమేముంది" అని చెప్పారు మందహాసం చేస్తూ. ఈ వార్త తెలిసి సంజీవదేవ్ మిత్రుడైన చలం అరుణాచలం నుండి ఒక ఉత్తరం రాశారు. "దొంగలు పడ్డారట కదా మీరు చారుదత్తుడి లాగా దొంగలు వేసిన కన్నం దగ్గర కూర్చుని వారి హస్తకళా నైపుణ్యాన్ని మెచ్చుకోవడం లేదు కదా! ఏమేం పోయాయి? నగనట్రా అయితే పర్వాలేదు, మీ దగ్గర ఉన్న విలువైన పుస్తకాలు, ఉత్తరాలు, చిత్రాలు భద్రంగానే ఉన్నాయి కదా" అంటూ ఆ లేఖలో పరామర్శించారు. కేవలం మాటలలో రాతలలోనే కాకుండా నిజజీవితంలో కూడా వేదాంతులుగా ప్రవర్తించే వారి తీరు ఇలాగే ఉంటుంది.

APSCERT

చదవండి – ఆనందించండి


ఉరులు



– మల్లిపురం జగదీశ్

"ఎంతేలైందో...?" కళ్ళకు అరచేయి అడ్డం పెట్టి పొద్దు కోసం చూసేడు ముసిలోడు.

సీతాఫలాలు, జామపళ్ళు, అరటిపళ్ళు కమ్మని వాసనతో అడవి సంపదంతా పోగేసినట్టుంది, అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. వాటి వెనక గిరిజనులు... శ్రమకు ప్రతిరూపాల్లా... అనుకున్న రేటు కోసం ఎదురు చూస్తూ!



కావిడి నిండా తెచ్చిన సీతాఫలాలతో కూర్చొనున్నాడు ముసిలోడు. నిన్నంతా ఎండలోన, చీమకాట్ల మంటతో ముళ్ళ కంపల మధ్య ఏరిన కాయలు... ఈ రోజు సంతలో సూర్యోదయం నుండి మిట్ట మధ్యాహ్నం దాకా ఎవరూ కొనలేదు.

"ఇవి సెల్లిపోతే, ఉప్పు, ఉల్లికాయలు, వర్రగుండ, కిరసనూన కొనుక్కోనెల్లాల. ముసిల్దాయి సుట్టముక్క అడిగింది. రెండు పొగాకు కాడలు పట్టికెల్తే సరి. కావిడి కాయలు ఏబైకి సెల్లితే పర్నేదు. సావుకార్లందరూ ఒకటైపోయినట్టుగున్నారు. ఇరవయ్యే ఇస్తామంతర్రు. అందరూ ఇరవైకే అమ్మీసి నెగిసిపోనారు. మరి తప్పదు." అనుకుని తనూ ఇరవైకే అమ్మీసేడు. అమ్మగా వచ్చిన నగదుతో అనుకున్నవన్నీ కొనగలిగేడు, ముసిల్దాయడిగిన సుట్టముక్క తప్ప.

కొడుకు సొంబరకి రెండు గుడ్డముక్కలైనా కొనియ్యమని అడగాల.

ఇంటికెల్లి కోడలినడిగితే, ఇక్కడికొచ్చే కలుస్తానని అన్నాడట. సంతంతా కలియ తిరిగేడు. కనబడిన తన ఊరి వాళ్ళందరినీ అడిగేడు.... "అమ్మీ! మా సొంబరగాడు కనబడ్డాడే?" అని. అందరి నుంచీ "లేదు మామా!" అనే సమాధానం వెక్కిరించినట్టు.

పొద్దు పడమటికి వాలుతోంది. సంత పల్చబడుతోంది. కొడుకు కనబడతాడన్న ఆశ క్రమంగా సన్నగిల్లింది.

సంతలో జనసమ్మర్దం క్రమంగా తగ్గుతుంది. మామిడి చెట్టు మీంచి వీస్తున్న గాలి చల్లగా తగిలింది. కుడి చేతిలోని సామాన్ల సంచి ఎడమ చేయికి మార్చేడు ముసిలోడు.

ARSCERT

"ఓయ్ మండంగి తాతా! కనపడ్డాడా సొంబడు?"

"నేదురా, ఆడికే నెతుకుతున్నాను. ఒచ్చినాడో నేదో!"

ఆడికి ఉన్నిదే అది. ఒత్తానని రాకపోడమూ, సెప్పిన పని సెయ్యకపోడమూ ఆడికి ఉన్నిదే. గవరమెంటు పిలిసి ఉజ్జోగమిచ్చింది. ఆడికి ఉజ్జోగమొచ్చిందని గొప్పయిపోనాము. అయితేటి? అక్కడి కాసి ఆడికి మరి పట్టనేక పోయెలము. మా కరమ కాప్పోతే నెల నెలకీ డబ్బులిచ్చినోడు మాతోనుండి మాకు పెంచినోడవ్వాల గానీ, మమ్మల్నొదిలీసి పారొచ్చినాడు. అద్దిల్లు సూసుకొని ఇక్కడ కాపురమెట్టేడు. 'ఏమిరా?' అంతే... 'పిల్లల సదువులు' ఆన్నాడు.

కొండ మీద సింతసెట్లే నయము. అదునుకి దేవతల్లాగ కాపాడతన్నాయి. అలగని కడుపున పుట్టిన బిడ్డల్ని కాదనుకోగలమా? పెతి బుదవోరమూ సంతకొచ్చినప్పుడల్లా ఆ యింటికెల్లడం, మనవల్ని సూడ్డం అయ్యాది. అయితే ఆలకి బడిల సేర్పించిన కాసి సూడ్డమే అయ్యాది కాదు. ఎల్లీసరికి పిల్లలు బడులికి, కొడుకు ఉజ్జోగంకి ఎలిపోయెలు. మరెప్పుడు సూడ్డమవుద్ది? ఆలున్నారని అక్కడికెల్లడమే గాని, ఎల్తే పరాయోలింటికెల్లినట్టిగే ఉండీది. కుర్సీ మీద కూకుండబెట్టీసీది కోడలు... గాలిపేను ఏస్సీది... గానీ... అంటీ ముట్టనట్టిగే ఉండీది. ఆ సెట్టు కిందే నయము. సెట్టు నీడ కాడ సేరబడి సుట్ట ముక్క కాల్సుకొని కూకున్న సుకము, కుర్సీలు గాలి పేనుల్తోటి వొత్తాదేటి?

ఇంటికెల్తే కోడలు సెప్పింది... "మామా! మీ బాబు సంతకొచ్చే కలుస్తానన్నా"డని. ఈ మద్దినల్లా అలగే సెప్తుంది కోడలు... గాని ఆడు రాడూ, కలవడమవదు. సుట్ట ముక్కకి డబ్బులివ్వడమవుద్దని గావాల తప్పించుకోని తిరుగుతున్నాడు. కోపంతో ముసిలోడి ముఖం ఎర్రబడింది... పడమటి కొండకి చేరిన సూర్యుడి లాగ.

గబ గబా ఇంటికొచ్చేడు. కొడుకు, కోడల్ని కలిపి సింతబొట్లలు దులిపినట్టిగ దులిపీద్దుమనుకున్నాడు.

ఇంటి ముందు మోటర్ బైకు నిలబెట్టి ఉంది. గడపలో ఎవరో ఇద్దరు మాట్లాడుతూ కనిపించేరు. లోపలికెల్లి కోడలినడిగేడు. "ఎవులమ్మీ?' అని. 'ఒకడు పోలీసు, మరొకలు అప్పులోడు' అని చెప్పింది కోడలు ఏడుస్తూ.

ముసిలోడి కోపం ఎగిరిపోయింది. గుండెలో సన్నని భయం కదలాడింది. పిల్లలు బిక్కు బిక్కుమంటూ కూర్చొనున్నారు. కొండలాంటి ముసిలోడు సిందవ ఎదురైతే ఆయుధం లేకుండా ఒట్టి చేతుల్తోటి చంపీగలడు. కానీ ఖాకీ గుడ్డలంటే భయం.... మూగ గాయాల సాక్షిగా.

"సొంబర నీకేటౌతాద్రా?' ఇద్దర్లో ఒకడు అడిగేడు.

"నా కొడుకు బావూ"

"ఎక్కడున్నాద్రా?'

"అదేటి బావూ! ఇక్కడే వుంతాడు"

"ఏడైతే? నీ గోసి గుడ్డల దాస్సేవేట్రా?" వెటకారంగా అన్నాడు. ముసిలోడి గుండెలో రాయి పడింది. మనసు కీడు పసిగట్టింది. పులి తిరుగుతున్న వాసన గుర్తొచ్చింది. ఆత్రుతగా కోడలి వైపు చూసేడు.

"మీ బాబు నెల రోజులా కాసి ఇంటికి రాడం లేదు మామా!' అని మళ్ళీ వెక్కి వెక్కి ఏడుపు అందుకుంది.

"ఏటి? ఏటైంది?" అదురుతున్న గుండెల్తో అడిగేడు. కోడలు జవాబిస్తోంది. ముసిలోడు నిశ్శబ్దంగా, చీకటిలాగా నిలబడి పోయేడు.

'గూడెం లోన పూరిపాక లో ఉన్నన్నాలూ సుకంగుండీది. మొల మీద గోసి గుడ్డ, సేతిలోన గొడ్డలో, కంకో ఉంతే బతుక్కి ఎదుర్నేక పోయింది. కొండ మీద పోడు సేసి సామలో, గంటిలో, జొన్నలో, కందులో తిండికి సరిపడిన

AP SCERT

కాడికి పండించి ఉన్నకాడికి తిని నిరూపూసీగా బతికీసోలం. పంట ఉన్నంత కాలమూ అక్కడ ఏసిన అరప తోనే పొద్దు పోయింది. కోతులు, అనుమంతులు పంట తినీకుంట రాత్రిల్లు తెలివేసే ఉండోలిమి. ఆ యేలప్పుడు. పిన్లగర్ర మీద పాట పాడాల, తుడుము దెబ్బేస్తే ఏ జంతువైనా కొండత్తలకి పారిపోవాల. పిన్లగర్ర పాట, తుడుం దెబ్బ ఆగిపోయిందంతే కందికొత్తల పండుగు అయిపోయిందన్నమాటే. కొండ మీద మంట ఆరిపోయిందంతే పంట సేతికందిపోయిందన్నమాటే.

అలపింటిది, ఈడికి ఉజ్జోగమొచ్చింది. కొండ ఎరగడు. మా తాతల కాంచి సూత్తన్నాను. ఒంటి మీద గోసి గుడ్డ తప్ప ఏటీ వుండీది కాదు. అయితేటి, హాయిగ ఉండోలిమి. ఈడికి సదువే నేర్పిందో మరేటో గానిఈ కాలుకి తిరగలి పాపిల్లాగ బూట్లు... బుర్రకి గాలి తగలకంట టోపి, అవేటో పేసన్లు, పేంటు బుసుకోట్లట. ఇవన్నీ ఏసుకుంతే కొండకి రాగలడా? వొచ్చినా పని సెయ్యగలడా?

లచ్చింపురంల కాపరమెట్టిన కాసి, ముసిల్దాయికి సూడ్డానికైనా కొండకొచ్చోడు కాదు. అద... ఆ ఇల్లే సేసింది. తోటోలందరూ సొంతిల్లు కట్టుకున్నారు, మనమేటి, అద్దింట్ల? మనమూ ఇల్లు కట్టుకుందుమూ అని స్లేబిల్లు కట్టీడానికి తయారైపోనాడు. స్లేబిల్లంతే మాటలేటి? డబ్బుండాలా? అద... అక్కడే సిక్కిపోనాడు. అవేటో సీటీ పాటలట... అందల దిగేడు. అక్కడ డబ్బులు రావాలంతే మరొకల ఆమీ సంతకాలుండాలట. అందికే ఈడికి వరసకు బావే, ఆడూ మేస్టే... ఆడు, ఆమీసంతకం సేసిచ్చేడట. ఆ సీటీ సగం కి సగం పాడీసి ఇంటిమీద పెట్టీసినాడట. ఇల్లుంతే సరిపోద్దా? ఇంటికి సరిపడిన సామాన్లుండాల. పొద్దుపోతే పిల్లలు ఇంకొకల గడపెక్కుతున్నారని ఆ టీవీ తెచ్చేడు. నెలకింత కట్టిద్దుమని డబ్బుల్లేకుండ టీవీ తెచ్చాడు. బాగే బతుకుతున్నాడనుకున్నాము. నాకేటి తెలుసు ఆడెంత ఇబ్బంది పడుతున్నాడో! ఆడికేటి అవుసరాలున్నాయో?! టౌన్ల ఇల్లు గడపడమంతే మాటలేటి? డబ్బుల్తోటి పని.

సీటీ పాట పాడడమైతే పాడీసినాడు గాని నెల నెలా డబ్బులు కట్టనేకపోనాడట. అప్పుడు సీటీవోడు పల్లకుంతాడా? ఆడు కోర్టుల కేసు పెట్టేడట. కోరుటేటి సెప్పిందీ... మనోడికి ఆమీ సంతకం పెట్టినోడి జీతం కాంచి కట్టమని తీరుపు సెప్పిందట. ఆడు మాత్రం ఎక్కడి కాసి తెత్తాడు? ఆడూ పెల్లం పిల్లం, పిల్లా జెల్లా ఉన్నోడోనే. ఆడూ జీతంతోనే బతుకుతున్నోడే. ఆడికి కష్టమనిపించదా? ఇన్నాలూ .. "వోయ్! బావా!" అంతే "ఏమోయ్! బావా?" అనుకోని తిరిగినోలు ఈ ఆమీ గురించే మాట మీద మాటొచ్చి కొట్టుకున్నంత పని సేసేరు. మరి నాబం నేదని మనోడి మీదకి ఆడు పోలీసు కేసు పెట్టేడు.

అద... అక్కడి కాంచి ఈడు కనపడకుండ దొంగ దొంగై తిరుగుతన్నాడు. పోలీసులు, అప్పులోలు నెతుకుతున్నట్టుగున్నారు.

"ఔనా... నీ కొడుకు ఎక్కడున్నాడో చెప్పరా?" అసహనంగా అడిగేడు పోలీసు.

"నాకేటి తెలుసు? ఆడెక్కడెక్కడ తిరుగుతన్నాడో! ఏ యేలకి తిండి తింతన్నాడో ... ఏ ఇరకల దాగుంతన్నాడో నాకేటి తెలుసు? కొండల్లోనున్నోడిని... అడివిలోన బతికినోడిని... నాకెలగ తెలుత్తాది?"

కొడుకు స్థితిని తలచుకొని ఏమైపోతాడోనని రోదించింది తండ్రి హృదయం. పిల్ల తప్పిపోయిన తల్లి మేకలాగయిపోయేడు ముసిలోడు. ఆడు సదవకున్న నాతోనే ఉండిపోయుంతే ఎలగున్నో! అని ఆలోచిస్తూ ఉండిపోయేడు.

బూములన్నీ సావుకారి సేతిలో ఉన్న రోజులు...

పండిన ఒక్క గింజ కూడా తనకి మిగిలేది కాదు. పండించిన పొవ్వాకు, కందులు, జొన్నలూ... ఒకటేమిటి? ఏటి పండితే అది సావుకారికే ఇవ్వాల. రేటు ఆడే సెప్పోడు. ఆ రేటుకే సరుకు ఇవ్వాల. ఆ రోజు... కుడ్డజోల కాసి పసుపు కొమ్ములు తట్టతో దించుతున్నాడు తను. షావుకారి చూసేడు.

APSCERT

"ఒరేయ్! సుక్కూ...!" పిలిచేడు.

ఆగలేదు. మళ్లా పిలిచేడు. ఆగకపోతే దారికడ్డంగా నిలబడి "దించుర... ఏట్రా తట్టలోన?" లాగి అడిగేడు. చెప్పేడు తను.

"ఇంటిల పడీరా..." అన్నాడు.

"ఉ... ఉ... నీకియ్యను. సంతల అమ్ముకుంతాను" అని అన్న మాటకి సావుకారి కోపమయ్యేడు.

"ఈ ఊర్లోన ప్రతీదీ నాకే అమ్మాలా" తట్ట లాక్కుంటూ అన్నాడు.

"కట్టపడ్డాను... పోడు సేసేను. పండించేను. నా యిట్టమొచ్చినోడికి అమ్ముకుంతాను"

"ఎక్కడా కష్టపడ్డావు? నీవు కష్టపడిన ఆ కొండ నాదిరా. అక్కడ పండిన పంట నాదిరా. మర్యాదగా చెప్పిందిను, లేకపోతే అనుభవిస్తావు"

బెదిరించేడు. బెదరలేదు తను. ఆ రోజు పడమటి కొండల్లో ములిగిన సూర్యుడు ఆ మరునాడు తూర్పు కొండ మీద పొలీసుల్తోటి తేలేడు.

పసువు కొమ్ముల తట్టలు షావుకారి గొడాంలోకి చేరేయి. వీధి మధ్యలో కాళ్ళు చేతులు కట్టి తల క్రిందులుగా వేలాడదీయబడిన అతని వొంటిపై లాఠీల దరువులు ... అరుపులు... ఊరు భయంతో వణికింది. కొండలు తిరిగి ఏడ్చేయి.

ఆ రోజుకాసి గూడ గూడంతా తప్పించుకు తిరిగేరు. ఏ కొండపంట ఊర్లోకి తెచ్చినా షావుకారికే అమ్మాలి. లేని నాడు తప్పించుకు తిరగాలి. షావుకారి కాళ్ల నుంచి, పోలీసుల లాఠీల నుంచి తప్పించుకు తిరగాలి.

గతం... కళ్ళ ముందు కదలాడి విషం మింగినట్టు గుటకేసేడు ముసిలోడు.

'అప్పుడు నాను అలగ. ఈ పొద్దు? నా కొడుకు ఇలగ. సదువుకున్నోడు, ఉజ్జోగస్తుడయినాడు. మా కంట తెలివైనోడు. అలపింటిది తప్పించుకొని దొంగ దొంగై తిరగడమేటి? ఆడికా గతేటి? ఎందుకిలగయిపోనాడు? అయినోలకి దూరమైపోయి, ఎన్నాలు తిరుగుతాడు? బావా బావా అని తిరిగినోడు ఈ పొద్దు ఆడి మీద కేసు పెట్టడమేటి? ఉరిలో టిక్కిపోయిన సెవర పిల్లి లాగ గిలగిల్లాడి పోతన్నాడు కొడుకు! అసలీ ఉరులెవులేసినట్టు?' అతనికి ఏమీ అంతు చిక్కడం లేదు.

"ఏదో ఒకటి సెయ్యాల, కొడుకునెలాగోకలాగ దక్కించుకోవాల. మా తాతల కన్నా మీము, మా కన్నా ఈడు కొంతలో కొంతైనా నయమైయున్నారు. రోజులెప్పుడూ ఇలగుండవు. రేపు నా మనవలు ఇంకా నయముగుండాల... "ఎవులు దగ్గిరికెల్లాల? ఎవులు సాయం సేత్తారు?' అని ఆలోచనలోకి జారిపోయేడు.

'ఆ బావే. ఈడు సిన్నప్పుడు దారి తప్పి తిరుగుతున్నోడికి దారిల పెట్టిన గురువు... ఇప్పుడూ దారి సూపెట్టడా?... అతగాని దగ్గిరికే ఎల్లాల' ని అనుకున్నాడు.

లేచి బయలుదేరేడు. ఆకాశంలో నిండు చంద్రుడు వెలుగుతున్నాడు చల్లగా... ముసిలోడికి దారి చూపిస్తూ.

(–జంధ్యావతి కథల సంపుటి)

AP SCERT

3 దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ



స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుశిక్షకు గురైన తొలి తెలుగు మహిళ దువ్వూరి సుబ్బమ్మ. అయితే ఆమెను జైల్లో ఎక్కడ, ఎలా ఉంచాలి? అది జిల్లా కలెక్టరుకు కూడా పెద్దప్రశ్న. అందుకే, ఆయనే సుబ్బమ్మ దగ్గరకు వచ్చి బ్రిటిష్ ప్రభుత్వాన్ని క్షమించమని అడిగితే వదిలేస్తానన్నాడు. తన కాలిగోరు కూడా మీ బ్రిటిష్ ప్రభుత్వాన్ని క్షమాపణ అడగదు అంది ఆమె. సరే! ఒక వంద రూపాయల జరిమానా కడితే వదిలేస్తానన్నాడు. తన తలమీద కప్పుకొన్న చీర చెంగు తీసి, నా దగ్గరేముంది, విధవని బోడిగుండు తప్ప అంటూ పకాపకా నవ్వింది. కలెక్టరుకు ఏం చేయాలో అర్థం కాలేదు. చివరకు కఠినకారాగార శిక్ష విధించాడు. ఆమె ఆనందంగా జైలుకెళ్లింది.

1881వ సంవత్సరం నవంబర్ 15వ తేదీన సుబ్బమ్మ తూర్పు గోదావరి జిల్లాలోని దాక్షారామంలో జన్మించింది. వారి తండ్రి మల్లాది సుబ్బావధాని. పదేళ్ల వయసులోనే సుబ్బమ్మకు వివాహం జరిగింది. ఆమె భర్త దువ్వూరి వెంకటప్పయ్య. అనేక బాల్యవివాహాలలో జరిగినట్లే, సుబ్బమ్మ జీవితంలోనూ విషాదమే నిండింది. ఆమె భర్త వెంకటప్పయ్య మరణించారు. అయితే ఆమె నిరుత్సాహ పడలేదు. చల్లపల్లి వెంకటశాస్త్రి దగ్గర తెలుగు, సంస్కృతం చదువుకున్నది. కృషితో, పట్టుదలతో రెండు భాషల్లో మంచి పాండిత్యం సంపాదించింది. తన పాండిత్యంతో అద్భుతమైన రీతిలో ఉపన్యసించి, బ్రిటిష్ ప్రభుత్వ దుర్మార్గాలను నిర్భయంగా ఎండగట్టింది.


సుబ్బమ్మ గొప్పవక్త. అనర్గళంగా మాట్లాడేది. ప్రసంగం మధ్యలో అనేక తెలుగు పద్యాలను, సంస్కృత శ్లోకాలను అలవోకగా చదువుతూ ప్రసంగించేది. చిలకమర్తివారి పద్యాల్నీ, గరిమెళ్ళవారి పాటల్నీ రాగయుక్తంగా పాడుతూ, ఆంగ్ల ప్రభుత్వాన్ని విమర్శించేది. ఆమె ఉపన్యాసాలను ప్రజలకు వినబడనివ్వకూడదని, ఆమె మాట్లాడే చోట డప్పులు వాయించేవారట. అయినా ఆవిడ తన ఉపన్యాసం ఆపేవారే కాదు. డప్పు కొట్టీ కొట్టీ అలసిపోయి వాళ్ళు వెళ్లిపోయాక, ఆమె తన ప్రసంగాన్ని కొనసాగించేవారు. 1921లో టంగుటూరి ప్రకాశం అధ్యక్షతన కాకినాడలో జరిగిన సభలో, స్వాతంత్ర్య తీర్మానాన్ని సమర్థిస్తూ ఆమె చేసిన అద్భుతమైన ప్రసంగం అశేష జనవాహినిని ఉత్తేజపరిచింది.

సంఘసంస్కరణ మార్గంలో సాగిన నిరాడంబర మహిళ ఆమె. పెద్దాడ సుబ్బమ్మ, చల్లపల్లి సీతమ్మల సహకారంతో మహిళా సభలు ఏర్పాటు చేశారు. బాలికా పాఠశాల స్థాపించి, బాలికలకు ఉచిత భోజన వసతి కల్పించారు. తలమీద ఖాదీ చీరముసుగు వేసుకొనేవారు. చీర కచ్చపోసుకు కట్టుకొనేవారు. చిన్నప్పుడే పోలియో రావడం వల్ల ఒక కాలు

AP SCERT

కుంటుపడింది. అందువల్ల చేతికర్ర సాయంతో కుంటుతూ నడిచేవారు. నెత్తిన ఖాదీ బట్టల మూట, భుజానికి ఖాదీ సంచి.. అలాగే ఊరూరా ఖద్దరు బట్టలు అమ్ముతూ తిరిగేవారు. స్వరాజ్య పోరాటంలో 1920లో మొదటిసారిగా ఒక సంవత్సరం రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించారు. ఆ తరువాత 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని రాయవేలూరు జైలులో నిర్బంధించబడ్డారు. అప్పుడు ఆమెకు ఆరు నెలల జైలుశిక్ష విధించబడింది. 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో, 1940లో వ్యక్తి సత్యాగ్రహంలో 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలు తిన్నారు.

ఎటువంటి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోని వ్యక్తిత్వం ఆమెది. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగల సమర్థురాలు ఆమె. ఆ రోజుల్లో పిఠాపురంలో పెద్దాడ కామేశ్వరమ్మని పోలీసులు తీవ్రంగా కొట్టేరు. ఆ దారుణాన్ని చూసి చలించిపోయి, పోలీసుల లాఠీలకి ఎదురు నిలిచింది. మీరు మనుషులా రాక్షసులా అని నిలదీసింది. ఆమెకు సమాధానం చెప్పలేక పోలీసులు తలొంచుకొని వెళ్లిపోయారు. జీవితమంతా దేశసేవలోనే గడిపిన సుబ్బమ్మగారు ఎటువంటి పదవులూ ఆశించలేదు. ఎటువంటి గౌరవాలూ కోరుకోలేదు. దాదాపుగా 16 ఏళ్లు అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా, స్వాతంత్ర్య ఉద్యమంతో మమేకమయ్యారు. ఆమె చేసిన దేశసేవను దృష్టిలో ఉంచుకొని కాకినాడ కాంగ్రెస్ మహాసభ ఆమెను 'దేశబాంధవి'గా ప్రస్తుతించింది. 1964 మే నెల 31వ తేదీన పరమపదించారు దువ్వూరి సుబ్బమ్మ.



బళ్లారి రాఘవీయం

ఆచార్య బళ్ళారి రాఘవ సుప్రసిద్ధ రంగస్థల నటుడు. ఆయన నాటక ప్రదర్శన కోసం ప్రజలంతా ఎదురు చూసేవారు. ఆర్ట్ లవర్స్ లీగ్ అనే సంస్థను స్థాపించి దేశమంతటా తిరుగుతూ అనేక నాటకాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆనంద భరితులను చేసేవారు. ఒకసారి చంద్రగుప్త నాటక ప్రదర్శన జరుగుతోంది. బళ్ళారి రాఘవ చాణక్యుని వేషంలో స్టేజి మీదకు వచ్చారు. అది శ్మశాన వాటిక దృశ్యం. ఇంతలో ఒక కుక్క వేదికకు అటువైపు నుంచి ఇటువైపుకు వచ్చింది. తెర వెనుక నిలబడ్డ ఇతర నటీనటులు నాటక నిర్వాహకులు అది చూచి ఆందోళన పడ్డారు. బళ్ళారి రాఘవ కుక్క వంక ఒకసారి సాలోచనగా చూసి "శునకమా వచ్చితివా, రమ్ము ఈ శ్మశాన వాటిక నాదే కాదు నీది కూడా" అని సమయస్ఫూర్తితో ఆ ఘట్టాన్ని రక్తి కట్టించారు. ప్రేక్షకులు స్టేజి మీదకు కుక్క రావడం కూడా నాటకంలో భాగమే అని అనుకున్నారట.

AP SCERT

చదవండి – ఆనందించండి

మనస్వి



– ద్వివేదుల విశాలాక్షి

ఆరోజు పాపకి తలంటి నీళ్ళు పోసి, కొత్త బట్టలు తొడిగి మొదటి పుట్టినరోజు పండుగ చేసింది కాంతమ్మ. పిండివంటలతో భార్య పెట్టిన భోజనం ఆరగించి, భుక్తాయాసంతో పడక గదిలో మంచంపై పరమేశం కునుకు తీయబోతుంటే, వీధి తలుపు ఎవరో కొడ్తున్నట్లు చప్పుడు వినిపించింది. ఈ మిట్టమధ్యాహ్నం ఎండలోపడి తమ ఇంటికి ఎవరొస్తారు? పక్కింటి ప్లీడరు గారి కోసం ఎవరో పార్టీ అయి ఉంటుందిలే' అనుకుని – లేవడానికి బద్ధకించి ఇటునుండి అటు తిరిగి మళ్ళీ పడుకున్నాడు.



వంట ఇంటి ముందు వరండాలో కూర్చుని, తనలో తనే ఏదో సన్నగా పాడుకుంటూ మధ్యాహ్నం పేరంటంలో ఇవ్వడానికి తమలపాకుల కిల్లీలు కడ్తోంది భార్య కాంతం. అంతలోనే మళ్ళీ వీధి తలుపు టకటక కొట్టిన చప్పుడు అయింది.

"ఏమండీ! ఎవరో తలుపు కొడ్తున్నారు. ఓసారి వెళ్లి ఎవరో ఏమిటో చూడండి, నా చెయ్యి తెరపిగా లేదు" అంటూ లోనుండి కాంతమ్మ కేక పెట్టింది.

ఇక తప్పదు అనుకుని విసుక్కొంటూనే లేచి వెళ్లి తలుపు తీసేడు. పరమేశం ఎదురుగా ఎవరో కొత్త వ్యక్తి. అంతకి పూర్వం అతన్ని ఎక్కడా చూసిన గుర్తులేదు.

వేళకాని వేళప్పుడు వచ్చి, బంగారం లాంటి తన నిద్ర పాడుచేసిన ఈ ఆగంతకుడు ఎవరబ్బా అనుకొంటూ ఎదుట నిల్చిన వ్యక్తి వైపు పరీక్షగా చూసేడు పరమేశం. మనిషి పొడగరి. ఆ పొడుక్కి తగ్గలావు. భారీ అయిన పంచలోహపు విగ్రహంలా నిండుగా ఉన్నాడు. అరవైకి పైబడి ఉండొచ్చు. మాసిన గడ్డం, నెరసిన జుట్టు, ప్రయాణపు బడలికతో వడలిన ముఖం, నలిగిన బట్టలు, కాళ్లకి మట్టి కొట్టుకున్న చెప్పులూ – పరమేశం ఎంత పరీక్షగా చూసినా ఆ ఆగంతకుడు ఎవరో – ఎక్కడివాడో అతనికి గుర్తు దొరకలేదు. "ఎవరండీ! మీకు ఎవరు కావాలి?" అన్నాడు.

"పరమేశంగారి ఇల్లు ఇదేనాండీ?" అంటూ ఎంతో నిదానంగా, పరమేశాన్ని పట్టి చూస్తూ ప్రశ్నించాడు అతడు.

"అవును.. ఇదే. నేనే పరమేశాన్ని."

"క్షమించాలి. వేళ కాని వేళ వచ్చి ఇబ్బంది పెడ్తున్నాను" అన్నాడు తను నొచ్చుకొంటున్న ధోరణిలో.

AP SCERT

"ఫరవాలేదు చెప్పండి" అన్నాడు పరమేశం – లోలోపల విసుక్కొంటున్నా పైకి సభ్యత కోసం మామూలుగా ముఖం పెట్టి.

"నాపేరు రంగస్వామి. మాది ఈ ప్రాంతం కాదు. ఈ పేపరులో ప్రకటన మీరే వేయించి ఉంటారనుకొని..." అంటూ సగంలో మాట ఆపి, పాతబడిన ఒక చిన్న పేపరు కటింగ్‌ను లాల్చీ జేబులోంచి తీసి పరమేశం చేతికందిచ్చాడు అతడు.

దాన్ని చూడగానే ఒక్కసారిగా ఎలక్ట్రిక్ షాక్ తిన్నవాడిలా అదిరిపడ్డాడు పరమేశం. నలిగి మాసి నాలుగు మడతలు చుట్టుగా ఉన్న ఆ కాగితం ముక్క అతడెవరో, అతనికి తనతో కలిగిన పనేమిటో చెప్పకనే చెప్తోంది. 'మీ పాప తప్పిపోయిందా? అనే ఆ ప్రకటన వేయించింది తనే. పాప తమ ఇంట కాలుపెట్టి వారాలకి వారాలే – నెలలకి నెలలే గడిచిపోతున్నా ఈ పిల్ల మా బిడ్డ' అంటూ పాప కోసం ఎవరూ రాకపోవడంతో – ఏమి చెయ్యాలో పాలుపోక మిత్రుల సలహా మేరకి ఆ ప్రకటన తనే వేయించాడు పరమేశం. అప్పటికే పాపతో అనుబంధం పెంచుకొంటున్న భార్య ఆ పిల్లమీద ఇంకా మమత పెంచుకోకముందే, ఆ తల్లిదండ్రులెవరో వచ్చి, పాపని తమతో తీసుకు వెళితే మంచిదన్న అభిప్రాయంతో ఆపనిచేసేడు.

అది జరిగి కూడా నెలలు గడిచిపోతున్నా, అంతకాలం దాకా ఎవరూ రాకపోవడంతో ఇంక పాప కోసం ఎవరూ రారనీ పాప తమదే అన్న భావంతో వారుండగా, ఇప్పుడీ ఆగంతకుడు ఎవడో, ఎక్కడినుండో, ఉరమని పిడుగులా ఊడిపడి, ఈ ప్రకటన ఇచ్చింది. మీరేనా – అని వాకబు చేస్తున్నాడు. ఇతడు నిజంగా పాపకి బంధువో, శ్రేయోభిలాషో అయి ఉంటే, ఇంతకాలం దాకా పిల్ల గురించి పట్టించుకోకుండా ఉండడం ఎలా జరుగుతుంది? యిందులో ఏదో మోసం ఉండి ఉంటుంది. ఏవో మాయ మాటలు నాలుగు చెప్పి, అందమైన ఆడపిల్లల్ని ఎత్తుకుపోయి, అమ్మే ముఠా ఒకటి చుట్టుపక్కల ఊళ్లల్లో తిరుగుతున్నట్టు పత్రికల్లో వార్తలు చూస్తున్నాడు. ఎదుట ఉన్న వ్యక్తి ఆ కోవకిచెందినవాడు కాదని చెప్పడానికి ఆధారాలేం లేవు. అలాగని వచ్చిన వాడిని వచ్చినట్లే తరిమి కొట్టడానికి తగిన కారణాలు కూడా కన్పించడంలేదు. పైకి చూడ్డానికి మనిషి సౌమ్యుడుగా, మంచీ మర్యాదా తెలిసిన వాడిలా కనిపిస్తున్నాడు. ఇంటి లోపలికిపిలిచి, మాటల్లో పెట్టి, జాగ్రత్తగా నాలుగు ప్రశ్నలు వేస్తే అసలు రంగు బైట పడకపోదు – అనుకున్నాడు పరమేశం.

తన మనోభావాలు పైకి పొక్కకుండా జాగ్రత్తపడుతూ అతడిని సాదరంగా లోపలికి ఆహ్వానించాడు. కాళ్లు కడుక్కోవడానికి నీళ్లిచ్చాడు. కూర్చోవడానికి కుర్చీ చూపి, వంట ఇంట్లోకి వెళ్లి ఒక గ్లాసుతో చల్లని మజ్జిగ తెచ్చి ముందు పెట్టేడు. అతడు అది తాగి, కాస్త సేదతీరాక "ఇప్పుడు చెప్పండి. మీరు వచ్చిన పనేమిటో?" అంటూ మర్యాదగా ప్రశ్నించేడు.

"ఈ ప్రకటన చాలా ఆలస్యంగా నాకంట పడింది. నాకుచేరిన ఈ కాపీలో ప్రింటు అంత బాగాలేదు. అందునా పత్రిక పాతబడి, నలిగిఉన్న కారణాన్న ఫోటోలో ఉన్న పిల్లరూపు సరిగా పోలిక పట్టడానికి వీలుగా లేదు... ఈ ప్రకటన చూసేవరకు, తల్లిదండ్రులు, తాతానాయనమ్మలతో పాటు, తను కూడా దురదృష్ట దారుణ అగ్నిప్రమాదంలో కాలి బూడిద అయిపోయిందే అనుకొన్నాను. మీరు అంటున్న ఈ పాప నా మనుమరాలు అవునో కాదో నాకు తెలియదు. అవునేమో అన్న ఆశతో ఇంత దూరంవచ్చేను..." ఒక్కొక్క మాటే ఆపి ఆపి అతి నెమ్మదిగా అంటున్నాడు అతడు. చివరి మాట అతని నోట తిన్నగా పెగిలి రాలేదు. దుఃఖంతో అతడిగొంతు పూడిపోయింది. కళ్లల్లో నీళ్లు తిరిగేయి. అది కేవలం నటనో నిజమైన దుఃఖమో పోల్చుకోలేకపోయాడు పరమేశం.

ముసలాయన కళ్లు తుడుచుకొని మళ్లీ చెప్పడం మొదలు పెట్టేడు. "మల్లారం మరిడిమాంబ తిరునాళ్లలో జరిగిన దుర్ఘటన గురించి మీరు వినే ఉంటారు..."

మల్లారం వారి పొరుగు గ్రామమే. ఆ దుర్ఘటన గురించి వినడమే కాదు. ఆ జాతరలో జరిగిన బీభత్సాన్ని కళ్లారాచూసేడు పరమేశం.

APSCERT

ఆరోజు మల్లారం గ్రామదేవత మరిడిమాంబ తిరునాళ్ల పండుగ. ఎంతెంత దూరం నుండో ప్రజలు తండోపతండాలుగా వచ్చి చేరేరు.

మరిడిమాంబ గుడి వున్న వీధి అంత విశాలమైందికాదు. ఇసుకవేస్తే రాలనంతగా ఉన్నారు జనం. ఉత్సవం బ్రహ్మాండంగా జరుగుతోంది. పులివేషాలు, బిళ్లవేషాలు, సాముగరిడీలు, చెక్కభజనలు, పగటివేషాలు, బుట్ట బొమ్మలు ఒకటేమిటి, అటువంటి పండుగ సమయాల్లో ఉండవలసిన అన్ని హంగులతో జాతర సాగిపోతోంది.

అంతలో జరిగింది ఆ దారుణ సంఘటన. గ్రామంలోని రెండు ప్రత్యర్థి ముఠాల మధ్య చెలరేగిన విద్వేషపూరితమైన బాణాసంచా పోటీ. మందుగుండు సామగ్రి కాల్చడం మొదలు పెట్టేరు. కాల్చిన బొట్లు, తారాజువ్వలు దారికి ఇటు అటు ఉన్న పాకలపైనా, యాత్రికుల విశ్రాంతి కోసం వేసిన పందిళ్ల పైనా పడి, ఒక్కసారిగా నాలుగు వైపుల నుండి మంటలు లేచేయి.

ఎక్కడెక్కడినుండో జాతర చూడాలని ఉత్సాహంతో వచ్చినవారు ఆ తల్లి గుడి ముందు బూడిద పోగులుగా మిగిలిపోయేరు. అంతకు కొద్దిసేపటికి ముందు ఆనందోత్సాహాలతో పరవళ్లు తొక్కుతున్న ఆ ప్రదేశమంతా అంతలోనే పెద్ద శ్మశానంగా మిగిలిపోయింది. జరిగిన ధనప్రాణ నష్టాలు ఎవరి అంచనాలకీ అందకుండా పోయేయి.

ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని, అందుకొన్న పరుగు ఆపకుండా పరుగెత్తి క్షేమంగా ఇల్లు చేరుకున్నారు పరమేశం కుటుంబం. వణుకుతున్న చేతులతో, ఇంటి తలుపు తాళం తీసి, వారు లోపలికి రాబోతుంటే ఎవరో చిన్న పిల్ల వెక్కి వెక్కి ఏడుస్తూ వీధి అరుగు నీడలో కనిపించింది.

"ఎవరు పాపానువ్వు? మీ వాళ్లు ఎక్కడున్నారు?" అని ప్రశ్నిస్తే అంతవరకు మెల్ల మెల్లగా ఏడుస్తున్నదల్లా ఒక్కసారిగా గొల్లున ఏడవడం మొదలుపెట్టింది. ఎవరో పిల్ల జాతరలో తప్పిపోయి ఇటు వచ్చిఉంటుంది. ఎలా జరిగినా తెల్లారేసరికి వాళ్ల వాళ్లు రానే వస్తారు. ఈ రాత్రికి ఇంటిలోకి తీసుకుపోయి, కాస్త బుజ్జగించి ఇంత తిండి పెట్టి నిద్రపుచ్చితే సరి అనుకున్నారు. దెబ్బలు తుడిచి, మందురాసి – బురద కొట్టుకున్న బట్టలు విడిపించి వేరు బట్టలు తొడిగింది కాంతమ్మ. ఎవరుఎంతగా బ్రతిమాలినా పాప, ఆ రాత్రి తినడం, తాగడం ఏమీ చెయ్యలేదు. అలా వెక్కి వెక్కి ఏడుస్తూనే ఎప్పుడో నిద్రలోకి జారిపోయింది.

తెల్లవారి జాము పొద్దెక్కినా పాపకోసం ఎవరూ రాలేదు. ఎంతో ఓర్పుతో కాంతమ్మ పదే పదే బ్రతిమిలాడి, బుజ్జగించి ఆ పూటకి కాస్తంత పెరుగు అన్నం మాత్రం తినిపించగలిగింది.

ఊరు ఊరంతా రాత్రి జరిగిన ఘోరకలితో ఉడికిపోతోంది. చావగా మిగిలినవారు, తప్పిపోయిన తమ పిల్లల కోసం, సమీప బంధువులకోసం, వీధులూ– తోటలూ, సమీప పొలాలు, నూతులూ, గోతులూ వెతుకులాడ్డం మొదలు పెట్టేరు. తమ యింటి ముందుకి ఎవరు వచ్చినా ఏపాటి సడి అయినా పాపకోసమే ఎవరో వచ్చారనుకొని తలుపు తియ్యసాగేరు పరమేశం దంపతులు. ఆరోజు, మరురోజు, వరుసగా నాలుగు రోజులు గడిచినా పాపకోసం ఎవరూ రాలేదు.

పాప తమ ఇంట కాలు పెట్టి పది రోజులు గడుస్తున్నా తన బంధువులు ఎవరూ వెతుక్కుంటూ రాలేదు. పరమేశం పోలీసు స్టేషనుకి వెళ్లి తప్పిపోయిన పిల్లల వివరాలు తెలుసుకొన్నాడు. ఫోటోలు చూసేడు. వాటిలో తమ ఇంట ఉన్న పాప ఫోటో లేదు. పొరుగూరిలో ఉన్న పెద్ద లైబ్రరీకి వెళ్లి రెండు, మూడు వారాలు దొరికిన దినపత్రికలన్నీ తిరగేసిచూసేడు. వాటిలో తప్పిపోయిన పాపకోసం ఎటువంటి విజ్ఞప్తి లేదు.

ఈ లోగా ఇంట్లో పాప కాంతానికి మాలిమి అయింది. పిల్లలతో కలిసి ఆటపాటలు మొదలుపెట్టింది. రోజులు వారాలకి మారుతున్నా పాప సమస్యకి ఒక పరిష్కార మార్గం కనిపించలేదు పరమేశానికి. అతడు పదే పదే పోలీసు స్టేషనుకి పోయి వాకబు చేస్తుండడంతో అక్కడివారు విసిగి, "మాకు తమ పిల్ల తప్పిపోయినట్లు బంధువుల నుండి ఫిర్యాదు రాందే మేమేం చెయ్యలేమండీ. ఉంచుకోవాలనుకుంటే మీ ఇంట ఉంచుకోండి. లేదంటే ఏ అనాధ శరణాలయానికో, చైల్డ్ వెల్ఫేర్ సెంటరుకో పంపేయండి" అంటూ తెగేసి చెప్పేరు.

AP SCERT

పాపని ఎక్కడికైనా పంపివేయడానికి కాంతమ్మ ఎంత మాత్రం ఒప్పుకోలేదు. "ఎవరూ రాకపోతే పోనీండి. మన ఇంట్లో మన పిల్లలతో పాటే తనూ పెరుగుతుంది. ఆడపిల్ల లేని నాకు ఆ కొరత తీరడానికి మరిడిమాంబ తల్లే ఈ పిల్లని మన దగ్గరికి ఇలా పంపింది అనుకొందాము' అంది ఆమె.

కాని పరమేశం అలా అనుకోలేదు. మిత్రుల సలహాలపై చివరి ప్రయత్నంగా బాగా ప్రచారంలో ఉన్న ఒక ప్రముఖ దినపత్రికలో పాప ఫోటో వివరాలతో ఆ ప్రకటన వేయించాడు.

అది జరిగి కూడా అయిదారు నెలలు గడిచిపోయింది. పరిస్థితిలో, ఎటువంటి మార్పు కనిపించకపోవడంతో, ఇంక పాప తన అన్న భావం, నమ్మకం పరమేశం, కాంతమ్మలకి కాక, పాప ఉదంతం తెలిసిన చుట్టుపక్కల వారికి కూడా కలిగింది. ఆ ఉత్సాహంతో ఈరోజు పాప పుట్టిన రోజు పండుగ ఇంట్లో సంతోషంగా జరుపుకొంటుంటే, ఆ సమయంలో ఎవడో – ఎక్కడివాడో తెలియని వ్యక్తివచ్చి ఏదో కథ చెప్తున్నాడు. అతడు నిజంగా పాప బంధువే అయితే అతడితో పాపని పంపించడానికి పరమేశానికి ఎటువంటి అభ్యంతరం ఉండదు. అలాకాక అతడు మోసగాడై పేపరు ప్రకటన చూసి, దాని ఆధారంగా ఏదో కథలల్లి చెప్పి పిల్లని తీసుకుపోవాలనుకుంటే, అటువంటి పాచికలే తన దగ్గర పారవని అతడికి నిస్సంకోచంగా తెలియజెప్పాలి అనుకున్నాడు పరమేశం. అతడు తన ఆలోచనల్లో తాను సతమతమౌతుంటే – ముసలాయన ఎటోచూస్తూ తన కథచెప్తున్నాడు.

అతడు తన మనుమరాలి వివరాలు చెప్తుంటే పరమేశం గుండెల్లో రైళ్లు పరుగులు తీసేయి. అతడి కళ్ల ముందున్న ఆశల సౌధం విరిగిపడి ఛిన్నాభిన్నం అయింది. అతడు చెప్తున్న మనుమరాలి వర్ణన, పాప పోలికలతో చాలా వరకు కలిసి వస్తోంది. పేపరులోపడ్డ ఆ చిన్న ఫోటో చూసి, అంత వివరంగా పిల్ల అందచందాలు, హావభావాలు వర్ణించి చెప్పడం ఎంత కల్పనాశక్తి ఉన్నవారికైనా సాధ్యపడే విషయంకాదు.

ముసలాయన తన కథనం ముగించి, పై బట్టతో మరొకసారి కళ్లు తుడుచుకొన్నాడు. ఈ సారి పరమేశానికి అది నటనలా అనిపించలేదు. అవి దొంగ కన్నీళ్లలా కనిపించలేదు. అతడిపట్ల మొదట్లో ఏర్పడిన సంశయ భావాలు క్రమంగా తొలగిపోయి, వాటి స్థానంలో సానుభూతి చోటు చేసుకుంది.

భర్త, ముందు వాకిలి వరండాలో చాలాసేపు ఎవరితోనో మాట్లాడుతూ ఉండిపోవడం కాంతమ్మ గమనించింది. వచ్చింది ఎవరా అని అటు చూడవచ్చింది. భర్త ఎదురుగా ఎవరో అపరిచిత వ్యక్తి. అక్కడే నిలబడి పరిశీలనగా అతడి వంకచూసింది. పరమేశం భార్యని అతడికి పరిచయం చేసేడు. "ఈయన రంగస్వామిగారని... చాలా దూరంనుండి మనల్ని చూడ్డానికి వచ్చేరు" అన్నాడు. ఆ పరిస్థితిలో భార్య ముఖంచూస్తూ అతడు పాపకోసం వచ్చేడని చెప్పలేకపోయాడు పరమేశం.

'అయ్యో! అంత దూరం నుండి, మనపై అభిమానంతో ఆయన చూడవస్తే ఇంతసేపూ ఊరికే కూర్చోబెట్టి మాట్లాడుతున్నారా? నన్ను పిలిస్తే కాస్త కాఫీ, టిఫిను తెచ్చి పెట్టేదాన్నికదా' అంటూ కాంతమ్మ లోపలికి వెళ్లి, ఒక ప్లేట్లో రెండు పెరుగ్గారెలు, చిన్నగిన్నెలో పాయసం, ఒక గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి అతడి ముందు పెట్టి "తీసుకోండి" అంది.

"ఇప్పుడు ఈ శ్రమంతా దేనికమ్మా" అన్నాడు అతడు మొహమాటపడుతూ.

"శ్రమకే ముందండీ! ఈ రోజు మా పాప పుట్టినరోజు. అనుకోకుండా వచ్చిన అతిథి దైవసమానుడు అంటారు పెద్దలు. మీరు తింటూ ఉండండి. కాఫీ తెస్తాను. మీచేత్తో పాప తలపైన నాలుగు అక్షింతలు వేసి మరీ వెళ్లండి" అని కాఫీ తేవడానికి లోపలికి వెళ్ళింది కాంతమ్మ.

'ఈ రోజు మా పాపపుట్టినరోజు' అని భార్య అన్నప్పుడు ముసలాయన ఆమె అంటున్న దేమిటో అర్థం కానట్లు, అయోమయంగా ఆమె వైపుచూడ్డం పరమేశం గుర్తించేడు.

"పాప ఎప్పుడు పుట్టిందో మాకు తెలియదు. మా ఇంటికి వచ్చి ఈనాటికి ఏడాది అయింది. అందుకే మా ఆవిడ ఈ రోజు పాప పుట్టినరోజు పండుగ జరిపిస్తోంది" అన్నాడు.

AP SCERT

ఎండ చల్లబడింది. పాపకి తల దువ్వి, పట్టుపావడా కట్టి, మెడలో తనమూడు వరసల ముత్యాల హారం వేసి, బొట్టూ, కాటుకా బుగ్గన దిష్టి తగులకుండా చుక్క పెట్టి అలంకరించింది కాంతమ్మ. ఇరుగు పొరుగు ఇల్లాళ్లు పేరంటానికి వచ్చేరు. వాళ్ళు కూర్చోవడానికి మధ్య హాలులో చాపలు పరిచేరు. కుర్చీలో పాపని కూర్చోబెట్టి దిష్టితీసి, హారతి పట్టేరు. పేరంటాళ్ళ కలగలుపు గొంతులతో పాపని నిండా నూరేళ్లు సిరిసంపదలతో ఆయురారోగ్యాలతో సుఖంగా జీవించమని దీవిస్తూ పాడుతున్న పాటలు, ముందు వరండాలోకి వినిపిస్తున్నాయి. ముసలాయన కళ్లు మూసుకుని తృప్తిగా ఆ పాటలు వింటున్నాడు. అతడి ముఖంలో ముందున్న విషాదం ఇప్పుడు కనిపించడంలేదు. టిఫిను తిని, కాఫీ తాగి మనిషి కాస్తకోలుకున్నాడు అనుకొన్నాడు పరమేశం.

"రండి – మా ఆవిడ పిలుస్తోంది. మనం కూడా వెళ్లి అక్షతలు వేసివద్దాం" అంటూ అతన్ని లేవదీసేడు.

మగవాళ్లు హాలులోకి రావడం చూసి, వాళ్ళంతా పక్కకి తప్పుకొని, వారికి దారి ఇచ్చేరు.

కన్నార్పకుండా పాప వంకే చూస్తున్నాడు అతడు. అతడి కళ్ళ వంకే చూస్తున్నాడు. పరమేశం.

'అయిపోయింది. భయపడినంతా అయిపోయింది. అతను తన మనుమరాల్ని పోల్చుకున్నాడు. ఇంక తనతో తీసుకుపోతాడు' – అనుకొన్నాడు పరమేశం బాధగా. అంతలోనే ముసలాయన ముఖంలో రంగులు మారేయి.

అతడు పాపని పోల్చుకొంటాడా లేదా అన్నది అసలు ప్రశ్నేకాదు. పాప అతన్నిపోల్చుకొంటుందా లేదా అన్నదే పరమేశం పెట్టుకున్న గీటురాయి. దానికోసమే ఆత్రంగా అతడు పాప వైపుచూస్తున్నాడు.

పరమేశంతోపాటు ఇంకొక వ్యక్తి హాలులో కాలుపెట్టినప్పుడే పాప ముఖ కవళికల్లో ఏదో మార్పు వచ్చింది. కూర్చున్నా ఇబ్బందిగా కదలసాగింది. వాళ్లు తనకు దగ్గరగా రాబోతూంటే ముసలాయన వంక పరీక్షగా పట్టి, పట్టిచూసింది. కొద్దిసేపు ఆ కళ్ళల్లో ఏదో చెప్పలేని భావం – ఏవో జ్ఞాపకాల అలజడి – అది గుర్తింపే అనుకొన్నాడు పరమేశం. అతడి మనసు గాలి తీసిన బెలూన్ లా అయిపోయింది. ఇక ఏ క్షణంలోనైనా పాప కుర్చీలోంచి లేచి వచ్చి, 'తాతా!' అంటూ ముసలాయన చేతుల్లో వాలిపోతుంది అనుకున్నాడు.

సంతోషమే మూర్తీభవించినట్టు పేరంటాళ్ళ మధ్య తిరుగుతున్న భార్యని చూస్తే అతడికి జాలివేసింది. పాపం! పిచ్చిది. పాపపై ఎంత మమత పెంచుకుంది. ఎన్ని ఆశలు పెట్టుకుంది. మరికొద్ది సేపట్లో ఈపాప తనకి శాశ్వతంగా దూరం కాబోతుంది అని తెలిస్తే. ఈ ఆనందం అంతా ఏమైపోతుంది? ఆ నిరాశలో ఎలా బ్రతుకుతుంది? – అనుకున్నాడు.

పాప కళ్ళల్లో కదలాడిన ఆ భావం ఒక క్షణకాలం మాత్రమే అక్కడ నిలిచింది. మరుక్షణంలో అతడి నుండి పూర్తిగా చూపు తిప్పేసుకొంది. బిడియంతో కాంతమ్మ పైట కొంగులో దూరిపోయింది. "ఎందుకే అంతసిగ్గు? కొత్తవారు ఎవరున్నారనీ!" అంటూ పాప బుగ్గపుణికి ముద్దు పెట్టుకొంది కాంతమ్మ.

ముసలాయన భారంగా నిట్టూర్చేడు. అందులోని విషాదాన్ని పరమేశం ఒక్కడే గుర్తించగలిగేడు. అతడివంక జాలిగా చూసేడు. పాపని దీవించి, తలపై అక్షతలు వేసి ఇద్దరూ తిరిగి ముందు చావిట్లోకి వచ్చేరు.

"పాపని చూసేరు కదా? ఏమంటారు?" అన్నాడు మాటలు మొదలుపెడుతూ.

"పోలికలు చాలా ఉన్నాయి. పాపని చూడగానే నా మనసు సంతోషంతో పొంగి పోయింది. నా ఒంటరి బ్రతుక్కి ఒక తోడు దొరికినట్లు అనిపించింది. క్షణకాలంపాటు, నా మనుమరాలే అనుకొన్నాను. 'తాతా' అంటూ వచ్చి, నాకాళ్లని వాటేసుకొంటుంది అనుకొన్నాను కానీ..."

"కాదంటారా?" సంశయంగా ప్రశ్నించేడు పరమేశం.

'కాదు' అన్నట్లు తల అడ్డంగా ఊపేడు అతడు.

"మరి చాలా పోలికలు ఉన్నాయంటున్నారు?"

AP SCERT

పరమేశం ప్రశ్నని అతడు వినిపించుకోలేదు.

"మీ కింకా సంశయమేమైనా ఉంటే ఒక పనిచెయ్యండి" అన్నాడు పరమేశం.

"చెప్పండి" అన్నాడు అతడు పాప మీంచి దృష్టి మళ్ళించకుండానే.

'మీరు మీ మనుమరాల్ని ఇంట్లో ముద్దుగా పిలుచుకునే పేరేదో ఉంటుంది కదా– ఆ పేరు పెట్టి పిలవండి. పాప వెనుదిరిగి చూస్తుందేమో – అది తన పేరుగా గుర్తిస్తుందేమో చూద్దాం' అన్నాడు పరమేశం.

కొద్దిసేపు సాలోచనగా కళ్ళు మూసుకున్నాడు అతడు. అంతలో ఏదో నిర్ణయించుకొన్నట్లు కూర్చుని – "నిర్మల తన పేరు, 'నిమ్మీ' అని పిలిచేవారిమి అంతా" అన్నాడు.

"అలాగే పిలవండి" అంటూ తొందరచేసేడు పరమేశం.

అప్పటికే పిల్లలు వీధి గుమ్మం దాటి వెళ్ళిపోతున్నారు.

"నిమ్మీ... నిమ్మీ! ఒకసారి ఇలారా తల్లీ!" అంటూ ఆప్యాయంగా పిలిచేడు అతడు. గుంపుగా వెళ్తున్న పిల్లల్లో ఒకరిద్దరు వెనుదిరిగి, అతడు అలా పిలుస్తున్నది ఎవరినా అన్నట్లు చూసేరు. వాళ్లలో పాపలేదు.

"నేనింక వెళ్లొస్తాను" అంటూ లేచేడు – అతడు తను వచ్చిన పని అయిపోయింది అన్నట్లు.

"ఈ రాత్రికి ఉండి రేపు వెళ్లరాదూ? బాగా అలిసిపోయినట్లు ఉన్నారు" అంది కాంతమ్మ.

"ఇప్పుడు కాదు. ఇంకొకసారి వస్తాను" అని క్షణకాలం ఆగి, "మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు. మీవంటి దంపతుల చేతుల్లో పడ్డ పాప అదృష్టవంతురాలు. ఆ భగవంతుడు పాపని, మిమ్మల్ని ఆయురారోగ్యాలతో పదికాలాలపాటు చల్లగాచూడాలి" అంటూ దీవించేడు.

"పదండి మిమ్మల్ని బస్సెక్కించి వస్తాను. బజార్లో నాకూ కొంచెం పని ఉంది" అంటూ తనూ అతనితో పాటు నడిచేడు పరమేశం.

వాళ్ళు బస్ స్టాండుకి చేరేసరికి అతడు వెళ్లవలసిన బస్సు కదలడానికి సిద్ధంగా ఉంది. అతడు అందులో ఎక్కి కిటికీ పక్కగాఉన్న సీటులో కూర్చున్నాడు.

"మీరు ఎప్పుడైనా ఇటువైపు వస్తే తప్పక మా ఇంటికిరండి" అన్నాడు వీడ్కోలుగా.

"చిన్నమాట" అన్నాడు అతను కిటికీ లోంచి కొంచెం ముందుకు వంగి.

ఏమిటన్నట్లు చూసేడు పరమేశం. "ఇందాక మీ ఇంట్లో – పాపని 'నిమ్మి' అని నేను పిలిస్తే పలకలేదు కదూ. 'కిట్టూ అని పిలవండి. పలుకుతుంది. వాళ్ళమ్మ దాన్ని అలాగే పిల్చేది. దాని పూర్తిపేరు కృష్ణప్రియ" అన్నాడు అతడు నెమ్మదిగా.

"బాబుగారూ" అన్నాడు పరమేశం రెండు చేతులూ పైకెత్తి అతడికి దండం పెడుతూ బస్సు రొదచేస్తూ కదిలింది.


"కిట్టూ పుట్టినరోజు ఈసారి మండు వేసవిలోకాదు. చల్లని చలికాలంలో సంక్రాంతి రోజున చెయ్యండి" ప్రతిగా చెయ్యి ఊపుతూ గట్టిగా అన్నాడు అతడు.

ధూళి చిమ్ముకొంటూ బస్సు ముందుకి పోయింది.

ఆశ్చర్యం నుండి కోలుకొన్న పరమేశం ఇంటిముఖం పట్టేడు.

AP SCERT

4 అయ్యదేవర కాళేశ్వర్రావు



తెలుగును ప్రేమించి, తెలుగుతనాన్ని మనసారా గౌరవించి, తెలుగువారి ఔన్నత్యాన్ని జాతీయ స్థాయిలో చాటి చెప్పి దేశ స్వాతంత్ర్య పోరాటంలో తన సర్వస్వాన్ని ధారపోసి, గాంధీ మహాత్ముడి అనుచరుడిగా, స్వరాజ్య సంగ్రామంలో జైలుశిక్షలు అనుభవించి, జీవితాన్ని దేశసేవలో చరితార్థం చేసుకొన్న మహనీయుడు అయ్యదేవర కాళేశ్వర్రావు. కృష్ణాజిల్లాలోని నందిగామలో కాళేశ్వర్రావు 1882 జనవరి 22వ తేదీన జన్మించారు.

నందిగామలోనే కాళేశ్వర్రావుగారి బాల్యం గడిచింది. అక్కడే ఉన్న ఇంగ్లీషు బడిలో చదివి, తన తొమ్మిదవ ఏట ప్రైమరీ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆయన ఏకసంథాగ్రాహి. ఒకసారి విన్న పాఠం ఎప్పటికీ మరచిపోయేవారు కాదు. ప్రైమరీ తరువాత, హైస్కూల్ చదువుకోసం, ఆ పిల్లవాడిని బందరుకానీ, బెజవాడ కానీ పంపడానికి తల్లిదండ్రులకు మనసు రాలేదు. అందువల్ల 1894 వరకూ ఆయన నందిగామలోనే ఉండిపోయారు. వీరి 14వ ఏట, కంచికచర్ల కరణంగారి అమ్మాయి పింగళి దుర్గాంబతో వివాహం జరిగింది. వివాహం అయ్యాక 1894 జూన్ నెలలో మూడవ ఫారంలో బందర్‌లో చేరారు. ఆ నెలలోనే నెలవారీ పరీక్షలలో ఆయనకు మొదటిస్థానం వచ్చింది. 1897లో మెట్రిక్యులేషన్ పరీక్షలోనూ, 1899లో ఎఫ్.ఏ.లోనూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆయనకు మద్రాసులో బి.ఏ. చదవాలని, ఆ తరువాత ఇంజనీరింగ్ చదవాలని ఉండేది. కానీ, తండ్రి ఆదేశంతో బందరులోనే ఆయన బి.ఏ. చదువుకొన్నారు. 1901లో బి.ఏ. లో ఆయనకు బంగారు పతకం లభించింది. కాలేజీలో ప్రదర్శించే నాటకాలలో వీరు ముఖ్యపాత్రలు ధరించేవారు.

1903లో తండ్రి మరణించడంతో ఆయన బందరు వదిలి, నందిగామ వెళ్లిపోయారు. ఆ తరువాత, 1906లో వారు స్వతంత్ర జీవనం గడపాలని న్యాయవాద వృత్తి చేపట్టారు. రైతు సమస్యల మీద పనిచేయడంలోనూ, మద్రాస్ ఎస్టేటు లాండ్ చట్టం మీద, హిందూ ధర్మశాస్త్రం మీద వారికి గొప్ప ప్రావీణ్యత అలవడింది. న్యాయవాద వృత్తిలో వారెంతో గొప్పపేరు, ధనం సంపాదించారు. ముఖ్యంగా జమీందారీ వ్యవహారాలను చక్కబెట్టడంలో వారి ఆదాయం, కీర్తి ఇబ్బడి ముబ్బడిగా వృద్ధి చెందాయి. అయ్యదేవర కాళేశ్వర్రావుగారి వినయం, సంస్కారం అందరి ప్రశంసలందుకొన్నాయి.

దేశ స్వాతంత్ర్యోద్యమం అయ్యదేవర వారిని బలంగా ఆకర్షించింది. మహాత్మాగాంధీజీ పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమంలోకి అడుగుపెట్టారు. మద్రాసులో వందేమాతర ఉద్యమ స్ఫూర్తితో పెద్ద సభను ఏర్పాటు చేయడంలో, బెంగాల్ విద్యార్థులకు నిధిని సేకరించడంలో వారు ప్రముఖపాత్ర వహించారు. అంతేకాదు, సంఘసంస్కరణకు, అస్పృశ్యతా నివారణకు ఉద్యమించారాయన. ఆ తరువాత 1904, 1905లలో మద్రాసులో కొమర్రాజు లక్ష్మణరావు,

AP SCERT

దేశిరాజు పెదబాపయ్యలతో కలిసి, దళిత విద్యార్థుల కోసం రాత్రి పాఠశాల నడిపారు. 1907లో నందిగామలో సంఘసంస్కరణ సభల్లో, వితంతు వివాహాలు చేసుకొన్నవారి సభల్లో పాల్గొని, వారితో సహపంక్తి భోజనాలు చేసి, ఆ ఊరిలోని దళితుల్ని స్వయంగా సభకు తీసుకువచ్చారు. 1906 నుండి దళితుల పాఠశాల తన స్వంత సొమ్ముతో నిర్వహించారు. 1917లో వీరి సహాయంతోనే విజయవాడలో ప్రథమ ఆదిఆంధ్ర మహాసభ శ్రీ భాగ్యరెడ్డివర్మ అధ్యక్షతన జరిగింది.

పత్రికా రచన, నిర్వహణ అంటే కూడా వారికి చాలా ఇష్టం ఉండేది. అప్పట్లో తిరుపతిలో శ్రీమాన్ తిరువేంగళాచార్యులు వేంకటేశ పత్రిక స్థాపించారు. అందులో అయ్యదేవర వారు స్వరాజ్య పోరాటానికి అనుగుణంగా ఎన్నో వ్యాసాలు వ్రాసేవారు. 1908 మార్చి 26న దేశభక్తుడైన వి.ఓ.చిదంబరం పిళ్ళైని, బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పుడు, స్వరాజ్య పత్రికలో 'అరే ఫిరంగీ క్రూర వ్యాఘ్రమా' అనే ఒక వ్యాసం ప్రకటించారు. దాంతో హరిసర్వోత్తమరావుకు, బోడి నారాయణరావుకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించబడింది. అప్పుడు కాళేశ్వరావుగారే. తెలుగు స్వరాజ్య పత్రిక భారాన్ని స్వీకరించి నిర్వహించారు. గ్రంథాలయోద్యమ విషయంలో అయ్యంకి వేంకటరమణయ్యతో, సూరి నరసింహశాస్త్రితో కలిసి పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపుగా ఏడెనిమిది వందల గ్రామాలలో గ్రంథాలయాలు స్థాపించారు.


వందేమాతర ఉద్యమ కాలం నుండే స్వాతంత్ర్య ఉద్యమంతో అనుబంధం సాగిస్తున్న కాళేశ్వరావుగారు 1917 నాటి కలకత్తా కాంగ్రెస్ మహాసభలతో అఖిల భారత కాంగ్రెస్ సభ్యుడయ్యారు. 1919లో రౌలట్ సత్యాగ్రహ యాత్ర సందర్భంగా, గాంధీజీ విజయవాడలోని వారింటికి విచ్చేశారు. గాంధీజీ పిలుపు మేరకు న్యాయవాద వృత్తిని వదిలిపెట్టి తన సమయం అంతా స్వాతంత్ర్య పోరాటానికే వినియోగించారు. 1921 మార్చి లో అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ మహాసభలు విజయవాడలో జరిగాయి. గాంధీజీతో సహా ఎందరో పెద్దలు ఆ సమావేశానికి విచ్చేశారు. ఆ మహాసభల విషయంలో అయ్యదేవర వారు ఎంతో సేవ చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో కాళేశ్వరావు ఎన్నోమార్లు జైలుశిక్షలు అనుభవించారు. తొలిసారిగా, సహాయ నిరాకరణ ఉద్యమంలో అరెస్ట్ అయి, ఒక సంవత్సరం రాజమండ్రి సెంట్రల్ జైలులో, కడలూరు జైలులో శిక్షను అనుభవించారు. ఆ తరువాత 1930లో శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా, మచిలీపట్నం సముద్రతీరంలో ఉప్పు తయారుచేసి, అరెస్ట్ అయ్యారు.క్విట్ ఇండియా ఉద్యమంలో మరోసారి అరెస్ట్, జైలుశిక్షలు అనుభవించారాయన.

1926, 1937, 1946, 1955 సంవత్సరాలలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో విజయవాడ నుండి పాల్గొని ఘనవిజయాలు సాధించారు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి సభాపతిగా సేవలందించారు. ఆయన మంచి రచయిత కూడా. జైలుశిక్షలు అనుభవిస్తున్న కాలంలోనే "చైనా జాతీయోద్యమ చరిత్ర, ఈజిప్టు చరిత్ర, ఫ్రెంచి విప్లవ చరిత్ర, అమెరికా సంయుక్త రాష్ట్రాల చరిత్ర" మీద మంచి పుస్తకాలు రచించారు. వారి రచన "సవ్యాంధ్రం నా జీవితకథ" వారి జీవితకథ మాత్రమే కాదు, ఆనాటి తెలుగువారి కథకూడా. విజయవాడ పురపాలక సంఘ అధ్యక్షుడిగా విజయవాడకు ఆయన చేసిన సేవ చాలా గొప్పది. 1930లో ఆయన మున్సిపల్ చైర్మన్ గా ఉన్న కాలంలోనే విజయవాడకు విద్యుచ్ఛక్తి వచ్చింది. దక్షిణభారత హిందీ ప్రచారసభ భవనం, ఆంధ్రరత్న భవనాలతో పాటుగా, వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన పెద్ద మార్కెట్, మురుగునీటి పారుదల సౌకర్యాలు, ప్రజలకు మంచినీరు. ఇలా విజయవాడ వికాసానికి కాళేశ్వరావుగారు చేసిన సేవ చిరస్మరణీయం. చివరిగా 1962లో విజయవాడ నుండి శాసనసభకు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. కానీ ఎన్నికల ఫలితాలు వెలువడే ముందే 1962 ఫిబ్రవరి 26న కాళేశ్వరావుగారు మరణించారు.

AP SCERT

చదవండి – ఆనందించండి

అహింస



– దాదాహయత్

అది మోకాలి మీదికి పాకింది. ఒకసారి నిలబడి గంభీరంగా తన స్థితిగతులు పరీక్షించుకొని ప్రమాదమేమీ లేదన్నట్లు మళ్ళీ కదిలి ముందుకు సాగింది ఆ నల్లటి గండు చీమ.



నిద్రమత్తు కళ్ళతో దాన్నే స్తబ్ధుగా చూస్తున్నాడు చంటి. అంతవరకూ ఓపిగ్గా దాన్ని గమనిస్తూ వచ్చాక దాని మీద హఠాత్తుగా ఆసక్తిపోయి విసుగు పుట్టేసి బొటనవేలికి మధ్య వేలును సంధించి లాగి ఒక్కటి తగిలించాడు. గండుచీమ ఎగిరి నేలమీద పడి సర్దుకొని నిలబడి, దొరికిపోయినట్టు తికమకగా ఎటు పారిపోవాలా అని కాసేపు దిక్కులు చూసి వెనక్కి తిరిగి పలాయనం చిత్తగించింది.

ఒక మోకాలి మీద గెడ్డం ఆన్చి నిర్లక్ష్యంగా పారిపోతున్నదాన్ని గమనిస్తూ దిగుల్లో పడిపోయాడు చంటి. ఆరోజు బడికి వెళ్ళాలంటేనే నీరసం ముంచుకొచ్చేస్తోంది. ఏం చేయాలో తోచక జేబు తడుముకొని ఇన్ని బలపాలూ చాక్‌పీసులూ బయటికి తీశాడు. అవి ఎప్పుడూ తన జేబులో వుండాల్సిందే – రాత్రిపూట కూడా ఎవ్వర్నీ తీయనియ్యడు.

ఓ చాక్‌పీసుతో అరుగుమీద ఓ సున్నా గీసి, మధ్యలో నిలువుగా గీత గీసి, చెవులు పెట్టి, పొడుగ్గా రెండు జడలు పెట్టి కింద రాశాడు– 'అమ్మ'. చంటి బళ్ళో చేరి రెండు నెల్లే అయింది. కాని, అంతకుముందే వాళ్ళమ్మ దగ్గర అక్షరాలన్నీ నేర్చేశాడు. అమ్మ పక్కనే నాన్నని గీసి పీచు జుట్టు పెట్టాడు. తర్వాత గంభీరంగా తన సొంత సామర్థ్యాన్ని పరీక్షించుకొని తృప్తిగా చూసి కాస్త వెనక్కి జరిగి కింద మరో బొమ్మ గీశాడు– 'టీచర్.'

ఈలోపల అమ్మ బయటికొచ్చి కొడుకు చిత్రకళా కౌశలాన్ని తిలకించి నవ్వి, "'బొమ్మలు గీస్తూ కూచున్నావా చంటీ! బడికి పోవూ? మొహం కడుక్కోని స్నానం చేద్దూగానా," అని కొడుకుని లేవదీసింది.

మొహమ్మీది కొచ్చిన చింపిరిజుట్టుని వెనక్కి తోసుకొని, "అమ్మా, మా టీచర్ చూడవే– బావుంది కదూ?" కళ్ళు మెరిపించి వేలితో చూపిస్తూ అన్నాడు చంటి.

"ఆ చాలా బావుంది. బడికి వేళ కాదూ? రా."

AP SCERT

చంటికి అరుగు దిగాలనిపించలేదు. బిక్కమొహం వేసుకొని దిగి అమ్మ వెంట వెళ్ళాడు.

స్నానం చేయించుకొని, తల దువ్వించుకొని అమ్మ వెంట వంటగదిలోకి వెళ్ళాడు చంటి.

పొయ్యి వెలిగించి, గిన్నె పెట్టి ఉప్మాకోసం పోపు వేసి తిరగబెడుతున్న అమ్మ కొంగు లాగుతూ వగలు పోసాగాడు.

"అబ్బ, వుండూ ఉప్మా కానీ."

అమ్మ భుజం మీద గెడ్డం ఆన్చి గారంగా, "అమ్మా," అని పిలిచాడు.

"ఊ!"

చీర కొంగుని గుప్పిట బలంగా బిగించి మళ్ళీ పిలిచాడు, "అమ్మా."

"ఏమిట్రా?"

"ఈరోజూ..."

"ఊ"

"స్కూలొద్దే."

చేస్తున్న పనాపి కొడుకు మొహంలోకి నేరుగా చూసి, "ఏం?" అంది.

చంటి జవాబివ్వలేదు. అమ్మ మళ్ళీ పన్లో పడింది.

"అమ్మా..."

"మీ నాన్నగార్నడుగు."

చంటి మొహం వేలాడేసుకొని నిలబడ్డాడు. కాస్సేపాగి మళ్ళీ కొంగులాగాడు.

"ఊ..."

అమ్మ చంటి చేతుల్లోంచి కొంగు లాగేసుకుంది.

చంటి ఖిన్నుడైపోయాడు. అమ్మ నిరసనకు మొహమైతే చిన్నబోయిందిగాని, బడికి మాత్రం వెళ్ళాలన్లేదు. బిక్క మొహమేసుకొని కాస్సేపలాగే నిలబడ్డాడు. తర్వాత అమ్మ భుజం మీద చెయ్యేశాడు.

కాస్సేపూరుకొని ఒక చేత్తో భుజం మీది కొడుకు చేతిని నొక్కిపట్టి తలతిప్పి లాలనగా చూసి, "అలాగేలే. ఇంట్లో కూచుని చదువుకో," అంది.

చంటి మొహం వికసించింది. లావులావు బుగ్గల్ని నవ్వుతో మరింత లావు చేసి వంటగదిలోంచి బయటికి పరిగెత్తి నాన్న గది ముందు, "హాయ్ హాయ్," అని గెంతుతుంటే పేపరు చదువుతున్న నాన్నగారు, "ఏవిట్రా?" అన్నారు కొడుకుని మురిపెంగా చూస్తూ.

గెంతడం ఆపేసి కుర్చీకోడు పట్టుకు నిలబడి, "నాన్నా అమ్మే స్కూలు కెళ్ళొద్దంది," అన్నాడు సిగ్గుగా.

నాన్నగారు విస్మయంగా చూసి, "ఎందుకు?" అనడిగారు.

చంటికేం చెప్పాలో అర్థంకాలేదు. ఆలోచనల్లో పడ్డట్టు మొహం పెట్టాడు.

నాన్నగారు వంటగదిలోకి కేకేసి, "చంటిగాణ్ణి స్కూలు కెళ్ళొద్దన్నావట?" అన్నారు.

"ఆ!" లోపల్నుంచి సమాధానం.

"ఎందుకూ?"

"రేపెళ్తాడు లెండి."

AP SCERT

"ఎందుకనెళ్ళొద్దన్నావ్?" అడిగారు నాన్నగారు.

"వాడు నిన్న ఆదివారమంతా గెంతీ గెంతీ ఈరోజు బడికెళ్ళడానికి బద్ధకిస్తున్నాడు. ఎప్పుడూ ఇలా అడగలేదు. స్కూలుకి పోసన్నాడు– సర్లెమ్మన్నాను."

"అలా ఎందుకన్నావ్? చదువు దగ్గరేం గారాలు!"

"పోన్లెండి, రేపు వెళ్తాడు. రెండు నెల్లేగా బళ్ళో చేరి."

నాన్నగారు ముందుగదిలోని కెళ్ళిపోయి చంటివైపు చూడకుండా సీరియస్ గా పేపర్లో పడ్డారు. చంటి అక్కడే నాన్నగారి మొహంలోకి చూసిచూసి బిడియంగా అక్కణ్ణుంచి కదిలి వెళ్ళిపోయి మళ్ళీ అరుగుమీద కూచొని దిగుల్లో పడ్డాడు. నాన్నగారి కోపం వొచ్చినట్టుంది.

ఇందాక గీచిన బొమ్మలు చెరిపేశాడు.

ఎండవాలు కాస్త ఎక్కువయ్యే వేళకి లేచి ఇంట్లో చాప మీద కూచొని హెూంవర్క్ చేస్తున్న అక్క దగ్గరికెళ్ళి, "అక్కా, కేరంబోర్డాడుకుందామా?" అడిగాడు కుతూహలంగా.

"హెూంవర్క్ చేసుకొని స్కూలు కెళ్ళాల్సుంటే నీతో కేరమ్సాడుకొంటూ కూచొమ్మంటావా?"

చంటి బాసింపట్టేసు క్కూచొని బుద్ధిగా అక్క చేస్తున్న పనివైపు చూస్తూ చదవడానికి ప్రయత్నించాడు. అసలేం అర్థంకాలేదు. విసుగుపుట్టి లేచి పెరట్లోకెళ్ళాడు. బంతిపూవు మీద కూచొని సీతాకోకచిలకొకటి కనిపించింది. చప్పుడు చెయ్యకుండా వెళ్ళి పట్టుకోబోయాడు. సీతాకోకచిలక ఎగిరిపోయి మరోచోట వాలింది. చంటి మళ్ళీ పట్టబోయాడు. అది ఆకాశంలోకి లేచి పెరటిగోడ దాటి ఎగిరిపోయింది. చంటి నిరాశపడిపోయి ఇంకేమన్నా సీతాకోకచిలకలున్నాయా అని చూశాడు. లేవు. ఇంకొంచెం ముందు వచ్చుంటే వుండేవి.

చంటి బంతిపూలు కోద్దామా అని ఆలోచించాడు. అమ్మ తిడుతుంది. నేల మీదికి చూశాడు. పెరటిగోడ మొదట్లో గడ్డిపూలున్నాయి. వెళ్ళి ఒక్కోటీ ఒక్కోటీ కోస్తుంటే వానపామొకటి బద్ధకంగా కదుల్తూ కనిపించింది. చంటి అటూ ఇటూ చూసి ఓ ఎండుపుల్ల నేరి వానపామును కదిలించాడు. అది కాస్త వేగంగా కదిలి ఓ గడ్డిమొక్క పక్కన చిన్న బొరియలోనికి దూరిపోయింది. ఎండుపుల్లతో బొరియలోకి గుచ్చాడు. వానపాము బయటికి రాలేదు. గడ్డిమొక్క పట్టి పీకాడు. బొరియ పెద్దదైంది కాని వానపాము మాత్రం రాలేదు. అయితే బలంగా పీకేసరికి గడ్డిమొక్క వేళ్ళతో సహా ఊడొచ్చి చంటి వెనక్కి చిత్తడిలోకి పడ్డాడు. ఛీఛీ బురదైపోయింది!

"ఒరేయ్ చంటీ, ఉప్మా తిందూగాన్రా," లోపల్నుంచి అమ్మ కేకేసింది.

మొహమంతా చిన్నబుచ్చుకొని లోనికొచ్చిన చంటిని చూసి, "ఛీ... ఛీ... గాడిదా, ఇందాకే కదరా స్నానం చేశావ్," అని బుగ్గగిల్లి లాక్కెళ్ళి చొక్కాలాగూ తీసేసి నీళ్ళగదిలో చంటి కాళ్ళూచేతులూ కడిగింది.

చంటికి బుగ్గ మంటపెట్టింది. కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. రోషమొచ్చింది.

అమ్మ లోపలికి తీసుకెళ్ళి వేరే బట్టలేసి ఉప్మా పెట్టింది.

చంటి ఉప్మా తిని వీధి గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

పక్కింటి హరిగాడు పలకా పుస్తకం పట్టుకొచ్చి, "ఏరా కిరణ్ బడికి రావా?" అనడిగాడు.

చంటి పోజుగా తల పైకెగరేసి లేదన్నట్టు తలూపాడు.

"ఏం?"

"మా అమ్మెళ్ళొద్దంది."

APSCERT

హరికి అర్థంకాలేదు, "దేనికి?"

"నేనే పోనన్నాను."

"అసలు స్కూలుకే రావా?"

"వస్తాను. ఈరోజు రాను."

"మరి మీ అమ్మ కొట్టదా?"

"మా అమ్మ కొట్టదుగా," అన్నాడు చంటి గర్వంగా.

హరి వెళ్ళిపోయాడు. చంటి ఇంకాసేపు అక్కడే నిలబడి ఇంట్లోకొచ్చాడు. తెలుగు వాచకం ముందేసుకు కూచొని బొమ్మలు చూడ్డం మొదలెట్టాడు. కాస్సేపటికి అక్క స్కూలు కెళ్ళిపోయింది. బట్టలేసుకొని నాన్నగారు పదింటికి ఆఫీసు కెళ్ళిపోయారు. పుస్తకం పక్కన పడేసి విసుగ్గా హాల్లోకొచ్చాడు చంటి.

ఆదివారానికీ మామూలు రోజుకీ తేడా అప్పుడు తెలిసింది. కేరమ్స్, బంతాటా ఆడడానికి అక్క లేదు. స్కూలు కెళ్ళిపోయింది. ఒళ్ళో కూచోబెట్టుకొని కథలు చెప్పడానికి, మురిపించడానికి నాన్నగారు లేరు. ఇల్లంతా బోసిపోయి మూగగా కనిపించింది.

నాన్నగారి కుర్చీ ఖాళీగా కనబడితే దిగులుగా వెళ్ళి కూచుని బల్ల మీదున్న లావుపాటి పుస్తకాన్ని ఒళ్ళో పెట్టుకొని పేజీలు తిప్పడం మొదలెట్టాడు. లోపల బొమ్మలేం లేవు.

చంటికి ఒకసారి నాన్న చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. నాన్న ఈ పుస్తకం చదువుతుంటే, "ఏవిట్నాన్నా అదీ?" అనడిగాడు తను.

"నా పుస్తకం నాన్నా."

"ఏముంటుందందులో?"

"ఆఫీసు మాటలుంటాయి."

"ఓ" అని అర్థమైపోయినట్టు కళ్ళు మెరిపించాడు.

"ఎంత పెద్ద పుస్తకమో!" అన్నాడు తను మళ్ళీ.

నాన్నగారు నవ్వి, "నువ్వు రోజూ స్కూలుకెళ్ళి బాగా చదూకుంటే ఇంతకంటే పెద్ద పుస్తకాలు చదివేస్తావు నాన్నా," అన్నారు.

తనకు భలే సంతోషమేసింది.

ఈ విషయం గుర్తుకు రాగానే హాయిగా నవ్వుకొంటూ కుర్చీ వెనక్కి వాలి ఆలోచనల్లో పడ్డాడు. తను స్కూలు కెళ్తాడు. బాగా చదూకుంటాడు. నాన్నగారిలా పెద్ద పెద్ద పుస్తకాలన్నీ చదివి పారేస్తాడు.

ఒళ్ళోని పుస్తకం అపురూపంగా కనిపించి దాన్ని ప్రేమగా నిమిరి జాగ్రత్తగా బల్ల మీద పెట్టాడు.

గుండెలురకలేస్తుండగా అమ్మ దగ్గరికి పరిగెత్తాడు.

"అమ్మా... అమ్మా, నేనేం, నాన్నారిలా పెద్ద పె...ద్ద పుస్తకాలన్నీ చదివేస్తాను పెద్దయ్యి." అన్నాడు ఉత్సాహంగా.

"ఊహూ," అంది అమ్మ నిరాసక్తత చూపుతూ.

"ఇంతింత పెద్ద పుస్తకాలు..." రెండు చేతుల నడుమ గొప్ప ఖాళీని చూపుతూ అన్నాడు.

"ఎలా? నువ్వు సరిగ్గా బడికెళ్ళవుగా!"

APSCERT

చంటి ఉత్సాహం నీరుగారిపోయింది. ఖిన్నుడై వెళ్ళిపోతున్న కొడుకుని చూసి నవ్వుకొంది అమ్మ.

చంటి పెరట్లోకొచ్చాడు. బాగా ఎండ కాసింది. ఆడుకోవాలనిపించలేదు. ఇంట్లో కొచ్చేశాడు. మళ్ళీ వెళ్ళి నాన్నగారి కుర్చీలో కూర్చున్నాడు.

హరిగాడేం చేస్తున్నాడో! నిన్న హరిగాడితో తనెంత ఆడుకున్నాడో!

హరి గుర్తుకొచ్చేసరికి చంటికి స్కూలు గుర్తుకొచ్చింది. స్కూలుతోపాటు టీచర్ గుర్తుకొచ్చింది. టీచరంటే చంటికి భలే ఇష్టం. ఎన్నెన్నో కథలు చెబుతుంది– కొట్టనే కొట్టదు.

బెత్తం మాత్రం చేతిలో ఊతంగా ఊగుతూనే వుండాలి.

చంటికి తన డెస్కు గుర్తుకొచ్చింది. ఖాళీగా వుండి వుంటుంది. చెప్పలేనంతగా దిగులేసింది.

లేచి ఇంట్లోంచి బయటికెళ్ళాడు. బయట దూరంగా రోడ్డు పక్కనే ఓ చెట్టు మొదట్లో కొంతమంది పిల్లలు గోళీలాడుతున్నారు. వెళ్ళి కుతూహలంగా చూస్తూ నిలబడ్డాడు. చంటి చూస్తుండగానే వాళ్ళలో వాళ్ళకి కొట్లాట మొదలయ్యింది.

చంటికి భయమేసి ఇంట్లోకి దూరిపోయి పెరట్లో కెళ్ళాడు. మూడు రాళ్ళనేరి తనూ గోళీలాట మొదలెట్టాడు. ఎండలో చురుకుపాలు చాలా పెరిగింది. ఒంటరిగా ఆడినంతసేపాడి రాళ్ళు పారేసి ఇంట్లో కొచ్చాడు.

అమ్మ బియ్యం చెరుగుతోంది.

దగ్గరకెళ్ళి, "అమ్మా! తాయిలం చెయ్యవూ," అనడిగాడు.

"రోజూ తాయిలమెక్కణ్ణించి తెచ్చేదిరా? నిన్న తిన్లేదూ!"

"ఊహూ, చెయ్యి."

"ఊహూ, నిన్నంటే అక్క కూడా వుండింది కదా!"

"అక్క మళ్ళా తింటుందిలే."

"ఊ, బావుంది. నువ్వు స్కూలు కెళ్ళనప్పుడల్లా తాయిలాలు చేసిపెట్టాలా? ఆదివారం పూటంటే అందరూ వుంటారు. అందరూ తింటారు. మళ్ళీ ఆదివారం చేస్తాలే."

ఉక్రోషంగా చంటి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఇప్పుడు పూర్తిగా ఒంటరితనం కనిపిస్తోంది. ఆడుకోడానికెవరూ లేరు. వెళ్ళి కేరంబోర్డు ముందేసుకొని ఒక్కడే ఆటాడ్డం మొదలెట్టాడు. ఇట్నుంచటు కొట్టి స్ట్రైకర్ని అవతలికెళ్ళి తెచ్చుకోవాలంటే చిరాకేసింది. బోర్డు నెత్తకుండా ఎక్కడి కాయిస్సక్కడే పడేసి లేచిపోయాడు. బయటకొచ్చి చూశాడు. గోళీలాడుకునే పిల్లల్లేరు. అమ్మ దగ్గరికెళ్ళి, "అమ్మా కథ చెప్పు," అన్నాడు.

"పన్లు చేసుకొంటుంటే కథలు కావల్సొచ్చాయా! పనుంది పో."

అక్కడే కూచుని అమ్మ బియ్యం చెరగడం చూస్తూ మెల్లగా జరిగి ఒళ్ళో తల దాచుకోబోయాడు. తోసేసింది.

అప్పుడొచ్చిందేడుపు. లేచి నిలబడి కాళ్ళు నేలకేసి కొట్టి ఏడుస్తూ వెళ్ళి చాప మీద పడుకున్నాడు.

చంటికి మళ్ళీ స్కూలు గుర్తుకొచ్చింది.

గుంపులు గుంపులుగా పిల్లలు, తెలుగు వాచకం పట్టుకొన్న టీచరు చాలా ప్రియంగా కనిపించారు. స్కూలు మీద అనుకోని ప్రేమ ముంచుకొచ్చేసింది.

అలాగే పడుకొని నిద్రపోయాడు చంటి.

AP SCERT

సాయంత్రం నాలుగున్నరకు నిద్రలేచి కాసేపు అటుఇటూ తిరిగి వీధి గుమ్మం దగ్గరికెళ్ళి నిలబడితే హరిగాడు స్కూలు నుంచి ఇంటికొస్తూ కనిపించాడు.

"ఒరే కిరణ్, నువ్వు రాలేదురా. టీచర్ భలే కథ చెప్పింది."

ఉత్సాహంగా ముందుకు వంగి, "ఏం కథరా," అడిగాడు చంటి.

"జింకా నక్కా కథ."

"ఒరే ఒరే నాకు చెప్పరా."

'తర్వాత చెప్తారా. టీచర్ నువ్వు రాలేదేమంది. నువ్వు చెడిపోతున్నావన్జెప్పింది."

చంటి గుండె దిగజారిపోయింది.

"ఒరే, ఈరోజు కేశవం మాస్టారు మా అందరిచేత కబడ్డి ఆడించారు వాళ్ళ క్లాసు వాళ్ళకి, మనకూ."

"ఎవరు గెలిచార్రా?" "మనమే."

చంటి గుండె గర్వంతో నిండిపోయింది.

హరి వెళ్ళిపోయాక చంటి దిగాలుగా ఇంట్లో కెళ్ళాడు.

సాయంత్రం నాన్నా, అక్కా వచ్చేశాక బాగా ఆడుకున్నాడు. ఊరికే నాన్న దగ్గర్నుంచక్క దగ్గరికి, అక్క దగ్గర్నుంచి నాన్న దగ్గరికి తిరిగాడు.

ఆరోజు రాత్రి పడుకోబోయే ముందు, "అమ్మా, జింకా నక్కా కథేంటే?" అనడిగాడు చంటి.

"ఏ జింకా నక్కా?"

"నాకేం తెలుసు. మా టీచర్ చెప్పిందంట. హరిగాడన్నాడు."

"అదా," అని అమ్మ చెప్పడం మొదలెట్టింది. "అనగనగా ఓ అడవిలో ఓ జింక వుండేదట. ఓ నక్క దాన్ని చూసి ఎలాగైనా తినేద్దామని దాంతో స్నేహం చేసిందట..."

చంటి ఒళ్ళంతా చెవులు చేసుకొని కథ విన్నాడు.

కథ విపరీతంగా నచ్చేసింది.

బాగా పొద్దుపోయాక అమ్మ గుండెల్లో వెచ్చగా మొహం దాచేసుకొని ఏవో ఆలోచనల్లో పడిపోయిన వాడల్లా ఉన్నట్టుండి తల పైకెత్తి, "అమ్మా– రేపు తొందరగా నిద్ర లేపాలి," అన్నాడు.

కళ్ళు మూసుకు పడుకున్న అమ్మ కళ్ళు తెరిచి చూసి, "దేనికి?" అనడిగింది.

"స్కూలు కెళ్ళడానికి," అనేసి మళ్ళీ గుండెల్లో దాగిపోయాడు చంటి.

AP SCERT

5 కడప కోటిరెడ్డి, రామసుబ్బమ్మ దంపతులు



సత్యాహింసల శాంతిమార్గమే తన మార్గమని ఆచరించి చూపిన ధీశాలి కోటిరెడ్డి. కోటిరెడ్డి కడపలో స్థిరపడ్డారు. అందువల్ల కడప కోటిరెడ్డిగా ప్రసిద్ధినందుకొన్నారు. ఉన్నతమైన ఆలోచన, ఉత్తమమైన భావాలు కోటిరెడ్డిలో బాల్యంలోనే వెలుగుచూశాయి. సత్యధర్మాలపైన అంతులేని విశ్వాసం, మానవత్వంపైన గొప్ప నమ్మకం, కష్టించి పనిచేసేతత్వం, అందర్నీ ప్రేమించే అలవాటు కోటిరెడ్డి జీవితాన్ని నడిపించిన మౌలిక సూత్రాలు.

నేటి చిత్తూరుజిల్లా మదనపల్లె తాలూకా, నారాయణ చెరువు గ్రామం వీరి స్వస్థలం. కోటిరెడ్డి జననం 1886లో ఈ పల్లెలోనే జరిగింది. వారి తండ్రి సిద్ధారెడ్డి, తల్లి నాగమ్మ. వీరికి తాతగారి పేరు పెట్టడం జరిగింది. వీరి పూర్తి పేరు కోటిరెడ్డిగారి కోటిరెడ్డి. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్టుగా కోటిరెడ్డికి చిన్ననాటే రామాయణ భారతాలంటే ఇష్టం కలిగింది. ఆ కథల్లో కన్పించే మహోన్నతమైన విలువలు, ఆయన జీవితాన్ని తీర్చిదిద్దాయి.

ఆయన బాల్యం తన పల్లెటూరిలోనే సాగింది. ఆ తరువాత ఉన్నత చదువుకోసం, మద్రాస్ విశ్వవిద్యాలయంలో చేరాడు. ఎంతో శ్రద్ధతో చదివి బి.ఏ. పాసయ్యాడు. ఆయన ఆలోచనలో మొదటినుండీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు నిండి ఉన్నాయి. అందుకే, కోటిరెడ్డి మనసు న్యాయవాద వృత్తిమీద లగ్నమైంది. దానితో న్యాయశాస్త్ర విద్యకోసం, ఇంగ్లాండ్ వెళ్లి, మిడిల్ టెంపుల్లో చదువుకొన్నారు. కష్టపడి చదివి, బారిస్టరై భారతదేశానికి తిరిగి వచ్చారు. మద్రాసులోనే న్యాయవాదిగా ఆయన ప్రాక్టీసు ఆరంభం అయ్యింది. చదువులో, జ్ఞానంలో ఆయన గొప్పవాడే కానీ, ఆచరణ దగ్గరకు వచ్చేసరికి, ఆయనకు అంతా అగమ్యగోచరమయ్యింది. ఆ వాతావరణానికి ఆయన మనసు సర్దుబాటు కాలేకపోయింది. కొద్ది రోజులు ఈ సంఘర్షణ అనుభవించాక, కోటిరెడ్డి తన న్యాయవాద వృత్తిని వదిలిపెట్టేశారు. స్వతంత్ర జీవనాన్ని మనసారా ఇష్టపడ్డ కోటిరెడ్డి, కడప చేరి అక్కడే స్థిరపడ్డారు. తనకున్న కొద్ది పొలాన్నీ సేద్యం చేసుకొంటూ, వ్యవసాయదారునిగా స్వేచ్ఛగా జీవించడం మొదలుపెట్టారు.

కోటిరెడ్డి దృష్టి పూర్తిగా భారత స్వాతంత్ర్య పోరాటం వైపు సాగింది. మహాత్మాగాంధీజీ అన్నా, ఆయన సిద్ధాంతాలన్నా కోటిరెడ్డికి ఎంతో ఇష్టం కలిగింది. ముఖ్యంగా సత్యాహింసల శాంతిమార్గం కోటిరెడ్డిని చాలా ఆకర్షించింది.

AP SCERT

తొలినుండీ ఆయన ఆలోచనలు, ఆశయాలు అందుకు తగినవిధంగానే ఉండడం వల్ల స్వరాజ్య పోరాటంతో మమేకమయ్యారు.

1921వ సంవత్సరంలో మహాత్మాగాంధీజీ ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పర్యటించారు. సహాయనిరాకరణ ఉద్యమం గురించి ప్రజల్లో గొప్ప అవగాహన కల్పించడానికి మహాత్ముడి ప్రసంగాలు ఎంతో దోహదం చేశాయి. గాంధీజీ రాయలసీమలో పర్యటించినప్పుడు, కోటిరెడ్డి ఆయనతో కలిసి సాగి ప్రతి సభని విజయవంతం చెయ్యడంలో ఎంతగానో కృషి చేశారు. సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు వీరికి ఆప్తులు. రాయలసీమలో హోంరూల్ ఉద్యమ కార్యక్రమాలలో, సర్వోత్తమరావు గారితో కలిసి పనిచేశారు. ఆంధ్ర మహాసభకు 1929లోనూ, 1937లోనూ, ఆయన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

స్వరాజ్యపోరాట కార్యకలాపాలలో పాల్గొనవలసిందిగా తన భార్య రామసుబ్బమ్మని, కోటిరెడ్డి ఎంతో ప్రోత్సహించారు. రామసుబ్బమ్మ 1902వ సంవత్సరంలో కడపజిల్లా, జమ్మలమడుగు తాలూకా, సుద్దపల్లెలో, కొనుదుల రామచంద్రారెడ్డి, అచ్చమాంబ దంపతులకు జన్మించారు. 1917వ సంవత్సరంలో, పదిహేనవ ఏట ఆమెకు కోటిరెడ్డితో వివాహం అయ్యింది. భర్తే ఆమెకు గురువయ్యాడు. ఆయన నేతృత్వంలోనే ఆమె ఇంగ్లీషు నేర్చింది. కొద్ది కాలానికే అనర్గళంగా మాట్లాడే శక్తి, సామర్థ్యం అలవడ్డాయి. దానికితోడు ఆమెలో సహజంగా ఉన్న పట్టుదల, ఉత్సాహం, ఆమెకు స్వాతంత్ర్య ఉద్యమంతో బలీయమైన అనుబంధం ఏర్పరచాయి.


సైమన్ కమీషన్ బహిష్కరణ ఉద్యమం, మద్రాస్‌లో ఎంతో బలంగా సాగింది. అప్పుడే ఆమె ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం చూపిన తెగువను, ధైర్యాన్ని కళ్లారా చూశారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా ధారపోయడానికి సంసిద్ధుడైన ఆంధ్రకేసరి త్యాగనిరతి రామసుబ్బమ్మని ఎంతో ప్రభావితం చేసింది. నాటినుండీ ఆమె తన కాలాన్ని, సమయాన్ని స్వాతంత్ర్య పోరాటానికే వినియోగించారు.

1938లో ఆమె కడపజిల్లా బోర్డు అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఎంతో సమర్థవంతంగా తన బాధ్యతల్ని నిర్వహించి, క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా తన పదవికి రాజీనామా చేశారు. 1940లో ఆమె మహిళా సమాజాన్ని ఏర్పాటు చేసి మహిళల హక్కుల్ని కాపాడడానికి ఎంతో కృషి చేశారు. దేశంలోని ప్రసిద్ధులైన అనేకమంది మహిళలతో ఆమె కలిసి పనిచేశారు. కడపలో మహిళా డిగ్రీ కళాశాల స్థాపనకు ఉద్యమించడమే కాక, స్వయంగా లక్షరూపాయలు విరాళం అందించిన దాతృత్వం రామసుబ్బమ్మది.

హోమ్‌రూల్ ఉద్యమం నాటినుండీ సాగిన కడప కోటిరెడ్డి, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని మహాత్ముడి రాయలసీమ పర్యటన, సైమన్ కమీషన్ బహిష్కరణ, దండి ఉప్పు సత్యాగ్రహం మరెంతో ఉత్తేజితం చేశాయి. మహాత్మాగాంధీ వ్యక్తి సత్యాగ్రహం ఆరంభించినప్పుడు వ్యక్తి సత్యాగ్రహిగా ముందు నిలిచాడు. దాని ఫలితంగా కోటిరెడ్డిని అరెస్ట్ చేసింది బ్రిటిష్ ప్రభుత్వం. 1940 లో తొలిసారి ఎనిమిది నెలలు వెల్లూరు జైలులోనూ, తిరుచనాపల్లి జైలులోనూ కఠినకారాగార శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయనలోని ధైర్యాన్ని, స్వరాజ్య స్ఫూర్తిని మరింత శక్తిమంతం చేసింది. తిరిగి ఆయన క్విట్ ఇండియా ఉద్యమంలోనూ అరెస్ట్ అయ్యారు. వెల్లూరు జైలులోనూ, అమరావతి జైలులోనూ, కఠిన కాగారార శిక్షకు గురయ్యారు. ఆ రోజుల్లోనే, వారి తండ్రి మరణించారు. 1943 డిసెంబర్లో ఆయన జైలునుండి విడుదలయ్యారు. రెండవసారి జైలునుండి తిరిగి వచ్చేక, స్వాతంత్ర్యోద్యమంలో మరింత ఉత్సాహంతో పాల్గొన్నారు కోటిరెడ్డి.

AP SCERT

స్వాతంత్ర్య పోరాటంతో పాటుగా ఆంధ్రోద్యమంలో కూడా కోటిరెడ్డి, వారి ధర్మపత్ని రామసుబ్బమ్మ ఎంతో కృషి చేశారు. రాయలసీమ ప్రాంతంలో ఖాదీ ప్రచారానికి వారు చేసిన కృషి గొప్పది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, 1952లో జరిగిన ఎన్నికల్లో కడపనుండి గెలుపొంది, శాసనసభ్యులయ్యారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం మంత్రివర్గంలో మంత్రిగా కోటిరెడ్డి పనిచేశారు. రాయలసీమ కరువు సంఘానికి అధ్యక్షుడిగా ఎంతో కృషి చేశారు. ఆంధ్రమహాసభకు అధ్యక్షుడిగా శ్రీబాగ్ ఒప్పందంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారు. తొంభై అయిదేళ్ల సంపూర్ణ జీవితమంతా దేశంకోసం, సమాజం కోసం తపించి, సమాజ సేవలో చరితార్థులైనారు కోటిరెడ్డి, రామసుబ్బమ్మ దంపతులు.



పారిభాషిక పదాలు

అభిరుచులు అనుక్షణం తమ మాటల్లో వ్యక్తం అవుతాయి అనడానికి దువ్వూరి వెంకట రమణ శాస్త్రి గారి సంభాషణలను చక్కని ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

ఒకరోజు డాక్టర్ అనంత పద్మనాభ రావు గారు శాస్త్రిగారిని భోజనానికి పిలిచారు. అతిథిగా వెళ్లిన వెంకటరమణ శాస్త్రి గారు పద్మనాభ రావు గారి శ్రీమతితో శాక పాకాలను గురించి తన అలవాట్లను చెబుతూ "అమ్మా నాకు తాలవ్యాలే తప్ప దంత్యాలు లేవు మీరు ఏమి చేస్తున్నారో" అని చమత్కరించారట. దువ్వూరి వారు జీవిత చివరి దశలో పక్షవాతంతో బాధపడుతున్నారు. ఒకరోజు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ గా పని చేస్తున్న కొర్లపాటి శ్రీరామమూర్తి గారు ఆయనను పరామర్శించడానికి వచ్చారు. మీ పరిస్థితి ఎలా ఉంది అని అడిగారు, దానికి శాస్త్రి గారు నవ్వుతూ ఏముంది అచ్చుకో ప్రయత్నం, హల్లుకో ప్రయత్నంగా ఉంది అన్నారట.

AP SCERT

చదవండి – ఆనందించండి

చంద్రవంక



– పోరంకి. దక్షిణామూర్తి

చంద్రవంక పొంగింది!

కట్టలు తెంచుకు పారింది.

చరచరా సాగుతూ ఊరంతా నిండింది.

ఎక్కడ చూసినా హాహాకారాలు, ఆర్తనాదాలు. ఊరు ఊరంతా గగ్గోలెత్తిపోయింది.

మాచర్ల చెన్నని ఆలయ ప్రాంగణంలో, మడిబట్ట కట్టుకొని మౌనముద్రలో కూర్చున్న మంగయ్య శాస్త్రి కళ్ళు విప్పి చూశాడు.

ఆలయ ప్రాంగణమంతా అంతులేని జల సముద్రం అయిపోయింది.

హోరున వర్షం పడుతోంది.

మంగయ్య శాస్త్రి గుండె కుదేలయిపోయింది! ఒక్క ఉదుటన లేచి మంటపం నలుమూలలకీ చూశాడు. మనమడు ఏవైపోయాడోనని మనస్సు విలవిల్లాడిపోయింది.



మనమడు చిన్న మంగయ్య శాస్త్రి – మంటపానికి వెనకతట్టున నీటిని చెదరగొడుతూ ఆడుకుంటున్నాడు.

అతనికి ప్రాణం లేచి వచ్చింది.

"బాబూ! ఇక్కడున్నావా? ఇంటికి పోదాం, రా బాబూ!" అంటూ వాణ్ణి దగ్గిరకి తీసుకోబోయాడు.

చిన్నవాడు తాత చేతులు తోసి పారేస్తున్నాడు. చుట్టూతా ఇంత నీటిని చూస్తూంటే వాడికి కన్నులపండువగా ఉంది. అరచేతులతో నీటిని చెదరగొడుతూంటే, తుంపరలు ముఖంమీదకి వచ్చి పడుతుంటే వాడికి ఎంతో కులాసాగా ఉంది. అందువల్లనే తాత చేతుల్లోనుంచి మళ్ళీ జారిపోయి నీళ్ళల్లో పడ్డాడు.

"బాబూ! వద్దు బాబూ! ఇంటికి పోదాం పద! అమ్మా, నాన్నా మనకోసం వెతుక్కుంటూ ఉంటారు" అన్నాడు.

"ఇంటికొద్దు తాతా! నాకిక్కలే బావుంది!" అన్నాడు వాడు. వచ్చీరాని మాటలతో.

AP SCERT

చిన్నవాడి అమాయికత్వానికి నవ్వుకోవాలో, వచ్చిపడ్డ ఆపదకి బాధపడాలో తెలిసింది కాదు, మంగయ్య శాస్త్రికి.

ఇల్లు ఏ పరిస్థితిలో ఉందో, ఇంటి దగ్గిరివాళ్ళు ఏమైపోయారోనని దిగులెక్కువైపోతున్నది. ఇక ఉండబట్టలేక, మనమణ్ణి చటుక్కున లేవనెత్తుకుని ఆలయ మంటపం దిగి వచ్చాడు.

చెంపలు పగిలేటట్టు వర్షం జోరుగా కొడుతుంది. నాగేశ్వరస్వామి శిలాస్తంభంమీదకి నీరు పాకుతూ ఉంది.

వర్షం అంతకంతకు పెరుగుతూనే ఉంది.

పోతూ పోతూ వీరభద్రస్వామి వైపు దీనంగా చూశాడు. ద్వారం ఇవతల పతనావస్థలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి ముందు ఒక్క క్షణం ఆగి చేతులు జోడించాడు.

"స్వామీ! నువ్వు ప్రత్యక్షదైవానివి! ఈ దీనుణ్ణి కరుణించు స్వామీ!" అని వెలుపలిద్వారం దాటి నడిచాడు.

ఊరంతా జవజవలాడిపోతున్నది!

చుట్టూ హాహాకారాలు అంతకంతకు ఎక్కువయ్యాయి. ఊళ్లో జనమంతా సామానులు మిద్దెల మీదకి చేరవేసుకుంటున్నారు. ఊరు ఊరంతా జీవన్మరణ సంధిలో అల్లాడిపోతున్నది.

ఆయన ఎంత తొందరగా ఇంటికి చేరుకోవాలనుకుంటున్నాడో అంత తొందరగానూ నీటి ఉరవడి పెరిగిపోతున్నది. అడుగుతీసి అడుగు వెయ్యటం కష్టమైపోతున్నది. కాలు ఒకవైపుకు వెయ్యబోతే నీటి విసురికి మరొకవైపు పడుతున్నది.

అడుగుతీసి అడుగేస్తున్నాడు. రెండు కోడిపెట్టలు ప్రవాహంలో పడి కొట్టుకొస్తూ సుడిగుండంలో గిరగిరా తిరిగి మునిగిపోయాయి.

మంగయ్య శాస్త్రి గుండె చిక్కబట్టలేకపోతున్నాడు.

"ప్రభూ! జగద్రక్షకా! ఏమిటీ ప్రళయం! ఎందుకు నీకింత ఆగ్రహం? ఈ ఊరు ఊరంతా సర్వనాశనమవుతూ ఉంటే చూస్తూ ఎలా భరిస్తున్నావు స్వామీ!" అంటూ విలవిల్లాడిపోయాడు.

మంగయ్య శాస్త్రి నడుస్తూనే ఉన్నాడు.

"తాతా! మన ఇల్లదుగో!" అంటూ చూపించాడు మనమడు.

"ఔను బాబూ, వచ్చేశాం!" అన్నాడాయన.

మంగయ్య శాస్త్రి ఇల్లు చంద్రవంక నోట్లో ఉన్నట్టుంది. ఇటూ అటూ పూరిగుడిసెలున్నాయి. వాటి మీద జనం ఎక్కి కూర్చున్నారు. హోరున వర్షం పడుతూ ఉన్నది. ఇంటికి వెనకవైపున చంద్రవంక హోరెత్తిపోతున్నది.

తనవాళ్ళు ఏమైపోయారో తెలియడంలేదు. ఈదుకుని వెళ్దామంటే భుజాలమీద పిల్లవాడున్నాడు. అక్కడే నిలబడదామంటే నీటి ఉరవడికి కాళ్ళు ఊగిసలాడిపోతున్నాయి. గుండె అదిరి అదిరి పడుతున్నది.

నీటిలో సుడిగుండం ఏర్పడి తనవైపే వడిగా వస్తున్నది. పిల్లవాణ్ని దక్కించుకోవాలన్న ఆతురత అతనికి ఎక్కువైపోయింది!

ముందుకు నడిచాడు. తన ఇంటి తలుపులు రెండు ఊడి కొట్టుకపోతున్నాయి! పూలసజ్జ కొట్టుకుపోతున్నది. శివుని పటం కొట్టుకుపోతున్నది. శ్రీ చక్రం కొట్టుకుపోతున్నది. వ్యాసపీఠం కొట్టుకుపోతున్నది! రుద్రాక్షమాల కొట్టుకుపోతున్నది.

AP SCERT

మంగయ్య శాస్త్రి గుమ్మంలో అడుగుపెట్టాడు. ఇంట్లో వాళ్ళంతా ఒక్కసారి గొల్లుమన్నారు! తన కొడుకూ, కోడలూ, కూతురూ, భార్యా నలుగురూ గోడకి అంటిపెట్టుకుపోయారు!

మంగయ్య శాస్త్రికి దుఃఖం ఆగింది కాదు. అయినా కంట నీరు జారకుండా పిల్లవాణ్ణి గుండెలకొత్తుకున్నాడు.

"అమ్మా!" అంటూ చేతులు చాచాడు పిల్లవాడు.

వెనక గదుల తలుపురెక్కలు ఊడి కొట్టుకుపోతున్నాయి. మంగయ్య శాస్త్రి అలానే చూస్తూ నిలబడిపోయాడు. కొడుకు తల వంచుకున్నాడు. కోడలు కొంగు ముఖానికి అడ్డు పెట్టుకున్నది. కూతురు వెక్కివెక్కి ఏడుస్తున్నది. ముసలావిడ ఈ విషాదానికి తట్టుకోలేకపోతున్నది.

కూతురు ఏడు మాసాల గర్భిణి. క్షణక్షణానికీ ఆమె గుండె బరువైపోతున్నది. కళ్ళు తిరుగుతున్నాయి. కాళ్ళు పట్టు తప్పిపోతున్నాయి. గొంతు పూడ్చుకుపోతున్నది.

అప్పుడే ఇంటి వెనకాల పెద్ద పిడుగు పడింది. రెండు కొయ్యబాదులు విసురుగా లోపలికి దూసుకువచ్చి, మంగయ్య శాస్త్రి కొడుకును దూరానికి నెట్టివేశాయి. అంతా క్షణంలో జరిగిపోయింది.

"చెన్నకేశవా" బిగ్గరగా అరిచాడు మంగయ్య శాస్త్రి.

"ఏవండీ!" అంటూ గుండెలు బద్దలుకొట్టుకుందా ఇల్లాలు.

పిల్లవాడు బిగ్గరగా ఏడుపు ప్రారంభించాడు.

"ఊరుకో బాబూ! ఊరుకో! నీకేం భయంలేదు! నేనున్నానుగా!" అంటూ వాణ్ణి ఒకవైపున ఓదారుస్తున్నాడు. మరొకవైపున భార్యను దగ్గరికి తీసుకుని తల నిమురుతున్నాడు.

అంతవరకు తాను ఎవరిని చూసుకొని తృప్తిపడ్డాడో వాళ్ళు ముగ్గురూ ఇప్పుడు కంటికి దూరమైపోయారు. తనవాళ్ళు, తన రక్తం పంచుకున్నవాళ్ళు కొడుకూ, కూతురూ, కోడలు తన కళ్ళముందే నీట మునిగి కొట్టుకుపోయారు. "పరమేశ్వరా! ఈ దుర్భర విషాదాన్ని కళ్ళార చూసేందుకే నన్ను బతకనిచ్చావా తండ్రీ!" అంటూ వాపోయాడు.

ఇక మిగిలినది తనూ తనమీదనే ఒరిగి ఉన్న ఇల్లాలు, భుజాలమీద మనమడూ! ఏమిటి ఈ వైపరీత్యం? ఏమిటి, ఏమిటిదంతా?

మంగయ్య శాస్త్రి మనస్సు పరిపరివిధాల పోతున్నది. ఈ విషాదకరమైన పరిస్థితిలో తన గుండె వెయ్యి వక్కలు ఎందుకు కాలేదో, బాధకు మారుగా ఆలోచన ఎందుకు రేగుతున్నదో అర్థం కావటంలేదు.

భార్య మహాలక్ష్మమ్మ కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నది. అప్పుడప్పుడు భర్త ముఖంలోకి చూస్తున్నది. ఏదో అడగాలనుకుంటుంది. నోరు పెగిలి మాట రాదు. చివరికి అడిగింది.

"ఏవండీ! ఏనాడో మనం చేసుకున్న పాపాలు నేటికి పండాయి కదా?" అన్నది.

మంగయ్య శాస్త్రి మాట్లాడలేదు.

ఆమె ఉద్వేగం పట్టలేక బిగ్గరగా వెక్కి వెక్కి ఏడవటం ఆరంభించింది. ఇద్దరి గుండెల్లో కొండంత విషాదం అలముకుంది.

AP SCERT

"ఎందుకే ఏడుస్తావ్? కళ్ళు తుడుచుకో!" అన్నాడు మంగయ్య శాస్త్రి భార్యవైపు తిరిగి

"లేదు! నేను ఎందుకేడుస్తాను? అంతా నాశనమైం తరువాత, ఇంకా ఏం చూసుకుని ఏడుస్తాను?" అన్నదామె.

"అదికాదే! నా మాట విను. ఒకచోట నాశనమైనది మరొకచోట కొత్త జన్మ ఎత్తుతుంది. దాని రూపంలో మార్పు రావచ్చు. కాని అదే చైతన్యం ఎప్పటికీ ముందుకు సాగుతూ ఉంటుంది. ఒకచోట రాలిన విత్తు ఇంకొకచోట కొత్తగా మొలకెత్తడం చూడలేదూ?" అంటూ మంగయ్య శాస్త్రి ఇంకా ఏదో చెప్పబోతున్నాడు. మహాలక్ష్మమ్మ ఇదేదీ వినిపించుకోటం లేదు. కళ్ళు మూసుకుని తనలో తాను మాట్లాడుకుంటున్నది.

తాత భుజాలమీద కూర్చున్న కుర్రవాడు, కాళ్ళకు నీళ్ళు అందాలని కిందకి జారబోయాడు.

నీటిమట్టం పైపైకి వస్తూనే ఉంది. నీళ్ళమీద తేలుతున్న సామాన్లు ఒక్కొక్కటే బయటకు కొట్టుకుపోతున్నాయి. మహాలక్ష్మమ్మ ఇవేవీ చూడడం లేదు. తనకీ ప్రపంచంతో సంబంధం లేదు. ఇంక వాటిని చూడటం కూడా దేనికి?

ఉత్తరవైపు గోడ కూలి భయంకరంగా చప్పుడైంది. ఆ వైపు పంచ ఒరిగిపోయింది. దూలాలు విరిగిపడ్డాయి. అన్నీ ముందుగదిలోకి ఒక్కసారి నెట్టుకొచ్చాయి. దభీదభీమని గోడల్ని గుద్దుకున్నాయి. నీళ్ళని చెదరగొట్టాయి. అంతా అల్లకల్లోలం చేసేశాయి!

"పరమేశ్వరా!" అంటూ బిగ్గరగా అరిచాడు మంగయ్య శాస్త్రి. తరువాత ఒక్క క్షణం కళ్ళు మూసుకున్నాడు.

"తాతయ్యా" అన్న పిలుపుకి మళ్ళీ కళ్ళు విప్పాడు.

తనని అంటిపెట్టుకొని ఉన్న మహలక్ష్మమ్మ, ఇప్పుడు పక్కన లేదు.

అంత పెద్దవాడూ మంగయ్య శాస్త్రి కంటి తడిని తుడుచుకోలేని పరిస్థితి.

"తాతయ్యా!" అంటూ మళ్ళీ పిలిచాడు చిన్నవాడు.

మంగయ్య శాస్త్రి తల పైకెత్తాడు. మనమడు మిద్దె కింద ఉన్న కంతను చూపించాడు. అందులో ఒక తాటేకు బుట్ట ఉంది.

"నాకది ఇయ్యవా తాతయ్యా!" అంటూ అడిగాడు చిన్నవాడు.

అంత విషాదంలోనూ మంగయ్య శాస్త్రి చిరునవ్వు నవ్వాడు. చెయ్యి చాపి, ఆ బుట్టను అందుకున్నాడు. అందులో ఉన్న తాటాకు పుస్తకాలు తీశాడు. ఒకటి వైద్యశాస్త్ర గ్రంథం. మరొకటి దశోపనిషత్తులు, ఇంకొకటి యోగశాస్త్రం. వేరొకటి భగవద్గీత. ఇంకొకటి మేఘ సందేశం, బ్రహ్మసూత్రాలు!

"బాబూ! ఇవి పుస్తకాలురా!" అన్నాడు మంగయ్య శాస్త్రి.

"నాక్కావాలి తాతయ్యా!" అన్నాడు చిన్నవాడు.

"కావాలా బాబూ! తప్పకుండా ఇస్తాను! ఇవన్నీ నీకోసం దాచినవే నాయనా!" అంటూ మంగయ్య శాస్త్రి తన యజ్ఞోపవీతం తీసివేసి, ఒకవైపు కొస పుస్తకాల బుట్టకు చుట్టి, మనవణ్ణి బుట్టలో కూర్చోబెట్టి, రెండోవైపు కొస వాడి భుజానికి తగిలించి, ప్రవాహం వైపు విడిచాడు.

APSCERT

చిట్టచివరిసారిగా మంగయ్య శాస్త్రి మనుమడివైపు చూసి కళ్ళు మూసుకున్నాడు. ఆ క్షణంలోనే ఆయన 'ఆత్మసన్యాసం' స్వీకరించాడు.

"ప్రభూ! ఇదంతా నీ సంకల్పం! దీన్ని కాదనగల అతిశయం నాకు ఎప్పుడూ లేదు! కాని, చిట్టచివరిసారిగా నిన్ను కోరేది ఒక్కటే స్వామీ! ఈ చిన్న మొలకను ఎక్కడికయినా సురక్షితంగా చేర్చి కాపాడు తండ్రీ! విశాలమైన ఈ ప్రపంచంలో ఎక్కడయినాసరే, ఎవరయినాసరే, మనిషి మనిషిగా బతికేటట్లు చూడు స్వామీ! ఇది నా జాతి, నా మతం, నా రక్తం అన్న అహంభావం మనిషికి కలగనియ్యకు. ఆత్మవిశ్వాసం మాత్రం రగుల్కొల్పు! వ్యవస్థ ఏదయినా నాకు బెంగ లేదు? వ్యక్తి నిటారుగా నిలబడగలిగితే చాలు! జీవిత విధానం ఎలా మారినా నష్టం లేదు, విలువలు మాత్రం నశించనియ్యకు తండ్రీ! ఇంతే చాలు నాకు. ఇదొక్కటే నిన్ను కోరేది!" అని, రెండు చేతులూ జోడించి రెప్పలు వాల్చి, లోచూపులు నిగుడ్చుకొన్నాడు.

చంద్రవంకా ఇంకా పొంగుతూనే ఉంది!

మంగయ్య శాస్త్రి మొర విన్నాడో ఏమో! ఆ మాచర్ల చెన్నకేశవుడు. మంగయ్యశాస్త్రి ఇంటి దూలమే ఆ వరద ఉధృతిలో ఆసరాగా మారింది. దూలాన్ని గట్టిగా పట్టుకొని వరదలో కొట్టుకుపోసాగాడు మంగయ్య. ప్రశాంతంగా పారే చంద్రవంక నేడు విలయతాండవం చేస్తూ కొండచిలువలా నోరుచాచి జరజరా సాగుతున్నది. వరదలో కొట్టుకు పోతున్నపుడు మనవడున్న బుట్ట కూడా అల్లల్లాడుతూ దగ్గరలోనే కన్పించింది. తటాలున బుట్టను కూడా అందుకొన్నాడు. ఇద్దరూ కొట్టుకొని వచ్చి భట్రుపల్లి పొలిమేరల్లోని దుబ్బుల్లో చిక్కుకున్నారు. పుస్తకాల బుట్టను మనవడి చిన్నారి పిడికిలి వదలనేలేదు. తాత పిడికిలి మనమడి చేతిని మరింత గట్టిగా పట్టుకొనే ఉంది. పల్లెవాసులు ఇద్దరిలో జీవం ఉందని హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

AP SCERT

అకారాది పట్టిక

అ

అంకం = ఒడి
అఖండం = విశాలమైన, సమస్తం
అగ్రతాంబూలం = తొలి ప్రాధాన్యత
అధిరోహించడం = ఎక్కడం
అన్వయం = వంశం
అన్వేషణ = వెతకడం
అన్యాపదేశం = పరోక్ష ప్రస్తావన
అప్రమత్తత = జాగురూకతతో ఉండడం
అంబకం = బాణం
అంబరం = ఆకాశం
అభ్రంగణం = ఆకాశం
అమృతం = చావు లేకుండా చేసే ఒక పానీయం.
అరాళము = వంపులు తిరిగిన బాణం
అరుగు = వెళ్ళు, పోవు
అర్పణ = సమర్పించుకోవడం
అలరు = ప్రకాశించు
అవజ్ఞ = తిరస్కారం, అవమానం
అవధానం = ఏకాగ్రత
అస్తిత్వం = ఉనికి
అస్పృశ్యత = అంటరానితనం

ఆ

ఆకరం = నిలయం, సమూహం
ఆచార్యుడు = బోధించేవాడు
ఆతపం = వేడి
ఆత్మకథ = తన గురించి తాను చెప్పుకోవడం
ఆదరం = గౌరవం
ఆద్యంతం = మొదటి నుంచి చివరి వరకు
ఆపద = కష్టం, ప్రమాదం.
ఆర్ద్రత = తడి, మెత్తని
ఆలంబన = ఆధారం
ఆస్యం = ముఖం
ఆజ్ఞ = ఆదేశం, ఉత్తరువు.

ఇ

ఇందీవరము = నల్లకలువ
ఇనుడు = సూర్యుడు

ఉ

ఉడాయించడం = పారిపోవడం
ఉడులు = చుక్కలు
ఉత్తరం = జాబు
ఉత్సాహం = పూనిక
ఉత్కృష్టమైనది = శ్రేష్ఠమైనది
ఉద్దండులు = ఆరితేరినవారు.
ఉపద్రవం = ప్రమాదం
ఉల్లసిల్లు = ప్రకాశించు

ఊ

ఊని = పూని, ఆనించి

ఎ

ఎరుక = పరిచయం
ఎలగోలు = మొట్టమొదటి

ఒ

ఒరులు = ఇతరులు

ఓ

ఓఘము = ప్రవాహం

ఔ

ఔన్నత్యం = గొప్పదనం

క

కదళి = అరటి
కపటం = మోసం.
కరపత్రం = ప్రకటన పత్రం
కాక = వేడి
కానుక = బహుమతి
కించపరుచు = చులకనచేయు.
కుటిల = వంకర, దురాలోచన
కులాలుడు = కుమ్మరివాడు, కుంభకారుడు
క్రుధ = కోపము
కృతజ్ఞత = చేసిన మేలు మరవక పోవడం.
కృతఘ్నత = చేసిన మేలు మరిచిపోవడం.
కేదారము = పొలము, ఎర్రకలువ
క్రేవ = దిక్కు
కైరవము = తెల్లకలువ
కొల్లలు = ఎక్కువ
కుంచితము = తగ్గిపోవు
కుంభిని = భూమి, నేల,

ఖ

ఖగము = పక్షి

గ

గరళం = విషం
గాత్రం = దేహం, అవయవం, గొంతు
గుంభనం = అజ్ఞాతం, బయటకు తెలియకుండ

AP SCERT

గోత్సము = పర్వతము.
గోష్ఠి = సంభాషణం

చ

చనుట = వెళ్ళడం
చటుల = అందమైన
చాకచక్యం = ఒడుపు
చింత = ఆలోచన
చురకత్తులు = పదునైనకత్తులు
చొరవ = చనువు
చౌరస్తా = నాలుగు రోడ్ల కూడలి
ఛాయ = నీడ

జ

జంకు = భయం
జీవనసరణి = జీవన విధానం
జ్యోత్స్న = వెన్నెలరాత్రి, వెన్నెల
జీర్ణం = పాతదైన, చినిగిన

ట

టక్కరి = మోసకారి

డ

డెందము = హృదయం

త

తంత్రులు = తీగలు
తథ్యము = తప్పనిసరి
తనరారుచుండుట = విజృంభించు, ప్రకాశించు
తపన = ఎక్కువ ఆసక్తి
తరుణం = సమయం
తలవంపు = అవమానం
తల్పం = పరుపు/పాన్పు
తిరస్కారం = పట్టు అనడం
తుత్తునియలు = తీవ్రంగా దెబ్బతీయు
తృటి = రెప్పపాటు కాలం

ద

దారిద్ర్యం = పేదరికం
దార్శనికులు = ముందుచూపుగలవారు
దివిజులు = దేవతలు.
దీక్ష = పట్టుదల
దేహళీదత్త దీపం = గడప మానుపై ఉంచిన దీపం
దంష్ట్ర = కోర
ధాత్రి = భూమి
ధారణ = ధరించుట
ధ్రువము = స్థిరం

న

నాగి = పుట్ట, పాములు ఆభరణాలుగా కలవాడు
నాథుడు = భర్త
నారాచము = బాణం
నికరము = గుంపు
నిక్కము = నిజం
నిగ్రహించుకొను = అదుపులో ఉంచుకొను
నిత్యనూతనం = ఎల్లప్పుడూ కొత్తగా ఉండడం
నినదించుట = బిగ్గరగా చెప్పడం
నిమగ్నం = పనిలో లీనమైపోవడం
నిరాఘాటం = అంతరాయం లేకుండా
నువ్వులు = తిలలు
నృశంసుడు = నరులను హింసించువాడు
నేలమాళిగ = భూమిలోపలి గది

ప

పక్షము = కనురెప్ప, పదిహేను రోజులు
పరిమళం = సువాసన
పరిపుష్టి = అధిక సంవృద్ధి
పర్యటన = పని నిమిత్తం ప్రయాణం
పాదుకలు = పాంకోళ్లు
పికము = కోకిల
పీఠిక = గ్రంథ ప్రారంభ ఉపోద్ఘాతం
పురస్కారం = సన్మానం, బహుమతి
పృచ్ఛకుడు = ప్రశ్నలు అడిగేవాడు
పొందిక = పద్ధతి, సరైన
పొలిమేర = ఊరి చివరి ప్రదేశం
పొలపారగా = ప్రకాశించు, అతిశయించు
పోరు = యుద్ధం
పౌత్రుడు = మనుమడు
ప్రత్యర్థులు = ప్రతివాదులు
ప్రళయం = సృష్టి నాశనం
ప్రవర్ధిల్లు = వికసించు, అభివృద్ధిచెందు
ప్రస్థానం = ప్రయాణం
ప్రాచుర్యం = గొప్ప పేరు పొందడం
ప్రాప్యం = పొందదగినది
ప్రీతి = ఇష్టం
ప్రేక్షకులు = చూసేవారు
ఫలం = పండు, ఫలితం

బ

బాహువులు = భుజాలు

AP SCERT

మ

మచ్చుతునక = ఉదాహరణ
మనోజ్ఞ = అందమైన
మరాళము = హంస
మక్షిక = ఈగ
మానసము = మనసు
మున్నుడి = ముందుమాట
ముఖాముఖి = ఎదురెదురు
మురిపం = ప్రేమ
మూర్ఖుడు = అవివేకి
మ్యూజియం = వస్తువులను ప్రదర్శించే చోటు
మృణాలము = తామరపువ్వు
మైత్రి = స్నేహం
మ్రుక్కడి = దుర్మార్గుడు
మంజుల = అందమైన

య

యతి = సన్యాసి
యథాలాపం = ఏ ఉద్దేశ్యం లేకుండా
యుగసంధి = రెండు యుగాల మధ్య సమయం
యోష = స్త్రీ

ర

రజతోత్సవం = 25సం. నిండిన సందర్భంగా చేసే ఉత్సవం.
రజతం = వెండి
రణక్షేత్రం = యుద్ధభూమి
రిత్త = అపవాదు, అపనింద, చెడ్డపేరు
రోత = అసహ్యం
రంపటిల్లు = విజృంభించు

ల

లయము = నాశనం
లాస్యము = నృత్యం
లేశం = అత్యల్పం
లంబితము = వ్రేలాడేది

వ

వ్యధ = బాధ
వాక్కు = మాట
వామపాదం = ఎడమ కాలు
వాత్సల్యం = ప్రేమ
వాహిని = నది
వికలం = బాధ, కలత
విగత దేహాలు = ప్రాణం లేని శరీరాలు
విభుడు = ప్రభువు
విముక్త = విడువబడిన
విరివి = ఎక్కువ
విలాసము = వైభోగం
వివేకం = తెలివి.
విస్తృత = ఎక్కువ
విహగము = పక్షి
వీనులు = చెవులు
వంచన = మోసం

శ

శరము = బాణం
శక్రుడు = ఇంద్రుడు
శఫరి తీర్థం = ఎగిరిపడే చేపలున్న సరస్సు
శారిక = గోరువంక
శిథిలం = ఛిద్రమైన
శ్రేయస్కరం = ఉపయోగం
శ్రోతలు = వినేవాళ్లు


స

సఖులు = స్నేహితులు.
సఖ్యం = స్నేహం
సజ్జనులు = మంచివారు.
సమాగమం = సమావేశం
సముపహారము = ఫలితం
సస్యము = పంట
సహస్రాంశం = వెయ్యోవంతు
సారస్వతం = వాఙ్మయం
సారమతి = న్యాయమైన బుద్ధి గలవాడు
సారథి = నడిపేవాడు
స్థిరం = శాశ్వతం
సీరము = నాగలి
సుతుడు = కుమారుడు
సూనృతం = సత్యం
సృజనాత్మకం = కొత్తగా కనుగొనడం
సౌజన్యము = మంచితనం
సౌదామిని = మెరుపు
సౌరు = అందం
సంస్తవం = పొగడ్త
స్థగీతం = స్థిరంగా ఉండడం
స్థండిలశయ్య = పడుకునే మంచం

హ

హతి = దెబ్బ
హర్షం = సంతోషం


AP SCERT



గిడుగు విసురు

జయంతి రామయ్య పంతులు గారు గ్రాంథిక భాషావాది. అయితే వారి సమకాలికులు అయిన గిడుగు రామ్మూర్తి పంతులుగారు వ్యావహారిక భాషావాది. భాష పరంగా వారి మధ్య గల భేదాభిప్రాయాలను పురస్కరించుకుని సందర్భం వచ్చినప్పుడల్లా ఒకరిపై ఒకరు విసుర్లు విసురుకోవడం పరిపాటి.

ఒకసారి జయంతి రామయ్య పంతులుగారు ఎక్కడో పొరపాటున 'తలకు నూనె వ్రాసుకొని...' అని రాసారట. అది చూసి గిడుగు రామ్మూర్తి పంతులు 'అవును, రామయ్య పంతులుగారు తలకు నూనె వ్రాస్తారు పుస్తకాలేమో రాస్తారు' అని చమత్కరించారు.



ఆంధ్రరత్న హాస్యం

ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు మంచి హాస్య ప్రియులు. వారు స్కూల్ ఫైనల్ పూర్తయిన తర్వాత తాలూకా ఆఫీసులో కొద్ది రోజులు గుమాస్తాగా చేశారు. ఒక రోజు ఆత్మగౌరవం అధికంగా గల ఆ ఊరి పెద్దాయన ఆఫీసుకు వచ్చారు. ఒక పత్రం మీద సంతకం చేస్తూ "వెంకట్రామయ్య గారు వ్రాలు" అని రాశారు. తర్వాత ఆయనకు ఆఫీసు నుంచి దాని తాలూకు కాగితం ఏదో పంపవలసి రాగా కవరు మీద "వెంకట్రామయ్య గారు గారికి" అని గోపాలకృష్ణయ్య గారు రాశారు. దానితో ఆ పెద్దాయనకు కోపం వచ్చి కవరుతో సహా ఆఫీసుకు వచ్చి గోపాల కృష్ణయ్య మీద ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సంతకంలో 'గారు' అని పెట్టారు, అది చూసి వారి పేరులో గారు ఉంది అనుకున్నాను సార్ అన్నారు ఆంధ్రరత్న సవినయంగా. అప్పటి నుండి ఆ పెద్దాయన తన పేరు రాసుకునే పద్ధతికి స్వస్తి చెప్పారట.

AP SCERT